# శ్రమణకం నవల

## -డా.నందమూరి లక్ష్మీపార్వతి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 112



# శ్రమణకం

## – డా. నందమూరి లక్ష్మీపార్వతి



'శ్రమణకం' ఒక పుస్తకంగా రూపుదిద్దుకుని వెలువడడానికి వెనుక దీనికి తొలిబీజం పడ్డ కాలపరిస్థితుల గురించి కొద్దిగా ముచ్చటించవలసి ఉంది.

నేను 1975లో భాషాప్రవీణ చదివేటప్పుడే 'పింగళి - కాటూరి' వారి 'సౌందరనందం' కావ్యం చదివాను. అందులో సుందరి పాత్ర ఒక గొప్ప ప్రేమికురాలిగా, భర్తను విడిచి క్షణమాత్రమైన నిలువలేని ఆరాధకురాలిగా కనిపిస్తుంది. తను కూడా భర్త మార్గాన్ననుసరించి చివరకు బుద్ధుని అనుగ్రహంతో నందుడిని కలుసుకుంటుంది. అంతవరకే కథ! ఆ పాత్రలో తరతరాల స్త్రీ సహజమైన మార్దవాన్ని, ప్రణయ భావుకతను మాత్రమే చూస్తాం. దాని పూర్వాపరాల గురించి చర్చలేదు. ఆ కావ్యం తెలుగు సాహిత్య ప్రపంచంలో రసజ్ఞుల నోలలాడించింది.

అందుకే 1989లో ఎమ్.ఫిల్.లో తులనాత్మక అధ్యయనం క్రింద తెలుగులో 'సౌందరనందం', హిందీలో 'లహరోంకె రాజహంస', సంస్కృతంలో అశ్వఘోషుని 'సౌందరనందం' పరిశీలనకు తీసుకోవటం జరిగింది. సుప్రసిద్ధ హిందీ నాటక కర్త మోహన్ రాకేష్‌గారి హిందీ నాటకం చదివాక సుందరి పాత్ర అద్భుతమైన వ్యక్తిత్వంతో నాకళ్ళముందు సాక్షాత్కరించింది. ఆయన పదమూడు పర్యాయాలు ఆ నాటకాన్ని తిరగరాసి, ఆ పాత్రకు అద్భుతమైన మెరుపులు దిద్దారు. ఫలితంగా తెలుగులో లీలా మాత్రంగా కనపడే ఈ పాత్ర హిందీలో మోహన్ రాకేష్‌గారి సృష్టిలో పరిపూర్ణతను సంతరించుకుని - పాఠకుల మనసులో ఒక ప్రముఖ స్థానాన్నాక్రమిస్తుంది. అది చదివి ఆ పాత్రను అర్థం చేసుకున్నాక సుందరి మీద నా ప్రేమ, ఆరాధన పదింతలు పెరిగాయి. హిందీ నాటకాన్ని తెలుగులో అనువాదం చేసుకుని ఆ పాత్రను మరింత శోధించేదాకా నిద్రపట్టలేదు.

కాలక్రమంలో అనేక మార్పుల తర్వాత నా భర్త శ్రీ నందమూరి తారకరామారావుగారు పరమపదించాక రాజకీయాల్లో తలమునకలుగా ఉన్న నన్ను మళ్ళీ సాహిత్య మార్గంవైపు మళ్ళించింది మా గురువుగారైన గంగిశెట్టి లక్ష్మీనారాయణగారే. 1999 ఎన్నికల తర్వాత పూర్తి నిరాశలో మునిగి ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నప్పుడు వారే గుర్తుచేసారు "మీకిష్టమైన 'సుందరి' పాత్రను ఒక మంచి పుస్తకంగా మలచవచ్చుకదా" అని. నాక్కూడా అదే సరైన సమయమనిపించింది. జర్మన్ ప్రయాణం పెట్టుకుని కూడా రెండు నెలల్లోనే 'శ్రమణకం' అనే పేరుతో ఈ పుస్తకం రాసి ఇంట్లో పడేసి వెళ్ళిపోయాను. మూడు నెలల తర్వాత తిరిగొచ్చి మా ప్రొఫెసర్‌గారి దగ్గరే పి.హెచ్.డి చెయ్యటం, మళ్ళీ ఈ పుస్తకాన్ని తప్పొప్పులు సరిదిద్దుకుని ముద్రణకివ్వటం జరిగింది. మూడేళ్ళ వ్యవధిలో రెండో ముద్రణకి కూడా వచ్చింది. ప్రస్తుతం ఈ పుస్తకం కాపీలు మార్కెట్‌లో ఎక్కడా లభ్యం కావడం లేదు. ఇప్పుడు 'కౌముది' ద్వారా అంతర్జాల తెలుగు పాఠకులకి చేరుతున్నందుకు చాలా ఆనందిస్తున్నాను.

లక్ష్మీపార్వతి

(ప్రారంభం)

**"మాలికా! ఏమిటా కలకలం"**

"రాజహంసలమ్మా ఈరోజెందుకో వాటి గొడవ ఎక్కువగా ఉంది."

"అవును ఉంటుంది. యజమానురాలి సంతోషమే వాటి సంతోషం. ఒక్కసారి చూసొద్దాం పద."

"ఇప్పుడా వద్దమ్మా - బయట చల్లగా ఉంది. మంచు పట్టిన తోట, సరోవరం శీతల గాలులు మీ ఆరోగ్యానికి భంగం కలిగించవచ్చు."

"పిచ్చిదానా! చల్లగాలి, పిల్ల తెమ్మెరలు, ఉషోదయాన పక్షులు సందడులు, వసంతం నాటి వనోత్సవం, ఇవన్నీ ఆనందించలేని మనసు, పరవశించని బ్రతుకు నా దృష్టిలో వ్యర్థం."

"మీ ఆనందాన్ని అడ్డుకోవాలని కాదు. మేము పరిచారకులం. యజమానుల సంరక్షణ మా విధి" మాలిక మెల్లగా అన్నది.

సుందరి ఆమె భుజం మీద చెయ్యేసి

"మాలికా! ఎప్పుడయినా నిన్ను పరిచారికగా చూసానా? నా అంతరంగిక జీవితంలో కూడా నీకున్న ప్రాధాన్యత వేరు. నాకు ఇష్టమైన నెచ్చలివి. మరెప్పుడూ దాసీ భావంతో మాట్లాడకు."

"సోదరి కంటె ఎక్కువ ఆదరిస్తున్న మీ అభిమానం ఇలాగే పదికాలాలు పాటు ఉంటే అదే చాలు. మీ ఔదార్యానికి నన్ను నేనే అంకితం చేసుకున్నాను యువరాణీ. నా శ్వాస కూడా మీకు భిన్నంగా పనిచేయదు - ఇది నిజం"

"అందుకే నువ్వంటే నాకిష్టం మాలికా. అంకితభావం ఆత్మానందాన్ని ఇస్తుంది. ***ప్రేమలో నిజాయితీని అనుభవించగలిగిన వాళ్ళు మాత్రమే వాస్తవ జీవితాన్ని గడపగలుగుతారు"***

"ఏయ్. మాటల్లో పెట్టి నా ప్రయత్నానికి అడ్డు తగులుతున్నావు, పద, పద." సుందరి ఆసనం మీదనుండి లేచింది.

మాలిక ఆమె భుజం చుట్టూ జలతారు శాలువా కప్పి - "ఇక పదండి. ఆరోగ్యం అంటారు అసలు చెప్పిన మాటే వినరు -" అంటూ బుంగమూతి పెట్టింది.

ఆమె అలగటం చూసి సుందరికి నవ్వొచ్చింది.

"బహుశా ఈ భంగిమ ఉండాల్సింది నా ముందు కాదేమో" అంది పరిహాసంగా.

ఆమె మాటల్లోని భావం అర్థమైన మాలిక ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది. మరేం మాట్లాడకుండా ఆమే ముందు దారితీసింది. సుందరి అనుసరించింది. ఇద్దరూ భవనానికి ఎడమవైపుగా ఉన్న మెట్లు దిగి ఉద్యానవనంలోకి అడుగుపెట్టారు.

సంజెకెంజాయిలో మంగళ స్నాతాలంకృతయైన వన సౌందర్యం చూడటానికి రెండు కళ్ళు చాలటం లేదు. పల్చని మంచు ముసుగులో కనిపించీ కనిపించని అందాలతో దోబూచులాడుతున్న ప్రియురాలిగా ఉంది. అప్పుడే వికసిస్తున్న పూలబాలలు పరిమళాల ద్వారా తమ సందేశాన్ని భృంగ ప్రియులకు అందిస్తూ ఆహ్వానిస్తున్నాయి. రాత్రి విరిసిన సన్నజాజి - విరజాజులు ఒత్తుగా రాలి సమాగమానికి మంచి శయనం ఏర్పాటు చేసాము చూడమంటున్నాయి. ఆకాశాన్నంటిన దేవదారులు, పండి సువాసనలతో గుభాళిస్తున్న పనస, నారికేళాలు, నోరూరిస్తున్న తియ్యమామిడులు, ఒక్కటేమిటి ప్రకృతి కాంత పట్టుబట్టి అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నట్టుంది.

చుట్టూ అమర్చిన చంద్రశిలావేదికలు మంచుతో మసకబారి ఉన్నాయి. సరోవరంలోని ఎర్రతామరలు తమ ప్రియబాంధవుడి కోసం ఎదురుచూస్తున్నాయి. రేకుల సోయగాన్ని విప్పుకోవటానికి రాత్రంతా ప్రియా సమాగమంలో అలసిపోయిన కలవలు మెల్లగా ముడుచుకుంటున్నాయి.

"చూసావా! మాలికా! ఈ సంవత్సరం మామిడిపండ్లు ఎక్కువ కాయలేదు. ఆ చెట్టును చూస్తుంటే సన్యాసం తీసుకున్న భిక్షుకుల్లా బోడిగా అనిపించటం లేదు."

"మీరేం మాట్లాడినా చక్కటి పోలికతో చెపుతారు. కుమారనందులయితే దానికి ప్రతి సమాధానం చెప్పగలరు. నాకేం తెల్సు. స్వారస్యం తెలియనిదాన్ని - మీరు చెప్పాక చూస్తుంటే అలాగే కనపడుతున్నాయి.

"పదండమ్మా. పద్మ సరోవరం దగ్గరకు - హంసల నిరీక్షణం అలుపులేనిదిగా ఉంది."

"అవును. వాటిది సార్థక జీవితం. వాటికి తెలిసిన మౌనభాష మనుష్యులకేం తెలుస్తుంది. ఆనందం నిర్వేదం - రాగం - విరాగం సమపాళ్ళలో నింపుకున్న సఫలజీవులు. ప్రేమనూ పంచగలవు. దుఃఖాన్ని దాచుకోగలవు. ఎంతమంది యోగులకు తెలుసు ఈ వేదాంతం" ముందుకు నడుస్తూ అన్నది.

"రాగము, విరాగము ఒక్కచోటే సాధ్యమంటారా? వెలుతురు చీకటి కలిసినట్లు కాదూ..!?" అడిగింది మాలిక.

"మంచి ప్రశ్న మాలికా! విరాగం రాగం నుండి పుట్టిందే. వైరాగ్యం మీద అభిలాష కలిగినప్పుడే కదా ఆ మార్గాన్ని అనుసరించేది. దుఃఖమూ అంతే. మమత దాని జన్మస్థలం. అందుకే సృష్టిసర్వం ప్రేమస్వరూపం ఇది శాశ్వతం. మిగిలిన సిద్ధాంతాల మీద నాకు పెద్దగా నమ్మకం లేదు. అవి తాత్కాలికాలు" అని నా అభిప్రాయం.

"అయితే సన్యాసం, మోక్షం వీటి మీద కూడా నమ్మకం లేదా?"

"ఏమాత్రం లేదు. ఏ కొంచెం తార్కికంగా ఆలోచించగలిగినా సృష్టి పుట్టుకకు పంచభూతాల కలయిక - వాటి సక్రమనిర్వహణకు గ్రహయానం వాటి ఆకర్షణా విధానం. మన తార్కిక జ్ఞానానికి అందీ అందనంత ఎత్తులో ఉన్న విశ్వవిజ్ఞానాన్ని విశ్లేషించుకోవటంలోనే యుగాలు గడుస్తున్నాయి. తరాలు నడుస్తున్నాయి. ఎవరి స్థాయికి సంబంధించి వారు తెలుసుకున్న ఏ విజ్ఞానం పరిపూర్ణం కాదు. అలా అని నమ్మించాలనుకోవటం ఇతరులను మోసం చెయ్యటమే.."

"భౌతిక పదార్థ అన్వేషణలో మానవుడు ఇప్పటికి తెలుసుకోగలిగింది. జడచైతన్యాలకు ప్రేరేపకమైనది ఆకర్షణశక్తి ఒక్కటే - ప్రాణంలేని గ్రహాలకీ ఈ ఆకర్షణ కదలిక ఇస్తుంటే వాటిలోని మార్పులకు కారణమవుతుంటే, పాంచభౌతిక శరీరంలో వస్తు విజ్ఞానాన్ని గుర్తించగలిగిన ఆలోచనాశక్తి ఉన్న మానవుడి జీవితానికి పరిపూర్ణత ప్రేమ కాదా. అది లేకుండా సృష్టిలేదు. కనుక పుట్టడం పెరగడం - మరణించడం... ఇవన్నీ దానిలోని భాగాలు.

ఇంతెందుకు. యోగం అంటే కలయిక అనే కదా అర్థం. కనుక ఎప్పుడూ ఏదో కలయిక జరుగుతూనే ఉంటుంది. అదే ప్రేమ. మనం కానీ, విశ్వంకానీ దానికి లోబడి ఉన్నాం."

ఆమె మాటలకు మాలిక అడ్డొచ్చింది.

" ఇలా అడుగుతున్నందుకు మీరేమనుకోవద్దు. నాకున్నదే మిడిమిడి జ్ఞానం కాని సందేహాలు ఎక్కువ. ఈ ప్రపంచం - మనుష్యులు - వారి అస్తిత్వాలు శాశ్వతం కాదు. పుట్టిన ప్రతి పదార్థం నశిస్తోంది. కాని వాని ప్రేరకమైన జీవస్థితి అదే చైతన్యం దాన్ని శాశ్వతమంటారు కదా. దానినే ఆత్మ - పరమాత్మ అని పండితులు చెబుతున్నారు. సుఖదుఃఖాలంటని యోగుల పరమాన్వేషణం దాని కోసమేనటగా. మరి అన్నిటిలో నిండిపోయిన ఆ శక్తి సృష్టి వునికిని కాపాడటం లేదా? దానిని తెలుసుకోవటమే యోగం అదే మోక్షం అని పెద్దలు చెప్పగా విన్నాను. " మాలిక గాలికి రేగుతున్న ముంగరులను వెనక్కు నెట్టుకున్నది.

సుందరి మాలికవైపు ఆశ్చర్యంగా చూసి.

"ఏమీ తెలియదంటూనే చాలా తెలుసుకున్నావు. నేను ఇంతకు ముందే చెప్పాను. ఏదీ సంపూర్ణ విజ్ఞానం కాదని. చివరకు నేను చెప్పింది కూడా - ఎవరి ఆలోచనా పరిధిలో వాళ్ళ వాదాలు కొనసాగుతుంటాయి. అందుకేగా ఇన్ని మతాలు, వాటికంటుకున్న మరెన్నో

మూర్ఖజాడ్యాలు. దేవుళ్ళ పని చెప్పేదేలేదు. మనుష్యులెంతమంది ఉన్నారో వాళ్ళూ అంతమంది పుట్టారు. బహుశా పశుపక్ష్యాదుల్లో కూడా ఈ ఆలోచన ఉంటే ఆ దేవుళ్ళు కూడా కోట్లమంది అయ్యుండేవాళ్ళు. నువ్వు చెప్పిన మోక్షాన్ని చూసొచ్చి చెప్పిన వాళ్ళు ఇంతవరకు లేరు మాలికా! క్రమం తప్పకుండా సాగిపోతున్న సృష్టి దాని వ్యాపారాలు యదార్థం. భౌతికం అభౌతికం పరస్పరాశ్రయాలు. ఒకటి లేక మరొకటి లేదు. ఒకవేళ ఉన్నా వాటి ఉనికి అర్థరహితం. నా అభిప్రాయంలో జన్మలు గతజన్మకర్మలు, ఎవరికీ అర్థంకాని అయోమయ విషయం. ప్రయోగాత్మకంగా నిరూపించబడిందీ లేదు''

సుందరి మాధవీలత కొమ్మకు తగులుకున్న కొంగును సున్నితంగా విడిపించుకుంది. గుప్పెడు మల్లెలు దోసిట్లో పోసుకుని గుండెలు నిండుగా గాలిపీల్చింది. పూలమీద రాలిన మంచుబిందువులు సున్నితమైన ఆమె చెక్కిళ్ళపై ఒకటి రెండు వాలాయి. వాటిని సుకుమారంగా తుడుచుకుంది.

'' ఏం మాలికా! ఇంకా సందేహాలున్నాయా - ఏది ఏమయినా సన్యాసం - మోక్షం వాటి గురించి ఆలోచించి సమయం పాడుచేసుకునే కంటే మనిషి మానవత్వంతో సమాజం దాని అనువర్తిక కార్యకలాపాలు సక్రమంగా నిర్వహిస్తే చాలు. చచ్చాక ఉండేదేమిటో - పోయేదేమిటో అందుకోలేని - అందుబాటులోకి రాని వాటిని గురించి సమయమంతా వృధాచేయటం ఎందుకు. సాటి మనిషితో సహజీవనాన్ని సక్రమంగా నిర్వహించుకుంటే సమాజం ప్రశాంతంగా కొనసాగుతుంది. '' మాలిక భుజం మీద చెయ్యేస్తూ అన్నది సుందరి.

''ఏమిటో నాకంతా అయోమయంగా ఉంది. కొన్ని అర్థమయ్యాయి. కొన్ని అర్థం కాలేదు. దీనిలోని అస్పష్టతనుండి బయటకు రాలేకపోతున్నాను''

''నువ్వేకాదు మాలికా! ప్రతిమనిషి ఈ అనిశ్చితిలోనే బ్రతుకుతున్నాడు. తరాల ఆచారాలు సాంప్రదాయక వాదం, కాలమార్పుల్లో ఏర్పడుతున్న శాస్త్రీయత, ఆలోచనల్లోని మార్పులు ఈ రెంటిమధ్య అస్తిత్వ హీనుడవుతున్నాడు. నువ్వన్నావే పదార్థం నశిస్తుందని. అది కేవలం భౌతికం. భౌతికమైనది నశించదు. అదే నిజమయితే కొంత కాలం ముందే ఈ సృష్టి ఆగిపోయి ఉండాల్సింది. పరంపరాగతంగా ప్రతి వస్తువు వాటి వంశాభివృద్ధి కొనసాగుతూనే ఉంది. అందువలన అది పరివర్తనే తప్ప నశింపుకాదు. చైతన్యం జీవానికి మరో రూపం. ఆ విధానంలో సాగేసృష్టి అజరామరం. అమరప్రేమకు సంకేతం.''

సుందరి మాటల్లోని అర్థాన్ని ఆకళింపు చేసుకోవటానికి మాలిక కాసేపు నిలబడిపోయింది ఆలోచిస్తూ-

''అదేమిటి తోటలో ఉంచిన శిల్పంలా నిలబడ్డావు. పద మాలికా! నా ప్రియనేస్తాల్ని చూడాలి. ఈ తోట చూడు. తన అందాలను ఆరబెట్టుకున్నట్లున్నది కదూ వాటి నాస్వాదించగలిగినవారే ధన్యులు. అనుభవించటానికి ఎన్ని అనుభూతులు. ప్రతిదానిలోని సౌకుమార్యం నా మనస్సును తాకి పులకరింపజేస్తుంది చూడు. ఈ పచ్చికమీద రాలిన మంచు ముత్యాలు-''

''అవును దేవీ! ప్రకృతి కాంత తమరి సౌందర్యానికి కానుకగా పంపినట్లనిపిస్తుంది నాకయితే.''

''అయితే ఈ ముత్యాలన్నీ ఏరుకుంటాను'' పరవశంతో సుందరి పచ్చికమీద వెల్లకిలా పడుకుంది. ఆ శీతలత్వానికి సుకుమారమైన ఆమె శరీరం స్వల్పంగా కంపించింది -

''మరో కొత్తమల్లెతీగ పుట్టిందమ్మా మనతోటలో'' - మాలిక ముసిముసిగా నవ్వింది.

''ఏదీనాకు చూపించవూ'' - అప్పుడే స్నానం చేసి వచ్చిన హిమసుందరిలా పైకి లేచి నిలబడింది సుందరి.

''ఇదుగో ఇక్కడే ఇప్పుడే పుట్టిన ఈ పూలతీగె నాకళ్ళముందే ఉంది'' అన్నది మాలిక సుందరిని చూపి.

''ఆహా! నా శిష్యురాలివని పించుకున్నావు. నా భావుకత నీక్కూడా వచ్చేస్తోంది.'' చిలిపిగా బుగ్గ గిల్లింది.

''సాహచర్య ప్రభావం దేవీ! ఆరునెల్ల సావాసం.''

"చూడు మాలికా! ఆగక తిరిగే అనంతమైన సృష్టి భ్రమణంలో మనకు తెలియకుండానే తిరిగిపోతున్నాం. ఆ ఆవర్తనంలో జీవిత పరివర్తనలు జరుగుతున్నాయి. ఇంత స్వల్పమైన జీవితానికి ఎన్నికోరికలు, ఎన్ని సుఖదుఃఖాలు తనకు తానుగా ఆవిర్భవించుకున్న అందాలను ఆవిష్కరించుకోవటంలో సృష్టిపడుతున్న తపన చూడు. అందులో వందో వంతయినా మానవుడిలో స్పందన మేల్కోవటం లేదు –" సుందరి భారంగా నిట్టూర్చింది.

"అమ్మా! ఇంతకీ హంసల్ని తమరు చూస్తారా లేదా? ఇప్పటికే చాలా సమయం అయ్యింది. కుమారనందులు వచ్చే వేళయింది. ఇంతవరకు తమరి అలంకరణ కాలేదు. ఏం చేద్దామంటున్నారు?"

"అసలు మర్చేపోయాను. హంసల గొడవ. సంభాషణ పక్కదారి పట్టించావు కదూ. ఉండు నీ పని చెపుతాను." చిన్న పూలకొమ్మ విరిచి మాలికను కొట్టడానికి వెంటబడింది సుందరి. ఆమెను తప్పించుకోవటానికి మాలిక అటూ ఇటూ పరుగెత్తింది. ఆటలాడి అలసిపోయి చాలాసేపటికి ఇద్దరూ భవనం దారి పట్టారు. ఈసారి ఇద్దరికీ హంసల సంగతే గుర్తులేదు. కాకపోతే ఎంతో ఉత్సాహంగా ఆ జవరాండ్ర సోయగాన్ని చూడటానికి వచ్చిన సూర్యుడు మాత్రం సహస్ర కిరణనేత్రాలతో తోటంతా వెతుకుతున్నాడు.

●●●

తళతళమని మెరిసే రూపాన్ని తనివితీరా చూసుకోవటానికి వంగి వంగి లేస్తున్నాడు బాలభానుడు. రోహిణీ నదీ జలాల్లో ప్రతిబింబిస్తున్న తన గోపుర ఔన్నత్యాన్ని తృప్తిగా చుసుకుని దైనందిన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది కపిలవస్తుపురం.

భారతదేశానికి ఈశాన్యంలో ఉన్న స్వతంత్రరాజ్యం ఇది. రాచరికం లేని రాజ్యమయినా సంపదకు కొదువలేదు. ఎంతో విస్తీర్ణంతో తూర్పున రోహిణి, పడమట, దక్షిణ దిక్కుల అచిరావతి ఉత్తరాన హిమాలయాల సరిహద్దులుగా ఉన్న ఈ రాజ్యం ప్రకృతికి ఆటపట్టుగా హిమవనికి ముక్కుపుడకగా పూర్తి సౌందర్యంతో అలరారుతుంటుంది.

ఆ నగరంలో విద్యావంతులకు కొదువలేదు. ఎన్నో ఆశ్రమ పాఠశాలలు కులాలకు తగినట్లు నిర్వహించబడుతున్నాయి. నడిచే బంగారు తీగల్లా స్త్రీల సౌందర్యం దానికి పెద్ద శోభ. సుధాధవళితాలైన పెద్ద పెద్ద భవన గోపురాలు, విశాలమైన మార్గాలు. ఆ దారివెంట ఎల్లప్పుడూ నడిచే గుర్రాలు, ఏనుగులు. ఆ రాజు సంపదను తెలియచేస్తుంటాయి. చక్కటి ఉద్యానవనాలతో అక్కడక్కడ పరిశుభ్రంగా నిర్మించిన స్నానఘట్టాలు, పండ్లతోటలు, పొలాలు, నాగరికతకు చిహ్నంగా కనిపిస్తాయి. తియ్యని చెరుకుతోటలు – పశువులకు మనుష్యులకు వేరువేరుగా త్రవ్వించిన లోతైన చెరువులు క్రమం తప్పకుండా వాస్తుబద్ధంగా కట్టబడిన గృహనిర్మాణం మార్గవైశాల్యాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి.

పండ్లతోటల్లో నానాజాతి పండ్లు అనాస, పనస, నారికేళం, మామిడి, బొప్పాయి, ఖర్జూరాలు ఉద్యానవనాల్లో కానుగచెట్లు, ఇప్ప – పొగడ – తినాసపు సంపెంగ – బొట్టుగు – నాగమల్లి – కదంబ నీలాశోకం లొద్దుగు – వేప, శిరీష శింశుపా పలాస మొదలైన రంగురంగుల పూలచెట్లు బాటసారులను కళ్ళు తిప్పుకోనియ్యవు. బాటకు రెండువైపులా నీడకోసం నాటిన చెట్లు ఇంటింటికి నీటి సదుపాయం కోసం నిర్మించిన జలయంత్రాలు, సమృద్ధిగా పండే పంటలతో శాక్యనగరం పచ్చగా కళకళలాడుతున్నది. కనుకనే భౌతికవాదం అక్కడ ప్రబలడానికి కారణమయింది. విశేషమైన సంపద వలన ప్రజలకు సుఖజీవనమే కాక మానసిక విశ్రాంతి క్కూడా కారణమవుతుంది. అది విజ్ఞానాభిలాషకు సాంస్కృతిక వికాసానికి దోహదపడుతుంది. అక్కడ మతం పలుచబడుతుంది.

అందుకే విశ్వమానవ కోటికి వెలుగందించే దివ్యతార్కిక విజ్ఞానానికి శాక్యనగరం జన్మనిచ్చింది. తన స్తన్యంతో తడిపి – తోటిమానవుల దుఃఖార్తిని తీర్చటానికి మార్గం తెలుసుకొమ్మని ఆశీర్వదించి పంపించింది. క్రీ.పూ 623లో కపిలవస్తు ప్రాంతంలో నేటి గోరఖ్‌పూర్ జిల్లాకు ఉత్తరంగ ఉన్న 'పడేరా' గ్రామంలో జనించిన గౌతముడికి పదహారవ ఏట పెండ్లి అయింది. 29వ ఏట శాక్య పెదలకు ఇచిన మాటమేరకు ఆయన సన్యాసం స్వీకరించి నగరం విడిచిపెటాడు.

వేలాదిమంది అభిమానుల అశ్రువులతో తడిసిన బాటగుండా సాగిపోయిన శాక్యసుతుడు.

... మళ్ళీ ఇన్నాళ్ళకు ఇన్నేళ్ళకు కన్నతల్లి ఒళ్ళోకి తిరిగివస్తున్నాడు. కబురందగానే పౌరులు గుంపులుగుంపులుగా వీధుల్లో మూగుతున్నారు. మరణించాడనుకున్న యువరాజు బ్రతికివుండటమే కాదు మళ్ళీ తిరిగొస్తున్నాడు. ఊరికే రావటంకాదు. కాశీ, సారనాథ్ పండిత సభల్లో అందరిని ఓడించి బింబిసారుడిని తమ మార్గానికి తిప్పుకుని మహాజ్ఞానిగా, బుద్ధుడిగా తిరిగొస్తున్నాడు. కంటినిండా చూడాలి. కమ్మని ఆయన కరుణలో కరిగిపోవాలి. ఆ మహానుభావుడు వెలిగించిన నూతనకాంతిలో తమ చీకటి మార్గాలను ప్రకాశం చేసుకోవాలి.

సిద్ధార్థుడు పుట్టినప్పుడు అంతే సంరంభం జరిగింది నగరంలో. మళ్ళీ ఇన్నేళ్ళకు ఆ ఉత్సాహం కనబడుతున్నది ప్రజల కళ్ళల్లో.

"అన్నిటినీ వదిలిపెట్టి వెళ్ళిపోయిన యువరాజు తిరిగి వస్తున్నాడు" అన్నాడో పౌరుడు సంతోషంగా.

"వచ్చేది యువరాజుగా కాదు. ప్రపంచాన్ని శాసించే ధర్మచక్రవర్తిగా వస్తున్నాడు. తత్వాన్ని మథించి ఏది తెలుసుకుంటే ఇంకోటి తెలుసుకోవాల్సిన పనిలేదో ఆ జ్ఞానాన్ని గ్రహించి పరిపూర్ణుడైన బుద్ధుడిగా తిరిగి వస్తున్నాడు అన్నాడు" మరో పౌరుడు.

"అది సాధించటానికి ఆయనెన్ని బాధలుపడ్డాడో. తిండీతిప్పలు వదిలేసి అడవులు పట్టి తిరిగి సాధించాడంట."

"నిజంగా మనమెంత అదృష్టవంతులం. యోగాలకే యోగం. ఆనందానికి మూలం. ఆ భగవానుని ప్రేమ భావనం. ఆ ప్రేమలో ఈ రోజు మన నగరం తడిసి పునీతమవుతుంది. అయితే నాకో సందేహం" అన్నాడు మొదటివాడు.

"అడుగు. దేహమున్నంతవరకు సందేహముంటుందని మా గురువుగారు చింతలేని చిదానందంగారు చెప్పారా."

"ఏం లేదు. ఇన్ని సంవత్సరాలు భార్యాబిడ్డలను వదిలివెళ్ళాడు కదా. ఇప్పుడు భార్యను మళ్ళీ ఏలుకుంటాడా?"

"పిచ్చివాడా! ఆ బంధాలు కావాలనుకుంటే ఆయన వెళ్ళిపోవాల్సిన అవసరం ఏముంది? లోకం కోసం వెళ్ళాడు మహానుభావుడు. ఏ బంధాలంటకుండా జీవితం గడుపుతాడు చూడుమరి. నేను చెప్పేదే నిజమవుతుంది. సరేలే. తినబోతూ రుచెందుకు. ఇంకాసేపట్లో ఏమిటనేది తేలిపోతుందిగా."

ఒకచోటకాదు నగరమంతా ఇవే మాటలు. ఆయన త్యాగాన్ని, మంచి మనసును గురించిన పొగడ్తలే.

"రాజ్యం మంచిగా ఉండాలనే రాజ్యం విడిచి వెళ్ళాడంట్రా"

"అదేమిటి?"

"అవును. ఎంతమంది ముసలాళ్ళు లేరు. వాళ్ళ నాన్న ముసలాడేగా. ఎంతమంది రోజూ చావరు. వాటికోసం కాదంట వెళ్ళింది. శాక్యసంఘం రాజు కంటే ఎక్కువకదా! ఆ సంఘంలో సిద్ధార్థుడు కూడా ఉన్నాడు. సరిహద్దు జలాల విషయంలో మనకు, కులియులకు ఎప్పటినుండో తగువు నడుస్తూనే ఉంది కదా. ఆ విషయమై యుద్ధం చేద్దామని సంఘం వాళ్ళు, వద్దని మన యువరాజు గొడవపడ్డారంట. నువ్వు సంఘం మాట వినకపోతే మీనాన్నను పదవినుండి దించేస్తాం. లేదా నువ్వు సన్యాసం తీసుకుని ఇల్లు, రాజ్యం వదలి పెట్టిపోవాలని శాసించారు. తండ్రికోసం శ్రీరామచంద్రుడిలా సమస్తం వదిలిపెట్టి వెళ్ళిపోయిన త్యాగమూర్తి. ఎంతమందికి తెలుసు ఈ కథ. ఆ పుణ్యమూర్తి పుట్టిన నేల ధన్యమయింది - మనమందరం ధన్యులం." ఆ పౌరుడు రెండుచేతులెత్తి నమస్కరించాడు. వింటున్న వాళ్ళ కళ్ళు చెమర్చాయి. ఆ కథ విని దిక్కులు పులకించాయి.

ప్రస్తుత సంఘటనకు పూర్వం పన్నెండు సంవత్సరాలు వెనక్కు వెళితే - భరద్వాజ ఆశ్రమాన్ని విడిచి 'అనోమానదీ' తీరం వెంట కాలినడకన సాగిపోతున్నారు ఇద్దరు వ్యక్తులు, అందులో ఒకరి దీర్ఘమైన బాహువులు మోకాళ్ళు దాటుతున్నాయి. సన్నగా పొడవుగా ఉన్న విగ్రహం. లే ఎండలో అతని శరీరం బంగారు ఛాయలో మెరిసిపోతున్నది. దీర్ఘమైన నాసిక పట్టుదలను సూచిస్తున్నది. విశాలమైన నేత్రాలో ఏదో అన్వేషణ. రాచవంశంలో పుటిన వ్యక్తిలా ఉన్నాడు. తలమాత్రం బోడిగా వంటిమీద కాషాయం చూడటానికి సన్యాసి వేషం.

రెండో వ్యక్తి మొదటి వ్యక్తికి సమవయస్కుడే అయిన రూపం పూర్తి భిన్నంగా ఉన్నది. ఛామనఛాయ శరీరం, పెద్ద ముఖంలో గుబురుమీసాలు, పొట్టిముక్కుతో తలమీద పాగా ధరించి రాజోద్యోగిలా ఉన్నాడు. రెండోవ్యక్తి మొదటి వ్యక్తిని ఏదో బతిమాలుతున్నాడు. మొదటి వ్యక్తి ససేమిరా వింటం లేదు. మాటిమాటికీ తల అడ్డంగా ఊపుతున్నాడు.

''అంతేనంటారా యువరాజా! రథసారథిగా కాదు - మీ బాల్యమిత్రుడిగా, సహాధ్యాయిగా అడుగుతున్నాను. మీ మనసు మార్చుకుని వెనక్కిరండి.''

''అందరిముందు చేసిన శపథం వెనక్కు తీసుకోలేను. చెన్నా! నా వ్యక్తి స్వార్థం గురించి ఆలోచిస్తే శాశ్వతమైన అపకీర్తి మా వంశానికే కాదు. శాక్యనగరానికి కూడా వస్తుంది. పైగా నాకు ఇహభోగాలమీద ఆసక్తిలేదు. సత్యసాధన కోసం మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది - నన్ను పోనీ మిత్రమా - నా మార్గాన్ని నిరోధించకు.'' మిత్రవియోగాన్ని తట్టుకోలేని చెన్నుడు కాళ్ళమీద పడి పెద్దపెట్టున ఏడ్చాడు.

''పోనీ - ఎప్పటికి తిరిగివస్తారో అదయినా చెప్పండి. ఈ అందమైన ముఖాన్ని చూడకుండా ఎలా ఉండను. ఎన్నేళ్ళు నాకీ చీకటి - చెప్పండి'' కన్నీళ్ళ తడికి ధూళి అంటుకుని అతని ముఖమంతా మలినమై పోయింది. దుఃఖాతిశయానికి గొంతులో మాటకూడా పెగలటం లేదు.

మిత్రుడిని పైకి లేపి తనమీద ఉన్న కాషాయం ఉత్తరీయంతో ముఖమంతా తుడిచాడు. అతడిని ఓదరుస్తూ ''హితుడా! చిన్నప్పటినుండీ నాతో కలిసి పెరిగినవాడివి. నా స్వభావం, అలవాట్లు అన్నీ నీకు తెలుసు. అటువంటి నువ్వే నన్నాపటం ధర్మం కాదు - ఎంతోమంది కష్టాల్లో - మగ్గిపోతూ - సరయిన తోడు కోసం ఎదురుచూస్తున్నారు. మరెంతోమంది దీనులు - మోహవ్యధార్తులు, వీళ్ళందరిని ఆదుకోవాల్సిన అవసరం ఉన్నది. నిండుమనసుతో నీ స్నేహితుడిని ఆశీర్వదించి పంపు. నామీద ఏమాత్రం ప్రేమ ఉన్నా మరొక్కమాట మాట్లాడకుండా నన్ను ముందుకు సాగిపోనీ. తప్పకుండా వస్తాను, అనుకున్న లక్ష్యం సాధించాక. లేదా నా శవమైనా కపిలవస్తుపురం చేరుతుంది సరేనా! ఇక వెళ్ళిపో. ఇప్పటికే చాలాదూరం నడిచివచ్చావు. ఇక వెనక్కు తిరిగిపో. నాన్నగారిని అమ్మను తమ్ముళ్ళను జాగ్రత్తగా చూసుకో - నీదే బాధ్యత'' కడసారిగా మిత్రుని కౌగిలించి వీడ్కోలు చెప్పాడు. మసకబారిన కళ్ళల్లో నుండి కనబడుతున్న అస్పష్టమైన రూపం దూరమైపోతుంటే చెయ్యి ఊపుతూ నిలబడిపోయాడు చెన్నుడు.

నదీ తీరమే తోడుగా ముందుకు సాగిపోయిన సిద్ధార్థుడు గంగానది చేరాడు. దాని ఒడ్డునే ప్రయాణం చేస్తూ ఉరవళ్ళ పరవళ్ళ ప్రవాహ సౌందర్యాన్ని తనివి తీరా చూస్తూ మగధ రాజ్యం సరిహద్దులు చేరాడు.

రత్నగిరి దగ్గర చిన్నపాక వేసుకుని కొన్నిరోజులు తపస్సు సాగించాడు. అక్కడ మరో ఐదుగురు ఋషులు అతనిని కలిసారు. తపస్సు చేసే విధానాన్ని అక్కడే తెలుసుకున్నాడు.

అపక్వాహారాన్ని కందమూలాలను నివ్వరిధాన్యాన్ని, గడ్డీ - గరిక ఆహారంగా కొంతమంది నీళ్ళను మాత్రమే తీసుకుని తపస్సు చేస్తున్న వివిధ వ్యక్తులతో పరిచయమయింది. కొన్నాళ్ళ తర్వాత ఆ ప్రదేశం విడిచిపెట్టి వింధ్యపర్వతాల దిశగా ప్రయాణం చేసాడు. దారిలో ఇద్దరు బ్రాహ్మణులను కలుసుకున్నాడు. కాలాముడి ఆశ్రమంలో కొంతకాలం కపిల సాంప్రదయాన్ని, సాంఖ్యశాస్త్రాన్ని అధ్యయనం చేసాడు. సాంఖ్యంలో - సమాధి మార్గంలో ఉన్న కఠోర సాధనలను పూర్తిచేసాడు. దైహికమైన మానసికమైన బంధాలన్నీ తెంచుకున్నప్పుడే ఆత్మసంపూర్ణమోక్షాన్ని సాధిస్తుందనే ఆలారకాలాముడి బోధలు సిద్ధార్థుడికి నచ్చలేదు. తరువాత ఉద్రకరామపుత్రుని ఆశ్రమంలో మరికొన్నాళ్ళపాటు తత్త్వశాస్త్రాన్ని అభ్యసించాడు. ఇతడి సిద్ధాంతంలో కూడా 'ఆత్మకు' ప్రాధాన్యత ఉన్నా కర్మకు ముఖ్యస్థానం ఉండటంతో ఈ భావన శాక్యసింహుడికి ఎంతో నచ్చింది. పునర్జన్మ - ఆత్మ శరీరాలు మారటం నచ్చక ఆయన శిష్యత్వాన్ని కూడా వదిలేసాడు.

ఆ పిమ్మట అనేక దేవాలయాలు, ఆశ్రమాలు సందర్శించాడు - మతాచారాల వెనక కరడు గట్టిన కసాయితనాన్ని ఆయన సహించలేకపోయాడు. ఆ మార్గం వృధా అని తెలుసుకున్నాడు.

ఇక అనుకున్న లక్ష్యం: మహాజ్ఞాన ఆవిష్కరణం - దానికోసం అతడు గయకు వెళ్ళాడు. విలజానది ఒడ్డున దట్టమైన ఉరువేలారణ్యంలో ఆశ్రమం నిర్మించుకున్నాడు. అక్కడ మరో ఐదుగురు శిష్యులుగా కలిసారు.

గౌతముడి సాధన రోజురోజుకు కఠినతరమయింది. మొదట్లో ఏడిండ్లకు వెళ్ళి భిక్ష యాచన చేసాడు. తరువాత రెండురోజులకోమారు మాత్రమే ఏడుపిడికెళ్ళ ఆహారం తీసుకున్నాడు. ఆ పైన వారానికి పక్షానికి క్రమేపి ఆహారం తగ్గుతూ రోజుల సంఖ్య పెరగుతూ వచ్చింది.

సాధన తీవ్రం అవుతున్నకొద్దీ దుంపలు, పండ్లు, వరిగింజలు, చిగుళ్ళు, ఆకులు, ఇవి మాత్రమే అతని ఆహారం. జనపనార బట్టలు, లేడి చర్మాన్ని ధరించాడు. పూర్తి నిరాహార పరిస్థితికి వచ్చింది. శరీరం మీద దుమ్ము మందంగా పేరుకుపోయింది. జుట్టుపెరిగి జడలు కట్టాయి. ఆహారం లేనందువల్ల శరీరం శోషించిపోయింది. ఒంటిరంగు పూర్తిగా మారిపోయింది. అతని కఠిన తపస్సు చూసి ఉద్రకుని శిష్యులు భయపడుతున్నారు. అతడితో పాటు వారు కూడా అక్కడే తపస్సు చేస్తున్నారు. కేవలం తోలుకప్పుకున్న ఎముకలగూడు మాత్రమే మిగిలింది. పరమార్ధం సంగతి తరువాత ముందు ప్రాణం మీదకు వచ్చింది. ఆరోగ్యం పూర్తిగా పాడయింది. ఆయాసం పట్టుకుంది. దీనజనుల గోడు అటుంచి తన గోడు పట్టించుకున్నవాళ్ళు లెరు.

ఇరవై రోజుల నిరాహార నిర్విరామ తపస్సులో సిద్ధార్ధుని శరీరం వడలిన తోటకూరలా వ్రేలాడిపోయింది. మాట అసలు రావడంలేదు. కనుగుడ్లు తేలిపోతున్నాయి. ప్రాణం శోషించిపోతున్నది. నాలుకమీద రవంత తడిలేదు. పంచేంద్రియాలు వివశస్థితిలో కూరుకుపోతున్నాయి. నిస్త్రాణమైన దేహం భూమ్మీద వాలిపోయింది.

అతని సహచరులు భయపడిపోయారు. అసలే రాకుమారుడు. ఏమన్నా అయితే తమ తలలకే ముప్పువస్తుందని గాభరపడ్డారు. అందులో కొండన్న అనేవాడు దగ్గరకి వెళ్ళి చెయ్యిపట్టి చూసాడు. అతని చేతికి నాడి అందలేదు. గుండెమీద తలపెట్టి విన్నాడు. ఏ శబ్దం చెవికి సోకలేదు.

"కొంపమునిగిందిరా. గురువుగారిలో ఎక్కడా ప్రాణం ఆడటంలేదు. గుండె కూడా ఆగిపోయినట్లుంది. పాపం రాచబిడ్డ. రాజ్యాన్ని వదులుకుని వచ్చి ఈ స్థితి పాలయ్యాడు. మరేం చేద్దాం, ఇది మన తలమీదకు వస్తుంది. శవాన్ని వాళ్ళ నగరం చేరుద్దామా?" అన్నాడు మహానాముడు.

"వద్దు వద్దు. ఇప్పటిదాకా ఏం చేస్తున్నారని మనల్ని ఖైదులో పెడితే" బుద్దియుడన్నాడు.

"పోనీ దహనసంస్కారాలు చేద్దామా?" బప్పన్న అడిగాడు.

"నాకొకటనిపిస్తుందిరా, ధ్యానంలో పైస్థాయికి పోయినపుడు సమాధిస్థితి కలుగుతుందటగా. ఆ స్థితికి చేరుకున్నప్పుడు శరీరం శవంలాగా అయిపోతుందట. ఆ సమయంలో వారిని పూడ్చినా నీళ్ళలో ముంచినా చావరట. శ్వాసను బంధించే సాధనని ఈ గౌతముడు చేస్తున్నాడేమో. ఒకవేళ మనం దేహాన్ని తగలబెడితే బ్రతికున్న మనిషిని చంపిన వాళ్ళమవుతాం కదా! ఆ పాపం మనకెందుకు? " అన్నాడు కొండన్న.

"అదీ నిజమే - ఎన్నో రోజులు యోగ సమాధిలో ఉంటారట మహాత్ములు. మనకెందుకు అతడిని ఇక్కడే వదిలివెళ్ళిపోదాం."

**"అవునవును. ఇళ్ళకు వెళ్ళిపోదాం.** ఇంతవరకు ప్రాణాయామం కూడా కుదరలేదు మనకు, తపస్సు సంగతి తర్వాత అడవి చీమలు కుడుతుంటే నరకద్వారాలన్ని కనబడుతున్నాయి"

"బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. పై జన్మలో ఆలోచిద్దాం తపస్సు గురించి ఇంటిదగ్గర పెళ్ళాం బిడ్డలు ఏడుస్తుంటారు పోదాం పద."

అందరూ కూడబలుక్కుని అతడి ఖర్మానికి అతణ్ణి వదలి కాశీ వెళ్ళిపోయారు. చెట్టు క్రింద అనాథగా గౌతముడు పడివున్నాడు. పట్టుపరుపుల మీద పువ్వులా ఉండాల్సిన దేహం కఠిన రాళ్ళమీద అనాచ్ఛాదంగా పడివుంది. పంచభక్ష్య పరమాన్నాలతో పెరిగిన శరీరం తిండికి నీళ్ళకు కరువై ఈ అడవిపాలయింది.

వాళ్ళు వెళ్ళిపోయిన కొంతసమయానికి ఒక స్త్రీ ఆ వైపుగా వచ్చింది. ప్రాణం ఉందో లేదో తెలియని స్థితిలో పడిపోయివున్న గౌతముడిని మెల్లగా కదలించి చూసింది. అర్థనిమీలితాలయిన నేత్రాల్లో ఎక్కడో కొంచెం జీవం కొట్టుకుంటా వున్నది. పరిస్థితిని అర్థం చేసుకున్న ఆమె ముందుగా చేసిన పని, తనవెంట తీసుకొచ్చిన వెండి చెంబులోని నీళ్ళతో పైట తడిపి ముఖమంతా తుడిచింది. అతని తల తన తొడపై పెట్టుకుని కొంచెం కొంచెంగా నీళ్ళు నోట్లో పోసింది. ఆరిపోవటానికి సిద్ధంగా ఉన్న పత్తి తైలం తాకిడితో కొంచెం పుంజుకున్నట్లు ముఖం తేటబడింది. తల్లి పుట్టిన బిడ్డను లాలించినట్లు తనతో తెచ్చిన పాలు త్రాగించింది. పంచప్రాణాలు వాటి స్థానాలకు వచ్చిచేరుకున్నాయి. కాసేపటికి తేరుకున్న గౌతముడు మెల్లగా లేచికూర్చున్నాడు. అతనిముఖంలో కళ్ళు తప్ప మరే అవయవం ఆకారంలో కనిపించడంలేదు. ఎండకు ఎండిపోయిన చెంపలు, పాలిపోయిన చర్మం.. అప్పుడే సమాధిలో నుండి లేచి వచ్చిన శవంలా ఉన్నాడు.

"కొంచెం పాయసం తింటారా బాబూ?" అడిగింది ఆప్యాయంగా. మెల్లగా తలవూపాడు. తింటానన్నట్లు.

గిన్నెలో పాయసాన్ని మెల్లమెల్లగా తినిపించింది. కొంచెం నీళ్ళు త్రాగించి మూతి కడిగి తన కొంగుతో అద్దింది. "ఆహా! స్త్రీమూర్తి! నీ మాతృత్వం, కరుణ అపూర్వం. లోకంలో ప్రతి ఒక్కరికి తల్లికాగలిగిన హృదయం నీకే సొంతం. రాళ్ళను, రాజులను చంటిపాపలా తన కంటిపాపలో పెట్టుకుని కాపాడగలిగిన కారుణ్యమూర్తివి. కరుణాంతరం. అమృతానికి నెలవు నీ గుండెలు. ఎందరో వీరాధివీరులను, త్యాగమూర్తులను భూమికి అందించిన మహనీయమూర్తివి. నీ జీవితం ధన్యం నీకిదే వందనం"

గౌతముడికి మరోజన్మ ఇచ్చింది ఆ మహాతల్లి. తేరుకున్నాక ఆయన సంబోధించింది అదే

పూర్తిగా బాహ్యస్మృతిలోకి వచ్చాక ఎదురుగా ఉన్న స్త్రీమూర్తిని చూసాడు. రెండు చేతులెత్తి నమస్కరించాడు. మమకారం, మానవత్వం కలబోసినట్లుంది ఆ రూపం. ముఖాన ఇంత కుంకుమ బొట్టు, కాసెపోసి కట్టిన చీరకట్టు, చిరునవ్వు ముఖం, అమాయకంగా కనిపించింది.

"నాకు ప్రాణం దానంచేసిన నీవు వనదేవతవా? ఎవరమ్మా నీవు?" సిద్ధార్థుడడిగాడు.

"సామీ నేను మామూలు ఆడదాన్ని. ఏ దేవతను, దయ్యాన్ని కాను. ఒక గొల్లింటి ఆడపడుచుని."

"ఈ రోజు ఎవరో పంపినట్లు వచ్చావమ్మా. ఈ బిడ్డకు మళ్ళీ పునర్జన్మ ఇచ్చావు. ఏ ఊరో తెలుసుకోవచ్చా"

"అయ్యో దానికేం బాగ్గెం. బాబూ! ఈ అడవి గుండా మూడుమైళ్ళు పోతే పలుగునీ నది ఉంది చూడు. ఆ నది ఒడ్డుగుండా కూసింత దూరం నడిత్తే మా పల్లె. దానిపేరు సేవాని. ఆ ఊరి పెద్దే మా ఇంటాయన. ఊరిపేరే ఆయన పేరు కూడా" భర్తను గురించి చెప్పేటప్పుడు సిగ్గుతో ఆమె ముఖం ఎర్రబడింది.

"లేకలేక మాకో కొడుకు పుట్టాడు. ఆడు పుడితే ఇదుగో ఇక్కడ దగ్గర్లో ఉన్న కొండదేవతకు పాలు, పాయసం మొక్కుతీరుత్తానని చెప్పా. ఆ తల్లి నా మొరాలకించి బిడ్డనిచ్చింది. అందుకే సామీ మొక్కు చెల్లించటానికొచ్చిన. నువ్వు చూత్తే పాణం లేకుండా పడుంటివి ఎవరో అని ఇటు లగెతుకొచ్చా."

ఆమె మాటలో పల్లెతనమున్నా ఆమె హృదయం మహోన్నతమైన నాగరికతను నింపుకుని కనిపించింది.

"మరి అమ్మకు పెట్టాల్సిన నైవేద్యం నాకు పెట్టావేమమ్మా. మొక్కు తీరలేదని బాధగా లేదా?"

"అయ్యో ఎంత పిచ్చోరు సామీ మీరు. ఒక పక్క పాణం పోతున్న మడిసిని ఇడిసిపెట్టి కనపడని దేవతకు పెడితే లాభమేముంది. సాటిమడుసుల నాదుకోలేని పూజల వల్ల ఉపయోగంలేదు బాబూ. కట్టాల్లో ఉన్నాళ్ళను కాసుకోకపోతే ఆ దేవుడు కూడా మెచ్చడు"

ఎంత సత్యం ఆ మాటల్లో! ఆమెకు చదువులేదు. ఏ గురువూ శాస్త్రాలూ బోధించలేదు. అమాయకంగా అడవిలో పెరిగిన ఆమెలో ఎంత పరిపక్వత! ఆ మాటల్లోని వాస్తవం గౌతముడి గుండెలను తాకింది. అద్భుతమైన ఆ న్యాయానికి అతని జ్ఞాననేత్రం తెరుచుకున్నది. ఇన్నాళ్ళూ చేసిన తపస్సంతా పరిహాసంగా తోచింది. అందులో తపస్సు చేసి స్వర్గానికి పోయేది అప్సరసల కౌగిళ్ళకేనని చెప్పిన కొంతమంది మాటలు గుర్తొచ్చి అసహ్యమనిపించింది. నిజమే మానవుడిని కష్టాల్లో ఆదుకోవటం కంటే పూజలు తపస్సు ఎక్కువకాదు. అది తన మార్గమే అయితే దానికి ఎన్నుకున్న విధానంలోనే లోపం ఉందనిపించింది.

"ఏమిటి సామీ! చూట్టానికి గొప్పింటి బిడ్డలా ఉన్నారు. ఈ తపస్సులేంటి? ఒకవేళ చేసినా కూడూ నీళ్ళూ లేకుండా ఎన్నాళ్ళుంటుంది దేహం? అన్నం ఒంటికి బలం. బలం ఉంటే ఏ పనయినా చెయ్యొచ్చు. ఈ మాత్తరం కూడా తెలుసుకోకుండా ఎట్టావున్నారు. ఇంకొంచెం ఆలీసం అయ్యుంటే ఏమయ్యేవారు. ఏ యమ్మ కడుపు పంటో సామి! నాకు మాటియ్యండి ఇంకెప్పుడూ ఇలాగ తిండి లేకుండా తపస్సు చేయనని - బుద్ధి బాగుంటే కదా మనసు కుదురుగుండేది" అమాయకంగా చాపిన ఆమె చేతిలో చేయి ఉంచాడు. ఒక్కొక్క సత్యం పొరలు విప్పుకుని కళ్ళముందు సాక్షాత్కరిస్తున్నది. తన అజ్ఞానాన్ని తొలగించటానికి ధర్మదేవత ఈమె రూపంలో వచ్చింది సందేహం లేదు.

"అమ్మా! మీ పేరు?"

"నా పేరు సుజాతంటారు. ఇదిగో సామి. నా బిడ్డకు పాలిచ్చే ఏలయింది. మీరు దేవుడ్ని కనుక్కున్నాక నన్ను శిష్యురాలిగా చేసుకోవాలి. మాట తప్పకూడదు. వేళకు బువ్వతిని తపమో, జపమో చేసుకోండి - ఆ దేవుడిక్కూడా రోజూ నయేజ్యం కావాలికదా! శరీరం ఉన్న మీకవసరంలేదా? అది మర్చిపోవద్దు. ఎళ్ళొత్తా" చెంబు - గిన్నెలు తట్టలో సర్దుకుని గౌతముడి పాదాలకు నమస్కరించి అక్కడనుండి బయలుదేరింది. ఆమె వెళుతుంటే చల్లని గంగామాత రూపం ధరించి నడిచిపోతున్నట్లు అనుభూతి చెందాడు గౌతముడు. ఆయన కళ్ళల్లో రెండు బాష్పాలు అనుంగు సోదరికి వీడ్కోలుగా -

జరిగిన సంఘటన చిన్నదేమీ కాదు - ఆయనలో ఒక పెద్దమార్పుకు అది మూలమయింది. తిండిలేకుండా శరీరాన్ని శుష్కింపచేస్తే వచ్చే ప్రయోజనం ఏంలేదు. చావటం తప్ప - శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచి సాధన చేసినప్పుడు ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవచ్చు. అందువలన తలక్రిందులుగా వ్రేలాడటం, గాలి భోంచెయ్యటం, మిగిలిన పద్ధతులన్నీ వ్యర్థాలే - ధ్యానం ప్రధానమైనది. దానిద్వారా అనుకున్నది సాధించాలి.

ఆ రోజు నుండి పూర్తి ఏకాగ్రతతో ధ్యానం మీదే మనసు లగ్నం చేసాడు. భూమధ్య స్థానంలో దృష్టి నిలబడినప్పుడు అటూ ఇటూ పరుగులు తీసే మనస్సు అదుపులోకి వస్తుంది. అంతశ్చేతనలో లయించే మనస్సు, పూర్తి ఆత్మానందాన్ని అందిస్తాయని తెలుసుకున్నాడు. మనస్సు దానినాశ్రయించుకున్న ఇంద్రియాలు ప్రాపంచిక సుఖాల వెంట గుర్రాల్లా పరుగులు తీస్తూ చపలత్వానికి లోనవుతున్నాయి. ఇవే కోర్కెలకు అస్థిరతకు మూలం. ఇంద్రియానుభూతమైన సుఖం తాత్కాలికం. అదుపులేని కోర్కెలవెంట పరుగుతీసే మనస్సుకు దుఃఖం తప్పనిసరి అవుతున్నది. దప్పికయినప్పుడే నీళ్ళు త్రాగాలి. ఆకలయినప్పుడే అన్నం తినాలి. అలాగే మిగిలిన కోర్కెలు. మనసు అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలి తప్ప దాని ఇష్టానికి వదిలేయకూడదు. అది అదుపులో ఉన్నప్పుడు ఇక శోకం ఎక్కడిది?

ఈ అన్వేషణలో కొన్నిరోజులు గడిచాయి. ఒకరోజు -

ప్రాతస్సంధ్య వెలుగు చీకట్లను కలబోసుకుంటున్నది. మసక వెన్నెల అడవి నాశ్రయించి మౌనంగా చూస్తున్నది. ఆకాశంలో అక్కడక్కడా ఒకటీ అరా నక్షత్రాలు నిర్భాగ్యుల ఆశాదీపాల్లా మెరుస్తున్నాయి. ఫల్గుణీ నదిమీదనుండి వస్తున్న చల్లటి గాలులు గౌతముడి అనాచ్ఛాదిత శరీరాన్ని మెల్లగా స్పృశిస్తున్నాయి. ధ్యానమగ్నమయిన ఆయన నేత్రాలు నిమీతాలై అరవిరిసిన కలువల్లా ఉన్నాయి.

భ్రూమధ్య స్థానంలో సుషుమ్నా నాడిమీద నిలచిన అంతర్దృష్టి సమాధి స్థితికి చేరుకుంటున్నది. ఆ సమయంలో చెట్లమీది పక్షులు ఏ మాత్రం సందడి చేయటంలేదు ఆయన ధ్యానం ఎక్కడ భంగపరుస్తామోనని –

చీకటి వెలుతురులో లీనమవుతున్నట్లు ఇంద్రియాలు మనసులో లయిస్తున్నాయి. మనస్సు బుద్ధిలో మమేకమవుతున్నది. తెలియని అగాధంలో జారిపోతూ బుద్ధి పట్టుకోసం ప్రయత్నిస్తున్నది. అంతఃకరుణ చతుష్టయం పంచీకరణంలో మిశ్రమమైలోకద్వవస్థనుండి లోకాతీత స్థితికి చేరుకుంటున్న వేళ. అవస్థాత్రయం, ఏకమై సంగమానికి ఆనందంతో సమాయత్తమవుతున్న ఆ శుభసమయం.

ఒక్క ఘడియకాలం సమస్తం నిశ్శబ్దం. అక్కడ జననాలు, మరణాలు వాటి సుఖదుఃఖాలు ఏమీలేవు. ఋతువర్తనాలు గ్రహసంచారాలు, పొంగే సముద్రాలు, క్రుంగే పర్వతాలు, కదిలేకాలం, నడిచే జీవజాలం అన్నీ ఏకీకృతమై జడీభవించి ఘనీభవించిన ఆ ఒక్కక్షణం.

చిరుదివ్వెగా లేచి, పెనువెల్లువై సాగి అణువు అణువున ఆవిర్భవిస్తున్న మహాప్రళయ విస్ఫోటనాల కాంతివలయమై సాగి సాగి పరిసరాలను ముంచెత్తే మహాప్రవాహమై నదులు, నదాలు, కొండలు, గుట్టలు, అరణ్యాలు – విశ్వాన్నే కబళించే గొప్ప కాంతి సమూహం సముద్రమంత విశాలమై, గగనమంత విస్తారమై అండపిండ బ్రహ్మాండాలను తనలో ఇముడ్చుకున్న ఆ వలయంలో అస్తిత్వాన్ని కోల్పోయిన గౌతముని శరీరంలో విద్యుద్ఘాతాల ప్రకంపనలు. ఎన్నడూ అనుభవానికి రాని ఆనందప్రహేళికలు.

సమస్త భావనలంతరించి తనలో విశ్వాన్ని, విశ్వంలో తననీ ఆవహింపచేసుకున్న సుమధురక్షణం. సిద్ధార్థునిలో జ్ఞానోదయమయింది. పరచుకున్న కాంతి వలయంలో తన మార్గం సుగమమయింది.

ఆ అనుభూతిలో ఎంతసేపున్నాడో తెలియదు. విచిత్రంగా మనస్సు పూర్తి ప్రశాంతస్థితిలో ఉన్నది. ఏ వికల్పాలు సంకల్పాలు లేవు.

శోకమూలం కరతలామలకమయింది.

సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. గయ బుద్ధగయగా సార్ధక్యాన్ని పొందింది. అప్పుడది వట్టి బోధికాదు. మహాబోధి. ఏ గురువుద్వారానో, ఈశ్వరుని వల్లనో కాక స్వబుద్ధి ద్వారా పొందినందున బౌద్ధధర్మం 'స్వబోధనం' అయింది.

మొదటగా ఈ వార్త ఉరువేలారణ్యంలోని ప్రతిచెట్టు, ప్రతి పక్షి తెలుసుకున్నాయి. కలకూజితాల ద్వారా గాలికందించాయి. సందేశాన్నందుకున్న వాయువు అఘమేఘాలమీద పరుగుదీసింది. పదిమందికా వార్త చేరవేసింది. బుద్ధుడికన్నా అతడి ధర్మాన్ని తానే ముందు మోసుకొచ్చానని గర్వపడింది కూడా. వార్త తెలిసిన కొండశిఖరాలు నదులు, మైదనాలు అవీ ఊరుకోలేదు. వాటి కర్తవ్యాన్ని వేయిబాహువులు చాపి చాటించాయి.

ఈ సమయంలో ఫల్గుణీనది నిర్వహించిన పాత్ర చాలా గొప్పది సుమా. తన నీటిని ముట్టుకున్న ప్రతి ఒక్కరికీ ఆ సత్యామృతాన్ని సంతోషంగా త్రాగించింది. అందుకే జానపదుల గళాల్లో కమ్మని తేటపదాల్లో బౌద్ధం వ్యాపించింది. పట్టణాలకు మెట్టింది. పండితుల చెవిసోకింది. అంతఃపురాలకు అడుగుపెట్టింది.

●●●

సిద్ధార్థుడు బుద్ధుడిగా మారాక మొదటగా తన సహచరులను కలుసుకోవాలనుకున్నాడు. వాళ్ళ జాడ తెలుసుకుంటూ కాశీ చేరి అక్కడ వారు లేనందువలన సారనాథ్‌లో ఉన్నారని తెలిసి అక్కడకు చేరుకున్నాడు. తిరిగి తిరిగి అలసిపోయి భోజనం చేద్దామని ధర్మసత్రం దగరకు వెళ్ళినప్పుడు తెలిసింది. ఆ రోజు పండిత సభ జరుగుతుందని.

కుతూహలంతో సభ జరిగే చోటుకు వెళ్ళాడు. అంతమందిలో ఒక కొండరాయిమీద ఎత్తుగా ఉన్న చోటు చూసుకుని కూర్చున్నాడు. ఆ సభకు ముఖ్య అతిధిగా ఆ రాజ్యాన్ని పాలించే బింబిసార చక్రవర్తి వస్తున్నాడు. దేశంలో నలుమూలలనుండి నిగమాగమ శాస్త్రాలను అవపోసన పట్టిన మహాపండితులందరికీ ఆహ్వానం వెళ్ళింది. ప్రధానంగా సభలో పాల్గొనేవారు భిన్నసాంప్రదాయాలకు సంబంధించి శాస్త్రపరంగా వారి వారి వాదనలు వినిపించవచ్చు.

చక్కటి వేదికమీద పట్టుపరుపులు పరిచారు. పండితులు కూర్చోవటానికి అనువుగా మెత్తని తలగడలనమర్చారు. కాశీ, సారనాథ్‌లకు సంబంధించిన పండితులు. మరికొంతమంది సాహిత్యం అభిలాషులు. కార్యక్రమ నిర్వహణకు ప్రధాన బాధ్యత వహిస్తున్నారు. సభాప్రాంగణం చుట్టూ కాషాయజండాలు కట్టారు. వేదిక ముందు చక్రవర్తికి ఆయన మంత్రులకు ఆసనాలు అమర్చారు.

కాసేపటికి సభప్రారంభమయింది. జరీశాలువల మెరుపులతో, పసిడి గండపెండేరాల ధగధగలతో ఉద్దండ పండితులంతా ఆసీనులయ్యారు. సామంతదండనాయక భటులు వెంటరాగా చక్రవర్తి కూడా వచ్చేసాడు. రాగానే అందరికీ అభివాదం చేసి తనకు నిర్ణయించిన ఆసనంలో కూర్చున్నాక సభ ప్రారంభించమని చేత్తో సంజ్ఞ చేసాడు.

ఆ సభలో కాశ్మీరపండితులే ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నారు. చార్వాకులొకవైపు పండిత వాదాలను తిప్పికొట్టడానికి సిద్ధపడుతున్నారు. సాహిత్యాభిమానులు ఆధ్యాత్మిక వాదులతో ఆ ప్రాంగణమంతా క్రిక్కిరిసి పోయింది. భక్తులు, తార్కికులు ఎదురెదురుగా కూర్చుని కోరచూపులతో చురచురా చూసుకుంటున్నారు. సభ ప్రారంభమయింది.

ఒక పండితుడు గొంతు సవరించుకుని ప్రారంభ సూచనగా

"దైవం అంటే ఏమిటి, దానినెట్లా తెలుసుకోవాలి" అని అడిగాడు.

దానికి మరో పండితుడు శాస్త్ర ప్రమాణాన్ని ఉదహరిస్తూ -

**'తిలేషుతైలం దధినీవసర్పిః**

**శ్రోతస్సురాపో, స్వరణీషుచాగ్నిః**

అంటే తిలల్లో తైలంగా, పాలలో వెన్నలాగా భూమిలో నీరులాగా, కట్టెలో అగ్నిలో ఈ సృష్టి ఆవిర్భావం వెనక ప్రతిపదార్ధంలో నిండి జగద్వ్యాపారాలను నడిపిస్తున్న ప్రేరేపకశక్తి దైవశక్తి. ఆ శక్తిని గుర్తించటానికి లౌకికమైన ఈ ఇంద్రియాలు చాలవు. మనోవాక్కాయకర్మల కతీతమైన ఆత్మజ్ఞానంతో మాత్రమే చూడగలం."

"అయితే అది సాకారమా, నిరాకారమా? "

"సాకారము, నిరాకరము రెండూనూ - పాలగా ఉన్నప్పుడు ద్రవపదార్ధం, అదే పెరుగుగా మారినప్పుడు ఘనపదార్ధం కావటం లేదా. అలాగే దైవశక్తి అన్ని విధాలుగా పనిచేస్తున్నది" అన్నారు రెండో పండితుడు.

"అంటే రెండూ పదార్ధాలేగా! పాలను గడ్డకట్టించటానికి పెరుగువేస్తేనే అది గడ్డకడుతున్నది. ఇక్కడ రెండు జడాలకు సంయోగాన్ని కలిగిస్తున్నది మనిషి బుద్దేగదా. మానవుడి బుద్ధికి కర్మలకు ఈ దైవశక్తి ఎంతవరకు బాధ్యత వహిస్తున్నది?" చార్వాకులడిగారు.

"జననానికి, మరణానికి మధ్య జరుగుతున్న అభివృద్ధి దానంతటదే జరగడంలేదు. గ్రహాలు తిరగటం, సముద్రాలు చెలియలికట్ట దాటకుండా ఉండటం. పంచభూతాలు వాటి స్వాభావికత. సృష్టిమనుగడకు మూలసూత్రం. దానినర్ధం చేసుకోగలిగితే ఒక అతీంద్రియశక్తి వీటిని క్రమబద్ధంగా నడిపిస్తున్న విషయం అర్ధంకావటంలేదా. అదే దైవశక్తి ఎందుక్కాకూడదు?" పండితుడు ఆవేశంతో ప్రశ్నించాడు.

"అది దైవశక్తని ఎందుకనుకోవాలి. సహజంగా సాగిపోతున్న ప్రకృతి స్వాభావికత అనవచ్చుగా?" చార్వాకులు నిలదీసారు.

కొంచెం సేపు వాదోపవాదాలు తీవ్రమయ్యాయి. సభావేదిక మీదే చెయ్యి చెయ్యి కలుపుకున్నారు, కొట్టుకున్నారు. నిర్వాహకులు వచ్చి విడదీసారు. మళ్ళీ వాతావరణం ప్రశాంతమయింది.

"ఆత్మకు భగవంతుడికీ ఉన్న అనుసంధానమేమిటి?" మరో సిద్ధాంతి అడిగాడు.

"ఆత్మ, పరమాత్మ నిజానికి వేరుకాదు. గడ్డకట్టినప్పుడు మంచు అంటాము. కరిగితే నీళ్ళంటాము" అంతే తేడా.

**అంతశ్శరీరే జ్యోతిర్మయోహిశుభ్రో**

**యంపశ్యంతి యతయఃక్షీణదోషాః**

లోపల జ్యోతిరూపంలో ప్రకాశిస్తున్న దైవాన్ని ఒక్క దోషరహితులు మాత్రమే చూడగలుగుతున్నారు. ఆయన ఆత్మరూపంలో నిరాకారంగాను ఉన్నాడు. సాకారంలో అనేక అవతారాలు ఎత్తి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తున్నాడు.. సృష్టిస్థితిలయాలకు అధిదేవతలై త్రిమూర్తులుగా ముల్లోకాలను పాలించటంలేదా?" భక్తిమార్గాన్ని నమ్మిన పండితుడు అరిచాడు.

"చాలాపొరపాటు మాట్లాడుతున్నారు. ఆత్మరూపాలను మార్చుకుంటే దాని తత్త్వానికే ముప్పు వస్తున్నది."

"అవ్యక్తోయ మచిన్త్యోయ మవికార్యోయ ముచ్యతే' అని చదవలేదా ఆత్మకు రూపంలేదు. నామం లేదు. నువ్వనుకుంటున్న రూపాలు మిథ్యాభ్రాంతమే. జీవస్థితిలో లౌకిక వ్యాపారాల కోసం సృష్టించుకుని ఆడుతున్న నాటకాలు"

"అహం బ్రహ్మాస్మి - నేనే సర్వం, వేరే ఏదీలేదు. " అద్వైతి అభిమానం అవధులు దాటింది.

"అహం అంటే ఏమిటో చెప్పండి అద్వైతిగారూ" ఒక పండితుడు వ్యంగ్యంగా అడిగాడు.

"ఉన్నదంతా అహమే. భౌతికమైనదేదీ అద్వైతంలో పరిగణించబడదు. ఎందుకంటే "యద్దృశ్యతి తన్నశ్యతి" కనుక.

కంటికగుపించే స్థూలశరీరం ఈ భూతజాలం నేను కాదు. నాకన్ను నా చేయి అంటామే తప్ప వాటిని 'నేను' అనం. అలాగే శరీరానికి ఉపకరణాలైన ఇంద్రియాలు నేనుకాదు. కన్ను చూడకపోయినా - కాలునడపకపోయినా నేనున్నాను వాటిని పనిచేయించే మనిషి నేనుకాదు. గాఢనిద్రలో అది ఉండనప్పుడు నేను ఉన్నాను కనుక అవస్థాత్రయానికి ఆవల సదా వెలుగుతూ ఉన్న తేజో రూపం నేను. అదే నా శరీర వ్యాపారాలకు మూలకర్త. సాక్షీభూతంగా ఏ కర్మా అంటని నిర్వికారనిర్గుణతత్త్వమది" తన్మయంగా చెప్పుకుపోతున్నాడు అద్వైతి.

మరో పండితుడు దానిని సమర్థిస్తూ "అవును  ఎదుట ఉన్నదంతా మిథ్య. నేను సత్యం. అందుకే నేను తింటున్నా తినని వాడినే. వింటున్నా విననివాడినే"

"ఏం పాపం.. చెవుడా?" ఎవరో చమత్కరించారు. " అసలు వీళ్ళకు తిండే పెట్టకుండా ఉంటే సరిపోతుంది. బ్రహ్మపదార్థాన్ని నమిలి మింగుతారు" చార్వాకుల పరిహాసానికి అందరూ నవ్వుకున్నారు.

"అయితే నేను ఫలానా అని చెప్పుకునే ఈ అహం ఎక్కడిది రెండు అహాలున్నాయా?"

"అవును. ఒకే అహం దాని స్థితిగతుల మార్పుల్లో రెండుగా చూడబడుతున్నది తప్ప నిజానికి ఒక్కటే. అద్దంలో చూసుకున్నప్పుడు బింబ ప్రతిబింబాల్లో రెండుగా కనబడటంలా - అయినప్పటికీ మనం ఒక్కరమే కదా. అలాగే ఇది, అజ్ఞానమనే అద్దంలో చూస్తే రెండుగా కనిపిస్తాయి" సమాధానమిచ్చాడు.

"అయితే ఆత్మ రెండు రూపాలు ధరిస్తున్నదన్నమాట -"

"జీవుడు దేవుడు - ఓహ్ - ఒకదానికొకటి పొంతన ఏదీ -"

బుద్ధుడిలో ఆవేదన అసహనం క్షణక్షణం పెరిగిపోతున్నాయి. ఇంతటి నిస్సారమైన విషయం కోసమా వీరి జీవితకాలమంతా వ్యర్థం చేసారు. ఉందో లేదో అది ఒకటిగా ఉందా రెండుగా ఉందా అనే విషయం ఇన్ని యుగాలుగా ఇంకా అర్థం కాని స్థితిలోనే జరుగుతున ఈ వాదనల వలన మానవాళికి ప్రయోజనం ఏమిటి?

ఇక అక్కడ కూర్చోలేకపోయాడు. సరాసరి జనాన్ని తప్పించుకుని సభాప్రాంగణం దగ్గరకు వచ్చాడు.

"నేనొక ప్రశ్న అడగవచ్చా?" గొంతెత్తి పెద్దగా అడిగాడు.

పండితవాదనలు ఆగాయి. అడిగింది ఎవరా అని సభలో ఉన్నవాళ్ళంతా తలలు తిప్పి చూస్తున్నారు. పండితులు ప్రశ్నార్థకంగా చూసారు.

"నేను అడుగుతున్నాను. ఒక ప్రశ్న అడగటానికి నాకో అవకాశం ఇస్తారా?" మరోసారి అడిగాడు. రుద్రుడు మారువేషంలో వచ్చినట్లు పచ్చటి దేహఛాయతో మెరిసిపోతున్న ఆ తాపసిని చూసి నిర్వాహకులడ్డగించారు.

"లేదు.. లేదు.. మీకా అవకాశం లేదు. ముందుగా అనుమతి పత్రం పొందాల్సి ఉన్నది. దయచేసి ప్రశాంతంగా కూర్చోగలరు."

"ప్రజలకోసం ఏర్పాటు చేసిన ఈ వాదనలలో వారిని భాగస్వాములుగా చెయ్యటం ధర్మం. సందేహం ఎవరికయినా రావచ్చు. తీర్చటం వారి బాధ్యత. కనీసం చక్రవర్తులయినా నాకవకాశం ఇస్తారని ఆశిస్తున్నాను"

సకలరాజలక్షణ చిహ్నితమైన దేహాన్ని మనోహరమైన అతని చిరునవ్వు చూసి బింబిసారుడు ముగ్ధుడయ్యాడు. దగ్గరకు పిలిపించుకున్నాడు.

"తమనామధేయం?"

"బుద్ధుడిని"

"ఏ దేశం?"

"అన్నిదేశాలూ నావే"

"ఆహా! ప్రపంచ చక్రవర్తులన్నమాట"

"సందేహమేముంది!? అధికారవ్యామోహులై యుద్ధాల పేరుతో ఎంతోమంది ప్రాణాలమీద నిర్మించుకున్న రాజ్యంకాదు నాది. ఎల్లలకతీతమైన శాంతిస్నేహాల సామ్రాజ్యం. ధర్మమే చక్రంగా అహింసే ఆకులుగా, సత్యంనాభిగా. శీలం ఇరుసుగా నా నూతన ధర్మచక్రం మదోన్మత్తుల మూఢాచారాలను తొక్కుకుంటూ హింసావాదుల దౌష్ట్యాన్ని అణచివేస్తూ విశ్వప్రేమ కాంతిలో విహారం చేస్తుంది."

పలుకుల్లో స్థితత్వం, ఆకృతిలో గంభీరత్వం చెప్పకనే చెబుతున్నాయి- ఇతడొక మహాపురుషుడని. తన కొడుకు వయసుంటుంది. అయినా మహాజ్ఞానిలా ఉన్నాడు. ముగ్ధుడయ్యాడు బింబిసారుడు.

"ఇంతకీ తమవాదం"

"మానవతా వాదం"

"చాలాగొప్పగా ఉంది సమాధానం. ఈ చర్చమీద మీకేమయినా అభ్యంతరాలున్నాయా?"

"అవకాశం ఇస్తే మాట్లాడతాను"

"అయితే అనుమతిస్తున్నాం అడగండి"

స్వయంగా చక్రవర్తే అనుమతినివ్వడంతో నిర్వాహకులకు అభ్యంతరం లేకపోయింది. సభావేదిక మీదకు ఆహ్వానించారు. పండితులు మిర్రిమిర్రి చూస్తున్నారు అనుకోని అతిథిని.

"ఇప్పటివరకు ఆత్మమీద సాగిస్తున్న మీ వాదోపవాదాలను వింటున్నాను. దయచేసి నా ప్రశ్నకు సమాధానం చెప్పండి. శాస్త్రం కాదు కావాల్సింది. శాస్త్రీయత - ఆత్మను మీరు చూసారా. పోనీ చూసినవాళ్ళు ఉన్నారా? వారెవరు?"

"మేం చూడకపోతే ఏం. చూసినవాళ్ళు ఉన్నారట. వాళ్ళ అనుభవాలే శాస్త్రాలు. వాటి ప్రామాణికత కంటే వేరే సాక్ష్యం ఏం కావాలి?"

"అనుభవాలు అక్షరరూపమైనప్పుడు అందరూ ఎందుకు అందుకోలేకపోతున్నారు. కేవలం శబ్దప్రమాణాలనంగీకరించేదెట్లా పోనీ అదివుందనే అనుకుందాం. అటువంటప్పుడు ఒక్కటే అయిన ఆత్మకు ఇన్ని వాదాలెందుకు? మార్గభేదాలెందుకు? అనుభవానికి తెచ్చుకోలేని సత్యాన్ని గురించి మీరు గట్టిగా మాట్లాడగలరా? మీకు తెలియని విషయాన్ని గురించి ఎలా నమ్మించగలరు. అది శుష్కప్రియం. శూన్యవాదం కాదా!? హేతుబద్ధతకు అది సమంతమెలా అవుతుంది? పోనీ సమాజానికొచ్చిన లాభమేముంది? విలువైన మీ సమయమంతా అధ్యయనానికి వాదోపవాదాలకు సరిపోతే నువ్వు నివసిస్తున్న లోకానికి వచ్చిన ఫలమేమిటి?"

'ఈ చార్వాకులతోనే చస్తుంటే మరొకడు తయారయ్యాడు' గొణుక్కున్నారు వాళ్ళు.

"నీవు నాస్తికుడవా!"

"నిజాన్ని నిలదీసి అడగటం నాస్తికతా! మీరేది చెబితే దాన్ని గుడ్డిగా నమ్మితే మీ దృష్టిలో మంచివాళ్ళు. ఇక్కడ గోవుతోక పట్టించి అక్కడ వైతరణిని దాటిస్తున్నామంటే నమ్మాలి. ఇక్కడ యజ్ఞం చేసి అక్కడెక్కడో పుణ్యలోకాలు వస్తున్నాయంటే వినాలి. అవునా"

"చెప్పండి ఆయన ప్రశ్నకు సమాధానం. అందుబాటులోకి రాని ఆత్మవాదానికి రంగులు పూసి ఆడిస్తున్న మీ నాటకాలు బయటపెట్టే వాళ్ళంతా చార్వాకులు. నాస్తికులు. దుర్మార్గులు" చార్వాకులు కోపంగా లేచారు.

"నిజానికి ఆ ప్రశ్నకు సమాధానం వాళ్ళదగ్గర కూడా లేదు. అందుకే అది పరోక్షం. కేవలం అనుభూతికే తప్ప వాక్కుకు అందదు. నిరాకారం నిష్క్రియమైన బ్రహ్మపదార్థం సృష్టికి మూలం. సమస్తం అందులోనే కదలాడుతున్నది" అని మళ్ళీ శాస్త్రప్రమాణాలతో పండితులు వాదాలకు దిగారు.

"పండితులారా! మీరన్నదే నిజమయితే మీవాదన ద్వారానే వద్దాము. నిర్వికారం నిష్క్రియమైన బ్రహ్మము చలించే ఆకారమైన జగత్తు ఆవిర్భావానికి కారణమెట్లా అవుతుంది? అదే కారణమయితే దానికీ రూపవికారాలు. ఆలోచన అన్నీ వున్నట్లే. వికారము మార్పుకు సూచన. మార్పుకు లోనయ్యే బ్రహ్మం, లేదా ఆత్మకు నిత్యత్వమెలా వస్తుంది. అసలు సృష్టించగలిగిన శక్తిని కోల్పోతుంది కదా. ఈ పరస్పర విరుద్ధాలు ఎలా సాధ్యం.

వట్టి మాటల ద్వారా దేని ఉనికినీ నిరూపించలేం. కార్యకారణ సిద్ధాంతం ద్వారానే జగత్తు నిరంతర పరిణామం చెందుతూ ఉంటుంది. నిద్రలో మనస్సు లేకున్నా నేనున్నాను అదే ఆత్మ అని చెప్పారే. నిద్రలో కూడా అసంకల్పికమైన క్రియలు జరుగుతుంటాయి. నల్లి కుడితే మనకు తెలియకుండానే మనసు ప్రేరేపిస్తుంది. చెయ్యిదాన్ని నలిపేస్తుంది. ఇదేమీ అలౌకికం కాదు. చాలా సహజమైంది. ప్రపంచం దాని వ్యాపారాలు అలాగే నడుస్తున్నాయి. ఇదంతా దైవసృష్టే అయితే దేవుడే చెడ్డవాళ్ళను సృష్టిస్తున్నాడా? అటువంటప్పుడు వాళ్ళను దండించడం ఎందుకు? అసలు జగత్తు శాశ్వతమా, అశాశ్వతమా, అనంతమా, అంతమా! ఆత్మ, శరీరాలు ఒకటా? వేరా? అనే సమస్యలకు వాస్తవజీవితాలకు సంబంధం లేదు. మానవ గమనానికి ఇవి అనవసరం కూడా. అలౌకికం ఎవరికీ అర్థంకాని అతీంద్రియ విషయాలు మతం అనిపించుకోవు. అజ్ఞానాన్ని దూరం చేసి స్వార్థత్యాగం మనో నిగ్రహం పెంపొందించుకోవటమే సమ్మతం కనక నేను చెప్పేది గ్రహించండి. అర్థంకాని అర్థం లేని ఆత్మల గురించి ఆలోచించే కంటే నీ పక్కనే ఉండి తింటానికి పట్టెడు మెతుకుల్లేక అల్లాడి పోతున్న ఈ అభాగ్యులను గురించి ఆలోచించండి. నీకేమో మూడు పూటలు - పిండివంటలతో భోజనం. సాటి మనిషికి గంజినీళ్ళకు కూడా కరువే. అదేమంటే కర్మ సిద్ధాంతాన్ని మీకనుకూలంగా మార్చుకుని వాడు పాపం చేసాడు కనుక అనుభవిస్తున్నాడని చెప్పే నీ వేదాంతం పాము విషం కంటే భయంకరమైనది. చచ్చిన తర్వాత ఏమవుతుందో అనేదానికంటే బ్రతికుండీ చచ్చినవాడిలా బ్రతుకుతున్న సాటి జీవుల నాదుకోవటంలోనే మీరనే స్వర్గం మోక్షం మరో లోకం అన్నీ ఉన్నాయి. కన్నీళ్ళను తుడిచే నీ చల్లని చేతిలో భగవంతుడున్నాడు. ఆ దయార్ద్ర చిత్తమే ఆత్మ, పరమాత్మ. ఇదే నా వాదం. నిష్కర్షగా నేను చెబుతున్నది ఇదే ఇన్ని సంవత్సరాలు తపస్సు చేసి తెలుసుకున్న సత్యం ఇదే నిత్యం. మరొటి లేదు" వేదిక దిగి క్రిందకు వచ్చాడు గౌతముడు.

వర్షం వెలిసినట్లయింది. ఆయన వాదంలో సత్యం శ్రోతల మనస్సుకు చేరింది. పండితులు అంగీకరించినా, అంగీకరించకపోయినా దాన్ని ఖండించగలిగిన శక్తి మాత్రం వారికి లేదు.

బింబిసారుడిలో అంతర్మథనం మొదలయి గౌతముడి వాదనలోని నిజాన్ని అంగీకరించమని మనసు ఒత్తిడి పెరిగింది. అయితే తరాల ఆచారాలు సంప్రదాయాలు అతని రక్తంలో జీర్ణమై ఉన్నాయి. అంత తొందరగా మారనిస్తాయా!?

అందువలననే ఆయన గౌతముడిని అభినందించలేదు. మౌనంగా విన్నాడు. ఇంతలో అతని సహచరులు నలుగురూ పరుగెత్తుకుంటూ అక్కడకు వచ్చారు.

"సిద్ధార్థా! మీరు మీరు బ్రతికున్నారా! ఇక్కడికెలా వచ్చారు? తపస్సు సాధించారా?" ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించారు.

అన్నిటికీ చిరునవ్వుతో సమాధానం చెప్పాడు. బుద్ధాన్ని సాధించి బుద్ధుడినయ్యానని చెప్పాడు.

"మీది సమాధి స్థితో, మరణమో తెలియక భయంతో పారిపోయివచ్చాము. మమ్మల్ని క్షమించండి" అని పాదాలమీద పడ్డారు.

పండితులంతా చుట్టుముట్టారు.

ఎవరీ చార్వాకుడు?

"చార్వాకుడు కాదు. శౌక్యనగర మహారాజు శుద్ధోధనుని ముద్దుబిడ్డ. సిద్ధార్థుడు. తను నమ్మిన సిద్ధాంతం కోసం అన్నీ వదిలివచ్చిన త్యాగమూర్తి" శిష్యులు వివరించారు.

ఆ మాటలు వినగానే వారందరికీ గౌరవం పెరిగింది. బింబిసారుడు ఆసనం మీద నుండి లేచి వచ్చాడు.

"ఓ మీరు శాక్యనగర యువరాజులా!? ఉత్తర గాంగతేయులకు మా అభివాదం. ఎంత సుదినం ఈ రోజు మీ దర్శనం!! క్షత్రియ కులానికీ అలంకారం తెచ్చారు. నాడు విశ్వామిత్రుడు మొదలుకుని నేటి మీ వరకు మీ పుట్టుక చేత క్షాత్రకులం ధన్యమయింది. మీరు మా అతిథి. మాతో రావాలి" అన్నాడు ఆలింగనం చేసుకుంటూ.

"క్షమించాలి. పర్రివాజకుడను. భిక్షాటనకు తప్ప మృష్టాన్నాలమీద ఇచ్చలేదు. మీరు అభిమానంతో అడిగారు కనుక కొన్నాళ్ళు మీ రాజ్యంలోనే ఉండటానికి అనుమతివ్వండి చాలు"

"సంతోషంగా రాజభవనాలు వద్దంటున్నారు కనుక. ఎన్నో రమణీయమైన ఉద్యానవనాలున్నాయి. మీరెక్కడ ఉండదల్చుకున్నా నిరభ్యంతరంగా ఉండండి. మా సైనికులు మీకు కావల్సిన సదుపాయాలమరుస్తారు. ఇక మాకు శలవివ్వండి. అత్యవసరమయిన రాచకార్యం ఉంది. వెళ్ళొస్తాను" చక్రవర్తి వెనుదిరిగాడు. మళ్ళీ ఆగి -

"శౌక్యమునీ! ఒక్క మాట. మీ నూతన ధర్మాన్ని ఏ అడ్డంకి లేకుండా ప్రచారం చేసుకోవచ్చు. నేను అనుమతిస్తున్నాను" అని చెప్పి రథం ఎక్కి వెళ్ళిపోయాడు.

తక్కిన పండితులు కూడా రాజకుమారుడనే గౌరవంతో వినయంగా శలవు తీసుకున్నారు. బుద్ధుడు తన శిష్యులతో కలసి ముందుకు నడిచాడు. సారనాథ్ గాలి కూడా మెల్లగా వారివెంట సాగిపోయింది.

గౌతముడు బుద్ధుడయ్యాక అతని మహాప్రస్థానపు తొలి మజిలీ సారనాథ్.

******

(2)

**రాత్రి ప్రియురాలి ముఖం మీది** నల్లని మేలిముసుగు తొలగించి చంద్రుడు బయటకు వచ్చాడు. ఒక్కసారిగా తెల్లటి కాంతి పూలవనమంతా పరుచుకుంది. నక్షత్రాలు ఆకాశవృక్షానికి వ్రేలాడుతున్న వెలిపిట్టల్లాగా ఉన్నాయి. తారలతో సయ్యాటలాడాలని ఉన్నా తన వెలుతురే తనకు అడ్డమై వేడి నిట్టూర్పులు విడుస్తున్నాడు. అవి తోరణాలుగా మేఘసందేశాలుగా మారి గగనమంతా విహారం చేస్తున్నాయి.

"చూసారా స్వామీ! ఈ విషాదం"

"నిన్నంతగా బాధించిన విషాదమేమిటి దేవీ?"

"ఈ చందమామే. లోకంలో ఎన్నో జంటలను కలిపే ఇతడు మాత్రం విప్రలబ్ధుడు సుమా. కోరుకున్న ప్రేయసిని ఎప్పటికీ పొందలేని దురదృష్టవంతుడు"

"కాదు దేవీ అతడెన్నడూ దురదృష్టవంతుడు కాడు. లోకంలో ఎంతోమంది దంపతుల, ప్రేమికుల ప్రేమను పండిస్తున్న ధన్యజీవి. తన చల్లని కిరణాలతో కష్టజీవులను సేదదీరుస్తున్న ఆత్మీయుడు. చూడు ఈ వెన్నెల్లో నీ మోము తెల్లకలువలాగా ఎంత ప్రకాశిస్తున్నదో ఏదీ ఒక్కసారి ముద్దిడనీ"

"ఆఁఅర్ధమయింది నాథా. కలువబాలను వెతుకుతూ వచ్చిన రేరాజు మీరేనన్నమాట. అందుకే మీ ముఖంలో అంత కాంతి. "

"అమ్మ దొంగా! ఎంత మాటల చమత్కారివి. సంగీత సాహిత్యాల్లో సమర్ధురాలివి కదూ. ఆ రెండూ ఎక్కడ దాచావో చూపించు. "

అతని మాటల్లోని భావం అర్ధమై ఆమె ముఖం సిగ్గుతో ఎర్రగా కందిపోయింది. అందంగా చెవికి అలంకరించుకున్న కలువతో అతడిని కొట్టి పారిపోయింది.

ఆమె నందుకోవటానికి అతడూ పరుగుతీసాడు. ఇద్దరి ఆట చూడటానికి కిరణాలన్నీ వెచ్చించినా చాలటం లేదు చందమామకు. పరుగెత్తి పరుగెత్తి అలిసిపోయిన నందుడు అలకతో బుంగమూతి పెట్టాడు.

"నిన్నందుకోలేను సుమా"

"మీరు మాత్రం సౌందర్యంలో కవుల వర్ణనల కందుతున్నారా?"

"ఆహా ఎంత వాక్చాతుర్యం. ఇదిగో నా బహుమానం" తన మెడలో పచ్చలహారాన్ని ఆమె మెళ్ళో వేసాడు.

"స్వామీ! ఈ హారాలతో నాపై భారాలు మోపవద్దు. మీరిచ్చే బహుమానాలు తిరిగి ఇవ్వడానికి నా దగ్గరేం లేవు. "

"అయ్యో ఈ దేశపు యువరాణి ఎంత పేదరాలు, పాపం ఎంత కష్టంవచ్చింది"

"కాదామరి దొంగతనం జరిగిన ఇంట్లో విలువైనవి ఏముంటాయి. కొసరికొసరి నావనుకున్నవన్నీ దోచారుగా. ఇంకేం మిగిలిందని మీకివ్వగలను.

ప్రణయ జలారుణం

**ప్రణుతితో సర్వార్పణం**
**చేసి శూన్యనైనాను**
**లోకమాన్యనైనాను.**

నా అణువణువు అర్పణ చేసి లేనిదానిగా మిగిలిపోయాను. మీ గుండెలో నిలిచిపోయాను. ఇంకేమివ్వగలదు ఈ పేదరాలు" ఆర్ధ్రతతో ఆమె కళ్ళు చమర్చాయి. ఆమె తన హృదయాన్నే ఆవిష్కరించుకున్నది. ఆ భావ సౌకుమార్యానికి అతడు కదిలిపోయాడు.

"నా ప్రియా! నీ ప్రేమను పొందిన నేను గొప్ప భాగ్యశాలిని. వేరే బహుమతులెందుకు. సౌందర్యాన్ని కుప్పగా పోసి అందించాడు, ఆ దేవుడు నిన్నందుకోవటమే అదృష్టం. వీణకు తంత్రిలా - వాయిద్యానికి జంత్రిలా, పూలలో సౌరభంలా నా భావానికి అర్థంలా నాలో కలసిపోయిన నా దేవతా! నీ విశ్వమోహన లావణ్యంలో తడిసి పులకరిస్తున్న ఈ దేహాన్ని చూడు ఎంత పులకరింతో. ఒక్క క్షణమైనా నీకు దూరంగా ఉండలేను. రాగరంజితాలయిన నీ చెక్కిళ్ళలో ఎరుపునై మిగలాలనీ, మధురాధరాలపై మధువుగా నిలవాలనినీ, కనురెప్పల నిద్రనై నీలో ఉండిపోవాలనీ చెలీ! నీ మనసంతా నేనే నిండిపోనీ" ఆర్తితో కౌగిలించుకున్నాడు. ప్రేమోన్మాదంతో ఆ జంట లోకాన్నే మరిచారు. ఎడతెగని కౌగిళ్ళకు చందన చర్చలు పేటులెత్తుతున్నాయి. విడరాని పెదవుల స్పర్శలో శరీరాలు మత్తిల్లుతున్నాయి. కోడెవయసుకు వెన్నెల సొగసు తోడయింది. హద్దులెరుగని ప్రణయ సీమలో హాయిగా రాజ్యమేలుతున్న ఆ ప్రేమ జంట శాక్య వంశపంట నందుడు, అతని ఇల్లాలు సుందరి.

గౌతమికి మూడో సంతానం ఇతడు. గౌతముడు ఇల్లు విడిచే సమయానికి ఇతనికింకా పెండ్లికాలేదు. అన్నదమ్ములు స్వభావంలో పూర్తి దక్షిణ ఉత్తరధ్రువాలు. కష్టమంటే తెలియకుండా పెరిగాడు. అన్ని విద్యల్లో ఆరితేరినా అనవసరంగా పౌరుషానికి పోడు. లలితకళలంటే ఇష్టం. నూనూగు మీసాల నూత్నయవ్వనంతో చక్కటి శరీర సౌందర్యంతో ప్రతి ఒక్కరి మనసును ఆకట్టుకునే రూపశీలాదులతో అందరి మన్ననలు పొందాడు. పెళ్ళయ్యేంతవరకూ స్నేహితులతో హాయిగా కాలం గడిపేవాడు. అప్పుడప్పుడు వేటకూడ అతనికి ఇష్టమైన వినోదం. ఇతడికి కూడా రాజకీయాలు ఆసక్తిలేదుకాని భోగలాలసుడు. ఏరికోరి సుందరిని వివాహం చేసుకున్నాడు. అందం రూపం ధరిస్తే సుందరిలాగానే ఉంటుంది. అద్భుతమైన ఆమె లావణ్యానికి దాసోహమన్నాడు. అంతేకాదు అతినికిష్టమైన సంగీతం, వీణావాదనం, కవిత్వం అన్నింటిలో అతనికి ఆమె సమవుజ్జీ. అందుకేనేమో అహంకారం అభిమానం కలబోసుకుని కొంచెం పొగరుగా కనిపిస్తుంది. ఏమాటయినా నిర్మొహమాటంగా మాట్లాడటం. తన అభిప్రాయాల మీద స్థిరంగా నిలబడటం ఆమె స్వభావం.

అప్పుడప్పుడు మామగారితో శాస్త్రచర్చల్లో పాల్గొంటూ నచ్చని వాటిని నిర్భయంగా విమర్శిస్తుండేది. యశోధరను మామూలు మనిషిగా చేయటానికి ఆమె చేయని ప్రయత్నం లేదు. ఈ రోజు కూడా సుందరమైన వారి భవనం రెండో అంతస్తులో శృంగారానికి ఓనమాలు దిద్దించే అద్భుతమైన కేళీమందిరంలో హంస తూలికాతల్పం మీద మణిదీపాలు వెలుగుతుండగా దంపతులిద్దరూ శయనించి ఉన్నారు.

రేపు గౌతముడు వస్తున్నాడని కబురు వారికి కూడా అందింది. అదే విషయం భర్త గుండెలమీద తలపెట్టుకుని ఆలోచిస్తూ పడుకున్నది.

"ఏమిటి మౌనంగా ఉన్నావు'? ఆలోచిస్తున్నావా దేవీ?"

"అవును"

"దేనిగురించి?"

"బావగారిని గురించి"

"అంత హఠాతుగా వారి గురించి ఎందుకాలోచిసునా్వు?" ఆమె ముంగురులు సవరిసూ అడిగాడు.

"ఎందుకా? ఆలోచించాల్సిన అవసరం ఉంది కనుక. చూడండి మన వివాహం అయిన దగ్గరనుండి ఒక్క క్షణం కూడా ఒకరిని విడిచి ఒకరం ఉండలేదు. ఇన్ని సంవత్సరాలు ఎడ బాయని జంటగా అందరి కన్నులపంటగా అందరికీ ఆదర్శంగా ఉంటున్నాము. ఇంతటి సౌభాగ్యానికి నోచుకున్నా నేను నిజానికి ఈ ఇంటి చిన్న కోడలిని. శాక్యవంశంలో మొదటగా అడుగుపెట్టిన పెద్దకోడలు యశోధరాదేవి జీవితాన్ని గురించి మీకేమీ బాధలేదా? మీ అన్నగారు చేసింది న్యాయమని భావిస్తున్నారా?"

"లేకేం దేవీ తొలిదినాల్లో నీకంటే ఎక్కువగా నేనూ బాధపడ్డాను. ఆమె మాకు వదినేకాదు తల్లిలాంటిది. మా అన్నయ్యకు కూడా. ఎంతో ప్రేమాస్పదురాలు మహాసాధ్వి. ఆ ఇల్లాలి దుఃఖం చూడలేక మా రాజ్యమంతా ఏడ్చారు. కానీ అప్పట్లో ఏం చేయగలం? అగ్రజుడు ఆయనే సన్యాసం తీసుకోవాలని కుటుంబం కోసం నిర్ణయం తీసుకున్నప్పుడు వారించాలని ఎంతో ప్రయత్నించాం. ఆయన మామాట వినలేదు. ఇల్లు వదలివెళ్ళి పోయారు, కానీ ఇప్పుడనిపిస్తుంది. ఆ మహోన్నతమూర్తిత్యాగం వలనే మనం మన రాజ్యం సుఖంగా ఉండగలిగాం. అంతేకాదు. ప్రపంచం కోసం ఆవిర్భవించిన మహనీయుడు. అటువంటి ఉన్నతుని ఇల్లాలుగా చరిత్రలో ఆమె స్థానం శాశ్వతంగా ఉంటుంది. అందుకే ఇప్పుడంతగా నేను బాధపడటం లేదు"

"అంటే ఒక స్త్రీ కన్నీళ్ళు కలల త్యాగం పేరుతో సమాధి చేయబడుతుంటే దానిని ఆనందంగా చూస్తున్నారా? ఇదెక్కడి న్యాయం. కోటి ఆశలతో అత్తింట అడుగు పెట్టిన ఆమె యవ్వనం భర్తృ వియోగాగ్నిలో దహించబడుతుంటే బాధ అనిపించటం లేదా? ఆమె ఏ పాపం చేసారని ఈ శిక్ష? మీ అన్నగారు చేసిందే పొగుడుతున్నారు. ఆమెకు జరిగింది అన్యాయమని మీ పురుషులకు అనిపించటంలేదు కాబోలు" గుండెలమీద నుండి మీదకి జారింది.

"అసలు నీ ఉద్దేశమేమిటి సుందరీ. అందరూ అనుభవిస్తున్నది సాధారణ జీవితం. అది పశుపక్ష్యాదులు కూడా అనుభవిస్తున్నాయి. సహజమైన ఆకర్షణలకు లోనుకాకుండా అతీతమయిన ఇంద్రియనిగ్రహం కలిగినవారు అసాధారణులు. నాది అనే స్వార్థం విడచి పరమార్థం కోసం ప్రాకులాడుతున్న నా సోదరుడిలాంటి వాళ్ళు ఎంతమంది ఉంటారు ఆలోచించు. అందరికీ సాధ్యం కాదు. మా వంశమే కాదు మారాజ్యం కూడా ధన్యమయ్యాయి ఆయన పుట్టడం చేత" అతడి కళ్ళల్లో అందులేని ఆరాధనా భావం కనిపించింది. కానీ ఆ మాటలు ఆమెకు ముల్లులా గుచ్చుకున్నాయి.

"అంటే మీరు కూడా సన్యాసాన్ని సమర్థిస్తున్నారా. లోకమంటే ఎవరు? మనుష్యులేగా సమాజమంటే కుటుంబ వ్యవస్థ. ఈ లోకంలో పుట్టిన కోట్లాదిమందికి ఈయన సన్యాసం వలన న్యాయం కలుగుతుందా? నమ్ముకుని వచ్చిన ఇల్లాలి కన్నీళ్ళు ఈ కోట్లమందిలో ఒకరివని గుర్తించకపోవటం దురదృష్టం. ఏశాస్త్రమూ ఇంతవరకు భార్యలను విడిచివెళ్ళమని బోధించలేదు. సమాజశ్రేయస్సుకు పటిష్టమైన కుటుంబ వ్యవస్థే కారణం. అది మర్చిపోకండి"

"కానీ దేవీ! ఒక్కటి మర్చిపోతున్నావు. కోట్లమంది ఒకే బాటన నడవలేరు. అందరూ త్యాగమూర్తులు కలేరు. ఔదుంబర పుష్పం ఎన్నో సంవత్సరాలకు ఒక్కసారే పూస్తుంది. దాని ప్రయోజనం అనల్పం. అలాగే మహనీయులు అంతే. కొన్ని శతాబ్దాలకు ఒక్కరు పుడుతుంటారు. వారి నడవడిక మానవాళికి గొప్ప సందేశం అవుతుంది. వారి ఆదర్శాల వెలుగులో లక్షలాదిమంది ప్రభావితులవుతారు. అయినా చిన్నదానిని పెద్దవారిని విమర్శించటం మంచిది కాదు."

ఆ సంభాషణ పట్ల తనకంత ఇష్టంలేనట్లు నందుడావైపుకు తిరిగాడు.

"మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఈ లోకంలో ఏ జంటకు వియోగం కలిగినా నేను బాధపడుతుంటాను. ప్రకృతి - పురుషుల కలయిక సృష్టి మనుగడకు సంపూర్ణం. సుఖదుఃఖాలన్ని ఈ కలయికలోనే పరిపూర్ణత్వాన్ని చెందుతాయి. కుటుంబాన్ని విడిచి పెట్టి వెళ్ళిపోయే సన్యాసంలో నాకు గౌరవం ఉండదు. మరికొందరి కోసం దూరం చేసే న్యాయమేమిటో నాకర్థం కావటంలేదు."

"అది నీకు నాకూ అరమయితే ఇలా ఉండం. అనవసరమెన ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు. రేపు అనగారు వసునారు.

ప్రొద్దున్నే వదినగారి దగ్గిరకెళ్ళు. అక్కడ ఏం కావాలో చూసుకో. ప్రస్తుతం నా పని చూడు" ఇటు తిరిగి కౌగిలించుకున్నాడు. అతడి కళ్ళల్లో కొంటెతనం మెరిసింది.

"కొన్నిసార్లు నీ వాదనతో ఏకీభవించాలనే ఉంటుంది. ఇంత సౌందర్యాన్ని విడిచి పెట్టి కాషాయాలు కట్టి అడువుల్లోకి పోవటం అసాధ్యమే."

"అందంగా లేకపోతే వెళ్ళటం సాధ్యమేనన్నమాట."

అతని ముక్కు పట్టి ఊపింది.

"ఆహా! బ్రహ్మదేవుడు నాకెంత మంచి వరమిచ్చాడు. వెన్నెలంతా ముద్దగా చేసి పూలపుప్పొడులతో తడిపి అప్సరాంగనల లావణ్యమంతా ప్రోది చేసి ఇచ్చిన ఈ శరీరం చూడు. నువ్వు తీసుకోమన్నా సన్యాసం తీసుకోను."

"ఏమిటి పదేపదే సన్యాసం మాట తీసుకువస్తున్నారు. మరోసారి అన్నారంటే కలువపూలతో, వాల్జడలతో శిక్షించాల్సి వస్తుంది. నాకనుసన్నలు దాటి స్వర్గానికైనా వెళ్ళగలరా" కిలకిలా నవ్వింది. ఆ నవ్వులో కోటిమల్లెల గుబాళింపు వేయి వెన్నెలల ధావళ్యం. ఆ సౌందర్యంతో తడిసి ఆమె మాటల చాతుర్యంలో మత్తిల్లి మైమరచిపోయాడు. ఆ దంపతుల శృంగార క్రీడకు ఎలా తెల్లవారిందో వారే సాక్షి మరొకరు రేరాను.

*ప్రభూ*
*ఎదురు తెన్నులు చూస్తుంది హృదయం.*
*వేయి యుగాలుగా నీకోసం*
*ఏ వేళ నీ పదములు నా మందిరాంత*
*ర్భాగమున ప్రవేశించునోయని*
*కదలిపోతున్న కాలావనికల*
*కొసలు పట్టి ఆపలేకున్నా*
*విసువు చెందిన ఈ నిరీక్షణం*
*ఏ విరాగాంచలాన్ని తాకుతుందో*

"స్వామీ! ఎలా మరిచారు మన ప్రణయాన్ని. ఎందుకు విడిచారు ఈ ప్రేమసౌధాన్ని. నా అపరాధం ఇసుమంత లేదే ఎంత నిర్దయగా ఈ యవ్వన సుమాన్ని నేలరాచి వెళ్ళిపోయారు. ప్రతిక్షణం నా కన్నుల్లో మీ రూపాన్ని ప్రతిష్ఠించుకుని రెప్పలు మూయకుండా ఎదురుచూస్తున్నాను. ఒకవేళ మీరు వస్తే ఆ రెప్పపాటు కాలం కూడా నాకు అవరోధం కాకూడదని.

నా ప్రణయాధిదేవతా! పెండ్లిపీటలమీద నన్ను ఓరగా చూసిన ఆ క్షణాన్ని ఈ మనసు పేటికలో జాగ్రత్తపరిచి దాచి ఉంచాను. నా తనువు పోయినా ఆ జ్ఞాపకం ఎన్నో జన్మలు నాతో రావాలని.

నిజానికి ఆ క్షణమే నన్ను నేను మీకు అర్పణ చేసుకున్నాను. మీ సుందర రూపాన్ని అందరూ పొగుడుతుంటే చూడాలని కోరికగా ఉన్నా సిగ్గుచేత చూడలేక రెంటి మధ్య ఎంతగా నలిగిపోయానో మీకిప్పటివరకు చెప్పలేదు కదూ. చివరికి తొలిరాత్రి కూడా లజ్జావనతనై ముఖం కప్పుకున్న నా రెండు చేతులను మీరు ఎంత సుకుమారంగా తొలగించారో అంతే సున్నితంగా నా పెదవులమీద ముద్దుపెట్టారు. తొలి ముద్దుకు పరవశనై ఒళ్ళు తెలియకుండా పడిపోయిన నన్ను మీరు పరిహసించారు. ఈ కొమ్మకు ఇంత సిగ్గయితే పూలెలా పూసుందని చమత్కరించారు. వలపువాకిలి తలుపు తీసి మిమ్మాహ్వానించాను. పూరిగా అందుకోక మునుపే మోడునె

మిగిలిపోయాను. కళ్ళల్లో కళ్ళు కలవలేక పడ్డ అవస్థ మీకు పరిహాసమయింది. దోసిళ్ళ కొద్దీ నింపి అమృతభాండాన్ని అందించాలనే తపన కంటే పాడు సిగ్గు ఎక్కువై వెనక్కు తోసింది. ఏ పనీ చేయలేక నిస్సహాయంగా ఉన్న నన్ను ఆర్తిగా కౌగిలించుకున్నారు. కనీసం నా చేతులు మీ చుట్టూ వేయనేలేదు. ఎంతమందభాగ్యురాలిని. మీతో వియోగం ఇలా వస్తుందని తెలిస్తే ప్రతిక్షణం నా కౌగిలిలో బందీగా ఉంచేదాన్ని.

ఒకసారి తుమ్మెద రెక్కల్లాంటి మీ అందమైన జుట్టు మీద చిన్న కవిత అల్లాను. "చంద్రుని ఫాలభాగాన ముద్దిడు నీలిమేఘమాలికల"ని. అది చదివి చిన్నగా నవ్వారు. ఎర్రటి పెదవుల మాటున తళుక్కున మెరిసిన తెల్లని నవ్వు చూసి పగడాలను ముత్యాలతో కూర్చునట్టున్నదని మైమరచాను. అదే మాట మీతో అంటే 'యశూ - నీకు నా బాహ్య సౌందర్యమేనా కనిపిస్తున్నది. నాలోని మనిషిని చూడటానికి ప్రయత్నించరాదూ. నేనయితే నీ కళ్ళ వాకిళ్ళ నుంచి కనిపిస్తున్న మనో సౌందర్యాన్నే చూస్తున్నాను. అక్కడున్నదంతా నా పైన ప్రేమే కదూ - అదృష్టవంతురాలివి. సర్వం నీ భర్తకు ఆత్మార్పణ చేసుకోగలిగావు. కానీ నాకు ఈ జీవితం తృప్తికలిగించటం లేదు. భోగాలు - సుఖాలు నిరంతరం వీటిలో మునిగి తేలటం ఎందుకో ఇబ్బంది అనిపిస్తున్నది. ఇంతకు మించి మనిషికి మరో మార్గమే లేదా. నువ్వేం బాధపడకు ఇలా అంటున్నానని ఎంతో ఉత్తమురాలివి, సౌందర్యవతివి. నీ సాహచర్యం నన్ను కొంతవరకు ఊరట పర్చింది. కానీ బడబాగ్నిలా, లోలోపల రగులుతున్న నా ఆవేదన చల్లారటం లేదు. ఇంద్రియ భోగాలే సుఖమా తేనెలో పడ్డ ఈగలా ఇందులోనే ఉండాలి అనుకుంటే దిగులుగా ఉంది. ఏం చేయను?' అన్నారు. పసిపాపలంటి ఆ స్వచ్ఛత చూసి కరిగిపోయాను. చంటిపాపలా నాకంటి పాపలో దాచుకోవాలనిపించింది. ఆ రోజే అనుకున్నాను. మీరు పూర్తిగా నా వారుగా లేరని - నిరంతరం మీలో జరుగుతున్న అంతర్మథనాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాను. ఆ బాధకు ఉపశమనమేమిటో నాకు తెలియలా, మీరూ చెప్పలా - పర్యవసానమిదని ఊహించలేకపోయాను. మీరు నా ఒక్కరికే తాళికట్టారు నా సొంతమని పొంగిపోయాను. కానీ మోక్షకాంతక్కూడా తాళి కడతారని ఊహించలేదు. నా జీవన ప్రాతస్సంధ్యలోనే వెలుగు ముగుస్తుందని వేచిన ప్రాయువు వనానికి వసంతం ఆగిపోయిందని కాలానికి కళ్ళెం వేసి జీవరథాన్ని నడిపించే ఆనందాశ్వాలు ఇక పరుగుతీయవని ఏ ఒక్క క్షణం ఊహించినా శయన మందిర ద్వారాలు ఎప్పుడూ మూసివుంచే దాన్నేమో. నా సౌభాగ్యదేవత మందిరం దాటిపోకుండా కునుకుపాటయిన లేక కపలా ఉండేదాన్ని. ఈ కళ్ళకు మీ రూపం దూరమై ఎన్ని యుగాలయింది. ఎంతగా ఈ హృదయం ఎదురుచూస్తుందో చూడు. మధురంగా సాగే ప్రణయగీతం మధ్యలోనే ఆగిపోయింది. పాడు విధి నా జీవిత అమృతభాండాన్ని కూలదోసింది.

క్షణమొక యుగంగా మీ రాక కోసం ఎదురుచూస్తున్న నా చూపులు మింటినంటి పోయాయి. భావతారలు మీ కోసం పూలదారులేస్తున్నాయి... రా స్వామీ! ఇన్నేళ్ళ వియోగాన్ని నీ యశోధర ఎలా మోస్తుందనుకున్నారు. బరువు మోయలేక కృంగి ఎంత కృశించిపోయిందో ఈ దేహం - మీ లాలనలో మళ్ళీ చిగుర్చి పుష్పించాలని ఆశగా ఉంది."

పన్నెండు సంవత్సరాల వియోగం.. ఆ దుఃఖంలో నలిగి నలిగి కృశించి పోయిందామె దేహం. గౌతముడి ప్రతిరూపం బిడ్డలో చూసుకుని ఆ మాత్రం బ్రతగ్గలుగుతున్నది. లేకుంటే ఏనాడో అతని వెంట ఆమె ప్రాణాలు కూడా ప్రయాణం చేసి ఉండేవే.

అందరి ఆమోదంతో శాక్యవంశంలో సిద్ధార్థుడి ఇల్లాలుగా పెద్దకోడలుగా అడుగుపెట్టింది యశోధర. ఏరికోరి శుద్ధోధనుడు ఈ వివాహం చేసాడు. ఆయన ఊహ తప్పుకాలేదు. మొదటనుండి వైరాగ్యంతో క్షాత్రవిద్యలపట్ల ఆసక్తిలేకుండా ఉన్న గౌతముడిని వివాహంతో బంధించాలనుకున్నాడు.

నిజానికి యశోధర సౌందర్యం అసమానం. అంతకంటే ఆమె సౌశీల్యం, మెత్తటి మాటలతో, వినయపూర్వకమైన ఆమె ప్రవర్తన ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నది. గట్టిగా నడిస్తే భూమికి దెబ్బ తగుల్తుందేమో నన్నంత మృదువుగా ఉంటుంది ఆమె నడక. అందమైన శిల్పానికి ప్రాణం పోసినట్లు వెన్నెల నడక నేర్చినట్లు పూలకొమ్మ నడయాడినట్లు రూపం గుణం కలబోసుకుని అందరి మన్ననలందుకున్నది. అంతేకాదు గౌతముడికి స్వయాన మేనకోడలు. మంత్రి మహానాయుడి కూతురు. ఆమె సౌందర్యం కంటే సౌశీల్యమే

గౌతముడిని ఆకట్టుకున్నది. పుట్టిన క్షణమే తల్లిని పోగొట్టుకున్న అతడు పినతల్లి ఒడిలో గారాబంగా పెరిగినా నిజమైన ప్రశాంతతను యశోధర ఒళ్ళోనే పొందాడు. ఆమె నిర్మలమైన ముఖం నిశ్చలమైన చూపులు చల్లని తటాకతీరంలా సేద దీరుతుండేవాడు.

శుద్ధోధనుడు కూడా కొడుకు కోడలి ఆనందానికి అంతరాయం కలక్కూడదని అద్భుతమైన మందిరం కట్టించి అక్కడ కొంతమంది విశ్వాసపాత్రులయిన పరిచారకులను ఏర్పాటు చేసాడు. మూడు గోపురాలతో ఏడంతస్తులతో ప్రధాన సింహద్వారం లోపల కళ్ళు చెదిరే ఉద్యానవనం నిర్మలకాసారాలు, వాటిలో రంగురంగుల తామరలు, అనేకరకాల ఫలజాతులు నాటించాడు. పూలజాతులయితే చెప్పనవసరంలేదు.

ప్రధానంగా వారి శయనాగారం శిల్పులు రావించబడ్డారు. జాతిరాళ్ళను పొదిగిన గోడలు పగలు రాత్రి వేరే దీపాల్లేకుండానే మెరుస్తుంటాయి. మేలైన చందనంతో నిర్మించబడ్డ ద్వారాలు, ద్వారబంధాలు ఎప్పుడూ సువాసనలు విరజిమ్ముతుంటాయి. సుగంధద్రవ్యాల్యతో పనిలేదన్నట్లు – అటువంటి మందిరంలో ఆరుసంవత్సరాలు కాపురం చేసారు. యశోధరా గౌతములు. అయినప్పటికీ అతని వైరాగ్యం ఏ సౌందర్యం ఆపలేకపోయింది. ముద్దులు మూటగట్టే కొడుకు పుట్టాడు స్వయంగా తనే రాహులుడు అని పేరు పెట్టుకున్నాడు. తన మార్గాన్ని ఆపే మరో బంధనంగా భావించే ఆ పేరు పెట్టాడు. కొడుకు రెండేళ్ళవాడయ్యాడు. అతని చిన్న నవ్వుల్లో శాక్యవంశమే పరవశించిపోతున్నది. బుడిబుడి నడకల్లో వారి ఆనందాల సౌధం నిర్మించుకుంటున్నారు. సంపూర్ణమైన జీవితం అయినా అతని మనసుకు శాంతిలేదు.

ఈలోపు శాక్య సంఘంలో సరిహద్దు తగాదా మీద చర్చ వచ్చింది. రోహిణీనది జలాల విషయంలో కులియులతో యుద్ధం తప్పనిసరి అని తేల్చారు సంఘసభ్యులు. సభ్యుల్లో ఒకరయిన గౌతముడు దానిని తిరస్కరించాడు. యుద్ధాలు చేసుకుంటూ పోతే సమాజంలో శాంతి క్షీణిస్తుంది. ప్రజల్లో ద్వేషభావం పెరుగుతుంది. ఏదయినా ప్రేమతో సామరస్యంతో పరిష్కరించుకోవాలి తప్ప హింసావాదంతో కాదని తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు. దానితో ఎక్కువ శాతం సభ్యులు సిద్ధార్థుడి వాదనను సమర్థించలేదు. సంఘనియమం ప్రకారం సభ్యుడిది వాదన వీగినప్పుడు అతడు రాజ్యాధికారాన్ని విడిచి పెట్టాలి. కనుక అతనికి శుద్ధోధనుడి అధికారాన్ని తొలిగిస్తామని చెప్పారు. సిద్ధార్థుడు అంగీకరించలేదు. అభిప్రాయం తనదైనప్పుడు తండ్రి కిందులో సంబంధమేముంది. అందువలన ఏ శిక్ష విధించినా తనకే విధించమని అడిగాడు.

అందరూ సుదీర్ఘంగా ఆలోచించి అతడు సన్యాసం తీసుకుని దేశాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోవాలని తీర్మానించారు. శాక్య సంఘనియమాలకు కట్టుబడి తండ్రి గౌరవం కాపాడాలని సిద్ధార్థుడు ఇంట్లో చెప్పకుండానే భరద్వాజాశ్రమంలో తలగొరిగించుకుని కాషాయ బట్టలు ధరించి సన్యాసం స్వీకరించాడు. ఈ విషయం ప్రాణమిత్రుడు సహాధ్యాయి రథసారథి అయిన చెన్నుడికే తెలుసు. అతడెంత వారించినా వినకుండా గౌతముడు అనోమా నదీతీరం వెంట సాగిపోయాడు. శాక్యసంఘం నిర్ణయం మీద గౌతముడు వెళ్ళిపోయాడనే వార్త నగరమంతా పాకింది. అందరూ సంఘసభ్యులు తీవ్రంగా నిందించారు. మూడురోజులపాటు ఎవరిళ్ళల్లో వంట చేసిన ఛాయలు లేవు. మొత్తం విషాద సముద్రంలో మునిగిపోయారు. తమ కాబోయే మహరాజును బలవంతంగా సన్యాసం ఇప్పించి దేశాన్ని దాటించిన శాక్య సంఘం మీద మొదటిసారిగా ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. యుద్ధం వద్దన్న గౌతముడి సిద్ధాంతమే బాగుందని ప్రజలు బాహాటంగా సమర్థించారు. దాంతో సంఘసభ్యుల్లో కూడా చాలామంది అహింసావాదానికే తమ మద్దతని నిష్కర్షగా చెప్పారు.

ఇంకేముంది సంఘం తమ వాదనలను మార్చుకోక తప్పలేదు. మౌలికమైన నియమాల్లో కూడా కొన్ని మార్పులొచ్చాయి. మళ్ళీ ఎక్కువశాతం సభ్యులు గౌతముడిని నగరానికి రప్పించటానికి ప్రయత్నాలు చేసారు.

మగధ రాజ్యంలో రత్నగిరి కొండల్లో ఉన్న సిద్ధార్థుడికి చెన్నుడితోనే కబురు పంపారు. తమ తీర్మానం నెగ్గింది కనుక సన్యాసం విడిచి నగరానికి తిరిగిరావాలని. కానీ అతడు తిరస్కరించాడు. తను కోరుకున్న అహింసా సిదాంతం అమలు చేయాలనుకున్నందుకు

ధన్యవాదాలని. కానీ తాను నగరానికి తిరిగి రాలేకపోతున్నాను అందుకు మన్నించమని, రాజభోగాలమీద తనకాసక్తి లేదని, నిరంతరం మోహంలో చిక్కుకుని అల్లాడిపోతున్న జనుల శోకానికి మూలం తెలుసుకున్నాకే తిరిగి వస్తానని కబురుపంపించాడు. అనుకూల వర్గం బాధపడ్డారు. వ్యతిరేక వర్గం ఆనందించారు. జలవివాదం వివాదంగానే మిగిలిపోయింది. అప్పుడప్పుడు సరిహద్దు రైతులు తన్నుకుంటూనే ఉన్నారు ఎద్దు మెడమీది కాడి పుండులా అది రగులుతూనే ఉంది.

రత్నగిరి కొండలనుండి వెళ్ళిపోయాక గౌతముడి జాడే తెలియలేదు. మళ్ళీ ఇన్నాళ్ళకు ఇన్నేళ్ళకు అందరి కళ్ళు, మనసు చల్లబడగా ఆయన తిరిగొస్తున్నారనే వార్త తెలిసింది. అదికూడా అతి కష్టం మీద శుద్ధోధనుడు సాధించగలిగాడు.

కుమారుడు తన అధికారాన్ని కాపాడటం కోసం రాముడిలా రాజ్యాన్ని విడిచి అడవుల కెళ్ళిపోవటం శుద్ధోధనుడిని బాధించింది. చెన్నుడు మిత్రుడిని సాగనంపి తిరిగి వచ్చాక సరాసరి అంతఃపురానికి వెళ్ళాడు. అతడికొక్కడికే ఏవేళయినా ఏచోటయినా నిరభ్యంతరమైన ప్రవేశం ఉన్నది. జరిగిన దారుణం అతడు చెబుతుంటే వృద్ధభూపతి నేలమీద పొర్లి పొర్లి ఏడ్చాడు. ' అయ్యో కుమారా! నాకు రాజ్యం కావల్సి వచ్చిందా? కాటికి కాళ్ళు చాపుకున్న నా కోసం అన్నీ వదిలిపెట్టి వెళ్ళిపోవాలా. నీ భార్యకు నేనేం సమాధానం చెప్పగలనురా తండ్రీ. మళ్ళీ ఆ ముద్దుముఖం ఎప్పటికి చూస్తానురా. రాజ్యత్యాగం చేసి నన్ను దశరథుడిగా చేసావా నాయనా! ఈ పుత్రవియోగంతో ఎన్నాళ్ళు బ్రతగ్గలను. ఒక్కమాట నాతో చెప్పివుంటే ఈ అధికారాన్ని వాళ్ళకే ఇచ్చి నీతోనే ఉండేవాళ్ళం కాదా. నిండా ముప్పయ్యేళ్ళు రాకుండానే నీకు అన్నింటి మీదా విరక్తి కలిగితే అరవై దాటిన నాకు మాత్రం ఈ భోగాలెందుకు? జ్యోతిష్కుల మాటలు తప్పించాలనే నిన్ను భోగాల్లో పెంచాను. గొప్ప సౌందర్య వతి యశోధరతో పెండ్లి చేసాను. చక్కటి కొడుకు కూడా పుట్టాక నా మనసు కుదుటబడింది. ఇక నా బిడ్డకొచ్చిన భయంలేదనుకున్నాను. కానీ - కాని ఈ విధి శాసనాన్ని తప్పించుకోలేనని అర్థమయింది. నా మనుష్య ప్రయత్నమంతా వ్యర్థమయింది. సుకుమారమైన నీ శరీరం అడవుల పాలయింది కదా తండ్రీ! ' ఏడుస్తూనే ఉన్నాడు. ఎంత ఓదార్చినా ఆయన దుఃఖాన్ని ఆపటం ఎవరికీ సాధ్యంకాలేదు. గాయాన్ని చేసిన కాలమే మాన్పేమందిస్తుంది. సంవత్సరాలు గడిచేకొద్దీ కొంత తేరుకున్నాక కొడుకు కోసం వెతికించని చోటులేదు. నలభై వేలమంది చారులను అన్ని దేశాలకు పంపించావు. చివరకు రత్నగిరి కొండల్లో ఉన్నాడని తెలిసి చెన్నసారథ్యం జరిగింది. అతని సమాధానం విన్నాక మనసు రాయిచేసుకుని మనవడిలో కొడుకును చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

కుమిలి కుమిలి ఏడుస్తున్న కోడలిని కూతురిలా ఆదరించాడు. భర్త పరివ్రాజకుడయ్యాడనే వార్త ఆ సుకుమారికి ఆశనిపాతమే అయింది. లోకంలో ఎక్కడయినా పుష్పం, భ్రమరా పాదాన్ని మోయగలదు కానీ పక్షిపాదాన్ని కాదుగా. ఎంత వర్షాన్నయినా భరించే చెట్టు అగ్ని సహించగలదా. చిన్న బాధ తట్టుకోలేని ఆమె సున్నిత హృదయం భర్త వియోగాన్ని ఎలా సహించగలదు. ఎన్నో రోజులు అన్నం నీళ్ళు మరిచి ఏడ్చింది. భవనంలో ఏ మూల చూసినా ఆయన జ్ఞాపకాలే. మెత్తటి అతని అడుగుల సవ్వడులే. మందిరంలో ప్రతి దర్పణంలో అతని సుందరమైన శరీరాకృతే కనబడుతుండేది.

'యశూ! ' అని చెవిలో పిలిచినట్లు అనిపించేది.

'ఆ స్వామీ! వస్తున్నా స్నానం చేస్తారా? భోజనం ఏర్పాట్లు చూడనా? ' అని కలవరించేది నెలరోజులకే విదియచంద్రుడిలా కళలు తగ్గిపోయి కృశింక్షిపోయిన ఆమెను చూసి కంట తడి పెట్టని వారు లేరు.

'ఒక్కమాట నాతో చెప్పి ఉంటే ఇంత బాధ ఉండేదికాదేమో' అని మామగారి దగ్గర ఏడ్చేది. అత్తగారే దగ్గరుండి కోడలిని కంటికి రెప్పలా కాపాడుకున్నది. కొడుకు ముద్దుమాటలకు కొంత తేరుకున్నా బలమైన ఆ ఘాతం ఆమె పసిమనసు తీవ్రంగా గాయపడింది. దైనందిన కార్యక్రమాలను మార్చుకున్నది. తమ శయనమందిరాన్ని పూర్తిగా మూయించింది. సాధారణ స్త్రీలాగా నిరాడంబరంగా చన్నీళ్ళ స్నానం చేస్తూ, సాదా తెల్లచీర మాత్రం ధరిస్తూ ఒంటిపూట భోజన, నేలపడక, సన్యాసినిలా తయారయ్యింది. అలంకారంలేని కురులు జడలు కటాయి. కజల హీనమె నేత్రాలు తెలగా కళారహితంగా మారాయి. ఇదివరకులా పెంపుడు చిలకతో

మాటల్లేవు. ధర్మగ్రంథాలు చదువుతున్నా తెలియనివి మామ దగ్గర నేర్చుకుంటున్నది. ఇప్పుడామె నివాసం సాధు, సన్యాసులకు ప్రతిరోజూ సంతర్పణ మందిరంగా మారింది. ఎన్నో వేదాంత చర్చలు అక్కడ జరుగుతుంటాయి. మహాసాధ్వి శాక్యవంశానికి మెట్టిన మణిపూస అని అందరూ ఆరాధిస్తారు. రాహులుడు నవ్వుతుంటే అచ్చం గౌతముడి నవ్వులాగా ఉండేది. చెక్కిళ్ళపై చిన్ని సొట్టలు పడి మరింతముద్దొచ్చేది. పడకటింట్లో ఎన్నోమార్లు భర్తను నవ్వించి నవ్వించి ముద్దులాడేది. 'ఆ చేతులు మళ్ళీ తనని కౌగిలిస్తాయా? యశూ! అని అందంగా ఆ పెదవులు పిలుస్తాయా? ఎండిన వనానికి వసంతం వస్తుందా? ' ఆమె గాఢంగా నిట్టూర్చింది. ప్రస్తుతంలోకి మనసు మళ్ళీ అడుగుపెట్టింది.

తన భర్త బుద్ధుడయ్యాడట. అంటే ఏమిటి తనెప్పుడూ ఆ పదం వినలేదు. ఆయన సన్యాసిగా ఉంటారా! మళ్ళీ సంసారం స్వీకరిస్తారా? అయినా తొందరెందుకు? ఆయన వస్తున్నారు. మామగారు మనిషిని పంపారంట. మగధలో ఉన్నారని తెలిసీ, చెలికత్తెకు చెప్పి సంతోషపడింది.

ఇప్పుడు ఎలా ఉండాలి. ఈ శయనమందిరం తలుపులు తీయించాలా వద్దా? ఆయనెలా అర్థం చేసుకుంటారో? ఇన్ని సంవత్సరాల నిరీక్షణం మళ్ళీ కలయిక ఆయననేమాత్రం నొప్పించకూడదు. తనులేని ఈ జీవితాన్ని ఎలా గడిపిందో స్వయంగా ఆయన చూడాలి. తన యశోధర తనకోసమే విరాగిలా జీవిస్తున్న సత్యం అర్థం చేసుకోవాలి. తనులేని రోజుల్లో కఠిన ఉపవాసాలతో చిక్కిశల్యమైన దేహం జడలు కట్టిన శిరోజాలు ఇవన్నీ చూడాలి. ధర్మసాధనలో కూడా పతిమార్గాన్ని అనుసరిస్తున్నది. నా భార్య అని, ఆయన మనసుదీరా కౌగిలించి ఆనందించాలి. ఈ ఆలోచనల్లో ఉండగా సుందరి అక్కడకు వచ్చింది. భవనమంతా కోలాహలంగా ఉంది. అంతటా చక్కగా అలంకరిస్తున్నారు.

"అక్కా! ఇదేమిటి. ఈ రోజు కూడా ఇలాగే ఉన్నావు. బావగారు వచ్చి అలంకరించాలా?"

యశోధర చిన్నగా నవ్వింది "ఫో కొంటెపిల్లా"

"లేకపోతే ఏమిటి? ఈ చిక్కులు కట్టిన జుట్టు, మట్టిపట్టిన శరీరం. చాలా బాగుంది అలంకారం. దువ్వి అలంకరించనా? ఇన్నేళ్ళ నీ సంసారంలో చీకట్లు తొలిగిపోయే రోజు వచ్చింది. ఇకనయినా నీ జీవితం కళకళలాడాలి. ఏయ్! ఎవరక్కడ అమ్మగారి స్నానానికి ఏర్పాట్లు చెయ్యండి. నేను దగ్గరుండి స్నానం చేయిస్తాను. గొజ్జగినీటిలో పన్నీరు ఎక్కువ కలపండి. సుగంధ వేళ్ళ తైలాన్ని ఇటు తీసుకురండి. శరీరానికి మర్ధించాలి"

సుందరి హడావుడి చూసి యశోధర అన్నది "నా స్నానం పూర్తయింది చెల్లీ. హడావిడి చేయకు. కాసేపు కూర్చో ఇటురా" తను కూర్చున్న నేలమీద పరుచుకున్న కంబళిని చూపించింది.

"అదేమిటి వచ్చేది మీ భర్తగారు. కనుక హడావుడి మీది నాదికాదు. కనీసం ఈ రోజయినా మంచి వస్త్రాలు ధరించవా అక్కా!"

(3)

**"ఏమిటి సోదరీ ఈ రోజు ప్రత్యేకత!?** ఆయన వస్తున్నారు అంతేగా నన్నిలాగే ఉండనీ"

"అంటే ఈ రోజుకేమీ ప్రత్యేకత లేదా? ఇన్నాళ్ళ అభిశప్తమైన నీ జీవితం ఎదురుగా నిలబడి ప్రశ్నించటం లేదా? నిన్నిలా చూస్తే గౌతములు మళ్ళీ అడవికే వెళ్ళిపోతారు జాగ్రత్త" పరిహాసంగా అన్నది.

"అయితే ఆయన వస్తున్నారని భావిస్తున్నావా?"

"ఒకవేళ రాకపోయినా మార్చాలి. అది మీకున్న హక్కు. ఈ లోకంలో దానిని కాదనే వారెవ్వరు. ఎన్నో సంవత్సరాల మీ నిరీక్షణకు అర్థం తెలుసుకునే రోజు. మీ భవిష్యత్తు కూడా ఈ సమాధానంలోనే ఉందని తెలుసుకోండి"

"నిజమే సుందరీ! నీ మాటల్లోనే ఆ అర్థం ఉన్నది. ఇన్నేళ్ళ వియోగ దుఃఖం.. సన్యాసినో సంసారినో అర్థంకాని పరిస్థితుల్లో అసంపూర్ణ వాక్యంలా మిగిలిపోయాను. అందుకే ఈ అర్థం తెలుసుకోవాలనే నేను ఇలాగే ఉన్నాను"

"అంటే మీ మనస్సేమిటో చెబుతారా?" సుందరి వెళ్ళి దగ్గరగా కూర్చుంది.

"నన్ను అత్తగారింటికి పంపిస్తూ ఏడుస్తున్న నా తల్లి ఒక్క మాటన్నది. లోకంలో పురుషులకంటే స్త్రీలకే బాధ్యతలెక్కువ. సరిగా నిర్వహించలేని ఇల్లాలు పుట్టింటికి మెట్టినింటికి అప్రదిష్ట అవుతుంది. నీ భర్త మనస్సెరిగి ఆయన అభిరుచులకు అనుగుణంగా నడుచుకోవటంలో పత్ని జీవిత సార్థక్యం దాగుంది. మళ్ళీ పుట్టింటికి రాకపోయినా బాధలేదు. అపకీర్తిని మాత్రం పంపకు తల్లీ అని. ఆ మాటలు నేనెన్నడూ మర్చిపోలేదు సుందరీ! ఆయన నాతో చెప్పకుండా అడవుల కెళ్ళిపోయినా అడవుల్లో ఇలా ఉంటారు, అలా తింటారు అని ఊహించుకుని నేనూ అదే జీవితాన్ని గడుపుతున్నాను. తనతోనే ఈ శరీరం మనసు ముడిపడి ఉన్నాయి" ఆమె మాటల్లో ఎంతో నిర్లిప్తత –

"ఒక్కటి చెప్పు. ఆయన సన్యాసిగా వస్తే అదే మార్గాన్ని మీరూ అనుసరిస్తారా? ఇప్పుడనుభవిస్తున్న జీవితాన్ని నా నుదుటి రాత ఇంతే అనుకుంటూ గడిపేస్తారు ఇంతేనా?"

"అంతే. ఆ బాట వారు నిర్ణయిస్తే అదే నాకు శిరోధార్యం. అంతకు మించి నా ఊపిరి కూడా వేరుగా పీల్చలేను"

"సాధించేదేమిటి?"

"పతిమార్గానుసరణం"

"మీకంటూ స్వంత ఆలోచనలు, అభిరుచులు లేవా? వాటిని మీ భర్త గౌరవించాలనే ధర్మాన్ని మర్చిపోతున్నారు. ఎన్నో ఏళ్ళు కోర్కెలకు, నీ ఆనంద జీవితాన్ని సమాధికట్టి విరాగిలా బ్రతకటానికి సిద్ధపడుతున్నారు. కనీసం మీరు ఒక మనిషి విషయాన్ని మర్చిపోతున్నారు. మీరు చేసిన పాపం ఏమిటి? జీవితమంతా శాపగ్రస్తలా బ్రతకాలనుకుంటున్నారు" సుందరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"కానీ ఒక్కసారి మీ బావగారివైపు కూడా ఆలోచించిచూడు. ఆయనేమన్నా సుఖాల్లో తేలుతూ నన్ను నిర్లక్ష్యం చేయలేదుగా. రాచబిడ – సుఖాలో పుటి సుఖాలో పెరిగి ఇవేవీ వదనుకుని అడవిలో బాదపడుతునారే. భర తిండిలేకుండా తపసు చేసుంటే నేను

భోగాల్లో బ్రతకటం ఏం భావ్యం  చెప్పు. సుఖాలు నాకేనా, ఆయనకక్కరలేదా? లోకాన్ని కాపాడాలని నా భర్త కంకణం కట్టుకున్నారు. పరివ్రాజకులై తిరుగుతున్నారు. ఆ మహనీయుడి ఆశయాన్ని అర్థంచేసుకుని నేను అనుసరించాలే తప్ప వ్యతిరేకించి మానసికంగా కూడా దూరం ఎలా కాగలను చెప్పు? చిన్న వయసు కావటంతో ఈ ఆవేశం సహజమే. నీ ఆవేదనా నిజమైనదే కాదనను. కానీ మహాత్ముల జీవితం ముళ్ళదారిలోనే ఉంటుంది చెల్లీ. ఆ ముల్లు తొలగించి మార్గాన్ని నిష్కంటకం చేయలేని నిస్సహాయతే నన్ను బాధపెడుతున్నది తప్ప. కోర్కెల్లో నా యవ్వనమేమీ వేగిపోవటంలేదు. ఆయన నిష్క్రమణలోనే నా కోర్కె సమాధి చేయబడింది. నన్ను గురించి ఎక్కువగా ఆలోచించి బాధపడకు'' ఆప్యాయంగా సుందరి తల నిమిరింది.

''అక్కా! మీరు సరిగా అర్థం చేసుకోవటంలేదు. కేవలం భౌతికమైన కోర్కెలు గురించి నేను మాట్లాడటంలేదు. సామాజికమైన న్యాయాన్ని గురించే అడుగుతున్నాను. స్త్రీని చిన్నచూపు చూసే ఈ పురుషాధిక్యతనే ప్రశ్నిస్తున్నాను - ఎన్ని కథలు వినలేదు. తెలివిలో, సాహసంలో ఓర్పులో చివరికి ఆత్మజ్ఞానంలో కూడా వారితో సమానంగా ముందడుగు వేస్తుంటే, సన్యాసం అనే పేరుతో ఈమె జీవితాన్ని ఎందుకు బలితీయాలి. ఆ ఇచ్చ ఉన్నవాళ్ళు ముందే వివాహాన్ని నిషేధించి నచ్చిన మార్గం వెళ్ళవచ్చు. కానీ కన్నెకలలతో - ఎన్నో ఆశలతో అడుగుపెట్టిన ఇల్లాళ్ళ జీవితం కన్నీటి కప్పజెప్పుంటే చూస్తూ ఊరుకోవటమేనా. అందుకే నేను బాధపడుతున్నాను. ఈ రోజు బావగారిని అడగండి - మీకు ఏ న్యాయం ఆయన చేస్తారో చెప్పమనండి'' ఆమె గొంతులో ఆవేశం.

''తప్పక అడుగుతాను. ఏది నిర్దేశిస్తే అదే సంతోషంగా స్వీకరిస్తాను'' అన్నది యశోధర.

''మళ్ళీ మొదటికే వచ్చింది నా కంఠశోష. ఒక్కసారి నా మాట వినండి. స్త్రీ అనుకుంటే సాధించలేనిది ఏమీలేదు. మీ ప్రేమతో ఆకర్షణతో ఆయనను మరల సిద్ధార్థుడిలా మార్చాలి. అందుకే మీరు అలంకరించుకోవాలి. లేవండి'' రెండు చేతులు పట్టి పైకిలేపింది. రోహిణీ జలాల మీదనుండి వచ్చిన ఓ పిల్లతెమ్మెర ఆప్యాయంగా వాళ్ళ ముంగురులను స్పృశించి వెళ్ళిపోయింది. నిలబడ్డప్పుడు యశోధర మరింత సన్నగా ఆకులన్నీ రాల్చుకున్న సన్నజాజితీగలా అనిపించింది. తెల్లటి చీరలో కృశించిన శరీరంతో కళ్ళల్లో ప్రాణం పెట్టుకుని భర్తకోసం ఎదురుచూస్తున్న ఆమె రూపం జాలిగొలుపుతున్నది. కదిలిపోయింది సుందరి.

''ఎంత అందం మీది - దాన్నిలా నాశనం చేస్తున్నారే. కనీసం మీమీద మీక్కూడా జాలిలేదు. ఈ కేశాల్ని చూడు ఎంత ముచ్చటగా ముడుస్తానో'' విడుపాటి వెంట్రుకలను చేతిలోకి తీసుకుంది.

యశోధర వారించింది. ''చెల్లీ! ఒక మంచి పనికోసం వారు ఒక మహాకార్యాన్ని నిర్వహిస్తున్నారు. దానికోసం తన శరీరాన్నే పణంగా పెట్టారు. నా సౌందర్యం కంటే మీ బావగారి సౌందర్యం వేయింతలుంటుంది. నేనింకా భవనాల్లోనే ఉన్నాను. ఆయనో అడవిలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ చలిని భరిస్తూ ఎలా ఉన్నారో, తల్చుకుంటే గుండె బద్దలైపోతున్నది. అందుకే నేనీ ధర్మాన్ని స్వీకరించాను. వారు వెళ్ళిన దగ్గరనుండి ఎంతగా ఎదురుచూస్తున్నానో వారులేని ఈ సమయం నా జీవన విధానమేమిటో వారు తెలుసుకోవాలి. ఆ మనస్సులో ఇంత కరుణ - ప్రేమ కలిగినా చాలు నా జీవితం ధన్యం''

''అయితే ఒక్కటి నిజం చెప్పండి. మీరు ఎటువంటి జీవితం కావాలని మనస్ఫూర్తిగా అభిలషిస్తున్నారో కనీసం అదయినా చెప్పండి '' సుందరి రెట్టించింది. ఆ మాటకు యశోధర దగ్గరనుండి సమాధానం రాలేదు. భావరహితంగా ఆమె వైపు చూస్తుండిపోయింది.

ఇంతలో కొంతమంది పరిచారికలు వచ్చారు. ''అమ్మా! తమరు ఆదేశించిన పనులన్నీ పూర్తయ్యాయి. ఇంకా ఏమయినా శలవిస్తే?''

''వారు వస్తున్న సందర్భంగా సాధుసమారాధనకు సంబంధించి వంటలు ప్రారంభించారా?'' అడిగింది యశోధర.

''చిత్తం దేవీ! ఎక్కడా ఆలస్యం లేదు''

''వారందరికి వసాలు తెప్పించమనాను''

"ఆ పని పూర్తయింది. ఒక్కటి మిగిలిపోయింది" ప్రధాన పరిచారిక అన్నది.

"ఏమిటది?"

"తమరి శయనమందిరం అలంకరించలేదు"

"దాని అవసరం ఇప్పుడు లేదు. అవసరం వస్తే నేను కబురుచేస్తాను. మీరు వెళ్ళండి. తోరణాలు, రంగవల్లుల కార్యక్రమం చూడండి"

"తమ ఆజ్ఞ .సెలవు" పరిచారికలు వెళ్ళిపోయారు.

"అక్కా! నా ప్రశ్నకు సమాధానం రాలేదు"

"అవును సోదరీ! సమాధానం ఇవ్వలేని ప్రశ్న నీది. అదేమిటో నా మనస్సులో ఉండిపోనీ"

"మీరు చెప్పకపోయినా నాకు తెలుసు. లోకంలో ఏ స్త్రీ భర్త కౌగిలికి, ప్రేమకు దూరమై బ్రతకాలని కోరుకోదు. విధికి తలవొగ్గి తనను తాను నిందించుకుంటూ బ్రతుకును వెళ్ళదీసే అనేకమంది స్త్రీలకు మీరు ప్రతినిధులు తరతరాల సాంప్రదాయిక తలరాతలను మార్చుకోలేక కర్మసిద్ధాంతానికి చుట్టివేయబడ్డ కట్టుబానిసలు సంప్రదాయపు సంకెళ్ళను తగిలించుకుని తనకుతానే బందీగా మిగిలిపోతున్న ఆడఖైదీలు. భర్త ఆజ్ఞ అనే అంకుశంతో పొడవబడుతూ సతీధర్మమనే కొలిమిలో కాగిపోతూ మనస్సును చంపి, కోర్కెలణచి నోరుండీ స్వేచ్ఛలేని మూగజీవాలు. మనోరహిత భావాలకు ప్రతిరూపాలు తరతరాల ఆచారాల యజ్ఞవాటికలో బలిపశువులు. పురుషుడేది చెబితే అదే ధర్మం. అతడేది విధిస్తే అది శాసనం. అవునా, మన రాత రాసేది బ్రహ్మ కాదక్కా! ఈ మగవాడే అదే పాతివ్రత్యం, ధర్మం అనుకుంటూ మీ కన్నీళ్ళను మీరు త్రాగండి. వస్తాను. ఈ వాతావరణంలో నా మనస్సు ఇమడలేదు. అయితే వెళ్ళేముందు ఒక్కమాట ఇన్నాళ్ళ ఇన్నేళ్ళ మీ వియోగానికి బాధకు, కనీస సమాధానం బావగారినుండి పిండుతారని ఆశిస్తున్నాను."

సుందరి ఆ చోటునుండి చరచరా వెళ్ళిపోయింది. కోడలి మందిరంలో అడుగుపెడుతున్న శుద్ధోధనుడు ఆ మాటలు విని మౌనంగా వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు వ్యథాభరిత హృదయంతో. తనకు తెలుసు ఆమె తలరాతలో మార్పేమీలేదని. ఎంతో ఒప్పించిన మీదటే బుద్ధుడు అక్కడకు వస్తున్నాడని – మరిన్ని కఠిన నియమాలతో.

"హవనం కోసం వచ్చిన ఓ దేవతలారా! ఈ సవన పశువు కంఠం నుండి ధారగా చిందే అరుణ వర్ణమైన ఈ రుధిర సోమరసపూరితమైన ఘృతాన్నము ఈ బింబిసారుని కర్తృత్వములో అగ్నిహోత్రుడి ద్వారా మీకందుచున్నది. మహారాజు రూపాలన్నీ ఈ యజ్ఞంతో నశించిపోవుగాక! ఓం యజ్ఞ రూపాయ స్వాహా అగ్నిభట్టారకాయ స్వాహా!"

"ఆం ఖండించండి. ముందుగా కపిల గోవుల తలలు నరకండి. సరిగ్గా వాటి రక్తం ఈ యజ్ఞగుండం మధ్యలో పడాలి తెల్సిందా!" హుంకరించాడు ప్రధాన ఋత్విక్కు.

"మీ దంపతులు నమస్కారం చేసుకోండి. ముందుకొంచెం జలాన్ని ఆచమనం చేయండి." మరో పురోహితుడు రాజదంపతుల చేత మూడుసార్లు జలసేచనం చేయించాడు.

రాజదంపతులు భక్తిగా పురోహితులు చెప్పినట్లు చేస్తున్నారు. ప్రధాన రాజపురోహితుడి ఆధ్వర్యంలో వేలాదిమంది ఋత్విక్కులతో రాజ్యశ్రేయస్సు కోసమే నిర్వహిస్తున్న మహాయజ్ఞమది. కనీసం పదివేలకు తక్కువకాని ఆవులు, లక్షల సంఖ్యలో గొర్రెలు, మేకలు, మంచి యవ్వనంలో ఉన్న అశ్వాలు, లక్షలాది బ్రాహ్మణ సంతర్పణలు.

మగధ సామ్రాజ్యం ఏర్పడ్డాక అంత పెద్ద యజ్ఞాన్ని చూడలేదని కనీసం వినను కూడా లేదని తలపండిన వాళ్ళే చెప్పుకుంటున్నారు. ఆ సంరంభం ఆరునెలల ముందే ప్రారంభమయింది. చాటింపు ద్వారా గ్రామగ్రామానికి కబురందింది. తప్పనిసరిగా

ప్రతిగ్రామం నుండి వారి వారి యధాశక్తి బలిపశువులను తరలించాలని రాజాజ్ఞ చక్రవర్తి పదఘట్టనలతో, రాజధానీ నగర వీధులన్నీ ధూళితో కప్పివేయబడ్డాయి. నింగీ నేల కలిసినట్లు నగరమంతా ఒకటే దుమ్ము. పౌరులకు అసలు నిద్రేలేదు.

భారీగా తలపెట్టిన క్రతుకార్యక్రమానికి అనేక దేశాలకు వర్తమానం వెళ్ళింది. కోసల చక్రవర్తి ప్రసేన జిత్తు కూడా వచ్చాడు. వైశాలినుండి, శాక్యనగరం నుండి శుద్ధోధనుడు అనారోగ్యంతో ఉండడం వలన వారి ప్రతినిధిగా దేవదత్తుడు వేలాది గోవులతో తరలివచ్చాడు. ఎక్కడ చూసినా ఒకటే కోలాహలం. చక్కగా వివిధ వర్ణ వస్త్రాలతో అలంకరించబడ్డ గోవులు, మేకలు గుర్రాలు, పశువులు వీధుల్లో నడుస్తుంటే మనుషులెవరో పశువులెవరో గుర్తించడం కష్టంగానే ఉన్నది.

సరిగ్గా యజ్ఞం ప్రారంభమయింది. చక్రవర్తి బింబిసారుడు అతని పట్టపుదేవేరి పట్టుబట్టలు కట్టుకుని భక్తిగా యజ్ఞకార్యక్రమం నిర్వహిస్తున్నారు. లక్షలాదినేయిభాండాలు - మోపులు మోపులు మంచిగంధం చెక్కలు. హాయిగా ఆస్వాదిస్తున్నాడు స్వాహాపతి. నింగికంటిన జ్వాలా నాల్కలతో విశాలమైన మైదానంలో చలవపందిళ్ళ క్రింద వచ్చిన అతిధులకు ఏర్పాట్లు చేయబడ్డాయి. అలంకరించిన పశువులన్నీ ఒకవైపు నిలబెట్టబడ్డాయి. యజ్ఞం పరిసమాప్తికి ముందు యూపస్థంభం దగ్గర పశుబలి ప్రారంభమవుతుంది. ఆ రక్తం ఏరులాగా యజ్ఞగుండాల్లో ప్రవహిస్తుంది. వేలాది హోమగుండాల ముందు ఋత్విక్కులు వేదమంత్రాలు పఠిస్తున్నారు. దేవతలను ఆహ్వానిస్తున్నారు. ఆ జీవుల రక్తం త్రాగమని.

ఋత్విక్కుడి ఆదేశం వినగానే పశువులు బలవంతంగా లాక్కురాబడ్డాయి. కసాయివాళ్ళ చేతికత్తులు గాల్లోకి లేచాయి. పదునయిన వాటి అంచుల తళతళలు ఎండతో కలిసి కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. ఇక ఒకే ఒక్క క్షణం ఒక్కవేటు. వేలాది తలకాయలు రాలి గుండాల్లో పడతాయి.

అదే క్షణంలో.

"ఆగండి" వెనుకేక యజ్ఞస్థలమంతా మారుమ్రోగింది. అంత సందడిలో కూడా ఆ గొంతులోని గాంభీర్యతకు అంతా ప్రశాంతమైపోయింది. లిఖించబడిన చిత్తరువుల్లా అందరూ ఎక్కడికక్కడే ఆగిపోయారు.

"ఎవరు మా యజ్ఞకార్యాన్ని ఆపుతున్న సాహసి. ప్రాణాలమీద ఆశతోనే వచ్చారా?" బింబిసారుడు కోపంగా అడిగాడు.

"నేనే - ఈ కార్యాన్ని ఆపుతున్న సాహిసిని. నన్ను శిక్షించండి" నల్లని అళికులము నుండి బయటపడ్డ తెల్లతామరలా, మూగుతున్న జనసమూహం నుండి తప్పించుకుని ముందుకు వచ్చాడు గౌతముడు.

"మీరా! ఎప్పుడు వచ్చారు? రండి. రండి అనుకోకుండా మీ దర్శనం మాకు అమితానందం. రండు ఆసీనులుకండి" ఆహ్వానించాడు చక్రవర్తి.

"ఈ ఆదరణకు కృతజ్ఞతలు. కానీ అతిధిగా నేనిక్కడకు రాలేదు. ఈ అమానుష కార్యాన్ని ఆపటానికే వచ్చాను."

"ఇది అమానుషమా - మన సనాతన ధర్మసంప్రదాయం ఇది నేనేం భిన్నంగా నడపటంలేదే - ఎందుకాపమంటున్నారు?"

"ఎందుకంటే ఇది పూర్తిగా అమానుషమైన చర్యకనుక. పురాణాల్లో మీరు చదువుకున్న పిశాచాలు, రాక్షసులనబడే వాళ్ళు మాత్రమే ఇలా పచ్చి రక్తాన్ని తాగుతారు. యజ్ఞం పేరుతో నిర్వహించబడుతున్నది కూడా అదే కార్యం. అందుకే ఆపమన్నాను."

"ఇప్పుడేగా మీరు విన్నారు. వైదిక మంత్రాలను అందులో యజ్ఞానికి పశుబలి తప్పనిసరి అని వినలేదా?" ప్రధాన ఋత్విక్కు కోపంగా అడిగాడు.

"ఎవరు వ్రాసారీ శాస్త్రం? మీరేగా. మూగప్రాణుల రక్తంతో పరలోకాలు ప్రాప్తిస్తాయని నమ్మింప జూస్తున్న మీ అనాగరిక చర్యలను ఎదుర్కోడానికే ఇక్కడకు వచ్చాను" అన్నాడు గౌతముడు స్థిరంగా.

అందరూ మౌనంగా చూసునారే తప, ఎదిరించడం లేదు.

"ఎన్నో సంవత్సరాలుగా వస్తున్న ఆచారం. దాన్నెలా కాదనగలరు" బింబిసారుడు అడిగాడు.

"మహారాజా! ఆలోచనా జ్ఞానం ఉన్న మనుష్యులం మనం. నిరంతరం పరివర్తనతో కాలమే మార్పులు చెందుతూ ఉన్నది. ఒకప్పుడు ఆటవిక దశలో ఆహారం కరువైనప్పుడు పంటలు పండించలేనప్పుడు ఏర్పడ్డ ఆచారాన్ని ఈనాడు కూడా సాగించడం పద్ధతేనంటారా! ఆచారం అనాగరికమైనప్పుడు మార్చుకోవటంలోనే ఉంది మనిషి విజ్ఞానం. బాల్యంలో బట్టలు లేకుండా తిరుగుతాం. వయసొచ్చాక కూడా అలాగే ప్రవర్తిస్తే లోకం పిచ్చివాళ్ళంటారు. సంస్కృతి కాలానుగుణమైన సంస్కరణల వైవిధ్యాల్లోనే నిలడ సంతరించుకుంటుంది. అర్ధంలేని అనాచారాలను ఆదరించి బలహీనుల ప్రాణాలు తీయకండి" ఆయన గొంతులో ఆవేదన సుళ్ళు తిరిగింది.

"ఒక్కడిగా వచ్చిన నీవు భగవంతుడు నిర్దేశించిన యజ్ఞాలిని అడ్డుకోడానికి మీకున్న బలమేమిటి?" ఋత్విక్కు ప్రశ్నించాడు.

"కళ్ళకు గంతలు కట్టుకు నడుస్తూ బావిలో పడేవారిని రక్షించే ప్రయత్నం నాది. నేలమీద దొర్లి దుమ్ము అంటించుకున్న వారికి తుడిచే యత్నమే నాది. ఆచారం పేరుతో సాగుతున్న అనాగరిక చర్యలను అడ్డుకోవడమే నా పని. తప్పును తప్పుగా మీరంగీకరించకపోయినా చెప్పగలిగిన మనోబలం నాకున్నది"

"మీరు శాస్త్రాలు చదివినట్లు లేరు. ఇప్పుడు మేము చెప్పే మంత్రాల అర్ధం మీకు తెల్సా"

"పూర్తిగా తెలుసు. వేదాలు ఉపనిషత్తులు జంతువుల్ని చంపమని చెప్పలేదు. మీరు చదివే మంత్రాలకున్న అర్ధమే వేరు. మీరు అతిప్రామాణికంగా భావించే ఒక శాస్త్రంలోదేగా ఈ శ్లోకం.

**"శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞాన**
**యజ్ఞపరస్తప"**

పూజావిధానం కంటే జ్ఞానం గొప్పదని చెప్పలేదా. మీరే, శాస్త్రాలను తప్పుదారి పట్టించి ఆ జ్ఞానం తెలియని రాజులను ధనవంతులను మీదారి మళ్ళించుకుంటున్నారు"

"అవును. మేము కర్మయజ్ఞం చేస్తున్నాం చెడ్డకర్మలు తొలగించటానికి" మరో పండితుడందుకున్నాడు.

"మీరు చేస్తున్న కర్మలోనే దోషమున్నప్పుడు మరో చెడును ఎలా తొలగించగలరు? మనస్సునే పవిత్రకుండంగా మార్చి అందులో కామం మొదలయిన అరిషడ్వర్గాలను ప్రేరేపించే పంచేంద్రియాలను పంచసమిధలుగా కఠోరమైన బ్రహ్మచర్యాగ్నిలో దహనం చేసి పశుభావాలన్నిటిని బలిచ్చి సమాజమనే దైవానికి ఆహవనాన్ని సమర్పించటమే యజ్ఞంలోని అంతరార్ధం. "యజ్ఞ కర్మ సముద్భవమ్" అని కదా. మంచిపనుల సముదాయమే యజ్ఞము. అది పక్కన పెట్టి జీవులను హింసించి చంపటం ద్వారా వచ్చేది పుణ్యం కాదు. మహాపాపం. అక్కడ దొరికేది మోక్షంకాదు ఘోరనరకం" అని చెప్పి మౌనం వహించాడు.

వర్షధార వెలసినట్లయింది. అప్పటివరకు గౌతముడి మాటల మాధుర్యంలో మునిగిన వాళ్ళకు వర్తమానము గుర్తులేదు. బింబిసారుడిలో సారనాథ్‌లో పడ్డ బీజం మొలకెత్తింది. ఇప్పుడు మొక్కగా, వేగంగా పెరుగుతూ చెట్టు దశకు వచ్చింది.

నిజంగానే ఈ మూగజీవాలను చంపటం వలన మోక్షమిస్తుందా? ఎలా వస్తుంది? తాను సృష్టించిన ప్రాణుల్నే ఆయన బలిగోరుతున్నాడా? నిజానికి ఈ కర్మకాండలో భగవంతుడి పాత్ర ఎంత? ఎవరు చెప్పగలరు? అయినా ఎన్నో సంవత్సరాలనుండి వస్తున్న అలవాటును తానొక్కడే ఎదుర్కోగలడా? ఆ తర్వాత సమాజాన్ని పురోహితులను ఎదిరించి నిలపటం కష్టమైనపని. ఏం చెయ్యాలి. బుద్ధుడి వాదనలో చాలా వాస్తముంది.

బింబిసారుడి మనస్సులో ఆలోచన గ్రహించినట్లు బుద్ధుడు చెప్పాడు.

"చూడండి మహారాజా! మీరనుకున్నట్టు సృష్టికంతా భగవంతుడే అయితే తన బిడ్డలనే తన బలికోరుకుంటాడా? అలా కోరుకునే వాళ్ళు దైవాలెందుకవుతారు. దయ్యాలవుతారు. చూడండి అమాయకంగా మనవైపే చూస్తూ తమ ప్రాణం పోయే సంగతి కూడా తెలియని మూగజీవాల వల్లే అంత పుణ్యం వస్తుంటే, ఎన్నో పురాణాలు చదివి దైవకర్మలను చేస్తూ పునీతులయిన ఈ పండితులను బలి ఇవ్వండి. లేదా నన్నివ్వండి. వేదాల్నే ఔపోసన పట్టిన ఈ రక్తమయితే తప్పక మోక్షమే వచ్చి కూర్చుంటుంది. కానివ్వండి మహారాజా! పశుబలికంటే నరబలి మరింత శ్రేష్ఠం" గబగబా యూపస్థంబం దగ్గరకు నడుచుకుంటూ వెళ్ళి తలవంచి నిలబడ్డాడు. ప్రజలంతా హాహాకారాలు చేసారు. వేలమందీ 'జై బుద్ధభగవానుకి జై' అని అరిచారు. అప్పుడు బింబిసారుడు యజ్ఞవేదిక మీద నుండి లేచివచ్చాడు.

"మహాత్మా! మనం మనసున్న మనుష్యులం. కాని జంతువులు ఆలోచనలేనివి. పైగా వాటిని ఆహారంగా తీసుకుంటాం. అందువలన బలిస్తే తప్పేమిటి?" అడిగాడు.

"తప్పు కాదా! ఆలోచన మనిషికే తప్ప పశువులకు లేదనుకోవటం పొరపాటు. వాటి ఆలోచనలు వాటికీ ఉన్నాయి. పుట్టుక – మరణం పిల్లల్ని కనటం ఇవన్నీ మనకు లాగానే వాటికీ జరిగిపోతున్నాయికదా. నోరొక్కటి లేనంత మాత్రాన నిస్సహాయజీవుల్ని చంపమని ఏ మతం చెబుతున్నది? కేవలం స్వార్థం కోసం మతాన్ని అడ్డుపెట్టుకునే ఈ దురహంకార వ్యవస్థను నేను వెలేస్తున్నాను. ఈ రోజునుండీ దీనికి వ్యతిరేకంగా నా తిరుగుబాటు సాగుతుంది. బలహీనుల్ని రక్షించాల్సిన రాచరికం వాళ్ళను శిక్షించటానికే అయితే ఎన్ని జన్మలెత్తినా మీకు మోక్షం రాదు. ఈ పండితులతో కలసి అధఃపాతాళానికే పోరు" ఆయన మాటలు సౌమ్యంగా ఉన్నా వాటి వెనకే ఉన్న స్థిరత్వం అందరినీ భయభ్రాంతుల్ని చేస్తున్నది.

"శాక్యమునీ! చివరిగా ఒక్క ప్రశ్న. దీనికి సమాధానం చెప్పండి. జీవహింస మహాపాపమంటున్నావు. మరి చెట్లకీ ప్రాణం ఉంది, వాటికీ జనన మరణాలున్నాయి. మరి మన అవసరాలకు పూర్తిగా చెట్లను నరుకుతున్నాము. శాక్యాలు తింటున్నాము. ఇదిపాపం కాదా" చక్రవర్తి మెల్లమెల్లగా దారిలోకి వస్తున్నందుకు సంతోషించాడు గౌతముడు.

"వాటికీ ప్రాణం ఉంది మహారాజా! పెరుగుదల, మరణం ఉన్నాయి. అయితే వాటి కాయలు కోసినందువలన ఆకులు తుంచినందువలన అవి మరణించడంలేదు. పైగా ఒక కొమ్మ నరికితే మళ్ళీ కొమ్మ పుడుతుంది. ఒక కాయ కోస్తే మారో కాయ. వాటి జీవపదార్థాలలో ఒక జడత్వం ఉంది. అనుభూతులు లేవు. కానీ జంతువులు కాలు నరికితే మళ్ళీ కాలు మొలుస్తుందా? దెబ్బ తగిలితే మనలాగానే అరచి కేకలు పెడతాయి. బాధతో అల్లాడతాయి. అందువలనే అవి మనతో సమానం

ఆత్మ అందరానిది. అంతుబట్టనివాడు దేవుడు. వాటికోసం మనం పుట్టిన భూమిని నరకప్రాయం చేసుకోవటం నేరం. మహో ఘోరం. వీళ్ళు చెపుతున్న ఉపనిషత్తుల్లో ఏముంది.

**యస్మిం సర్వాణి భూతాను**
**ఆత్మైవాభూ ద్విజానతః**
**తత్ర కో మోహః కశ్శోకః**
**ఏకత్వ మనుపశ్యతః**

సమస్త జీవులను తన ఆత్మగా భావించి నడుచుకునే వాడే శోకరహితుడవుతున్నాడు అని చెప్పలేదా? అవసరానికి మార్చుకునే సిద్ధాంతాలను మూర్ఖ వాదాల ముసుగులో కొనసాగించాలనుకుంటున్న ఈ పండితుల అహంకారాన్ని ఎంతోకాలం సమాజం భరించలేదు. దానిని సమర్థిస్తున్న మీరూ దానికి మూలం చెల్లించాల్సి ఉంటుంది. ప్రభువు ప్రజలమనిషి. వారి కన్నీళ్ళు తుడవటానికి ప్రయత్నించాలి కానీ యజ్ఞం పేరుతో మూగజీవులను వధిస్తూ కూర్చోవటం ఎంతవరకు న్యాయం? దీనుల హీనుల కన్నీళ్ళల్లో కష్టాల్లో దైవమున్నాడు. ఆ దైవాన్ని చూడటానికి ప్రయత్నించండి. ఇక ఈ బలిని కొనసాగించరనే భావిస్తున్నాను"

వెంటనే బింబిసారుడు భార్యా సమేతంగా బుద్ధుడి కాళ్ళకు నమస్కరించాడు.

"మహాత్మా! మీరు మా కళ్ళు తెరిపించారు. ఇకపై నా రాజ్యంలో హింసకు చోటులేదు. మీరు బోధించిన అహింసావ్రతాన్ని నేనేకాదు నా రాజ్యమంతా అమలు జరగాలని శాసిస్తాను. మీ మతంలోకి నన్ను కూడా తీసుకోండి. నాకూ సన్యాసం ఇప్పించండి" అని ప్రార్థించాడు.

చక్రవర్తే తలవంచితే మిగిలిన వాళ్ళదేముంది. ఆ యజ్ఞవాటిక బౌద్ధమతవాటికగా మారింది. వేలాదిమంది ధర్మదీక్షలు స్వీకరించారు. అందరికి త్రిశరణాలు బోధించాడు.

**బుద్ధం శరణం గచ్ఛామి**

**ధర్మం శరణం గచ్ఛామి**

**సంఘం శరణం గచ్ఛామి.**

ముక్తకంఠంతో అందరూ పలుకుతుంటే చిరునవ్వుతో బుద్ధుడాచోటు విడిచాడు. ఆ తర్వాత మగధ రాజ్యమంతా బుద్ధుడి నూతన సిద్ధాంతానికి ఆకర్షితమయింది.

ఆయన కీర్తిచంద్రికలు మెల్లమెల్లగా దిగంతాలకు వ్యాపిస్తున్నాయి. పామర పండితులంతా బుద్ధుని వాదానికి మోకరిల్లుతున్నారు. అపౌరుషేయాలని చెప్పబడుతున్న వేదాలు నిర్దేశించిన కర్మకాండల్లోని లోపాలను నిశితంగా విమర్శిస్తూ పల్లెపల్లె ఇల్లు ఇల్లు ధర్మ ప్రచారం సాగిస్తున్నాడు. తరతరాలుగా ఆచారాల పేరుతో సాగిస్తున్న హింసావాదంపై ధ్వజమెత్తాడు. సాధుజంతువుల పట్ల బలహీనుల పట్ల జాలి చూపించి ఆదుకోవాల్సిన పాలకవర్గం, మూఢనమ్మకాలతో అహంకారానికీ, అభిజాత్యానికీ ప్రతిరూపమైన ఒక వ్యవస్థ కొమ్ముకోయటం ఆయన సహించలేకపోయాడు. మత్తులై మదోన్మత్తులై అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో మానవత్వాన్ని మంటగలిపి నైతిక విలువలు దిగజార్చుకుంటున్న నిరంకుశ రాచరిక బ్రాహ్మణ వ్యవస్థల మీద తన నూతన సిద్ధాంతమనే కత్తిని ఝళిపించాడు. ముఖ్యంగా మనిషికి మనసుకు మధ్య తెరలు దించుతున్న కులవ్యవస్థను కూకటి వేళ్ళతో పెకిలిస్తున్నాడు. అన్ని కులాలవాళ్ళకు బుద్ధాశ్రమంలో చోటు దొరుకుతున్నది. తోటివారిగా పుట్టి పశువుల కంటే హీనంగా సమాజం చేత చిన్నచూపు చూడబడుతున్న దళిత వర్గాలకు తన సిద్ధాంతంలో ప్రధానస్థానం కల్పించాడు. సామూహిక భోజన విధానాన్ని అమలులోకి తెచ్చాడు. అందుకే బౌద్ధధర్మం రోజు రోజుకు మహావృక్షంలా పెరిగిపోతున్నది.

అగ్నికాశ్యపుడు ఆ కాలంలో మహావేదాంతి. గొప్పవక్త. ఆయన బుద్ధుడి నూతన ధర్మానికి ఆకర్షితుడై తన ఆరువందలమంది శిష్యులతో శిష్యునిగా చేరిపోయాడు. ఆ బాలగోపాలం వెర్రెత్తిపోతున్నారు. బింబిసారుడి కోరిక మేరకు పాటలీపుత్ర నగరం వెలుపల వేణువనంలో నివసిస్తున్నాడు. వేలమంది శిష్యులు తయారయ్యారు.

ఈ సంగతి శుద్ధోధునికి తెలిసి గౌతముడి బాల్యమిత్రుడయిన ఉదయనుని మగధరాజ్యం పంపించాడు. అతడు వేణువనంలో ఉన్న బుద్ధుడిని కలిసి తండ్రి సందేశం అందించాడు. అతని వియోగాన్ని మోయలేని శాక్యనగరం అతని కోసం ఎంతగా ఎదురుచూస్తుందో కన్నీళ్ళతో వివరించాడు. కుమారుని కోసం ఏడ్చి ఏడ్చి చూపు పోగొట్టుకున్న తండ్రిని ఓదార్చాల్సిన అవసరం ఉందని పదేపదే చెప్పాడు. భర్త వియోగంతో చావుకు సిద్ధపడిన భార్యను ఊరడించాల్సిన ధర్మాన్ని గుర్తుచేసాడు. ఒక పూటంతా అతడు చేసిన విన్నపాలకు బుద్ధుడు కరిగిపోయాడు. చైత్రమాసంలో నగరానికి వస్తానని కబురు పంపించాడు. విదియనాటికే గౌతముడు వస్తున్నాడన్న వార్త శాక్యనగరం చేరింది. బీటలు వారిన భూమిలో తొలకరి కురిసినట్లు యువరాజు వియోగంతో అల్లాడిపోతున్న నగరవాసుల మనసుల్లో ఆనందజల్లులు కురిసాయి. ఆయన కంటే ముందు వచ్చిన కీర్తికాంత సకలసత్కారాలందుకుంటున్నది.

అప్పటికే కోసల, మగధ, వైశాలి దేశాల్లో చక్రవర్తులు - సామంతరాజులు బుద్ధధర్మాన్ని తీసుకున్నారని తెలిసింది. కుమారుడి యశస్సును కథలు కథలుగా వింటున్న తండ్రి మనసు ఆనందం గట్టుదాటి పొర్లిపోతున్న ఏరులాగా ఉన్నది. అటువంటి యశోవంతుడైన కుమారుడిని కన్నందుకు అతడు గర్వపడుతున్నాడు.

కరవుదీరా కౌగిలించి పుత్రగాత్ర పరిష్వంగసుఖాన్ని పొందాలని అతని మనసు ఉవ్విళ్ళూరుతున్నది. గౌతముడి బాల్యమంతా గుర్తు తెచ్చుకుని మాటిమాటికీ మురిసిపోతున్నాడు. జ్యోతిష్యులు చెప్పింది యదార్ధమైనందుకు ఆశ్చర్యపోతున్నాడు. నగరమంతా సుందరంగా ఉంచమని ప్రధానదండనాధికారికి బాధ్యతలు ఒప్పచెప్పాడు.

స్వాగత సన్నాహాలు ఆర్భాటంగా జరుగుతున్నాయి. నగరం వెలుపల సరిహద్దు నుండే మేళతాళాలతో ఎదురెళ్ళి తీసుకురావటానికి ఏర్పాట్లు చేసారు. రథ, గజ, అశ్వాలను భారీగా సమకూర్చారు.

ఆ రోజు శాక్యనగరం ఎంత అందంగా వెలిగిపోతున్నదంటే కొత్తపెళ్ళికూతురు కూడా సిగ్గిపడాల్సిందే

యశోధర పరిస్థితి అయోమయంగా ఉన్నది. ఉదయం సుందరి వచ్చి వెళ్ళిన తర్వాత చాలాసేపు ఆమె మాటలను గురించే ఆలోచించింది. పిచ్చిపిల్ల తనంటే ఎంతప్రేమ. తమకాపురం బాగుండాలని ఆమె కోరిక. అదే సాధ్యమయితే తనకీ పరిస్థితి రాదుగా. తొలికోర్కెలు పండించుకునే దినాల్లోనే అతని మనసు పూర్తిగా సంసారసుఖాలమీద లేదు. పరాధీనంగా అంటీముట్టనట్లు వ్యవహరించారు. తన పదిసంవత్సరాల దాంపత్యం కొడుకు పుట్టినా కూడా అనుబంధాన్ని మిగల్చలేక పోయింది. అప్పుడే అర్ధమయింది ఏ బంధాలకు అతడు కట్టుబడడని. అటువంటిది ఇంత జ్ఞానం పొంది అనేకమందికి వెలుగు మార్గం చూపిస్తున్నతను తిరిగి తన మార్గానికి రావటం అసాధ్యం. సుందరి అంటుంది సమాధానం పొందమని. తనకు ముందే తెలుసు. అయితే తన భవిష్యత్తును నిర్ణయించాల్సింది అతడే. అదెలా ఉంటుందనేది ప్రశ్న.

మగధనుండి బుద్దుడు తన స్నేహితుడు ఉదయునితో మరి కొంతమంది శిష్యులతో కలిసి బయలుదేరాడు. వేలాదిమంది మగధప్రజలు త్వరగా తిరిగిరావాలని మాట తీసుకున్నారు. దారిలో తన జన్మస్థానమైన లుంబినీ వనంలో ఆగాడు. అప్పటికే చెన్నడు గౌతముడికి ఇష్టమైన గుర్రాన్ని తీసుకువచ్చి అక్కడ ఆగాడు. అక్కడ తల్లికి జలతర్పణం చేసాడు. చేతులు జోడించి మనసారా నమస్కరించాడు. ఉదయనుడితో ముందు వెళ్ళమని కపిల వస్తుపురంలో తనకు రాజోచితమైన ఆర్భాటాలు చేయవద్దని సాధారణ పౌరుడిలా నగరప్రవేశం చేస్తానని కబురుపంపాడు. ఆరోజంతా లుంబినీ వనంలో ఏ సాల వృక్షం క్రింద తల్లి తనకు జన్మనిచ్చిందో అక్కడ కూర్చుని ధ్యానం చేసాడు. ఆ రాత్రి విశ్రమించి మరుసటి ఉదయమే చెన్నడితో కలసి గుర్రమ్మీద బయలుదేరగానే శిష్యులంతా మిగిలిన గుర్రాలెక్కి వాళ్ళూ అనుసరించారు.

మధ్యాహ్నానికి నగరప్రవేశమయింది. లక్షలాది మంది జనం దూరంనుండే చూస్తే రంగురంగుల మబ్బులన్నీ నేలరాలినట్లు మనోహరంగా ఉందా దృశ్యం. బుద్ధుడి ఆజ్ఞ ప్రకారం ఆర్భాటాలు తగ్గించినా వచ్చే జనాన్ని ఎవరాపగలరు!? వారికళ్ళల్లోని వెలుగే మణిదీపాలుగా హారతిచ్చాయి. రకరకాల ఘట్టనలే నృత్యోత్సవమయింది. భక్తి పూర్వకమైన పలకరింపులే మంగళవాయిద్యాలు తథాగతుని దివ్యదర్శనంతో నగరంలో ప్రతి ఇల్లు, ప్రతి చెట్టూ, ప్రతిగాలి పలకరించి పులకరించాయి.

(4)

**తడి ఆరని కన్నులు, పొడి** ఆరిన నోరు.. దానికి తోడు వృద్ధాప్యం. పిలిచే ఓపిక కూడా లేకుండా కొడుకును చూస్తూ నిలబడ్డాడు శుద్ధోదనుడు. కాషాయవస్త్రాలు పసిడి రంగు ఒంటిమీద మెరుస్తుంటే నల్లటి నిడుపాటి వెంట్రుకల్ని మడిచి గోపురంలా ముడివేసాడు. చేతిలో భిక్షాపాత్ర. కాళ్ళకు పాముకోళ్ళు. సాధారణ వేషంలో ఉన్నా వర్చస్సులో రెండో సూర్యుడిలా మెరిసిపోతున్నాడు. గంభీరాకృతి, అడుగు ముందుకు పడనీయడంలేదు. కళ్ళల్లో అనంతకోటి కరుణరసం.. కన్నబిడ్డను కళ్ళారా చూడాలనుకున్నాడు. కానీ ఉన్న కంటిలోపానికి తోడు అవిరళంగా స్రవిస్తున్న కన్నీరు ఆ రూపాన్ని చూడనిస్తేనా. తన చేతులతో ఎత్తి పెంచిన కన్నయ్య ఎంతవాడయ్యాడు లోకానికే గురువట. తన గుండెల్ని తన్నిన చిన్నిచిన్ని పాదాలు ఈరోజు లోకపూజితాలు. తన జీవితం ధన్యం. ఇతని పుట్టుకచేత వంశం రాజ్యం అన్నీ పావనమయ్యాయి. మహా ఇల్లాలు తన భార్య. అటువంటి సాధ్వి కడుపుఫలం ఊరికే పోతుందా.

చిక్కి, వృద్ధాప్యానికి తోడు తన వియోగ దుఃఖం కూడా తోడవడంతో వయసుని మించి ముసలివాడుగా కనబడుతున్న తండ్రిని చూడగానే అతని అంతరంగంలో కరుణ పొంగింది. ఎదురుగా వెళ్ళి జన్మదాతకు నమస్కరించాడు. చెక్కిళ్ళపై కారిపోతున్న కన్నీటిని తన ఉత్తరీయంతో తుడిచి కుశలప్రశ్నలడిగాడు. ఇదంతా కేవలం బాధల్లో ఉన్న వారిని ఓదార్చినట్లే ఉంది తప్ప కన్నతండ్రి అనే మమకారం ప్రత్యేకంగా కనిపించలేదు. అందరినీ పేరు పేరున కుశల ప్రశ్నలతో పలకరించి వారి సంతోషాన్ని రెట్టింపు చేసాడు. తన మాటల కోసం నిరీక్షిస్తున్న ప్రజల నుద్దేశించి గౌతముడిలా ప్రసంగించాడు.

"నిరంతర శోకతప్తులారా! దుఃఖానికి మూలం తృష్ణ. ఆశలేని జీవితం ఆనందానికి మూలం. అనంతమైన కోర్కెల ప్రవాహంలో అందుకోలేని అనుభూతులకై పాకులాడి చివరకు ఆయుష్షును హరించుకోవటమే కాదు నిత్య విషయాగ్నిలో మనిషి దహించబడుతున్నాడు. కామము ప్రధానశత్రువు. మిగిలిన అరిషడ్వర్గాలు దాని నెచ్చెలులు - ఒక్క స్వభావాన్ని జయించటానికే జన్మ చాలటంలేదు. అటువంటి ఆరు దుర్గుణాలు మనలో చేరి మనసును చికాకు పరుస్తున్నాయి ఇంద్రియ సుఖాలవెంట మనస్సు నిలకడ లేకుండా పరుగులు తీస్తున్నది. అందువలన ఇంద్రియ భోగాలు మనిషికెప్పుడూ అశాంతిని అనర్థాన్ని తెచ్చిపెడుతూనే ఉన్నాయి. వాటి మూలం తెలుసుకోవటమే నివారణం. అది నేను తెలుసుకుని బుద్ధుడినయ్యాను. ఇకనుండి నా మార్గం. శోకరహితమైంది. దాని సత్యాన్ని గ్రహింపచేయటానికే గురువుగా వచ్చాను. శోకమూలమైన ప్రపంచం శోకనాశనాన్ని పొందటమే మహానిర్వాణం. మీరనుకున్నట్లు స్వర్గనరకాలు - మోక్షం మరెక్కడో లేవు. అన్నిటికీ మూలం మనస్సే దానిని అదుపు చేయగలిగితే ఈ భూమ్మీదే అన్ని లోకాలు చూడగలవు. వేరే ఏమీలేదు. దైవభావనకూడ మనస్సుకు సంబంధించిందే. సాటిమనిషి నాదుకునే వాడే దేవుడు. ఈ నిజాన్ని మీరు గ్రహించగలిగితే మీ జన్మ ధన్యమవుతుంది. నేను కొంతకాలం ఇక్కడే ఉండి నా నూతన ధర్మాన్ని మీకు బోధిస్తాను. కులం, మతం వర్గం ఏ తేడా లేకుండా నా ఆశ్రమానికి రావచ్చు. ధర్మదీక్షలు తీసుకోవచ్చు. అయితే ఆ మార్గం కఠినాతికఠినం. మీరందరు ధర్మ మార్గ ప్రవర్తకులై వర్ధిల్లుతారని ఆశిస్తూ ముగిస్తున్నాను"

ఆ అమృతవర్షానికి తడవని వారులేరు. 'మన జన్మలు కడతేర్చటానికే వచ్చాడు మహానుభావుడు. ఇకనుండి మనకు కష్టాలు కన్నీళ్ళు ఉండవు. ఆయన మాటలు వింటే.' ఇలా ఎవరికి వారు చర్చించుకుంటూ ఇళ్ళదారి పట్టారు.

గౌతముడు కూడా తండ్రితో కలిసి భవనానికి వెళ్ళాడు. అదికూడ చేతకవనంలో విడిది ఏర్పాట్లు పూర్తయ్యేంతవరకు మాత్రమే భవనంలో ఉంటానని మాటిచ్చాడు. పేరుకు భవనంలోనే కానీ ఆయనకు ప్రత్యేకంగా శుద్ధోధనుని మందిరంలో క్రిందిగదులన్నీ తథాగతునికి అతని శిష్యులకు నివాసంగా మార్చబడ్డాయి. అతడు చెప్పిన ప్రకారమే సాధారణమైన నేలపడకలు ఏర్పాటు చేయబడ్డాయి.

రాజభవనం చేరుకోగానే ధూపదీపాలతో పూలహారాలతో ప్రధాన పరిచారకులంతా వరుసగా నిలబడ్డారు. పెంచిన తల్లి గౌతమి ఏడుస్తూ వచ్చింది. దిష్టితీసి హారతిచ్చి బిడ్డను అక్కున చేర్చుకుని బావురుమని ఏడ్చింది. తల్లిని ఊరడించాడు. అత్త వెనుకగా నిలబడి ఉన్నది యశోధర. భవనంలో కనుక మేలిముసుగు ధరించలేదు. వచ్చింది తన నాథుడేనా? రెండు కళ్ళెత్తి చూడాలనుకుంటున్నది కానీ ఏదో పరాయిభావం సూటిగా చూడనివ్వటంలేదు. అయోమయస్థితి. దేహం మనస్సు ఆమె ఆధీనంలో లేవు. అవెప్పుడో పరాధీనమయ్యాయి. అతడు జుట్టు ముడితో కాషాయంతో వేరేగా కనిపిస్తున్నాడు. అడుగు ముందుకు వేసాననే అనుకుంటున్నది కానీ ఉన్న చోటునుండి అంగుళమైనా ఆమె పాదాలు కదలటం లేదు. అంతరం మాత్రం నిరంతరంగా ఆక్రోశిస్తూనే ఉన్నది.

**"హృదయార్తమైన ఈ పిలుపందుకుని**
**బీడు వారిన క్షేత్రమున ప్రేమ వర్షింపుమో స్వామీ"**

నేనేమైపోతున్నానో నాకే తెలియటంలేదు. మొదటిసారిగా నా శరీరం కూడా నా మాట వినదని గుర్తించాను. ఇంత నిస్సహాయురాల్ని ఇలా విడిచి పెట్టడం భావ్యమా. పందిరిలేని లతలాగా వాలిపోతున్న ఈ దేహలతికను చూడు. సుకుమారమైన శరీరం భావతాకిడికి కంపించిపోతున్నది. ఉపవాస నియమాలతో కృశించి వున్న ఆమె నిలబడే శక్తిని కూడా కోల్పోయింది. అసంకల్పితంగా నేత్రాలనుండి అశ్రువులు మంచి మౌక్తికాల్లా ధారగా వర్షిస్తున్నాయి. ఒక్కసారి ఆ పాదాల మీద వాలిపోవాలని మనస్సు తొందరపెడుతున్నది.

**'శక్తి తరుగకనే యాత్ర ముగియు సమయమున**
**అడుగిడినవి నీ పాదములు నామందిరాంతరంగమున**
**కోర్కెయేలేదు ఒకసారి నీ కౌగిలింతకన్న**
**ఆ పై మరణమైనను నాకానందదాయకమే.'**

ఇంతలో శుద్ధోధనుడున్నాడు.

"నాయనా! ఈమె నీ భార్య యశోధర. నీవు వెళ్ళింది మొదలు ఈరోజు వరకు అలంకరణకు దూరమై నిన్నే జపిస్తూ ఉపవాసాదులతో నేలపై శయనిస్తూ తన సతీధర్మాన్ని కాపాడుకుంటున్నది. ఉత్తమ ఇల్లాలు నీ యశోధర అని లోకమంతా శ్లాఘిస్తున్నది. ఈమె నమస్కారాన్ని స్వీకరించు. ఇతడు నీ కుమారుడు రాహులుడు. నీవు ఇల్లువదిలేనాటికి రెండేళ్ళవాడు ఇప్పుడు చూడు నీ పోలికలను సంపూర్ణంగా పుచ్చుకుని పదహారు కళలతో ఒప్పే చందమామలాగున్నాడు. ఇతడికి నీ ఆశీస్సులందించు" మనవడిని ముందుకు పిలిచాడు.

ఒక్క క్షణం గాలి స్థంభించినట్లయింది. ఎవ్వరూ ఏం మాట్లాడటంలేదు.

గౌతముడు నిర్నిమేషంగా రెండు నిమిషాలు భార్యవైపు కుమారుడి వైపు చూసాడు. అటు కన్నతండ్రి ఇటు కన్నకొడుకు మధ్యలో కట్టుకున్న భార్య - మూడు బంధాలు తన ప్రేమకోసం తన పిలుపుకోసం ఆర్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ పరిస్థితినే తానెదుర్కోవాల్సింది. లోకంలో అందరూ ఎలాగో వీరూ అంతే. ప్రత్యేకత ఏముంది? సన్యాసి అయినప్పుడే అన్ని బంధాలు తెంచుకున్నాడు.

అందుకే నిర్లిప్తంగా చూసి కుమారుడి శిరస్సుమీద చేయి ఉంచి భవమోచనమస్తు అని దీవించాడు. నమస్కరించటానికి వచ్చిన యశోధరను వారించి పాదాలు వెనక్కు తీసుకున్నాడు. కానీ అప్పటికే వివశమైన ఆమె శరీరం తట్టుకోలేక ఆయన పాదాలమీద వాలిపోయింది. బుద్ధుడు మెల్లగా పైకి లేపి స్వయంగా నీళ్ళు చిలకరించి సేదదీర్చాడు. కుశలప్రశ్నలడిగాడు.

ఆ మాత్రం స్పర్శకే ఆమె ఉత్తేజితమైంది. ప్రతి అణువులో నూతన శక్తి ఏర్పడినట్లు ఉత్సాహంతో మనసు నిండిపోయింది.

**'ప్రభూ! ఎన్ని యుగములనుండి**
**నిన్ను చేరగనుంటినో ఎరుగనైతిని**
**శరన్మేఘాంచలము వంటి ఈ**
**తుషారదివ్య స్వప్నమున విహరింతు**
**నీ యనుమతితో నిన్నుగూడి'**

బుద్ధుడి ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. కఠినమైన బ్రహ్మచర్య దీక్షలో స్త్రీ సాంగత్యాన్ని పూర్తిగా నిషేధించాలి. ఇంకా ఏమేమి చేర్చాలో రాత్రికి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

ఆయన ధోరణిలో ఆయన ఉన్నాడు. కాసేపు చర్చలు అయిన తర్వాత భోజనాలకు పిలుపు వచ్చింది. వెంటనే తథాగతుడు తన భిక్షాపాత్రను చేతిలోకి తీసుకున్నాడు. శిష్యులూ అదే చేసారు. అందరూ బయటికి నడవబోతుంటే శుద్ధోధనుడడ్డుకున్నాడు.

"ఇదేమిటి తండ్రీ! కన్నవారిమయినంత మాత్రాన కడుపునిండా అన్నం పెట్టుకోకూడదని మీ ధర్మశాస్త్రం చెప్పిందా?"

"లేదు తండ్రీ! మా సంప్రదాయాన్నే పాటిస్తున్నాను. పరివ్రాజకులైన వాళ్ళు ఏ ఇంటనైనా మూడుగుప్పిళ్ళకు మించి ఆహారాన్ని తీసుకోరాదు. మీకు సమ్మతయితే అంతే ఆహారాన్ని ఈ భిక్షాపాత్రల్లో వడ్డించండి. మిగిలింది వేరే ఇళ్ళల్లో తీసుకుంటాం" సమాధానం చెప్పాడు.

"అయ్యో! కన్నబిడ్డకే భిక్ష వేయటం. బహుశా చరిత్రలో ఏ తండ్రీ ఇటువంటి అనుభవాన్ని చూసి ఉండడు. ఆ అదృష్టం కూడా నాదే - అలాగే బిక్షకు వెళ్ళిరండి - సాయంత్రం కొంత సమయం మీతో సావకాశంగా మాట్లాడే అవకాశాన్ని ఇప్పించండి చాలు" అన్నాడు చేతులు జోడించి.

బుద్ధుడంగీకరించి తల్లి పెట్టిన మూడు పిడికిళ్ళ ఆహారాన్ని తీసుకుని భిక్షాటనకు రాజమార్గాన బయలుదేరాడు. ఈ దృశ్యాన్ని పౌరులు వింతగా చూసారు. ఎంతో రుచికరమైన భోజన పదార్థాలను పట్టుకుని వాకిట్లో అన్నపూర్ణలా ఎదురుచూస్తున్నారు ఇంటి ఇల్లాళ్ళందరూ. తమ భిక్ష స్వీకరించి తమ పాపాలను తొలగించమని ఆర్తితో వేడుకుంటున్నారు.

నియమం ప్రకారం మరో ఆరిళ్ళ దగ్గర భిక్ష తీసుకుని శిష్యులతో నివాసానికి తిరిగి వచ్చాడు.

ఆ రాత్రి శిష్యులందరూ పరివేష్టించి ఉన్నారు. తన ధర్మంలో కష్టనష్టాల గురించి మాట్లాడుతున్న సమయంలో శుద్ధోధనుడు వచ్చాడు. గౌరవంగా లేచి నిలబడి తండ్రికి ఆసనం చూపించాడు. వయోభారంతో చర్మం ముడతలుపడి దయనీయంగా కనిపిస్తున్నది ముగ్గుబుట్టలాంటి తల. పండిన అనుభవాలకు ప్రతీకగా ఉంది.

"ఎన్నాళ్ళు నాకీ భారం నాయనా!"

నేలమీద కూర్చోవటం కష్టమైంది ఆయనకు.

"తప్పదు తండ్రీ ఎవరికెంతవరకు కాలం నిర్ణయిస్తుందో అంతవరకు జీవితగమనం సాగాల్సిందే"

"సరే నా భారాన్ని కాలానికే వదిలేసాను. రేపోమాపో వెళ్ళిపోవటానికి సిద్ధంగా ఉన్న నా అస్తమయ దిశను గురించి మాట్లాడను. నిండా ముప్ఫయి అయిదు సంవత్సరాలు లేని యశోదర జీవితం వయసులో అడుగుపెడుతున్న రాహులుడి భవిష్యత్తు ఏం

చేయాలనుకుంటున్నావు. కంటిదీరా చూసుకోలేకపోతిని. కరువుదీరా హత్తుకోని దుర్రదుష్టవంతుడిని నేను. రాచవంశంలో పుట్టి వీధులెంట బిచ్చమెత్తుతున్నా మాట్లాడలేని నిస్సహాయపు బ్రతుకునాది. కానీ నువ్వే సర్వస్వమని నమ్మివచ్చిన ఆ ఇల్లాలు అనుమతి కోసం ఎదురుచూస్తున్నది. మంచి వయస్సులో వసంతంరాని వనంలా కోర్కె చంపుకుని భర్తవుండీ లేనిదానిలాగా కన్నీళ్ళతో కాలం వెళ్ళదీస్తున్న ఆమెకేమని చెబుతావు. తండ్రెవరో కూడ అర్థం తెలియని వయస్సులో విడచి పెట్టి వెళ్ళావు పన్నెండేళ్ళుగా కన్నతండ్రి కోసం ఎదురుచూస్తూ ఈరోజు వస్తున్నావని విని ఎంత సంతోషపడ్డాడో పిచ్చితండ్రి. తాతయ్యా ఈరోజంతా నాన్నతోనే ఉంటా. నాన్నచేతి ముద్దలు తిని ఆయనతో పడుకుంటాను అని ఎన్ని కబుర్లు చెప్పాడు.!! కనీసం బిడ్డను మనసుతీరా పలకరించవైతివే - నీవు చాలా గొప్పవాడివే కావచ్చు. కానీ మాకు మావాడివి. నీలో ప్రవహించే రక్తం మాది. మా మనిషివి. మా సంతోషానికి మూలానివి. మా కలలకు రూపానివి. నీ వాళ్ళందరిని శాపగ్రస్తుల్లా బ్రతకమని లోకం బాధల్ని తీర్చడానికి వెళుతున్నావా తండ్రీ వెళ్ళు. వెళ్ళే ముందు మా జీవితాలకో పరిష్కారం చూపించి వెళ్ళు. ఇక నీ వియోగాన్ని తట్టుకునే శక్తి మాకు లేదు.'' ఆపుకోలేని దుఃఖంతో నేలకూలిన చెట్టులా భూపతి పక్కకు ఒరిగిపోయాడు.

కొంత శైత్యోపచారాలు చేసిన మీదట మామూలు స్థితికి రాగలిగాడు.

''మీరు బాధపడకండి నాన్నగారూ ఈ బంధాలన్ని వద్దనుకునే ఇల్లువిడిచి వెళ్ళిపోయాను. నాకేనాడు అధికారంపై మనసు లేదు. అది మీకూ తెలుసు. కొంతమందయినా త్యాగం చేస్తే మిగిలిన లోకం ఉద్ధరించబడుతుంది. ఈ త్యాగంలో మీరూ పాత్రులు కావాలి. ఇంట్లో ఉంటే కేవలం మీకు మాత్రమే కొడుకును. కానీ బయట మాత్రం ఎంతోమంది తండ్రులను పోగొట్టుకున్న బిడ్డలు - బిడ్డలను కోల్పోయి అల్లాడే తండ్రులు. వీరందరి శోకాన్ని తుడవటానికి నీ బిడ్డకు మీరు జన్మనిచ్చారు. నేను, నాది కేవలం వ్యక్తిగత స్వార్థం. దానికోసమే మనిషి మరిన్ని తప్పులు చేస్తూ దిగజారిపోతున్నాడు. వ్యక్తిగత స్వార్థం. దానికోసమే మనిషి మరిన్ని తప్పులు చేస్తూ దిగజారిపోతున్నాడు. వ్యక్తికంటే సమాజం గొప్పది. సమాజం కోసమే దేహత్యాగాన్ని సిద్ధపడ్డాను.

ఈనాడు మీ ఎదురుగా ఉన్నది ఆ నాటి సిద్దార్థుడు కాడు. శోకమూలం తెలుసుకుని కులమత, వైషమ్యాల కతీతమయిన మానవత్వాన్ని మేల్కొలపటానికొచ్చిన బుద్దుడిని నా నూతన సిద్దాంతంలో మానవులందరూ ఒక్కటే. ఈ ప్రేమ విశ్వజనీనం. ఇప్పుడు చెప్పండి ఇంత ప్రపంచానికి అందాల్సిన ప్రేమ కేవలం ముగ్గురికి పంచమనటం భావ్యమేనా.

వెలుగుతున్న దివ్యకాంతిలో, కఠోరమైన బ్రహ్మ చర్యదీక్షలో శీలమే ఆయుధంగా ధరించి కదులుతున్న కర్మవీరులం. దయచేసి నా మార్గాన్ని ఆపకండి. నేను అందరివాడిని. ఎక్కడా నా సోదరులు దుఃఖించకూడదు. దీనులు పీడించబడకూడదు. ఈ ధర్మదేవత సంస్థానంలో పేదగొప్ప తారతమ్యాలుండవు. పంచభూతాలు పండ్లవృక్షాలు సమానమైన ధర్మాన్ని నెరపినట్లే మా మతంలో అందరూ సమానం. ఒకరికి మృష్టాన్నం మరొకడికి గంజినీళ్ళకు కూడా కరవే. ఈ వ్యత్యాసాలు పోవాలనే భిక్షువులు తప్పనిసరిగా భిక్షాటనం చేయాల్సి వచ్చింది అందరూ కలిసి భుజించాలి. ఇదీ మా నియమం. ఈ ఆశయాన్ని అర్థం చేసుకోగలిగితే నా మార్గాన్ని అనుసరించండి. లేదా నన్ను నిరాటంకంగా వెళ్ళిపోనివ్వండి. యశోధరకయినా, నా కుమారుడికయినా నేను చెప్పే సమాధానం ఇదే రాచరిక వ్యవస్థలో భోగలాలస, అహంకారం ఉన్నాయి. వాటిని విడచిపెట్టిన నాడే తోటి మానవుడి ఆకలి అర్థమవుతుంది. ఈ సమాజమే మోక్షద్వారం. తాడితపీడిత వర్గమే నాకు దైవం. ఆ కన్నీటిని తుడవటమే ఆనందం అభిలషణీయం.'' ఏ మాత్రము తొట్రిలకుండా రాగరహితమైన చూపులతో నిర్వికారంగా చెబుతున్న బుద్దుడిని అలాగే చూస్తుండిపోయాడు వృద్ధభూపతి.

''పోనీలే నాయనా! నీ మార్గానికి అడ్డురావాలని నేననుకోను. ఆనాడు అనపత్యతా దోషాన్ని తొలిగించటానికి జన్మించావు. నేడు భవబంధాల్లో చిక్కిస్కుతున్న నాకు అపవర్గ ప్రాప్తసంధానకుడివైన గురువుగా గోచరిస్తున్నావు - ఏ మమతాపాశాలు నిన్ను బంధించలేవు. ఈ లోకమంతా నీదే లోకమే నీకోసం ఎదురుచూసుంది - పోయిరా భగవాన్! మోహంతో నా కొడుకుగా అన్న మాటలు మనసులో

పెట్టుకోకు. అయితే నా బాధక్కొటే నేనెలాగూ బ్రతుకు చివరలో ఉన్నాను. కానీ ఆమె నీ భార్య ఆమెనేం చేస్తావో చెప్పు. ఆమెను పంపిస్తాను. కనీసం ఆ మాటలు నీ భార్యకు చెప్పటం ధర్మం. కళ్ళల్లో వత్తులేసుకుని ఎదురుచూస్తున్న ఆమెకు చెప్పటం న్యాయం."

బుద్ధుడు మౌనంగా తలాడించాడు.

శుద్ధోదనుడు లేచి బయటకు వచ్చేసాడు. కాసేపటికి యశోధర మేలిముసుగు ధరించి లోపలికి వచ్చింది. రాగానే బుద్ధుడి పాదాలకు నమస్కరించి తలవంచి మౌనశిల్పంలా కూర్చున్నది.

ఆ పరిస్థితి బుద్ధుడికి శిష్యులకూ ఇబ్బందిగానే ఉన్నది. లేవబోయి ఆయన కనుసైగతో వాళ్ళంతా కూర్చుండిపోయారు.

"చూడు యశోధరా! భర్త కార్యసాధన వెనుక భార్య ప్రోత్సాహం తప్పకుండా ఉంటుంది. మొదటినుండీ నా అన్వేషణ వేరు, ఈరోజు నేను దానిని సాధించగలిగాను. తుచ్ఛమైన సంసార సుఖం కోసం నేను తలపెట్టిన ఈ మహాయజ్ఞాన్ని ఆపగలనా. భార్య ఒక్కతె దుఃఖిస్తుందని ఇంతమంది ఆర్తులు బాధలు విడిచిపెట్టనా. చదువు సంస్కారం ఉన్న నీకు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. నీ మార్గం నీ అధీనం - ఏనాడయితే సన్యాసం స్వీకరించానో ఆ రోజు నుండీ నీమీద నాకే మాత్రం హక్కులేదు. నువ్వు సర్వస్వతంత్రురాలివి. ధర్మబద్ధమైన మార్గమేదైనా స్త్రీలకు సమ్మతమే. అలాగే రాహులుడి విషయం మీరందరు ఆలోచించుకుని నిర్ణయించుకోవటం ఉత్తమం. ఇక వ్యక్తిగతమైన ప్రశ్నలకు సమాధానం నా దగ్గరలేదు. ఎందుకంటే నా దీక్షలో కర్తవ్యపాలనలో కఠినతే ఎక్కువగా ఉంది. తోటి స్త్రీలలాగే నువ్వుకూడా మాతృమూర్తితో సమానం. ఇకవెళ్ళిరా. నీకు ఆశీస్సులు." రెండు చేతులెత్తి దీవించాడు.

ఆమె మాట్లాడాలనుకుంది. ముందు ఏమని సంబోధించాలో అర్థం కాలేదు. తమాయించుకుని.

"స్వామీ! మీరు లోక పూజ్యులు. మీకు తెలియని ధర్మంలేదు. నేను స్త్రీని. భర్తచాటు ఇల్లాలిని. నా భర్త నా అనుమతి లేకుండానే పరిత్యక్తను చేసి సన్యాసం స్వీకరించారు. ఒక్కటే బాధ. ఆరోజే వారు తన నిర్ణయాన్ని చెప్పివుంటే సంతోషంగా పంపించి ఉండేదాన్ని. నన్ను ప్రతిబంధకస్థానంలో ఉంచి నాతో చెప్పకుండా వెళ్ళిపోవటం వలన లోకనిందకు గురికావలసి వచ్చింది. ఆయన చేసింది ధర్మమో, అధర్మమో నాకు తెలియదు. ఎందుకంటే వారు వీటికి అందనంత ఎత్తు ఎదిగారు. అందువలన ధర్మ స్వరూపులు. సాటివారి కన్నీరు తుడవటానికి సమస్తం త్యాగం చేసినవారు. మీరే మాకు మార్గం చెప్పాలి. భర్త విడిచిపెట్టిన భార్య పరిస్థితేమిటి. చేయని తప్పుకు ఇన్ని సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎలా బ్రతకమంటారు. నేను అడిగేది కూడా వ్యక్తిగతం కాదు లోకసహజంగా అడుగుతున్నాను. అగ్నిసాక్షిగా పదిమంది ఎదుట మెళ్ళో తాళికట్టి తన సొత్తుగా చేసుకున్న భార్యను స్వతంత్రంగా విడిచిపెడుతున్నాను. ఆమె ఇష్టం అంటే ఆమె ఎక్కడికి పోగలదు? ఈ ధర్మ సందేహాన్ని మీరే పరిష్కరించగలరు."

మెత్తగా ఉన్నా ఆ మాటల్లోని పదును గౌతముడికే కాదు అక్కడున్న వారందరి హృదయాన్ని తాకింది.

గౌతముడు కొంచెం సేపు నిరుత్తరుడయాడు. "చూడు శుభాంగీ! భర్త సొత్తని నువ్వే చెబుతున్నావు కదా. అతను దానికి అధికారి అయినప్పుడు ఆ సొత్తును వాడుకోనూ వచ్చును ఇంటనూ భద్రపరచనూ వచ్చు. పైగా సన్యాసానికి నీ ప్రశ్న వర్తిస్తుంది. కానీ బౌద్ధాన్ని గ్రహించి బుద్ధుడినయ్యాను. లోకంలో సమస్త జీవుల దుఃఖాన్ని తుడవటానికి వచ్చాను. లౌకిక బధాలేవీ నన్నంటవు. నీ మార్గాన్ని నీవు నిర్ణయించుకో -

"అయితే స్వామీ! ఆ దుఃఖితుల్లో నేనొకదాన్ని. నా దుఃఖానికి మార్గం చూపండి. తమరి శిష్యురాలిగా స్వీకరించి నాకు ధర్మదీక్ష ఇవ్వండి. ఇల్లాలిగా శిష్యురాలిగా నా జీవితాన్ని మీ సేవలో సార్థకం చేసుకుంటాను"

"అదెట్లా కుదురుతుంది. నా నూతన ధర్మంలో స్త్రీలకు అవకాశం లేదు. ఆమె సాంగత్యం అభివృద్ధినిరోధకమవుతుంది. కనుక సంఘంలో వారికి స్థానం లేదు" నిష్కర్షగా చెప్పాడు.

"ఓహో! ఇదికూడా ఉందా. ధర్మమార్గానికి స్త్రీ పురుషులు అనే బేధం ఎందుకు? బలహీనత మనస్సుకు సంబంధించింది అయినప్పుడు వస్తువుల మీద ఆరోపించటం ఏం ధర్మం. ఇంద్రియ నిగ్రహం లేని వారి మనస్సు అడవిలో ఉన్నా చలిస్తునే ఉంటుంది. పదార్థాలను త్యజించికాదు. నియమపాలనం చెయ్యవలసింది. ఎదురుగా ఉన్నా వాటిపై ఆసక్తి లేకపోవటం అదే నిజమైన నిగ్రహం. ఆలోచించండి. స్వామీ! నా మార్గానికి మీరు రారు. రాలేరు. కనీసం మీ మార్గాన్ని అనుసరించనివ్వండి." ఆమె గొంతులో వేడికోలు భర్తకోసం పడుతున్న తపన చూసేవారి మనస్సులు ద్రవిస్తున్నాయి.

బుద్దుడి ప్రధాన శిష్యులు మౌద్గల్యుడన్నాడు.

"క్షమించండి భగవాన్. మీకు చెప్పేపాటి వారం కాము. కానీ మూరు మరొక్క మారు ఆలోచించండి. మనకు జన్మనిచ్చి పెంచి పెద్ద చేసిన మాతృమూర్తులను గౌరవించటం ధర్మం. అంతేకాదు కర్తవ్యనిర్వహణలో పురుషుల కంటే స్త్రీలు నియబద్దులు - గార్గి - మైత్రేయలాంటి వారు ఆత్మ విద్యను సాధించి చూపారు. మన సంఘంలో కూడా కొన్ని నియమాలతో వారి ప్రవేశాన్ని అనుమతించండి."

మిగిలిన వారందరూ వంతపాడారు.

గౌతముడు ఆలోచనలో పడ్డాడు. నిజమే. తనకు జన్మనిచ్చింది ఒక స్త్రీ, అల్లారుముద్దుగా పెంచిపోషించింది మరో స్త్రీ, జీవనయాత్రలో అర్ధాంగిగా వచ్చి కష్టసుఖాల్లో భాగం పంచుకుని సౌఖ్యాన్నందించింది స్త్రీయే. అసలు అన్నిటికమే ముఖ్యమైన విషయమే తను మరిచాడు. ఆరోజు ఆమె ప్రాణదానం చేయకపోతే బుద్దుడెక్కడ! బుద్దదర్మమెక్కడ. అటువంటి జ్ఞానప్రదాత ప్రాణదాత స్త్రీ కాదా. ఉన్నతమైన స్త్రీని అల్పంగా ఊహించుకుని తన ధర్మానికి పనికిరాదనటం అవివేకం. అహంకారం అప్పుడు తనకూ సంకుచితులైన వేదపండితులకూ తేడా ఏముంది. కులరహితమైన సమాజాన్ని స్థాపిస్తున్నప్పుడు లింగవివక్షతలు మాత్రం ఎందుకు కొన్ని కఠిన నియమాలు, ఏర్పరచి వారికి కూడా భాగస్వామ్యం ఇస్తే ఎలా ఉంటుంది? లోపల ఆలోచిస్తూనే ఉన్నాడు. పైకి మాత్రం.

"ఇప్పుడే తేలే సమస్యకాదు మౌద్గల్యా! మనం మరోసారి ఆలోచించాల్సి ఉంటుంది. స్త్రీల సాహచర్యం వలన ప్రయోజనం కంటే ప్రమాదాలే ఎక్కువ అందువలన నదీతీరానికి వెళ్ళాక ధర్మమండలి సమావేశంలో ఈ అంశాన్ని చేర్చి ఆలోచిద్దాం" అన్నాడు గంభీరంగా.

శిష్యులు మౌనముద్రదాల్చారు. యశోధర కూడా మరేం మాట్లాడకుండా మరోసారి నమస్కరించి తిరిగి వచ్చేసింది. తర్వాత రాహులుడు తండ్రిని కలిసి తానుకూడా ధర్మదీక్ష తీసుకుంటానని చెప్పాడు. ఆనందంగా ఆశీర్వదించాడు గౌతమబుద్దుడు. బుద్దుడు రాజమందిరంలో ఉన్న మూడు దినాల్లో రాజబంధువులు మంత్రులు దండనాయకులు. వేలాదిమంది పౌరులు ఆయనను తీర్థంలా కలుస్తూనే ఉన్నారు. దీక్ష స్వీకరిస్తామని చెబుతున్నారు. రెండోరోజు రాత్రి అందరూ వెళ్ళిపోయాక సుందరీనందులొచ్చి గౌతముడికి నమస్కరించారు.

క్రొక్కారు మెరుపుతీగలా అద్భుతమైన సౌందర్యంతో మెరిసిపోతున్న మరదలిని మొట్టమొదటిసారిగా చూసాడు. తమ్ముడిని అక్కున చేర్చుకుని ఆదరించాడు. వాక్కూ, అర్ధంలాగా, పాలూ, నీరులాగా కలసి పరమార్థం కోసం జీవించమని ఆశీర్వదించాడు. సుందరికూడా ఆ తేజోమూర్తిని చూస్తూ తనను తానే మర్చిపోయింది.

అక్కడేం మాట్లాడలేదుకానీ తిరిగొచ్చేముందు యశోధరని కలిసింది. గౌతముడికి ఆయన శిష్యులకు కావలసినవి సమకూర్చటానికి ఆమె హడావిడి పడుతున్నది. అత్తగారు, గౌతమి కూడా అక్కడే ఉన్నది. ఇద్దరికి నమస్కరించింది. వారు ఆమెను కౌగలించుకుని ఆశీర్వదించారు.

హడావిడిగా ఉన్నట్లుంది

"మళ్ళీ రానా? " అడిగింది.

"నీకు మళ్ళీ ఏమిటి? రా సుందరీ. రేపు ఉదయం వారికి కావలసిన ఏర్పాట్లు చూస్తున్నాను. ఇటురా కూర్చో. " ఆసనం చూపించింది.

"ఏమ్మా నందుడు కూడా వచ్చాడా అన్నగారిని కలవటానికి.?" అత్తగారు అడిగింది.

"వచ్చారు అత్తయ్యా. మామగారి దగ్గర ఉన్నారు."

"యశోధర దీక్ష తీసుకుంటుందంట - మేము కూడా తీసుకోవాలని అనుకుంటున్నాం." గౌతమి అన్నది.

సుందరి ఆశ్చర్యపోయింది. ఆ పైన భయపడింది. ఈ అంటువ్యాధి కుటుంబమంతా పాకిపోతుందా.

"అక్కా! ఈ నిర్ణయం మీరెలా తీసుకోగలిగారు. ఏం చేస్తున్నారో అర్థమవుతుందా.?"

"కాకేం చెల్లీ. పూర్తి స్వస్థతలోనే ఉన్నాను. నేను మొన్నే చెప్పాను కదా. ఆయన బాటలో నడవటమే ఆనందమని. అయినా ఇంకా మీ బావగారు పూర్తి నిర్ణయానికి రాలేదు. ఆలోచిస్తామని చెప్పారు. "

"అంతేనా. జీవితమంటే అర్థం ఇదేనా. మీ ఆయనేదో కొత్త ధర్మం కనుక్కున్నారు కనుక అందరూ బోడిగుండ్లు చేయించుకుని అందులో చేరాలి. నేను కనుక్కున్నదే నిజం ఇందులో బ్రతకండి అంటం ఏం న్యాయం. మీరు లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. భర్తను గుడ్డిగా ఆరాధించే సాధారణ స్త్రీలానే ప్రవర్తిస్తున్నావు. అత్తగారు మామగారు వారి జీవితం పూర్తిగా గడచింది. బాధలేదు నీ వయస్సు సగం నడిచింది. కానీ మీ కుమారుడు శాక్యవారసుడు రాహులుడు. వాడి వయసు ఎంత? జీవితాన్ని ఏం తెలుసుకున్నాడని సన్యాసం ఇప్పిస్తున్నారు. ఇది న్యాయంగా తోస్తున్నదా?" ఆపైన మాట్లాడలేకపోయింది. గొంతులో దుఃఖం సుడులు తిరుగుతున్నది. మాట గద్గదమయింది. నాన్నమ్మ ఒళ్ళో కూర్చున్న రాహులుడు వచ్చి పిన్ని ఒళ్ళో కూర్చున్నాడు.

ఆమె కళ్ళ నీళ్ళు తుడుస్తూ -

"పిన్నీ! నా గురించి బాధపకండి. నాకు ఊహ తెలిసిన నాడే నాన్నగారు ఇల్లువిడిచి వెళ్ళారు. ఆయనను చూస్తానని అనుకోలేదు. అదృష్టం కొద్దీ తిరిగొచ్చారు. ఏనాడు అమ్మ ముఖంలో ఇంత సంతోషాన్నీ సంతృప్తినీ చూడలేదు. ఈ రోజు ఆమెను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. కానివ్వండి ఆమెకేది సంతోషమో అది చెయ్యటమే ఉత్తమం. ఇక నా విషయమంటారా తండ్రి బాట తనయుడికి అనుసరణీయం. తన కుమారుడినే మార్చలేని వాడు లోకాన్నేం మారుస్తాడు అనే అపనింద తండ్రిగారికి రాకూడదు. అందువలన ఈ విషయమ్మై బాధపడటం ఎందుకు? "

"నాయనా! నీకు తెలియదురా - నిండా పన్నెండు సంవత్సరాలు లేవు. జీవితం మొదటి దశన్నా చూడలేదు. ధర్మకర్మాల అర్థమైనా తెలియదు. ఎవరో ఒకరు ఏదో ఒక్కక్షణం మనసులో కలిగే ఆలోచనలకు అందరూ అదే దారిలో నడవాలనుకోవటం వెర్రితనం. సహజమైన ప్రకృతిధర్మం అన్నిటికంటె గొప్పది, నా బాధను ఎవరూ అర్థం చేసుకోలేకపోతున్నారు. చూడు నిండుగా కళకళలాడాల్సిన మీ అమ్మ జీవితం ఇంకా మోడుగా మిగిలినందుకు మీకు బాధగా లేదా.? "

"ఎవరి బాధ గురించమ్మా! మాట్లాడుతున్నావు.?" పడుతూ లేస్తూ శుద్ధోధనుడక్కడికి వచ్చాడు. పెద్దకోడలంటే గౌరవం. చిన్నకోడలంటే ప్రేమ, కొంచెం భయం. ముక్కుసూటిగా మాట్లాడుతుందని అనేక సందర్భాల్లో ఆమెను ప్రశంసించాడు.

ఆయన్ను చూడగానే ముగ్గురు స్త్రీలూ కొంగులు తలమీదకి లాక్కున్నారు. కోడళ్ళిద్దరూ ఆయన పాదాలు తాకి ఆశీస్సులందుకున్నారు.

"ఆ.. ఇప్పుడు చెప్పండి ఏం మాట్లాడుతున్నారు.?" అన్నాడు ఆసనంలో కూర్చుంటూ.

"మీరు చెప్పండి మావయ్యా - నా వాదనలో ఏమయినా అసహజత్వముందేమో. అందరూ భిక్షకులే అయితే భిక్షవేసేవారు ఎవరు? భగవంతుడంతటివాడు సారదిగా ఉండి యుదం చేయలేదా. మనిషి తనకు నిరేశించిన కర్మ తాను చేయకపోతే ఆత్మద్రోహం.

సంఘద్రోహం అవుతుంది. రాజులు పరిపాలనం, బ్రాహ్మణులు ధర్మాచరణం. వర్తకులు వ్యాపారం మిగిలిన వృత్తులవారు వారి వారి పనులని చేయటం సమాజానికి సమతూకం. వీరందరూ వారి పనులు విడిచి సన్యాసం స్వీకరిస్తే సమాజం తిరగబడుతుంది. అస్తవ్యస్తమైన జీవన విధానం ఏర్పడితే ఎలా ఉంటుందో ఆలోచించండి."

"ఇంతకీ నీ ఉద్దేశ్యం సుందరీ గౌతముడి వాదాన్ని కాదంటున్నావా?"

"పూర్తిగా కాదనటంలేదు. మహోన్నతమైన మానవత్వాన్ని మేలుకొలిపి వర్గరాహిత్యమైన సమసమాజ స్థాపనకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయం అదెవరూ చేయలేరు కూడా. కానీ దానికోసం ఆచరిస్తున్న విధానంలోనే కొంత లోపం కనబడుతున్నది. ముక్కుపచ్చలారని పసిబిడ్డలు ఎవరికి వారు తమ లౌకిక బాధ్యతలను విడచి పెడితే ఆయననుకున్నట్లు శోకరాహిత్యం కాదు, శోక భూయిష్టమైన సమాజమే ఉంటుంది. ఈ రాజ్యానికి రాజై శాక్యవంశాన్ని నిలబెట్టాల్సిన రాహులుడు సంఘంలో చేరితే వివాహం లేకుండా శాక్యవంశాన్ని నిర్వంశం చేస్తాడు. రాజ్యాన్ని విడిచి శత్రువుల పరం చేస్తాడు. ఇది తలచుకుంటేనే నా గుండెలు బద్దలయిపోతున్నాయి. " ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి అక్కడున్న వారందరి కళ్ళవెంట నీళ్ళు.

"అమ్మా, నీ మాటల్లో నిజంలేకపోలేదు. గౌతముడు నా కొడుకుగా చెప్పటం లేదు. అతని నూతన ధర్మంలో ఒక గొప్పతనముందు. హింసావాదానికి అక్కడ చోటేలేదు. యుద్ధమంటూ వస్తేనే రాజులు రాజ్యరక్షణ చేయాలి. అసలు యుద్ధమే లేకపోతే. అధికారమదోన్మత్తతతో యుద్ధాలు పేరిట లక్షలాదిమంది మనుష్యులను బలిపెట్టడం. ప్రజల్లో అశాంతి, అభద్రత. పోగొట్టుకున్నవాళ్ళకోసం బ్రతికున్నవాళ్ళు శవాలుగా మారటం. ఆహారపు కొరత ఇదంతా యుద్ధం వలనే కదా. అందుకే ఎల్లలు చెరిపి సరిహద్దులు తుడిచి ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టపరిచే సమాజాన్ని అతడు సృష్టిస్తున్నాడు. ఇప్పటికే మగధ, కోసల దేశాల చక్రవర్తులు గౌతముడి సిద్ధాంతాన్ని అంగీకరించారు. మనతో సమానమయిన వైశాలి, వారణాసి - శ్రావస్తి చిన్న రాజ్యాలు కూడా బుద్ధుడిని శరణుజొచ్చాయి. ఇంక మన నగరమే వెనుకబడి ఉంది. అంతరాలు మనిషిలో అహంకారాన్ని పెంచి పాపం వైపు మళ్ళిస్తుంది. సమానత్వం మనిషిని - మనిషిని దగ్గరచేస్తుంది. పగ - క్రోధం - ద్వేషం ఇవి తొలిగినప్పుడు హింసకు తావేలేదు. నిజమైన శాంతిసందేశం మానవాళికి అందినప్పుడు భూమి స్వర్గమవుతుంది. అదే నా బిడ్డ చేస్తునన్ వ్యవసాయం. అతడు చల్లే ధర్మవిత్తనాలు పంటగా మారినప్పుడు ఈ భూమి వెలలేని జాతిరత్నాలనందుకుంటుంది. ఇప్పటికే మన నగరమంతా సంచలనంగా ఉంది. ఎంతోమంది ధర్మదీక్షలు తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నారు. మన కుటుంబం వెనకాడటం మనకు అగౌరవం కాదా తల్లీ.!?"

"మీ వాదనను నేను కాదనటం లేదు మామగారూ. నా బాధను అర్ధం చేసుకోండి. నూతన సిద్ధాంతంలోని లోపం. విమర్శకు దారితీస్తుంది. ఎన్నోసార్లు మీరు రాజయోగాన్ని గురించి నాకు చెప్పారు - జనకుడు - వశిష్టుడు ఎంతోమంది గృహస్తులగానే ఉండి ఆత్మనిగ్రహంతో రాజ్యపాలనం చేయలేదా - వారికొచ్చిన లోటేముంది. భార్యభర్తలు విడిపోయి బ్రతకమని ఏ ధర్మం చెబుతుంది. ఆశ్రమధర్మాలన్ని ఉత్తమ మార్గాలే - అది సక్రమంగా నిర్వహించబడితే నాలుగుపాదాల్లోసమాజం సమానంగా నడుస్తుంది. కానినాడు విపరీతాలే. మొదట మనం అర్ధం చేసుకోవాల్సింది మనిషి మనస్తత్వాన్ని. అది ఎప్పుడూ మార్పులు కోరుతూనే ఉంటుంది. కొన్నాళ్ళ తర్వాత బావగారు విమర్శలు ఎదుర్కోకూడదనే నా బాధ. ఏ సిద్ధాంతమైనా కొన్నాళ్ళే నిలబెట్టగలదు. తర్వాత దానిమీద ఆసక్తి తగ్గిపోయి సంవత్సరాలుగా సాగిస్తున సృష్టిధర్మానికి కట్టుబడతాడు. ఇది ప్రకృతి సహజం. మిమ్మల్ని నొప్పించినందుకు క్షమించండి."

"నా భావాలు నావి - నావేదననాది. బాబూ - రాహూ! జాగ్రత్త నాయనా - అక్కా మీ పరిస్థితిని నేను ముందే ఊహించగలిగాను. కనీసం మీకు మీరు న్యాయం చేసుకోకపోయినా మీ బిడ్డకయినా న్యాయం చెయ్యండి. శాక్యవంశం ఇంతటితో ఆగిపోకూడదు వస్తాను. " కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ కదిలిపోతున్న దీపకాంతిలా వెళ్ళిపోయింది. సుందరి వెళ్ళిన చాలాసేపటివరకు

వారి వారి ఆలోచనల్లో ఆ నలుగురు అక్కడే కూర్చున్నారు మాటలేమీ లేకుండా ఆమె ప్రభావం వారిమీద పడిందనటానికి గుర్తుగా. యశోధర వేదనేమిటో ఆమెకొక్కదానికే తెలుసు. అంతగుంభనగా మనస్సును దాచుకోగలిగింది.

************

(5)

**అనుకున్న ప్రకారం మూడురోజుల** తర్వాత తమకోసం కేటాయించబడ్డ చేతకవనానికి బుద్ధుడు తన నివాసాన్ని మార్చాడు. అక్కడ రెల్లుగడ్డితో చక్కటి గోడలతో ప్రత్యేకంగా నిర్మించబడ్డ కుటీరాలు శిష్యులకు, తనకు స్వాగతం చెప్పాయి. గంధకుటీరం గౌతముడిది. శీతోష్ణాలను నివారించే సదుపాయాలతో అవి నిర్మించబడ్డాయి - వందల ఎకరాల్లో నానావిధ ఫలపుష్పజాతులతో నిర్మలమైన నీళ్ళు నిండిన సరోవరాలతో అనేక రకాల పక్షులు, లేళ్ళు, నెమళ్ళతో అద్భుతమైన చేతకవన సౌందర్యం కళ్ళు చెదిరేటట్లున్నది. పక్కనే ఉన్న హిమాలయాలనుండి శివుడు తన ప్రమధగణంతో కదలివచ్చి అక్కడ నివాసం ఏర్పరచుకున్నట్లున్నది.

యధావిధిగా తధాగతుని కార్యక్రమాలు జరిగిపోతున్నాయి. వేకువఝామున చన్నీళ్ళ స్నానం ఆ పై ధ్యానం - యోగం - శిష్యులకు బోధలు - ఏడిండ్లకు భిక్షాటనం సాయంత్రంపూట గ్రామాలకు వెళ్ళటం దైనందిన కార్యక్రమాలుగా మారాయి. గౌతముడు శిష్యుడికి మాటిచ్చిన ప్రకారం మరొక్కసారి ఆశ్రమంలో స్త్రీలకు దీక్ష ఇచ్చే విషయమ్మై చర్చ జరిగింది. రకరకాలుగా అభిప్రాయాలు వెలిబుచ్చారు. అనేక నగరాలనుండి రాజవంశస్తులు ధనవంతులు బౌద్ధమతంలో చేరుతూనే ఉన్నారు. వారందరికీ బుద్ధుడికి అత్యంత ప్రీతిపాత్రుడు ఆనందుడు. అతడి ఇంద్రియ నిగ్రహం - కుశాగ్రబుద్ధి గురుభక్తి గురువునెక్కువ ఆకర్షించాయి. ఆనందుడి తల్లి మరికొంతమంది భార్యలు తమను కూడా సంఘంలో చేర్చుకొమ్మని అర్థిస్తున్నారు. ఇంకా బుద్ధుడే ఏ నిర్ణయానికి రాలేకపోతున్నాడు.

ఈ పరిస్థితుల్లో ఒకరోజు ఎండ తీక్షణంగా ఉన్న సమయంలో ఏనాడూ బయట ముఖం ఎరుగని సుకుమారి యశోధర, అత్త గౌతమితోను వందలాదిమంది స్త్రీలతో కలసి పాదచారులై నదీతీరానికి వెళ్ళారు. కొన్ని గంటలు వారు ఎండలోనే బుద్ధుడి దర్శనం కోసం పడిగాపులు కాచారు. మండే ఎండకు కాళ్ళు, తల మండిపోతున్నా పట్టుదలగా నిలబడ్డారు. చివరకు బుద్ధదర్శనమైంది. మేఘాన్ని చూసిన చాతకంలా అయింది యశోధర మనసు - ఆ గుంపుకు ఆమే నాయకురాలు. వారు మొరపెట్టుకున్నదేమంటే

"స్వామీ! సమాజనిర్మాణానికి స్త్రీలెంత ప్రధాన భూమికో - సమాజసేవకు వారిసేవలు అంతే అవసరం. అంతరంగాల సరిహద్దుల్ని వైరుధ్యాల అడ్డుగోడల్ని చెరిపేస్తున్న మీరు స్త్రీ వివక్షత చూపించటం ధర్మం కాదు - మీకంటే ఎక్కువ కర్తవ్యనిష్ఠను కొనసాగించటానికి మేము సిద్ధంగా ఉన్నాం. మాకూ అవకాశమిచ్చి చూడండి."

అంతమంది స్త్రీలు ఒకేసారి రావటం దానికి యశోధర నాయకత్వం గౌతముడు కొంచెం ఇబ్బందిలో పడ్డాడు. " తప్పనిసరిగా రెండురోజుల్లో తన నిర్ణయాన్ని తెలియజేస్తాన" ని ప్రస్తుతానికి వెళ్ళిరమ్మని వినయంగా చెప్పాడు.

స్త్రీలందరూ వెనక్కు తిరిగారు. యశోధర వెళ్ళబోతూ ఒక్కమాటన్నది.

" మీరు మా పట్ల సరైన నిర్ణయం తీసుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం. అంతకు మించి మార్గం లేదు. " అని హెచ్చరించి వెళ్ళిపోయింది.

మొత్తానికి రెండురోజులు తీవ్రంగా ఆలోచించి అందరి సలహా మీద బుద్ధుడు ఒక నిర్ణయానికి రాగలిగాడు. దానికి ఒక తీర్మానం తయారుచేసారు. అతి కఠినమైన నియమాలు అందులో చేర్చబడాయి.

1. స్త్రీలు ప్రత్యేక సంఘంలో ఉండాలి.

2. వారు పురుష సంఘాలకు వెళ్ళినా పగటిపూట మాత్రమే వెళ్ళి తిరిగి నివాసానికి వెళ్ళిపోవాలి.

3. బ్రహ్మచర్యదీక్షను కఠినంగా అమలుపరచాలి.

4. బుద్ధధర్మాన్ని ప్రచారం చేయాలి.

భిక్షకు వెళ్ళటాన్ని స్త్రీలకు నిషేధించారు. వారికున్న ఆస్తిపాస్తులు సంఘపరం చేసి దానితో జీవితం గడపవచ్చు.

ధర్మానికి విరుద్ధంగా నడచినవారిని వెంటనే బహిష్కరించే హక్కు సంఘానికుంది.

ఇటువంటి నిర్ణయాలతో బౌద్ధసంఘం స్త్రీల ప్రవేశాన్ని ఆమోదించారు.

ఆ విషయం తెలిసి యశోధర పొంగిపోయింది. వచ్చే పౌర్ణమినాటికి అందరికీ దీక్షలివ్వాలనే నిర్ణయం జరిగింది. మధ్యలో ఒక్కసారి గౌతముడు శ్రావస్తి నగరం వెళ్ళి రెండురోజులున్నాడు. ఆయన వచ్చారని తెలిసి అక్కడంతా పండగలు చేసుకున్నారు. అనేకమంది దీక్షలు తీసుకున్నారు. పౌర్ణమినాటికి కపిలవస్తుపురం రావటానికి ఆయన అనుమతి పొందారు.

ఇక్కడ కూడా ఆ వార్త పెద్ద సంచలనాన్ని తెచ్చింది. అందరికంటే ఎక్కువ యశోధర ఆనందపడుతున్నది. ఏ విధంగానయితేనేం తన మార్గాన్ని అనుసరించటానికి ఒప్పుకున్నారు. సంసారమయినా సన్యాసమయినా ఆయన మార్గమే కోరుకున్నది. అది ఈరోజు నెరవేరబోతున్నది. ఎంతో ఆనందంతో తన నగలన్నీ దానధర్మాలు చేసింది. ఎన్నో కోట్ల వరహాలు భిక్షుకుల ఆరామాలకు దానంగా ఇచ్చివేసింది. వస్త్రదానం, వస్తుదానం ఒకటేమిటి సర్వం దానసమర్పణం.

బుద్ధుడు పుట్టిన జన్మస్థలంలో దీక్షాస్వీకారం పెద్ద ఎత్తున జరుగుతున్నదన్న వార్త సరిహద్దుదేశాలకు చేరిపోయింది. ముఖ్యంగా స్త్రీలు కూడా తీసుకుంటున్నారనేది సంచలనమైంది. పౌర్ణమినాటికి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నట్లు శిష్యులంతా తిరుగు సందేశం పంపించారు -

చీకటి పొరను ఛేదించుకుంటూ ఉదయకిరణాలు నాలుగు దిక్కులా పరుచుకుంటున్నాయి. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, కళ్ళు నులుముకుంటూ అప్పుడే నిద్రలేస్తున్నది కపిలవస్తుపురం. రాజభవనంలో మంగళవాద్యాలు వినిపిస్తున్నాయి.

అప్పటికే స్నానం పూర్తిచేసుకుని సూర్యదేవుడికి అర్ఘ్యమిస్తున్నారు సుందరీ, నందులు.

**"అదిదేవనమస్తుభ్యం భాస్కరా**

**దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే**

**సప్తాశ్వరథ మారూఢం ప్రచండం కశ్యపాత్మజం**

**శ్వేత పద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహం"**

ధవళ వస్త్రాల్లో దేవతామూర్తుల్లా మెరిసిపోతున్నారు. చిగురాకు బాకు ధరించిన మన్మధునకు పూలవింటిలా సుందరి అందం ఒకరికోసం ఒకరు పుట్టినట్లున్నారు. సంతోషశుభాలు కూడినట్లు ఉత్సాహవిజయాలు పెనవేసినట్లు, పుష్పానికి పరిమళం తోడైనట్లు ఒకరికొకరు, ఒకరిని మిచి మరొకరు రెండు కళ్ళు చాలవు, వారిని చూడటానికి.

"ఈరోజు అలంకరణ నేను చేయనా?"

పొడువాటి ఆమె కురులను తన చేతిలోకి తీసుకున్నాడు.

"ఏమిటో ఆర్యపుత్రులు అంత సంతోషంగా ఉన్నారు" వాలుగా చూసింది సుందరి.

" సంతోషం కాక ఏమిటి నా ఎదురుగా అప్సరస నిలబడి ఉంటే. "

"పొగడ్తలు చాలుకాని, ఏం అలంకరిస్తారో చెప్పండి"

"నాకు తెలియందేముంది. చిన్నతనంలో మా అమ్మకు కురులు దువ్వి జడవేసేవాణ్ణి తెలుసా?"

"నాకు తెలియదా తమరి చాతుర్యం - కురులు ముడవాలి. తిలకం దిద్దాలి. చందన లేపం అద్దాలి. చెక్కిళ్ళపై మకరికా పత్రాలు రచించాలి. కాళ్ళకు పారాణి అందంగా అద్దాలి - వీటన్నిటిలో మీరేం చెయ్యగలరు?"

"అన్నీ చేస్తాను. చూడు. నీ ఇష్టసఖి మాలిక కంటే నేనే బాగా అలంకరిస్తాను సిద్ధమేనా?"

"ఓ - నేను సిద్ధమే" అద్దం ముందు కూర్చుంది సుందరి. దర్పణం చిన్నదవటంతో ఆమె అందాన్ని పూర్తిగా చూపలేకపోతున్నది - ఆ రూపం ముగ్ధమనోహరంగా కనిపించింది. ఆ రూపాన్ని చూస్తూ చిలిపిగా అద్దాన్ని తుడుస్తున్నట్లు నటిస్తూ నోటితో పూత్కారం చేసాడు. దర్పణంలో సుందరి ముఖం అదృశ్యమయింది. పూర్తిగా మసకబారిన అద్దాన్ని చూస్తూ - ఆమె కృత్రిమ కోపంతో -

"ధూర్తుడా! నీకు చాలా అసూయ. మెరుస్తున్న ప్రతిబింబాన్ని మసకవారజేసావు. అలంకరిస్తానని చెప్పి అలక తెప్పించావు. నీతో మాట్లాడితే ఒట్టు" పైకి బింకాన్ని ప్రదర్శించింది.

"సుందరీ! పరిహాసానికి చేసినా అంతకోపమెందుకు అసలు బింబం ఇదుగో దోసిట్లో పదహారు కళలతో వెలిగిపోతున్నది చూడు" ఆమె ముఖాన్ని రెండుచేతుల్లో బంధించాడు.

"నన్ను తాకకు. నీ వికార చర్యల్ని నేను సమర్ధించలేను. అందమైన ఉదయకాలాన్ని నీ కుచేష్టలతో పాడుచేసావు" విసురుగా వెళ్ళి ఆసనం మీద కూర్చుంది. బిగించుకున్న పెదవులు నవ్వుతున్న కళ్ళు. నందుడిదేమీ గమనించటంలేదు. ఆమెకు నిజంగానే కోపం వచ్చిందని భయపడ్డాడు.

"ఏమిటి సుందరీ పరిహాసం చేసినా కోపమయితే ఎలా? పోనీ ఈ దాసుడి తప్పులు మన్నించు. లేదా దండించు" వెళ్ళి ఆమె పాదాల దగ్గర కూర్చున్నాడు. లేత తమలపాకులాంటి ఆ పాదాలను తన ఒళ్ళో పెట్టుకుని తన తల ఆమె ఒళ్ళో పెట్టాడు. సుందరి కోపంతో త్రోసేసింది. అతడు పట్టుకోసం ఆమె నడుమును చేతులతో బంధించాడు.

"ఊఁ ఇప్పుడు శిక్షించు ప్రియా - ఇంత ఉదయమే నీ మనసును నొప్పించాను. నిజంగా నేను మూర్ఖుడిని. ఏం చెయ్యాలో, చెయ్యకూడదో తెలియని మొరటువాడిని. సుకుమారివి సున్నితమైన నీ మనస్సు ఎంతగా నొచ్చుకుందో కీల్జడలతో నన్ను పరిహరించు. కర్ణికాలంకారంతో దండించు. నీ శిక్షకు నేను సిద్ధం. కానీ నీ కోపాగ్ని ఒక్క ఘడియ ఓర్చలేను. ఊహలోకూడా నీకు దూరమై జీవించలేను. రా చెలీ నన్నాదరించు. నాపై వలపు కురిపించు" అతడు కౌగిలిని మరింత బిగించాడు.

అతని దైన్యవదనం చూసి ఆమెలో ప్రేమ - జాలి కట్టలు తెంచుకున్నాయి. తట్టుకోలేని ఉద్వేగంతో భర్తను గట్టిగా కౌగిలించుకుంది. ఆమె కురులు నల్లటి వస్త్రంలా ఇద్దరి శరీరాల్ని కప్పేసాయి.

"నన్ను క్షమించండి. మిమ్మల్నింతగా నొప్పించాను. నా కోపం పరిహాసానికే. ఇష్టమైన ప్రియుడి కొంటె చేష్టలకెవ్వరానందించరు. అంత రసజ్ఞత లేనిదాన్నా. అంతులేని మీ ప్రేమ సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా ఏలాలని మీ లాలనలో అనుక్షణం కరిగిపోవాలనే ఈ అల్పహృదయాన్ని ఎట్లు మన్నిస్తారో" అని హృదయం మీద పూలకొమ్మలా వాలిపోయిన లలితాంగిని అక్కున చేర్చి చెక్కిలి తుడిచి ఫాలమున ముద్దిడుకున్నాడు.

"దేవీ! రోష మేఘాల మాటునుండి బయటకు వచ్చిన నీ ముఖ చంద్రుడెంత అందంగా ఉన్నాడో చూడు - ఒకసారి అద్దంలో చూసుకో" అని అద్దాన్ని ఉత్తరీయంతో శుభ్రంగా తుడిచి ఇచ్చాడు. ఆమె అద్దం చూసి ముసిముసిగా నవ్వింది. ఆ నవ్వులో తడిసి నందుడు ఆనందంలో తేలిపోయాడు.

"చూడు దేవీ! ఎలా అలంకరిస్తానో - అలంకరణా నైపుణ్యం చూసి తప్పకుండా బహుమతి ఇస్తావు." తిలకం గిన్నె చేతిలోకి తీసుకున్నాడు. కానీ అది ఎండిపోయికనిపించింది. వెంటనే మాలికను పిలిచాడు.

"పిలిచారా యువరాజా?"

"అవును. ఈ గిన్నె తడిపి తీసుకురా"

క్షణంలో ఆమె తడిపిన తిలకాన్ని అతనికిచ్చి వెళ్ళిపోయింది.

"ఏది నీ అందమైన ముఖం నా వైపు తిప్పు" గిన్నెలో తిలకాన్ని బాగా కలుపుతూ అన్నాడు.

ఇంతలో వారిని బయట ఎవరో పిలిచినట్లయింది. అతడు గిన్నెను పక్కన పెట్టి తలుపు తెరిచాడు.

"ప్రభూ! మీకోసం విశాఖదత్తుడు వచ్చారు"

"ప్రధానామాత్యులా - ఇంత ప్రొద్దున్నే ఏమిటంత అత్యవసరం?"

"ఏమో! తమతోనే శలవిస్తారట."

"సరే! సమావేశమందిరంలో కూర్చోబెట్టండి"

ఇప్పుడే వస్తాను.

"దేవీ! విశాఖదత్తుడుగారు వచ్చారట అత్యవసరంగా మాట్లాడాలని. ఏమిటో మాట్లాడి వస్తాను"

"మంచిది" ఆమె ముక్తసరిగా సమాధానమిచ్చింది. నందుడు వెళ్ళిపోయాడు. సుందరి మనసులో అలజడి రేగింది. సరిగ్గా తిలకం దిద్దబోయే ముందు ఈ అడ్డంకి బహుశా మళ్ళీ ఇది దిద్దలేకపోతే. ఛ మనస్సింత బలహీనమవుతుందేమిటి. గౌతముడి నగరప్రవేశం నుండి అన్నీ శంకలే. మనస్సుకు విశ్రాంతిలేకుండా పోయింది.

క్రితం రోజు వార్త ఆమె చెవిదాకా వచ్చింది. ఆడవాళ్ళక్కూడా దీక్షలివ్వటానికి బుద్ధుడనుమతించాడట - అంతఃపురంలో అందరూ దీక్ష తీసుకోవటానికి సిద్ధంగా ఉన్నారట - లోపల్లోపల బాధ గుండెను పిండేస్తున్నది. తన మాటలు, వేదన వాళ్ళనేమాత్రం మార్చలేకపోయాయి. కుటుంబ వ్యవస్థ చెల్లాచెదురుకాబోతున్నది. సున్నిత మనస్కుడైన తన భర్తమీద ఇదెంత వరకు ప్రభావం చూపిస్తుందో. ఇప్పుడు తాను చెయ్యాల్సిందేమిటి? ఆలోచనల్లో సమయం చాలా గడచిపోయింది. రెండు మూడుసార్లు పరిచారికలు వచ్చారు కానీ పలకరించే సాహసం చేయలేకపోయారు.

"ఇప్పుడే వస్తానన్న నందుడు రాలేదు. భోజనాల సమయం దాటిపోతున్నది. పరిచారికల ద్వారా తెలిసిందేమంటే నందుడు శుద్ధోదనుని మందిరానికి వెళ్ళాడని. అక్కడ కుటుంబమంతా సమావేశమయ్యారని. మరి తనెందుకు పిలవలేదు. బహుశా స్త్రీలకు పిలుపులేదేమో అని సరిపెట్టుకున్నది. ఇంత సమయం చర్చలేమై ఉంటాయి. నందుడ్ని కూడా దీక్ష తీసుకొమ్మని ఒత్తిడి తెస్తున్నారేమో"

అలా అనుకోగానే ఆమె గుండె ఝల్లుమంది. ఒక్క క్షణం శరీరం ఒణికిపోయింది. ఆ ఆలోచనే దుస్సాహంగా అనిపించింది. అయినా అతడటువంటి పనికి అంగీకరించడు. తనకు తెలుసు. తన ప్రేమ సామ్రాజ్యం దాటి ఒక్కడుగు కూడా వేయలేడు.

ఏమయినా తనకిది పరీక్షాసమయం. తన సిద్ధాంతానికి గౌతముడి సిద్ధాంతానికి జరగబోతున్న సంఘర్షణలో ప్రథమాధ్యాయం మొదలైంది. అందరిముందు తాను బయటపడింది కనుక. కనీసం తన భర్తను ఆ మార్గం నుండి తప్పించటానికి ఎంత సాహసానికైనా పూనుకోవాలి. తప్పదు. ఆయనేకాదు. నగరంలో అనేక కుటుంబాలను నదీతీరం నుండి దృష్టి మళ్ళించాలి. అందుకు ఏం చేయాలి. మధ్యలో మాలిక రెండుసార్లు వచ్చి భోజనం చెయ్యమని బ్రతిమాలింది. కానీ సుందరి తిరస్కరించింది.

ఉదయం నందుడు వెళ్ళే ముందు ఏ స్థితిలో ఉందో ఇప్పుడు అలాగే ఉంది. తిలకం గిన్నె మరోసారి ఎండిపోయింది. అయినా ఇవేవీ గమనించడంలేదు. బుద్ధుడి బారినుండి భర్తను తన వాదాన్నెలా కాపాడుకోవాలనే ఆలోచనలో నలిగిపోతున్న మనస్సు. చివరికో ఉపాయం తళుక్కుమని మెరిసింది.

"అవును. అదే సరైన మార్గం. ఇన్ని సంవత్సరాలుగా వస్తున్న శాక్యరాజుల సంప్రదాయాన్ని నిలబెట్టనూవచ్చు. చాలామంది మనసు పరివ్రాజకం వైపు మళ్ళకుండానూ చేయవచ్చు."

ఈ ఆలోచన వచ్చాక ఆమె మనసు స్థిమితపడింది.

ఎక్కడలేని ఉత్సాహంతో మనసు తేలిపోయింది. వెంటనే లేచి కురులను తనకు తానే స్వయంగా ముడుచుకుంది. విశాలమైన ఫాలభాగాన్ని భర్తకోసమే విడిచిపెట్టినట్లు కనిపించీ కనిపించని చిన్న బొట్టు దిద్దుకుంది. రోజులు లెక్కించి చూసుకుంది. ఇంకా పదిరోజులే వ్యవధి ఉంది. చాలు అనుకున్న కార్యక్రమం చేయటానికి. ఈ సమయంలో తాను జాగ్రత్తగా వ్యవహరించాలి. మరింత ప్రేమతో భర్తను ఆకట్టుకోవాలి. రేపు చేయబోయే కార్యక్రమాన్ని ఎలాగయినా ఒప్పించాలి నిజంగా అది సాహసమే. తాను గెలిస్తే ఫర్వాలేదు. కాకపోతే.. ఆ పైన ఆలోచించలేకపోయింది. ఆహారంగా పాలుపండ్లు తీసుకుని శయనమందిరానికి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి చాలా సమయం గడిచాక తిరిగి వచ్చిన నందుడిలో ఉత్సాహం లేదు. అన్యమనస్కంగా ఉన్నాడు. అతని కళ్ళలో చెప్పలేని భయాందోళనలు కనిపిస్తున్నాయి. తనకోసం ఎదురుచూసి ఎదురు చూసి నిద్రపోయిన భార్యముఖం చూస్తూ కూర్చున్నాడు. మౌలిక భోజనానికి పిలవటానికి వస్తే వద్దని - శబ్దం చేయకుండా వెళ్ళిపొమ్మని సైగతో చెప్పాడు. సుందరి ఆహారం తీసుకోలేదని మాలిక సైగతో చెప్పింది. మనసులో ఏదో తప్పు చేసిన భావన - ప్రశాంతంగా ఉండనీయటంలేదు. బోసిగా ఉన్న ఆమె పాలభాగాన్ని చూస్తుంటే అపరాధభావన మరింత పెరుగుతున్నది. మసకబారిన వెలుతురులో ఆమె చెక్కిళ్ళు తెల్లగా మెరుస్తున్నాయి. దూరంగా తోటనుండి అస్పష్టంగా హంసల శబ్దాలు. ప్రియురాలు కనిపించక ఆర్తిగా అరుస్తున్న చక్రవాకం పిలుపు.

మొదటిసారిగా ఒక వైవిధ్యమైన మార్పు తనలో చోటుచేసుకుంది. ఆమెకు తెలియకుండా తాను గాలికూడా పీల్చి ఎరుగడు. కానీ ఈ రోజంతా ఆమెకిష్టంలేని పనులే చేసాడు. చిన్న మసకకే ఎంతో బాధపడింది. కానీ తన మనస్సులో ఇంత పెద్దగా ఆవరించుకున్న ఈ మసకను చూస్తే -

ఉదయం నుండి తండ్రిగారి భవనంలో చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎంతోమంది రాజకుమారులు అన్ని ప్రాంతాలనుండి వచ్చారు. అక్కడ ఒకటే హడావిడిగా ఉంది. సారనాథ్ నుండి గౌతముని ప్రధాన శిష్యులంతా వచ్చారు. పౌర్ణమినాటికి తీసుకునే దీక్షల్లో తనను కూడా తీసుకోమని వత్తిడి తెచ్చారు - వారు చెప్పిన మాటలు వింటుంటే ఆ క్షణమే దీక్ష తీసుకోవాలని అనిపించింది - వారంతా ఎంత ఆనందంగా ఉన్నారు. కానీ ఆ సమయంలో కూడా భార్యముఖమే గుర్తుకు వచ్చింది. ఆలోచించి చెబుతానని తిరిగి వచ్చాడు. కానీ ఇక్కడ ఏదో వెలితిగా అనిపిస్తున్నది. తన రెండు సంవత్సరాల వైవాహిక జీవితంలో ఏదో అపశ్రుతి చోటు చేసుకున్నట్లనిపించింది. తమ అనుబంధం ప్రేమ, విడిచివెళ్ళటం సాధ్యమా? కానీ కుటుంబమంతా దీక్ష తీసుకుంటున్నారు. ఎండకన్నెరుగని మహాఇల్లాలు ఒదినగారు నాలుగ్గంటలు ఎండలో నిలబడి అన్నగారిని ఒప్పించారట స్త్రీలకవకాశం కల్పించమని. అందరూ ఒకదారి, తామిద్దరే వేరుదారి లోకం ఏమంటుందో?

"పౌర్ణమినాటికి గడువు నిర్ణయించారట అన్నగారు ఈలోపు నిర్ణయించేసుకోమని నాన్నగారు చెప్పారు"

అక్కడున్న వాళ్ళంతా పెద్ద వంశాలనుండి వచ్చినవాళ్ళే. తనకంటే వయసులో చిన్నవాళ్ళు రాజ్యాన్ని వదిలివచ్చినవాళ్ళు, ముక్కుపచ్చలారని బాలురు ఉన్నారు. భార్యలను విడిచిపెట్టి వచ్చిన వారున్నారు. ఇంతమంది కంటే తానేం ఎక్కువ.

భోగం కంటే త్యాగం రాగం కటే విరాగం గొప్పవి కాని మనసును సంసారబంధనాల నుండి తెంచుకోవటం సాధ్యమా. ఏం చెయ్యాలి? తన మనస్సు పరివ్రాజకం వైపు ఆకర్షించబడుతున్నదా!

ఈ సమయంలో ఈ మసక వెలుగులో ఆమె సౌందర్యం కూడా గొప్పగా అనిపించటంలేదు. బోసిగా ఉన్న ముఖం నిర్జనమైన ప్రదేశంలా భయపెడుతున్నది. అస్పష్టమైన దీపపుకాంతిలో గదిలో వస్తువుల నీడలు భీతి గొలుపుతున్నాయి. ఒకటి రెండు సార్లు వత్తికొడిగడితే సరిచేసాడు.

ఒక్కరోజులో ఇంత మార్పా! తన కర్థంకాని మనిషి తనలో దాక్కున్నాడు. అతనిరూపం కొంచెం అర్థమయితేనే ఇంత ఆందోళనగా ఉంది. అసలు పూర్తి స్వరూపమేమిటో ఈ భయాలు ఆమె ముందు పెడితే ఎగతాళి చేస్తుంది. మీ కన్నీ అనవసరమైన ఆలోచనలని కొట్టిపారేస్తుంది. కానీ ఏదో జరగబోతోంది. ఇది నిజం.

ఆ రాత్రంతా నిద్రలేకుండానే తెల్లవారింది. లోపలి ఆలోచనల్లాగే కళ్ళుమండుతున్నాయి. సుందరి నిద్రలేచింది ఇద్దరూ మాట్లాడుకోలేదు. పలకరించాలంటే నందుడికి జంకు, సుందరికి బెట్టు – ఆ పగలంతా ఎడమొహం పెడమొహంగానే ఉన్నారు. వివాహమయ్యాక ప్రణయకలహాలు తప్ప, బయటి విషయంగా మాట్లాడుకోకుండా ఉండటం ఇదే ప్రథమం.

రోజు రోజుకీ బుద్ధుడి బోధలు ప్రజల మనసుల్లో బాగా నాటుకుంటున్నాయి. నగరంలోనే కాదు చుట్టుపక్కల గ్రామాలక్కూడా వెళ్తున్నాడు. తన దివ్య సందేశంతో వారిని ప్రభావితుల్ని చేస్తున్నాడు. అస్పృశ్యకోరల్లో చిక్కి అల్లాడుతున్న అట్టడుగు వర్గాలను చేరదీసి వాళ్ళ కష్టసుఖాలు విచారిస్తున్నాడు. ఎవరేం పెట్టినా ఆప్యాయంగా తింటూ తన అంతస్తును మరిచి అందరిలో ఒకరిగా కలిసిపోయిన గౌతముని సిద్ధాంతానికి అందరూ ఆకర్షించబడుతున్నారు. ముఖ్యంగా మూఢనమ్మకాలు సోదాహరణంగా అబద్ధాలని రుజువు చేస్తూ రోజురోజుకీ పామరుల్ని కూడా తన దారికి తెచ్చుకుంటున్నాడు. అతడు సామాన్యుడు కాడు. భగవంతుడనే ప్రచారం జరుగుతున్నది. ఇంకా కొంతమంది ఆయనకు మహిమలు ఉన్నాయంట. ఆ చేత్తో తాకితే ఎంతరోగమయినా పోతుందని ప్రచారం వచ్చింది. రవ్వపడ్డప్పుడు రగులుకోవటమే ఆలస్యం – దానికి గాలితోడై అన్ని వర్గాలవారు భగవంతుడిగా కీర్తిస్తుంటే కిట్టనివాళ్ళు దొంగసన్యాసి – ప్రజల్ని మోసం చెయ్యటానికే ఈ వేషం. అని వాళ్ళూ ప్రచారం చేస్తున్నారు.

ముఖ్యంగా వైదికులు అతడు నాస్తికుడని, అతని బోధనలు వింటే పితృదేవతలకు దిక్కులేకుండా పోతుందని దేవతలు ఆగ్రహిస్తారని కరువుకాటకాలు – అకాల మృత్యువులు వస్తాయని వదంతులు పుట్టించారు ప్రజల్లో. ఆయన్ని చులకన చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆ గుంపుకు నాయకుడు దేవదత్తుడు. ఒకప్పుడు హంసను బాణంతో కొట్టి గౌతముడి కరుణవలన అది బయటపడిన దగ్గరనుండి అకారణంగా కక్షపెంచుకున్నాడు. అతడు కూడా శుద్ధోధనుడి కుమారుడే గౌతముడి సోదరుడే అయినప్పటికీ మనస్తత్వాలు భిన్నరకాలు. అగ్నికి ఆజ్యంలాగా యజ్ఞకాండలను నిరసించటం ప్రధాన పోషకులైన రాజులు, ధనవంతులు ఆ మార్గాన్నే అనుసరిస్తున్నారు. ఇది పురోహితులకు మరింత బాధయింది. దాన్నడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యం చేస్తున్న వాళ్ళ అధికారాలకు చెల్లని కాలమొచ్చింది. శత్రువుకు శత్రువు మిత్రుడన్న సామెతగా దేవదత్తుడితో చేతులు కలిపారు. బింబిసారుడి కుమారుడు అజాతశత్రువు. అతడు దేవదత్తుడికి ప్రాణస్నేహితుడు.

గౌతముడి మీద లేనిపోనివి చెప్పి అతని మనస్సు మార్చారు బుత్విక్కులు. దాంతో వాళ్ళంతా కుటిలయత్నాలు ప్రారంభించారు – అతడినేవిధంగా దెబ్బతీయాలని ఆలోచిస్తుండగా వారికో మంచి అవకాశం వచ్చింది.

పౌర్ణమి ఇంకా పదిదినాలుందనగా కపిలవస్తు నగరంలో ఒక మాదిరి సంపన్న కులానికి చెందిన స్త్రీ కిసగౌతమి. దైవభక్తురాలు. పెండయిన పదిసంవత్సరాలకు ఎన్నో నోములు మరెన్నో పూజలు చేసే ఒక్క బిడ్డ పుట్టాడు. ఐదు సంవత్సరాల వయసు వచ్చింది. ఆ

బిడ్డనెంతో అపురూపంగా చూసుకుంటుందామె. ఆ పిల్లవాడు కూడా ఎంతో ఆరోగ్యంగా చురుగ్గా ముద్దుముద్దు మాటలతో ఇంటిల్లపాదిని ఆనందపరుస్తున్నాడు. రేపోమాపో గురుకులానికి పంపించటానికి ఆమె అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నది.

ఆ రోజు పొలం పనిమీద బయటకు వెళ్తూ పిల్లవాడిని ఇంట్లో ఉన్న అత్తగారికి అప్పజెప్పింది. వాడికి అన్నంపెట్టి ముసలమ్మ కాస్త కునుకు తీసింది. కాలొచ్చినవాడు ఒకచోట ఉండడు కదా. ఇంటివెనకవైపు పెద్ద పెరడు ఉంది. ఎన్నోరకాల కూరగాయలు, పెద్ద పెద్ద వృక్షాలు అడవిమాదిరిగా క్రిక్కిరిసి ఉంది. మామిడికాయలేరుకుందామని వెళ్ళి సంపెంగ పొదక్రింద చుట్టచుట్టుకుని పడుకున్న పామును చూడక తొక్కాడు. అసలే అది విషజంతువు. ఆపై తొక్కిన కోపం. కసిదీరా పసిబిడ్డని చూడకుండా కాటేసింది. పసివాడవడంతో పాపం అమ్మా అమ్మా అని అరుస్తూనే ప్రాణం విడిచాడు. చూసిన వాళ్ళులేరు. చాలాసేపటికి మెలుకువ వచ్చిన అత్తగారు బిడ్డను వెతుక్కుంటూ పెరట్లోకి వెళ్ళింది.

అక్కడ బిడ్డ నల్లబడిపోయి మరణించి ఉన్నాడు. ఆమె గుండె పగిలిపోయింది. క్షణంలో వార్త అందరికి తెలిసిపోయింది. విషయం విన్న తల్లి పొలంలోనే పడిపోయింది. చేతుల మీద మోసుకొచ్చారు.

ఆ తల్లి ఆవేదన అర్ధమైంది. పేగులు తెగిపోయేటట్లు ఏడుస్తున్నది. ఒక్కగానొక్క బిడ్డ. ఇక బిడ్డలు పుట్టే ఆశలేని వయస్సు. జనమంతా పోగయ్యారు. దేవదత్తుడు మరికొంతమంది పండితులు కూడా అక్కడ ఉన్నారు. కడుపు ఎండిన ఆ తల్లి గోలుగోలున ఏడుస్తున్నది. ప్రతి ఒక్కరి కాళ్ళు పట్టుకుంటున్నది.

"ఏడీ! నా ముద్దుకన్న. నాకివ్వండి. నా సంపదంతా తీసుకోండి. నా తండ్రి నా కడుపుమంట. వాడినవ్వు మొగం చూడకుండా నేనెట్లా బ్రతికేది. అయ్యో దేవుడా! ఇచ్చినట్టే ఇచ్చి తీసుకెళ్ళావా! ఇది నీకు న్యాయమేనా? ఎన్ని పూజలు వ్రతాలు చేసాను కనికరించి కడుపు పండించావనుకుంటే వాడి వెంట యముడ్ని పంపిస్తావా. ఓరి పాపిష్టి వాడా! నీకసలు మనస్సు లేదురా. నువ్వు దేవుడివా కాదు. వట్టిరాయివి. లేకపోతే నా బాధ నీకు తెలియదా! నా బిడ్డే కావాలా" క్రమేపీ ఆమె ఏడుపు ఉన్మాదంలోకి పోతున్నది.

అప్పుడు ఒక పండితుడన్నాడు.

"అమ్మా! ఊరుకోండి. మీరెంత ఏడ్చినా బిడ్డ తిరిగివస్తాడా. చెప్పండి మీకు జరిగింది అన్యాయమే కాదనలేం. బిడ్డపుట్టేవరకు లేరని ఏడ్చావు. పుట్టాక పొయ్యాడని ఏడుస్తున్నావు. నిండా నాలుగేళ్ళయినా నీ ముద్దూ ముచ్చట తీరలేదు. లోకం తెలియని ఆ బిడ్డ ఏం పాపం చేసాడని అప్పుడే నూరేళ్ళు నిండాయి" కపట శోకం నటించాడు.

"మరయితే పాపం ఎవరిదంటావు?" మరొకడు రెచ్చగొట్టాడు.

ఎవరేమిటి, కలికాలం. ఆచార భ్రష్టులు నాస్తికులు దేవుడు లేడు, దయ్యంలేదని రోజూ తిరుగుతున్నారుగా. యజ్ఞం వద్దట - ఆచారాలు పక్కన పెట్టాలట. ఎన్నో సంవత్సరాలనుండి వస్తున్న మన సంప్రదాయాలను తోసేస్తే ఆ పాపం ఊరికే పోతుందా? అది శాపమై చుట్టుకుంటుంది. ఎంత అనాచారం. ఎంత ఘోరం. దాని ఫలితమే ఇది.

"అందుకే ఈ అకాలమృత్యువులు - అనారోగ్య పీడితులు - ఇక కరువొక్కటి రావాల్సి ఉంది. " మరొకడందుకున్నాడు.

"ఇంతకీ ఆ నాస్తికులెవరు.?" ఎవరో అడిగారు.

"ఎవరేమిటి కళ్ళముందు కనబడుతుంటే? ఆ కర్మ భ్రష్టుల్ని మోయొద్దటండీ. కాషాయం కట్టుకున్నంతమాత్రాన సన్యాసికాడు. ఇష్టం వచ్చినట్లు అర్ధాలు మార్చేసి కొత్తసిద్ధాంతమని అందరిని నమ్మిస్తున్నాడే"

"ఎవరు? గౌతముడా! అతడి అనాచారం వల్లనే ఇదంతా జరుగుతున్నదా?" దేవదత్తుడడిగాడు.

"కాక మరెవరివలన. ఈ కిసగౌతమి మహాపుణ్యాత్మురాలు. ఆమె ఏం పాపం చేసిందని గర్భశోకం అనుభవిస్తున్నది. పూజలొద్దు, పురస్కారాలొద్దు అని ప్రచారం చేసున్నాడుగా ఆ మహానుబావుడు. కాలుపెటి పదిరోజులు కాలేదు. అప్పుడే ఈ అనరం."

"భగవంతుడా! ఇంకెన్ని పాపాలు చూడాలో" నశ్యం పీలుస్తూ అన్నాడు మరో వృద్ధపండితుడు. ఇదంతా వాళ్ళ పన్నాగం. జనంలో అక్కడక్కడా ఉండి మిగిలిన వాళ్ళను మాటలతో రెచ్చగొడుతున్నారు. దానికి అందరూ వంతపాడుతున్నారు. సమయం అటువంటిది. సహజంగానే తరాలుగా నరాల్లో పాతుకుపోయిన విశ్వాసాలు. అందులోనూ కష్టం వచ్చినప్పుడు మనుష్యులు మరింత మూర్ఖులవుతారు. ఎవరేది చెబితే అదే నిజం గొర్రెదాటు మనస్తత్వాలు ఇప్పుడదే పనిజేస్తున్నది.

"అయితే ఆయన అనాచారం వల్లే ఇది జరిగిందంటారా?" కిసగౌతమి బంధువొకాయన అడిగాడు.

"ముమ్మాటికీ అతనివల్లనే. దేవుడు వేరే లేడు, తనే దైవం అని చెప్పుకుంటున్నాడుగా. అందరూ అలాగే కొలుస్తున్నారు. మరి దేవుడయితే మహిమలుంటాయి కదా అందువలన మీ బిడ్డను బ్రతికించమనండి. బతికిస్తే మేమంతా ఆయన పాదాలకు శరణంటాం లేదా రేపటినుండి అక్కడకు పోవటం మానేయండి"

మరికొంతమంది తాళం వేసారు.

"నిజమే ఏమీలేనోడు గొప్పొడెట్టా అవుతాడు. కనుక ఈ బిడ్డని బతికించాల్సిందే పోదాం పదండి" అసలే గర్భశోకంతో కుమిలిపోతున్న ఆమెకు దారిదొరికినట్లయింది. పోయిన బిడ్డ బ్రతికి వచ్చినట్టు హృదయం తేలికపడింది. పూనకం వచ్చినట్టు వెంటనే బిడ్డను రెండుచేతులమీద ఎత్తుకుంది - జారుముడి వీడి వెంట్రుకలు వీపంతా పరచుకున్నాయి. వెల్లువెత్తిన శోకసముద్రంలా నదీతీరానికి పరుగుతీసింది. ఆమె వెంట జనం, బ్రాహ్మణులు - దేవదత్తుడు అనుసరించారు. కడలివెంట నదీపాయల్లాగా.

వాళ్ళకు చాలా సంతోషంగా ఉంది ఈ సంఘటనతో, గౌతముడి మాట వినేవారుండరు. మళ్ళీ తమ ఆటలు సాగుతాయి.

అప్పుడే ధ్యానం ముగించుకున్నాడు బుద్ధుడు. మామూలుగా ఆయన బోధలు వినటానికి శింశుపా వృక్షం క్రిందకు చేరారు శిష్యులంతా.

అపవర్గదుర్గాన్ని ఛేదించి అస్తేయపథాన్ని చేరాలంటే సత్యవాక్పాలన మొక్కటే రాజమార్గం. మమత - సమత ఈ రెండు మానవులందరిని ఒకచోట చేర్చు మహామంత్రాలు. కనిపించని దైవాన్ని వెతికే కంటే కనిపించే మనిషిని చూడు. అతన్ని ఓదార్చటంలో కలిగే ఆత్మతృప్తిలో దైవత్వం ఉంది. జరామృత్యువుల వారధిని దాటించగలిగిన వారధి బ్రహ్మచర్యం, శీలమనే కత్తి ధరించిన వాడికే శత్రువు ఎదురుగా నిలబడలేడు. ఇవి కేవలం మాటలకు పరిమితం కాకూడదు. ఆచరించినవాడే ఆదర్శపురుషుడు" బోధసాగుతూనే ఉంది.

ఆ ప్రశాంతతను భంగపరుస్తూ కిసగౌతమి బిడ్డ శవంతో ఏడుస్తూ వచ్చింది. ఆమె వెంట అందరు - ఒక్కసారిగా ఏడుపులు - వేడుకోళ్ళు. వనదేవత నిద్రాభంగమైనట్లయింది. బిడ్డను గౌతముడి పాదాలదగ్గర పడుకోబెట్టి రెండు చేతులు ఎత్తి నమస్కరిస్తూ.

"స్వామీ! వీడు నా ఒక్కగానొక్క బిడ్డ. పాముకరచి చనిపోయాడు. వీడులేకపోతే నా జీవితమే లేదు. వీడ్ని బ్రతికించండి. కావాలంటే నా ప్రాణాలు తీసుకోండి. నువ్వు దేవుడివి. నువ్వు తప్ప ఎవ్వరూ నా బిడ్డను బ్రతికించలేరు."

వెనక నిలబడ్డ పండితుల, దేవదత్తుడి ముఖాల్లో వంకర నవ్వులు. ఒక్క క్షణం హరివిల్లులాంటి ఆ భ్రుకుటి ముడిపడింది. పెదవుల మీద చిన్న మందహాసం.

ఆమె భర్త, బంధువులు బిగ్గరగా రోదిస్తున్నారు. 'నువ్వు తప్ప మాకెవరున్నారు ఎవరికేకష్టమొచ్చినా ఆదుకునే దేవుడివంట. నువ్వే కాపాడయ్యా ఆయమ్మని' అని.

కాసేపు శిష్యులకేం అర్థంకాలేదు. తరువాత పరిస్థితి అర్థమైంది. ఈ అమాయకులను ఎవరో రెచ్చగొట్టారు. ఏ మూఢనమ్మకాలను పోగొట్టాలని తన సర్వస్వం త్యాగం చేసాడో అదే నమ్మకాల చట్రంలో ఈ అమాయకులు ఆయన్నే బిగిస్తున్నారు. ఏ శోకాన్ని దూరం చేయాలని ఆయన తపన పడుతున్నాడో ఆ శోక దేవతే ఎదురుగా నిలబడి సవాలు విసురుతున్నది. ఎన్నో విషమ సమస్యల నవలీలగా ఎదుర్కొన్న భగవానుడు దీనెటా పరిష్కరిసాడో.

"చెప్పండి స్వామీ! మీరు బ్రతికిస్తారని, ఆ స్వాములంతా చెప్పారు - మీరు దేవుడు కాకపోతే ఇంతమంది రాజ్యాల్ని, భార్యల్ని వదలి ఎట్లా వస్తారు" అమాయకమైన ఆ ప్రశ్నలకు పండితులానందిస్తున్నారు. వాళ్ళకు కావల్సిందదే అతడి అవమానాన్ని కళ్ళారా చూడాలి. ఆ బలహీనతల మీద తమ స్వార్థవాదాలకు బలం చేకూర్చుకోవాలి.

బుద్ధుడికి తెలియందేముంది. వాళ్ళ నాటకాన్ని గ్రహించాడు. ఆ మాతృమూర్తి శోకాన్ని అర్థం చేసుకున్నాడు. తన అమృత హస్తాన్ని ఆమె తలమీదుంచి ఆశీర్వదించాడు. ఆ దివ్య స్పర్శకే ఆమెకొంత తేరుకుంది. కళ్ళెత్తి భగవానుడి కళ్ళల్లోకి చూసింది. శాంతిదేవతకు నిలయమైన ఆ నేత్రాలు సర్వదుఃఖాలకు ఔషధం దొరికే చోటులా కరుణావృష్టిని కురిపిస్తున్నాయి. ఆ దయావృష్టిలో తడిసి కాసేపు శోకాన్ని మర్చిపోయింది.

*********

(6)

"**ఏమ్మా మౌనంగా ఉన్నావు.** నీ బిడ్డను బ్రతికించమని అడుగుతున్నావా?"

"అవును స్వామీ!"

"నేను బ్రతికిస్తానని ఎవరు చెప్పారు"

"అదుగో వారే" చేయెత్తి వెనకవైపుకు చూపించింది అక్కడ పండితులంతా ఉన్నారు.

ఇంతలో ఈ వార్త తెలిసి శాక్యనగరం ప్రజలు తండోపతండాలుగా రావటం మొదలయింది. వారు నడుస్తుంటే ఉవ్వెత్తుగా పైకి లేచిన దుమ్ము, ఆకాశంతో స్నేహం చేస్తున్నట్లుంది.

"తప్పకుండా నీ బిడ్డను బ్రతికిస్తాను. కానీ ఒక్క షరతు."

"నిజమా స్వామీ! నాకంత అదృష్టమా, చెప్పండి ఏం చెయ్యమన్నా ప్రాణమిచ్చయినా చేస్తాను" మాతృహృదయం ఆనందంతో ఎగిసిపడింది.

"అయితే ఎవరింటికయినా వెళ్ళి గుప్పెడు నువ్వులు తీసుకురావాలి"

"అయ్యో అదెంతపని. ఇప్పుడే పరుగెత్తుకెళ్ళి తెచ్చేస్తా" లేవబోయింది.

"ఆగు తల్లీ! నువ్వులు తెచ్చేందుకు వారింట్లో మునుపెన్నడు మరణం సంభవించి ఉండకూడదు. ఆ షరతుమీదే వారు నీకు నువ్వులివ్వాలి. దీనికి సమ్మతమేనా"

"ఓ - మాటతప్పను స్వామీ! ఇప్పుడే పట్టుకొస్తా" విడిన వెంట్రుకలను ముడివేసుకుంది. జారిన కొంగు నడుములో దోపింది. ఒక్క పరుగున అక్కడినుండి వెళ్ళిపోయింది. అర్థం తెలియని వాళ్ళు ఆనందంగా ఉన్నారు. తెలిసిన పండితులు తలలు పట్టుకున్నారు. ఏ అమాయకత్వంతో గౌతముడిని దెబ్బతీయాలనుకున్నారో అదే అమాయకత్వానికి ఆయన కనువిప్పు చేయబోతున్నారు. అయినా చూద్దాం. ఏం జరుగుతున్నదో అని నిలబడ్డారు. పౌరులంతా కోపంతో మండిపడుతున్నారు.

ఇప్పుడిప్పుడే తమ అజ్ఞానాన్ని తొలిగిస్తూ లోకాన్ని చూపిస్తున్న ఆ మహానుభావుడిని ఏదో విధంగా అవమానించాలనుకుంటున్న వాళ్ళకు ఒక్కసారి బుద్ధిచెప్పాలి. ఏదో వంకన పూజలని యజ్ఞాలని దానాలని దోచుకు తింటున్నది చాలక. సర్వం వదులుకొచ్చిన ఆయన మీద దుమ్ము చల్లాలనుకుంటున్న వాళ్ళ పాపాల్ని అడ్డుకోవాలి - వారికి సరైన గుణపాఠం చెప్పాలి. వారిలో వారు మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

వసారాలో కూర్చుని పిండి విసురుకుంటుందొక ఇల్లాలు. చెమటతో తడిసిన ముఖాన్ని పైట కొంగుతో మాటిమాటికీ తుడుచుకుంటూ తిరగలి తిప్పుతున్నది. బొట్టులేని ఆమె ముఖం పాడ్యమినాటి చంద్రుడిలా కనిపిస్తున్నది. రెండేళ్ళ పిల్లవాడు పాలకోసం పైటలాగుతున్నాడు. ఆ పసివాడ్ని ఒళ్ళో అడ్డంగా వేసుకుని పాలిస్తూనే తనపని చేసుకుంటున్నది.

"అమ్మా!" ఆరమైన పిలుపు.

ఆమె తలెత్తి చూసింది. ఎదురుగా శోకమంతా మూర్తీభవించినట్టున్న స్త్రీమూర్తి.

"ఏంకావాలి? బాధలో ఉన్నట్లున్నావు."

"నాకు గుప్పెడు నువ్వులుకావాలి"

"అయ్యో అదేం భాగ్యం. వాటికోసం అంత బాధపడాలా! ఇప్పుడే తెచ్చిస్తానుండు" బిడ్డను చంకనేసుకుని ఇంట్లోకి వెళ్ళింది. కొంచెం సేపట్లోనే ఆమె నువ్వులతో తిరిగొచ్చి కొంగుచాపమన్నది.

అవి అందుకోకుండానే కిసగౌతమి ఆమెతో -

"అమ్మా మన్నించండి. ఆచారవంతమైన నువ్వులు కావాలి."

"అంటే నేను స్నానం చెయ్యలేదనా. పొద్దున్నే చేసి దీపం పెట్టుకున్నాకే పనిలోకి దిగుతాను."

"అదికాదమ్మా. మీ ఇంట్లో ఎవరూ చనిపోకుండా ఉంటే ఈ నువ్వులు గ్రహించగలను."

ఆ మాటలకు ఆమె గడపలో కూలబడి ఏడుస్తూ -

"అయ్యో! నా బాధ ఎవరికి చెప్పుకోవాలి. నా ముఖం చూస్తే తెలియటంలా - నా భర్త మరణించి ఇంకా మాసం రోజులు నిండలేదు. ఆ దుఃఖనుండి ఇంకా తేరుకున్నది లేదు" అన్నది రోదిస్తూ -

"అయ్యయ్యో ఎంత పాపిష్టిదాన్ని. నా దుఃఖంలో నీ దుఃఖాన్ని గమనించలేకపోయాను. ఈ అభాగ్యురాలిని మన్నించండి ఈ నువ్వులు తీసుకోనందుకు వెళ్ళొస్తానమ్మా" అక్కడినుండి మరోచోటికి వెళ్ళింది -

ఆ ఇంట్లో ఆమె బిడ్డ మరణించి ఆరుమాసాలు. గర్భశోకంతో ఉన్న ఇంటామె చెప్పింది. వేరే ఇంట తండ్రిపోయాడు. మరోచోట తల్లిని పోగొట్టుకున్న అనాథులైన పిల్లలు. తల్లికోసం విలపిస్తున్నారు. - తండ్రీలేడు. ఎప్పుడో ఇల్లు వదిలి పెట్టి వెళ్ళిపోయాడంట. పాపం పక్కవాళ్ళే ఇంతన్నం పెడుతున్నారు. వాళ్ళ కష్టం చూస్తే కడుపు తరుక్కుపోయింది - ఇంకొక ఇంట్లో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. కొత్తగా పెళ్ళయింది. మూడురోజుల నిద్రకని వచ్చారు. తెలియని రోగంతో పెళ్ళికొడుకు కన్నుమూశాడు. తెలిసీ తెలియని పసివయసులో ఉన్న ఆమెను ముత్తయిదువులు విధవను చేస్తున్నారు. ఒకవైపు తన తలరాతను మారుస్తుంటే మరోవైపు చేతిలో బొమ్మతో ఆడుకుంటున్నది ఆ పసిది. ఆ దృశ్యం చూసి తల్లిదండ్రులు, బంధువులు రోదిస్తున్నారు -

చావులేని ఇల్లు దొరుకుతుందనే ఆశతో ప్రతి ఇల్లు తిరుగుతూనే ఉందా పిచ్చి తల్లి - ప్రతి ఇంటా చావుకబురు వింటూనే ఉంది - విన్నకొలది ఆమె జ్ఞాననేత్రం మెల్లగా తెరుచుకుంటున్నది.

తిరిగి తిరిగి చివరకు మరణంలేని ఇల్లు కనుక్కోలేక నవ్వులు లేకుండానే వనవాటికకు తిరిగొచ్చింది.

కానీ ఇప్పుడామె మునుపటిలా లేదు. ఏదో సత్యాన్ని తెల్సుకున్న ఋషిలా గంభీరంగా ఉంది. శోకం స్థానంలో నిర్వేదం. ఆక్రందనకు బదులు ఏదో ఆలోచన వస్తూనే బుద్ధుడి పాదాలకు నమస్కరించింది.

"స్వామీ ఈ సత్యం తెలుసుకోటానికి నన్ను అంతదూరం పంపాలా! మీరు స్వయంగా చెబితే అర్థం చేసుకోననా?"

బుద్ధుడు చిరునవ్వు నవ్వాడు. తెల్లటి దంతాలు ఎర్రటి పెదాల మధ్య మెరిసాయి. అది చూడటానికి కెంపుల చట్రంలో ముత్యాలు కూర్చినట్లుంది -

"లేదు తల్లీ! వ్యథాభరితమైన హృదయం వాస్తవాన్ని మాటలతో గ్రహించలేదు. నేను మిమ్మల్ని ఓదార్చటానికి చావు సహజం, ప్రతి ఇంట్లో జరుగుతున్నదే అని చెప్పినా నమ్మేవారుకాదు. ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఆత్మీయవియోగంతో దుఃఖిస్తున్నవారే. ఈ విషయం స్వయంగా తెలుసుకుంటే తప్ప మనస్సుకు ఊరటరాదు. జరావ్యాధుల్లో చిక్కి ఆశాపాశాల్లో అల్లాడిపోతున్న మానవాళికి మరణం ఒక విముకి. ఏ ఇంట చూసినా ఏ కంట చూసినా దొరికే సమాధానం అదే మృత్యువు నిరయగా తన దర్శాని పాటిసునది.

పంచభక్ష్యపరమాన్నాలు ఆరగించే పుట్టుభోగి మరణిస్తున్నాడు. ఏ సుఖం ఎరుగని కష్టజీవి మరణిస్తున్నాడు. దాని కర్తవ్యపాలనలో అందరూ సమానమే.

ఈరోజు నీ బిడ్డ - రేపు నేను - ఎల్లుండి నీవు. అందరం తరలిపోవాల్సిందే దాన్నాపగలిగిన శక్తి ఈ సృష్టికేలేదు. మరెవ్వరికీ లేదు. పాలుతాగే పసిబిడ్డనయినా, భర్తకౌగిలిలో ఆదమరిచి నిద్రించే భార్యనయినా అది కఠినంగా కబళిస్తుంది. ఇంతమంది తమ బంధువులను మృత్యువుకు అప్పగించి దుఃఖిస్తూంటే అందరూ అదే దారిలో నడుస్తుంటే నువ్వొక్కదానివే స్వార్థపరురాలివి కావాలనుకుంటున్నావా? ఒక్క నీ బిడ్డే ముఖ్యమా? చెప్పుతల్లీ! సృష్టి ధర్మానికి ఎదురీదాలనుకోవటం న్యాయంకాదు. నిజం చెబుతున్నాను. నాకే శక్తులు లేవు. నేను చచ్చినవాళ్ళను బ్రతికించే దేవుడిని అంతకంటేకాను. మీలాంటి మనిషిని. నాకూ రోగాలు, ముసలితనం, చావు అన్నీ ఉన్నాయి. అయితే నిజాన్ని తెలిసి దుఃఖించటం అజ్ఞానంకాదా! ఇవన్నీ తప్పవనుకున్నప్పుడు వాటికోసం బాధపడకూడదు. ఆ సత్యాన్ని విడమర్చి చెప్పే గురువును నేను. మన ఆయువు తీరేంతవరకు మనిషి ధర్మాన్ని నిర్వర్తించి సాటిమనిషికి సాయం చేసి సంతోషంగా దేహాన్ని చాలిద్దాం. ఇదే నా ధర్మం"

మంత్రముగ్ధుల్లా వింటున్నారు -

'కనపడే సత్యాన్ని గ్రహించలేని మూర్ఖత్వాన్ని ఎంత సున్నితంగా తొలగించగలిగాడు. కఠోరమైన మృత్యు రహస్యాన్ని మృదువుగా విప్పి చూపించాడు. ఇప్పుడా ప్రదేశంలో రోదనలు లేవు. సత్యశోధనలు తప్ప' ఆశ్చర్యంగా అందరి మనసులు ప్రశాంతంగా ఉన్నాయి.

దేవదత్తుడితో సహా గౌతముడి అవమానాన్ని కళ్ళారా చూడాలని వచ్చిన మతఛాందసులకు గుణపాఠం చెప్పినట్లయింది. అందరూ తలవంచుకున్నారు. బుద్ధుడు అతని శిష్యులు వాళ్ళ విషయంలో ఏం మాట్లాడకపోయినా పౌరులూరుకోలేదు. రెచ్చిపోయారు.

"లేదు స్వామీ! మనుష్యులను బ్రతికించే విద్య వీళ్ళకు తెల్సు. వీళ్ళు బ్రతికించకపోతే తలకాయలు నరికేస్తాం" కొంతమంది ఆవేశంగా లేచారు

"ఆ మహానుభావుడికి తమ్ముడిగా ఆ వంశంలో పుట్టి ఇట్లాంటి పనికిమాలినవాడి వయ్యావే - ఒక్కసారి ఆయన బోధలు విని మనిషిగా మారు" అని దేవదత్తుని నిందించారు.

కొట్టటానికి మీదకెళ్ళిన జనాన్ని బుద్ధుడు వారించాడు. అజ్ఞానం, అహంకారం ఆత్మహత్యాసదృశాలు - వారిని ఆ దారినుండి రక్షించాలి కాని శిక్షించకూడదు.

"అందరూ నేను చెప్పిందే గుడ్డిగా అనుసరించాలని లేదు. విమర్శలున్నప్పుడే మరింతగా ఆత్మశోధన జరుగుతుంది. సత్యం మరింతగా ప్రకాశిస్తుంది. కనుక నాకు వారు శ్రేయోభిలాషులే - వారినేమి అనకండి. విడిచిపెట్టండి."

"సోదరా! మీరిక వెళ్ళవచ్చు. ఇక్కడ మిమ్మల్నాపేవారెవ్వరూ లేరు - పోయిరండి - శుభమస్తు" ఆ మాటల్లోని సహనానికి వారిలో చాలామందికి పశ్చాత్తాపం కలిగింది. దేవదత్తుడిలో కూడా చిన్నమార్పు.

కాసేపటికి ఆ ప్రదేశం మళ్ళీ యధాస్థితికి వచ్చింది ఏమీ జరగనట్టే కొమ్మ మీది పక్షులు, కొలనులో నీళ్ళు ఊసులాడుకుంటూ కూర్చున్నాయి.

"ఎవరక్కడ?"

"చిత్తం దేవీ! నేను నీహారికను"

"మాలికేం చేస్తున్నది?"

"తమరి స్నానం ఏర్పాటు చూసోంది దేవీ!"

''కుమారనందులెక్కడ?''

''వారు స్నానం ముగించుకుని ఉద్యానవనంలోకి వెళ్ళారు''

''ఇంత ఉదయమా''

''అవును దేవీ! కబురు చెప్పమంటారా?''

''వద్దులే వెళ్ళు'' మళ్ళీ ఆలోచించుకుని వెళ్ళిపోతున్న చెలికత్తెను ఆపింది.

''నీహారికా! యువరాజులవారిని తోటలో ఉండమను. నేను స్నానం చేసి అక్కడికి వసానని చెప్పు''

''అలాగే దేవీ ఇప్పుడే కబురందిస్తాను''

ఆమె ఉద్యానవనం వైపు, సుందరి స్నానశాల వైపు వెళ్ళిపోయారు. రాత్రి అతడు పొద్దుపోయాక వచ్చాడు. ఉదయం ఇద్దరూ మాట్లాడుకోలేదు అనుకున్న పని సాధించాలంటే తానుదిగిరాక తప్పదు –

ఆరోజు ఆమె చాలా ప్రత్యేకంగా అలంకరించుకుంది. వెండి జలతారు కూర్చిన లేతాకు పచ్చజరీ చీర ఒంటిరంగుకు మరింత మెరుపును పెంచింది. ముత్యాలు కుట్టిన ఆకుపచ్చ కంచుకం తొడిగి, మెడలో పచ్చలు తాపిన మేలిమి బంగారు పతకం. కాళ్ళకు బంగారు కడియాలు. నుదుట దోసగింజాకారంలో తిలకం దిద్దుకుంది. చేతులకు నగిషీలు చెక్కిన రత్నకంకణాలు. తలస్నానం చేసిన జుట్టును స్వేచ్ఛగా విడిచిపెట్టింది. ఆమె నడుస్తుంటే సముద్రపు అలల్లా వెంబడిస్తున్నది.

చిలకలరాణిలా అడుగుపెడుతున్న భార్యను చూసి ముగ్ధుడయ్యాడు నందుడు. పుట్టింటి మీది కోపంతో సముద్రాన్ని విడిచిపెట్టి వస్తున్న లక్ష్మీదేవిలా ఉందారూపం. పలకరింపుగా నవ్వాడు. ఆమె చిరునవ్వు అతనిలో బాధనంతా చేత్తో తీసేసినట్లయింది. ఎంతో ప్రేమతో ఆహ్వానించాడు. ఇద్దరూ సరోవరం దగ్గరకు వెళ్ళారు. ఒడ్డుకు ఈదుకుంటూ వచ్చాయి. వాటి తలమీద ఆప్యాయంగా నిమిరింది.

''దేవీ! ఇవి నీకెంత మాలిమి అయ్యాయి. తను కూడ ఒక హంసను ముట్టుకోబోతే అది దూరంగా వెళ్ళిపోయింది''

''ఏదయినా అభ్యాసాన్ని బట్టి ఉంటుంది''

''నన్ను మన్నించాలి. నిన్న ఆలస్యంగా వచ్చినందుకు''

అతని కళ్ళల్లో లీలగా పశ్చాత్తాపం మెరిసింది.

''మనలోమనకు మన్నింపులెందుకు ప్రియా! నేను మీ సర్వస్వం. మాటిమాటికీ మన్నింపులడగటం బలహీనతకు నిదర్శనం. పోనివ్వండి, ఆ విషయం మర్చిపోయాను. మీకో మంచి వార్త చెప్పాలని చాలా ఉత్సాహంగా వచ్చాను''

లేతకిరణాలు నీళ్ళల్లో ప్రతిఫలించటం వలన ఆ కాంతి ఆమె చెక్కిళ్ళ మీదపడి అవి తళుక్కున మెరిసాయి.

''ఇంత ఉత్సాహానికి కారణమేమిటో దేవీ! మీ పుట్టింటినుండి ఏమయినా సందేశమా నందుడిలో కూడా ఉత్సాహం తొంగిచూసింది''

''మీకంటే పుట్టింటి వార్తనాకానందమా. మా వాళ్ళందర్నీ మీలో చూసుకుంటున్నాను. మీకన్నా ఈ ప్రపంచం దేవుడు, మోక్షం ఏవీ నాకెక్కువకాదు. అసలు వేరే ఆలోచించనేరాదు – మీ ప్రేమొక్కటిచాలు నాకు'' అతని చేతుల్లో ముఖం దాచుకుంది.

''ఇంతకీ వార్తేమిటి చెప్పు చెలీ. తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది'' మెల్లగా వంగి తలమీద ముద్దుపెట్టుకున్నాడు.

''ముందు మీరు నాకోమాటివ్వాలి. నా కోర్కెను మన్నిస్తానంటే చెబుతాను''

''అలాగే నువ్వేం చెప్పినా, చేసినా నాకు సంతోషమే. ఎందుకంటే అది సంతోషంతో ముడిబడింది కనుక''

''పౌర్ణమి ఎన్నాళ్ళుంది?''

''ఇంకా వారం దినాలు – ఏం?''

"పౌర్ణమి రోజు ఏం జరగబోతుందో మీకు తెల్సు"

"అవును నిన్న ఆ పని కోసం నాన్నగారు పిలిపించారు అంతఃపురంలో అందరూ దీక్షలు తీసుకుంటున్నారట. వదినగారు రాహులుడితో సహా. ఆ ఉత్సవానికి మనిద్దరినీ రమ్మని చెప్పారు" కావాలనే మిగిలిన విషయం అతడు చెప్పలేదు.

"మీరేమన్నారు. వెళ్ళటానికి ఒప్పుకున్నారా?"

"లేదు, లేదు నిన్నడిగి చెబుతానన్నాను"

"అంటే నన్నక్కడకూడా అవమానించారన్నమాట"

"అదేమిటి? నీకే ఎకువ ప్రాధాన్యత ఇచ్చాను"

"అది ప్రాధాన్యతెలా అవుతుంది. పెద్దలడిగినప్పుడు నా భార్య నడిగి చెబుతానంటం.. నేనేదో మీమీద ఆధిపత్యం చెలాయిస్తున్నట్లు వాళ్ళనుకోరూ!?"

"ఎవరేమనుకుంటేనేం. నా భార్యకు గౌరవమివ్వాల్సిన అవసరంలేదా? అందరికంటే ఆమే నాకెక్కువ"

"ఊం.. రేపటినుండి నన్నందరూ ఆడిపోసుకుంటారు. ఇంతగయ్యాళి భార్య భర్తను ఆడిపోస్తోందని" బుంగమూతి పెట్టింది.

"పోనీలే. నేననుకుంటే కదా నువ్వు బాధపడాలి. అసలు విషయం దాటేస్తున్నావు అదేంటో త్వరగా చెప్పు. లేకపోతే నీ అలంకరణంతా చెరిపేస్తాను"

"వద్దు. వద్దు. విషయం తీవ్రమైంది. మనం లోతుగా చర్చించాల్సి ఉంది. మీరు దూరంగా కూర్చోండి."

"సరే. దేవిగారి ఆజ్ఞ" అతడు బుద్దిగా చేతులు కట్టుకున్నాడు.

"ప్రియా! నేను చెప్పే విషయం సావకాశంగా వినండి. తర్వాత అది మంచనిపిస్తే అనుమతివ్వండి. ఏమయినా మనిద్దరిమధ్యా అపార్థాలకు చోటుండకూడదు. నా ఆలోచనలు నావి. కొన్ని విషయాల్లో నేను సర్దుకోలేను. సమర్థించనూలేను. అలాగే మొదటినుండి దీక్షల విషయంలో నేను వ్యతిరేకం. ఇదే విషయాన్ని అత్తగారితో మామగారితో మాట్లాడాను. అక్కగారికయితే ఎన్నోసార్లు నచ్చచెప్పాను. కనీసం శాక్యవంశం మొలక ఉత్తరాధికారి రాహులుడినయినా ఈ దీక్షనుండి తప్పించ"మని పదే పదే అడిగాను.

"అయితే వారేమన్నారు?" నందుడి కళ్ళల్లో ఆశ్చర్యం.

"ఒకవైపు నా వాదనను అంగీకరిస్తూనే మరోవైపు బావగారిని సమర్థించారు. ఇక ఆమె మనస్సేమిటో నా ఒక్కదానికే తెల్సు. ఆమె పరిస్థితులతో రాజీపడింది. భర్తమార్గమే ఆచరణీయంగా భావిస్తున్నారు"

"అవును దేవీ! అది ఉత్తమ స్త్రీ ధర్మం"

"క్షమించండి. తలవంచి బ్రతకటం ఉత్తమమెలా అవుతుంది. ఆమె తన ధర్మాన్ని పూర్తిగా నిర్వర్తించలేకపోయింది"

"అదెలా? భర్తను వ్యతిరేకించి నడవమనా నీ అభిమతం"

"అయితే స్త్రీలు నోరు తెరచి ఏం మాట్లాడకూడదనా మీ అభిప్రాయం."

"ఏమిటి సుందరీ. నీ మాటలు నాకసలర్థం కావు. కాలికీ, వేలికీ ముడిపెడతావు. ఇప్పుడు నీ స్వేచ్ఛకు నేను అడ్డుచెప్పానా?"

"నా స్వేచ్ఛ గురించి కాదు నేను మాట్లాడేది. లోకంలో స్త్రీల స్వేచ్ఛ గురించి యశోధరాదేవి బుద్ధుడిని తన న్యాయస్థానం ముందు నిలబెడితే ఆయన తప్పక దోషి అయివుండేవారు."

"అదెలా సాధ్యం?"

"వివాహధర్మంలో 'ధర్మేచ - అర్థేచ - కామేచ - మోక్షేచ నాతిచరామి' అనిపిస్తారుకదా! ఏకర్మ నిర్వహణలో పురుషుడు భార్యనతిక్రమించిపోరాదని. కానీ గౌతములాదర్శాన్ని విస్మరించారు. పన్నెండు సంవత్సరాలుగా చేయని తప్పుకు ఆమె శికను

అనుభవించారు. అసలు సన్యాసి కాదలచిన వాళ్ళు భార్య అనుమతి తీసుకోవాలని శాస్త్రం ఉంది. ఆయన అదీ చెయ్యకపోగా ఇప్పుడు కావి చీరెలు - కమండలాలు ఇచ్చి మరింత అన్యాయం చేస్తున్నారు'' అదీ ఆమె బలవంతంమీద.

సూటిగా కళ్ళల్లో పడుతున్న కిరణాల్ని తప్పించుకోటానికి కొంచెం పక్కకు తిరిగింది సుందరి.

''ఏదయినా ఆమెను కూడా తన మార్గంలో నడిపించుకుంటున్నారు. ఇందులో ఆమెకు జరిగిన అన్యాయమేముంది?''

''పూర్తిగా న్యాయం జరిగిందనుకుంటున్నారా? స్త్రీ మనసు నాకు తెలుసు. ఆమెకు భర్త సర్వస్వం. అతని ప్రేమలో తన జీవితాన్ని పండించుకోవాలనుకుంటుంది. బాధ్యతలు తీరాక భార్యాభర్తలిద్దరూ కలిసి సన్యసించవచ్చు. కానీ ఈ సన్యాసం లోక విడ్డూరం. మీ అన్నగారి సిద్ధాంతంలో భార్యాభర్తలు కలిసి ఉండకూడదు కదా. ఇన్నాళ్ళూ వియోగాన్ని అగ్ని కుంపటిలా మోసింది. ఇప్పుడయినా జరిగే న్యాయం ఏముంది? బోడితల - కావిచీరలు పూర్తిగా తనకు తనే శిక్ష వేసుకుంటున్నది''

''లేదు దేవీ! వదినగారు ఈ దీక్ష ద్వారా చాలా సంతోషంగా ఉన్నారు. మునుపెన్నడూ లేని ఉత్సాహమైన జీవితాన్ని ఆమె గడపగలదు'' చాలా నమ్మకంగా అన్నాడు నందుడు.

''ఒకవేళ మీరన్నదే అయితే మనస్సును పూర్తిగా చంపుకుంటోంది. బహుశా ఆత్మాహుతి అంటే అర్థం ఇదేనేమో, అంతటి అసమర్థతకు ఆ మార్గమే న్యాయం'' ఆమె మాటల్లో వ్యంగ్యం.

''నువ్వంగీకరించినా, లేకపోయినా మా వదినగారు తన సతీధర్మాన్ని పూర్తిగా పాటిస్తున్నారు. నిజమైన స్త్రీగా అందరికీ ఆదర్శమవుతున్నారు'' నందుడి మాటల్లో యశోధర పట్ల భక్తి - గౌరవం కనిపించాయి.

ఆ మాటలకు సుందరికి కోపం ముంచుకొచ్చింది.

ఇంత మూర్ఖంగా స్త్రీల మనోభావాలు బలిపెడుతున్న శాసనాలు ఎవరు రచించారు. మగవారేగా! కన్నీళ్ళ సముద్రంలో కదలుతున్న వారి బడబాగ్నులనార్ప ఎవ్వరితరం? బుసకొట్టే నాగులాగా రోషారుణ నేత్రాలతో నందుడివైపు చూస్తూ -

''ఆహా! ఆడవాళ్ళనెంత బాగా అర్థం చేసుకున్నారండీ. సుకుమారమైన స్త్రీల మనస్సు సంపూర్ణ ప్రేమకు నిలయం. తల్లిదండ్రుల లాలనలో, భర్త పాలనలో బిడ్డల మమతానురాగాల్లో వికసించి సమాజ చైతన్యానికి స్ఫూర్తినిస్తుంది. ఉత్తమ సంఘానికి ఉన్నతమైన శక్తి సంపదలను సమకూరుస్తుంది. దాన్ని ఎప్పటికప్పుడు చైతన్యం చేయాల్సిన బాధ్యత భర్తదే మసిబారిన నమ్మకాలు, జీవరహితమైన శాసనాలతో స్త్రీ మనస్సును సమాధి చేసి ఆపైన సతీత్వపు రంగు పూసి వికృతమైన పురుషాహంకారంలో నడుస్తున్న దుర్మార్గపు సంప్రదాయాలనడ్డుకోవాల్సి ఉంది. మీ అన్నగారు చెబుతున్నది కూడా అదేగా. కానీ స్త్రీల విషయంలో ఆయన ఏం మారలేదు. భార్యాభర్తలు కలిసివుంటే తప్పేమిటి భర్త ఉండీ దూరంగా బ్రతకమంటం ఏం ధర్మం? అసలు తప్పంతా ఆమెదే''

''అదేమిటి? ఇంతలో మారిపోయింది. మళ్ళీ ఆమెను తప్పుబడుతున్నావు''

''మరికాదా? లోకంలో స్త్రీ ఆకర్షణ పురుడ్ని పురుషుడిగా ఉంచాలి. ఆమె ఆకర్షించలేకపోతే సన్యాసిగా మారి అడవులు పట్టుకుని పోతాడు. యశోధర అనాకర్షణ వల్లనే సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. ఆమె బావగారిని పూర్తిగా ఆకట్టుకోలేకపోయింది. ''

''ఎంతపెద్ద అభియోగం మోపుతున్నావు వదినగారిమీద దృఢచిత్తులను ఎవ్వరూ బంధించలేరు.''

''అదే పొరపాటు. మెతకదనం, అన్ని అనర్థాలకు మూలం. అవసరమైనప్పుడు తన జీవితానికి సంబంధించి ప్రధాన నిర్ణయాలు తీసుకోకపోతే ఇలాగే సంభవిస్తుంది. ఇద్దరికీ మిగిలింది శాశ్వత సన్యాసం.''

''సరే. వదినగారి విషయం విడిచిపెట్టు. మగధ చక్రవర్తి బింబిసారుడు కోసల చక్రవర్తి ప్రసేనుడు ఇంకా ఎంతోమంది రాజకుమారులు, పెద్ద పెద్ద పండితులు వీరంతా ఎందుకు ఆకర్షితులయ్యారు. మన నగరంలో ప్రతిరోజూ వేలమంది నదీ తీరానికి

వెళ్తూనే ఉన్నారు. వీళ్ళంతా నీకంటే తెలివితక్కువాళ్ళా! రేపు పౌర్ణమి ఎంతమంది దీక్షలు తీసుకుంటున్నారో. అంచనాలకు అందటంలేదు. దాన్నేమంటావు"

"అదా! ఇందులో రహస్యం మీరు గ్రహించాలి. దేవుడు ఒక్కడేగా. ఇన్ని నామరూపాలెందుకు? భిన్నమతాలెందుకు? మళ్ళీ మాది గొప్పంటే మాది గొప్పని వాదోపవాదాలు. ఒక్కదేవుడికి ఇన్ని మార్గాలా?"

నిజమే. అవన్నీ ఎన్ని మార్గాలయినా లక్ష్యం దేవుడేగా. ఏ మార్గాన్ని అనుసరించినా గమ్యం ఒక్కటే. మనిషి అభిరుచుల్ని బట్టి మారుతూంటాయి" అన్నాడు నందుడు.

"అమ్మయ్య! ఒప్పుకున్నారుగా. మనిషికి ఎప్పుడూ ఏదో కొత్త మార్గం కావాలి. అదీ తన మనసుకు నచ్చాలి. రోజూ ఒకేవిధమైన జీవితానికి విసిగిపోయి నూతనంగా ఏది కనిపిస్తే దాని వెంట పోతుంటారు. ఇది సహజం. ఏ సిద్ధాంతం మీదయినా ప్రతిబింబిస్తున్నది. మనుష్యుల స్వభావాలే తప్ప వేరుకాదు. అదీ కొంతకాలం ఇదంతా తనమీద తనకు నమ్మకంలేకపోవటం. అందుకే వాస్తవికతకు దూరమై బ్రతుకులు అస్థిరంగా నడుస్తున్నాయి. తనకేది కావాలో తనకు తెలియదు. తాత్కాలికంగా ఏ వాదం సబబనిపిస్తే కొంతకాలం దానివెంట పరుగులు. తర్వాత దాన్ని పక్కకు తోసేయటం. వ్యక్తి తన స్వార్థాన్నుండి ఎన్నడూ బయటికి రాలేడు. ఇది సంసారికయినా సన్యాసికయినా ఒకటే."

"ఈరోజు శాక్యపౌరులకు లేదా రాజులకు ఈ ధర్మం గొప్పదిగా అనిపించవచ్చు. కొన్నాళ్ళ తర్వాత వాళ్ళే దీనిలో లోపాలు వెతుకుతారు. నిలకడ మనసులో ఉంటే ఎక్కడున్నా సమాజసేవ చెయ్యొచ్చు" ఆమె మాటల పరిణతి అతనికి ఆశ్చర్యం కలిగించినా మనస్సంగీకరించటంలేదు ఒప్పుకోవటానికి.

"అంటే బుద్ధ ధర్మంలో గొప్పతనాన్ని నువ్వు గ్రహించలేదా? అందులోని నూతనత్వం మానవాళికి ఆదర్శనీయమయింది. ఆయన పోరాడుతుంది మూఢాచారాలమీదే ఒక ఆదర్శాన్ని లక్ష్యంగా పెట్టుకున్న వాళ్ళకు సంసారబంధాలు చాలా చిన్నవి. దాన్ని గుర్తించలేక అసహజంగా ఆలోచిస్తున్నావనిపిస్తోంది"

"అసహజం నా మాటల్లోనే కాదు - మీ చేతల్లో కనిపిస్తోంది. సహజత్వమేమిటో ఈ రాజహంసలనడిగినా చెబుతాయి. ఇంతమందికి ధర్మోపదేశం చేస్తున్న గౌతములు ఒక్కసారి ఈ సరోవరం దగ్గరకొచ్చి ఈ హంసలకు ఉపదేశం చెయ్యమనండి. అవి మొదట ఆశ్చర్యంగా చూస్తాయి. ఆ తర్వాత ముక్కు ముక్కు రాసుకుని కదిలిపోతున్న తరంగాలవెంట ఆనందంగా ఈదుకుంటూ వెళ్ళిపోతాయి. అది స్వాభావికం. మరొక్కసారి ధర్మోపదేశం చెయ్యాలని ఆయనకుండదు. ప్రకృతిలో జరిగే ప్రతిపనీ సహజమే. దానికి భిన్నమైనది అసహజాలు."

"నీ మాటలు వింటుంటే ఇదీ నిజమేననిపిస్తోంది. నిన్న అన్నగారి శిష్యులు మౌద్గల్యుడి మాటల్లో వాదనలో నిజముందనిపించింది. నేనే ఎటూ నిర్ణయించుకోలేకపోతున్నాను" ఎండ కొంచెం ఎక్కువవటంతో నందుడు లేచి నిలబడ్డాడు. సుందరి కూడా లేచింది. ఇద్దరూ చెట్టునీడవైపు నడిచారు.

"చూడండీ! మన ఆలోచనేమిటో మనకు అర్థంకానప్పుడిలాగే ఉంటుంది. ఎవరేం చెప్పినా బాగానే ఉందనిపిస్తుంది - అందుకే నా ఆలోచన ఆశయం ఒక్కటే - సహజత్వాన్ని పాడుచేయకూడదనే. మామిడి చెట్టు ముళ్ళ కాయలు కాస్తే బాగుంటుందా? భార్యాభర్తలు విడిపోయి ఎవరికి వారు బోడితలలతో భిక్షాటనం చేస్తుంటే ఎలా ఉంటుందో ఆ దృశ్యం ఊహించుకోండి. దాని వెనక ఆశయాలేమైనా కానీ కపిలవస్తు నగరం పూర్వపు శోభతో వెలగాలి. దంపతులు ఆనందంగా కలిసి బ్రతకాలి. ఇదే నా కోరిక" ఆమె మాటల్లో స్థిరత్వం అతడి గుండె కదిలించింది.

"చెప్పు దేవీ! ఏం చేద్దాం. ధర్మదీక్ష తీసుకోవద్దని ప్రచారం చెయ్యాలా! అలా చెయ్యటం కూడా బాగుండదు. అన్నగారిని, తండ్రిగారిని ధిక్కరించినట్లవ్వదూ."

"ఎంత అమాయకులు మీరు. మనం వీధికెక్కి ప్రచారం చెయ్యాల్సిన అవసరం లేదు. మన వ్యతిరేకతను తెలియజేస్తే సరిపోతుంది.

"అదే ఎలా?"

"ఏముంది శాక్యనగరవాసులకు వందల సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయం వసంతోత్సవం. అది పన్నెండు సంవత్సరాలుగా మనరాజ్యంలో నిషేధించబడింది. గౌతముల తర్వాత మీరు పెద్దవారు కనుక యువరాజుగా ఈ సంవత్సరం ఆ ఉత్సవాన్ని నిర్వహిస్తే మన ఆచారాన్ని నిలబెట్టినట్లవుతుంది. మర్చిపోయిన పూర్వవైభవాన్ని తిరిగి ప్రజలకు అందించినట్లవుతుంది. ఎలా ఉంది నా ఆలోచన."

"బాగానే ఉంది. అదెప్పుడు నిర్వహించాలి"

"ఎప్పుడో నిర్వహిస్తే ఆనవాయితీ పోదూ. ఎప్పటిలాగానే రేపొచ్చే పౌర్ణమికే."

హఠాత్తుగా పామును చూసినట్లు ఉలిక్కిపడ్డాడు. క్షణకాలం ముఖం నిర్జీవంగా పాలిపోయింది.

"సుందరీ! ఈ నిర్ణయం ఆలోచించే తీసుకున్నావా! అదేరోజు మనవాళ్ళంతా దీక్షలు తీసుకుంటున్నారు. మనం తీసుకోకపోయినా కనీసం వెళ్ళాల్సిన బాధ్యత ఉంది. అదికూడా మరిచి పూర్తివిరుద్ధమైన ఈ ఉత్సవాన్ని నిర్వహించాలనుకోవటం ఎంత బుద్ధిహీనత. తండ్రిగారెంత బాధపడతారు. తల్లిగారేమనుకుంటారో ఆలోచించావా! అన్నిటినీ మించి లోకులు ఇష్టం వచ్చినట్టు నిందిస్తారు" ఆవేదనగా నుదురు రుద్దుకున్నాడు.

"ఎంతసేపున్నా వారేమనుకుంటారో, వీరేమనుకుంటారో అని ఆలోచిస్తారే తప్ప మనమేం చెయ్యాలని ఆలోచించరేం. మన కుటుంబమంతా ఇష్టపడితేనే మీ అన్నగారు పరివ్రాజకులయారా.. ఎవరిష్టం వారిది."

"నా బాధ ఎందుకర్థం చేసుకోరు?" సుందరి మాటల్లో ఆవేదన.

"ఏమిటి అర్థం చేసుకునేది. ఈ ఆలోచన ఎంత తప్పో ఈరోజు నీకర్థంకాదు. ఒకే కుటుంబంలో భిన్నమార్గాలనే అపవాదు పెద్దవారికొస్తుంది. కొడుకు, కోడలిగా వారిని గౌరవించటం మన ధర్మం. ఈ ఉత్సవం నిర్వహిస్తే వారినవమానించినట్లే పైగా ఇన్ని సంవత్సరాల తర్వాత పూర్తిగా భిన్నమయిన వాతావరణంలో - వద్దు సుందరీ - నాకు ధైర్యంలేదు."

ఆమె భారంగా నిట్టూర్చింది.

"ఇదంతా విని మళ్ళీ మొదటికొచ్చారు. పోనీ అదంతా నాపైన వేయండి. మనిష్టాన్ని మనం ప్రదర్శించుకునే హక్కులేదా - నిరాశానిస్పృహలనుండి ప్రజల్ని ఉత్తేజపరచాలి. నగరం కళకళలాడాలి. నిజంగా ఆ రోజు చూడండి ఎంతమంది వస్తారో. బాధపడేవాళ్ళకంటే ఆనందించేవాళ్ళు ఎక్కువుంటారు కాదనకండి" గోముగా గడ్డం పుచ్చుకుని బ్రతిమాలింది.

"ఏమో నా అభిప్రాయం చెప్పాను ఆపైన నీ ఇష్టం. నిన్ను కాదనే శక్తి నాకులేదు. నా ప్రధానమైన బలహీనత నువ్వు. ఎంతో విజ్ఞానం ఉన్న దానివి. మరొక్క మారు ఆలోచించి నిర్ణయం తీసుకో."

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. ఇందులో స్వార్థం బలహీనతలు ఇవేవీ నాకు లేవు. నేను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి నడవటం నా లక్షణం. ఈ నగరంలో కొంతమంది స్త్రీలయినా అక్కగారిలా కాకూడదనే నా బాధ. దయచేసి మనస్ఫూర్తిగా ఈ కార్యాన్ని ప్రోత్సహించండి చాలు, నేను సఫలమవుతాను."

"సరే దేవీ! నీ ఇష్టం. కానీ ఒక్కమాట. ఉత్సవం బాగా జరిగిందా లేదా అనేదానిమీద నువ్వేమీ బాధపడకూడదు అలా అని మాటివ్వు" చెయ్యిచాపాడు -

ఆమె ఆ చెయ్యి అందుకుంటూ -

"అయ్యో! ఇంతేనా నన్నర్థం చేసుకుంది? ఏ కార్యమయినా మన మనస్సుకు సంబంధించింది. దానిలో జయాపజయమాలు మనవే. కనుక బాధెందుకు. సంతోషంగా స్వీకరిద్దాం. సరేనా. మీకు మాటిస్తున్నా. ఇక వ్యవధి తక్కువ కనుక ఏర్పాట్లు శీఘ్రంగా చెయ్యాలి. లోపలి వ్యవహారమంతా నేను చూస్తాను. వెలుపలి ఏర్పాట్లు మీరు చూడండి. ఎవరెవరిని పిలవాలో ఆహ్వానపత్రికలు తయారు చేయించి పంపటం మీ బాధ్యత. కాదంటే వాల్జడల ప్రహరణాలు - కలువపూల చెంపదెబ్బలు. "

"అమ్మో - నేను భరించలేను" భయం నటించాడు.

ఆ అభినయం చూసి ఆమె ఫక్కున నవ్వింది. గుప్పెడు మల్లెలు పోసినట్టు ముత్యాలు విరజిమ్మినట్లు వెన్నెలపూలు దూసినట్లు ఒక్కసారి పరిసరాలన్నీ తెల్లటి నవ్వుల కాంతిలో మెరిసాయి.

చేయి చేయి పట్టుకుని ఇద్దరూ నవ్వుకుంటూ భవనంలోకి దారితీసారు.

**********

(7)

**నదీ తీరం వెంట గ్రామాల్లో కూడా గౌతమ** బుద్ధుడు సంచరిస్తున్నాడు. ఒక్కడే కాలినడకతో అడవుల్లో కొండల్లో నిర్భయంగా తిరుగుతూ దారితప్పిన జీవితాల్లో చెడును తొలిగిస్తున్నాడు. దొంగవృత్తుల వాళ్ళనేకమంది ఆయన బోధలతో మారిపోయి సాధువులుగా జీవిస్తున్నారు. కరడు గట్టిన హంతకులు సైతం దాసోహమంటున్నారు.

నిస్వార్థమైన నడవడిక అంతులేని కరుణార్థ్రమైన చూపులు. ఎంతటి వారు సైతం బౌద్ధ భిక్షువులవుతున్నారు. కరడు గట్టిన తీవ్రవాదులు బందిపోటులు మారి సామాన్య జనజీవనంలో కలిసిపోతుంటే ఇది చక్రవర్తులకు - ప్రజలకు కొంత ఇబ్బందిగానే ఉంది. శిక్షించాల్సిన చట్టం చేతులు ముడుచుక్కూర్చోవాలి. ఆత్మీయుల్ని ఆస్తుల్ని ఎవరి మూలంగా కోల్పోయారో వాళ్ళు సన్యాసుల్లా తమ మధ్యలో తిరుగుతూ తమ ఇళ్ళకే భిక్షాటన కొస్తుంటే మొదట్లో చాలా ఇబ్బంది పడ్డారు. కానీ గౌతముడు హామీ ఇచ్చాక వారు శాంతించారు. ఈ విషయాన్ని కూడా పండితులు అవకాశంగా మలచుకోవాలనుకున్నారు. కానీ అది సాధ్యం కాలేదు. బుద్ధమతం ఉత్తుంగతరంగాలయితే ఛాందసవాదం ఒక పిల్ల కాలవలా పరుగెత్తితే గుర్తించేదెవరు.

ఒకరోజు యధావిధిగా గిరిధర పర్వత ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో బుద్ధుడు సంచరిస్తున్న సమయంలో తెలిసింది. మళ్ళీ రైతులు జలవివాదంగా తన్నుకుంటున్నారని అది విని బుద్ధుడు వేగంగా నడచి ఆ ప్రాంతం చేరాడు. అక్కడంతా గందరగోళంగా ఉంది. యువకులు కత్తులు, ముసలివాళ్ళు కర్రలతోను ఒకరి తలలొకరు బద్దలు కొట్టుకుంటున్నారు.

అప్పటికి ఎన్నోమార్లు సరిహద్దు జలాలు విషయంగా గొడవలు పడటం సర్వసాధారణమయింది. ఎంతో ప్రాణనష్టం ఆస్తినష్టం జరిగింది. శాక్యులకు కొలియులకు తరతరాలుగా వస్తున్న ఈ వివాదం కారణంగానే సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు. కానీ వారి సమస్య ఒక కొలిక్కిరాలేదు. రాజ్యాల మధ్య యుద్ధాన్ని గౌతముడు తన త్యాగం ద్వారా నివారించాడు. కానీ గ్రామాల్లోని కక్షలారలేదు. దాని ఫలితంగా ఏడాదికోసారయినా తగవులు తప్పటంలేదు. వాళ్ళ కక్షలకు ఎన్నో ఇళ్ళు తగలబెట్టుకున్నారు. పశువులను చంపుకున్నారు. ఏపుగా పెరిగిన పైర్లు నాశనమయ్యాయి. దాదాపు ప్రతి ఇంట్లో ఆ తగువుకు బలికాని వాళ్ళులేరు.

యువకులు జలరక్షణ సంఘాలేర్పాటు చేసారు. అనేక యుద్ధవిద్యల్లో శిక్షణ పొందుతున్నారు. పోరాటాలు జరిగినపుడు మరణిస్తున్నారు. తల్లిదండ్రులకు కడుపుశోకం కట్టుకున్న భార్యలకు వైధవ్యం తప్ప ఇన్నేళ్ళుగా వాళ్ళు సాధించిందేమీ లేదు.

లంచగొండులైన రాజోద్యోగులు దానికి ఆజ్యం పోసి పబ్బం గడుపుకుంటున్నారు తప్ప సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపలేఢ.

మళ్ళీ ఈ రోజు తగువు మొదలయింది. నిజానికి రోహిణీనది హిమాలయ ప్రాంతంలోనే ఉంది కనుక నీళ్ళు ఎప్పుడూ సమృద్ధిగానే ఉంటాయి. ఎగువ ప్రాంతం నుండి నీళ్ళు రానీయకుండా కులియులు కట్టవేస్తుంటారు. వాళ్ళ పొలాలు తడిసాకే క్రిందకి వదుల్తుంటారు. దానివలన శాక్యులకు ఒక్కోసారి సకాలంలో నీరందక అందినా చాలక ఇబ్బందులు పడుతున్నారు. దానివలన గొడవలే ఇవి.

ఈరోజు కూడా జరిగిందదే. పూర్తిగా నీళ్ళు రాకుండా పైన అడ్డకట్ట వేసారని తెలిసి శాక్యరైతులు అర్ధరాత్రి వెళ్ళి ఆ కట్ట తొలగించి వచ్చారు - తెల్లవారాక అది తెలిసి కులియరైతులు యుద్ధానికి వచ్చారు.

మాటలతో ప్రారంభమైన పోట్లాట చేతల్లోకి మారింది. విచక్షణ మర్చిపోయియి ఒకళనొకళ్ళు కత్తులతో పొడుచుకున్నారు. నరుక్కున్నారు. కాళ్ళు తెగి చేతులు తెగి తలకాయలు పగిలి ఆ ప్రదేశమంతా నానా భీభత్సంగా తయారయింది. వారి రక్తం రోహిణి జలాల్లో కలిసి ఎర్రగా ప్రవహిస్తున్నాయి. యువకుల ఆవేశానికి హద్దులేదు ఆడవాళ్ళు ఆక్రందనతో మార్మోగుతోందాచోటు.

అదృష్టవశాత్తూ ఎక్కువ ప్రాణనష్టం కలగకుండానే ఆయన ఆ చోటును చేరుకోగలిగారు. ఎటు చూసినా రక్తంతో తడిసిన నేల. గాయాలతో బాధపడుతూ నేలమీద దొర్లుతున్న రైతులు. వారి భార్యల ఏడుపులు. క్రోధం పెచ్చుమీరినప్పుడు మానవత్వాన్నెలా చంపేస్తుందో ఆ దృశ్యం ప్రత్యక్ష సాక్ష్యం.

ఇద్దరి గ్రామాధికారుల కరకు కరవాలాలు పైకి లేచాయి. ఒక్క క్షణముంటే ఇద్దరి మెడలు తెగి తలకాయలు క్రిందపడేవే. ఆ రెంటిమధ్యకెళ్ళి నిలబడ్డ గౌతముడు రెండు కత్తులను తన చేతులతో ఒడిసిపట్టాడు. వాటి పదునుకు ఆయన చేతులు అంగుళం లోతు గాయపడినా అతడు చలించలేదు. పవిత్ర రక్తం కత్తులమీదుగా జారి బొట్లుబొట్లుగా నేలను తాకుతోంది.

ఊహించని ఆ సంఘటనకు గ్రామాధికారులు బిత్తరపోయి చేష్టలు దక్కి అలాగే నిలబడిపొయ్యారు.

చెప్పండి యుద్ధం ఆపమని చెప్పండి. "గౌతముడు వారిని హెచ్చరించాడు.

"ఆపండి బుద్ధభగవానులొచ్చారు. యుద్ధం ఆపండి" వాళ్ళు కేకలు పెట్టారు.

ఆగిపోయింది. అంతటి ఆవేశం ఏమయిందో ఆకాశానికి లేచిన సముద్ర కెరటాలు అంతలోనే సర్దుకున్నట్లు చప్పున చల్లారిపోయింది. కొంతమంది ఆయుధాలు క్రిందపారేసి ఆయన కాళ్ళను చుట్టేసారు. రక్తం కారుతున్న దేహాలతో చేతులు జోడించి నిలబడ్డ రైతులను చూచి ఆయన చలించిపోయారు.

"భగవాన్! మీరు తప్ప మా సమస్య మరెవ్వరూ పరిష్కరించలేరు. సంవత్సరాలుగా కొనసాగుతున్న జలవివాదం పెరుగుతుందే తప్ప పరిష్కారం దొరకటంలేదు" అని మొరబెట్టుకున్నారు.

స్త్రీలు దూరంగా నిలబడి దండంపెడుతూ.

"సామీ! మాకో మార్గం చూపండి. మా కళ్ళముందే కట్టుకున్నాళ్ళు, కన్నాళ్ళు చచ్చిపోతుంటే మేం చూడలేకపోతున్నాం. ప్రశాంతంగా ఉండాల్సిన మా పల్లెలు రక్తపు కొల్లులయ్యాయి. మా జీవితాల్లో ప్రశాంతత లేదు. ముక్కుపచ్చలారని మా కూతుళ్ళు పసుపుకుంకాలు దూరమై ఏడుస్తుంటే జీవచ్ఛవల్లాగా చూస్తున్నాం. ఏ ఇంట చూసినా తాళితెంపుకున్న ఇల్లాళ్ళు ఒకరిద్దరో ఉండే ఉంటారు. నెలలు మోసి కని ఇన్నేళ్ళు పెంచి చివరకు ఈ జలానికి బలిస్తున్నాం. మాకేదో మార్గం చూపెట్టండి. ఈ అన్యాయాల్ని చూసే ఓపిక మాకికలేదు" అందరూ పెద్దపెట్టున రోదించారు.

బుద్ధుడందరిని శాంతపరిచాడు.

"సోదరులారా! నేనెందుకు రాజ్యం విడిచిపెట్టి వెళ్ళానో తెల్సుగా. కేవలం మీ విషయం మీదే. మీరు శాంతి సామరస్యాలతో కలసి బ్రతకాలనే సన్యాసం తీసుకున్నాను. నా తండ్రిని భార్యాబిడ్డలను రాజ్యాని వదిలిపెట్టింది. ఇటువంటి హింసరాకూడదనే. కానీ మళ్ళీ నా కళ్ళముందే మీరిలా చంపుకుంటే నా త్యాగానికి అర్ధమేమిటి? ఈ తగాదావల్ల మీరు సాధించిందేమిటి బహుశా పోగొట్టుకుందే ఎక్కువనుకుంటాను.

"అవును స్వామీ! ప్రతి కుటుంబంలో తరానికి ఒకళ్ళిద్దరయినా చనిపోయిన వాళ్ళున్నారు. పోయిన వాళ్ళగురించి ఏడుస్తూనే మళ్ళీ చావనికి సిద్ధపడుతున్నాం. ముత్తయిదువుల కంటే ముండమోపులే ఎక్కువ మా గ్రామాల్లో" ఒక రైతు చెబుతూ ఆవేదనగా కళ్ళు తుడుచుకున్నాడు.

"ఇన్నాళ్ళుగా దీన్ని పరిష్కరించటానికి ఎవరూ ముందుకు రాలేదా!"

"ఏదో వస్తుంటారు నాలుగు డబ్బులు తీసుకుని ఇదిగో అయ్యింది అదిగో అయిపోయింది అని చెబుతూనే ఉన్నారు. ఇంతవరకు పూర్తిచేసిన వాళ్ళెవరూలేరు"

"చూడండి. నాకు ఈదేశం ఆ దేశం అనే తేడాలేదు. ప్రపంచ మానవాళి అంతా ఏకం కావాలని నా కోరిక. రాజ్యాలు, రాజులు, గొప్పవాళ్ళు, తక్కువవాళ్ళు, కులాలు, మతాలు దీనికోసం ఘర్షణలు ఒకళ్ళకొకళ్ళు చంపుకోవటం, ఇవేవీ నచ్చకే అడవులకెళ్ళి తపస్సు చేసాను. బుద్ధాన్ని సాధించాను.

"యుద్ధం మనిషిలో హింసావాదాన్ని అధికార వ్యామోహాన్ని పెంచుతుంది. ఎంతోమంది స్త్రీలు అనాధలౌతారు. అంతేకాదు వైరం వైరాన్ని పెంచి మనిషికి మనిషికి, మనసుకు మనసుకు మధ్య మరింత వైషమ్యం కలిగించి మరణాన్ని ముగింపుగా ఇస్తుంది. దానివలన ఉపయోగమేమిటి ఆలోచించి చూడండి. కత్తితో సాధ్యంకాని పని ప్రేమతో సాధ్యమవుతుంది. వైరం కంటే సామరస్యంతో సమస్యల్ని పరిష్కరించుకోవాలి. హింసావాదం వివేకాన్ని చంపి, చివరకు తనను చంపుకుంటుంది. అందుకే నామాటినండి. దీనికో పరిష్కారం ఈరోజే చేద్దాం. దానికి కట్టుబడి మీరంతా స్నేహంతో మెలుగుతానని భవిష్యత్తులో మరెన్నడూ తగవులకు పోమని నా మీద ప్రమాణం చేసి చెప్పాలి"

"తప్పకుండా దేవా! మాకంతకంటే ఏం కావాలి. మరుభూముల్లాంటి మా బతుకుల్లో పండ్ల చెట్లు మొలిపిస్తాయంటే అంతకంటే సంతోషం ఏముంది. మీరే పరిష్కారం చెయ్యండి. ఇదిగో రెండు రాజ్యాల గ్రామాధికారులంతా ఇక్కడే ఉన్నాం. మేము ప్రమాణం చేస్తున్నాం ప్రత్యక్షదైవం ఈ బుద్ధభగవానుడి పాదాల సాక్షిగా మీరు సూచించిన మార్గానికి కట్టుబడి ఉంటాం. మేమెన్నడూ తగువు జోలికి వెళ్ళం. మాకన్నతల్లి భూదేవి సాక్షిగా మీకు మాటిస్తాం" అని రైతులంతా మట్టిపట్టి ప్రమాణాలు చేసారు.

ఆనందంతో కలువపూవులా బుద్ధుడి ముఖం వికసించింది. వారందరిని ఆయన ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

"అందరూ ప్రశాంతంగా కూర్చోండి. మనలో మనమే ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకువద్దాం. అసలు వివాదానిక్కారణం జలాలని తెలుసు. ఎగువదిగువ ప్రాంతాలకు సర్దుబాటు చేసుకోవటంలో వస్తుంది గొడవంతా" ఒక గ్రామాధికారి చెప్పాడు. శాక్యగ్రామాధికారి లేచి -

"బాబూ! మాకు సరిగ్గా పంటల సమయంలోనే నీళ్ళందకుండా చేస్తున్నారు. ఒకవేళ ఇచ్చినా సరిగ్గా అదనుకు మళ్ళీ పైన కట్టలు కడుతున్నారు. ఇదేమని అడిగితే పోట్లాట కొస్తున్నారు. ఇదే గొడవ ఇన్ని సంవత్సరాలనుండి"

దానికి కులియులు స్పందిస్తూ -

"స్వామీ ! మీరే చెప్పండి న్యాయం మా పొలాలు తడుపుకోకుండా నీళ్ళొదలమంటే ఎలా విడిచి పెట్టాలి. మా పొలాలు తడిసాక తడుపుకోకుండా నీళ్ళొదలమంటే ఎలా విడిచిపెట్టాలి. మా పొలాలు తడిసాక ఆలస్యంగానయినా విడిచిపెడ్తున్నాంగా. ఇంకేందుకు గొడవ. అనసవరంగా మాతో గొడవ పెట్టుకుంటున్నారు" ఫిర్యాదుచేసారు.

'నీరు వదిలేటప్పటికి పంటల అదను పోవటం లేదా తర్వాత నీళ్ళొచ్చి ప్రయోజనమేముంది. సమయంలో తడిస్తేనేగా భూమి దున్నుకునేది. లేకపోతే ఏముంది సంత్సరమంతా ఏడుస్తూ కూచోవాలి' శాక్యరైతు ఆవేదన.

'మీ పొలాలకేం బంగారం కొంచెం తడిస్తే చాలు. మావట్లాకాదుగా బాగా తడిస్తే పంటలు పండవు. మీకు నీళ్ళన్నీ ఇచ్చిమేమెండుకోవాలా?' కులియల సమాధానం.

రెండువైపుల వాదనలు ప్రశాంతంగా విన్నాడు గౌతముడు. ఇద్దరిని శాంతింపచేసాడు.

"చూడండి మనం మనుష్యులం, మిగిలిన పశుపక్ష్యాదుల కంటే ఆలోచన ఉన్నవాళ్ళం. ఈ ప్రకృతిలో పంచభూతాలు నిప్పు, నీరు, గాలి, భూమి, ఆకాశం ఇవి అందరికీ సమానం. వాటిని స్వేచ్ఛగా అనుభవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. వాటికోసం జంతువులే పోట్లాడుకోవటం లేదు. పక్షులు చంపుకోవటం లేదు. మరి తెలివున్న మనం ఏం చేస్తున్నాం భూమికోసం తగవు, నీళ్ళకోసం నిప్పుకోసం ఇలా ప్రతిసమస్యకు ఒక పరిష్కారం ఉంది. దానిని సమన్వయం చేసుకుని సహనంతో సరిదిద్దుకునేవాడే మనిషి. ఏమున్నా లేకపోయినా సృష్టిలో కోట్లాది జీవులు బ్రతుకుతుంటే అన్నీ ఉన్న మనం మత్సరంతో బ్రతుకుతున్నాం. మన ద్వేషాన్ని చల్లార్చుకోటానికి ప్రాణాల్నే బలిపెడుతున్నాం.పోయిన ప్రాణం తిరిగి తీసుకురాగలరా"

"సహనశీలియైన భూమాతను మీ ద్వేషంతో కలుషితం చేస్తున్నారు ఎన్నాళ్ళు ఈ పోరాటం ఎన్నేళ్ళు ఈ నరబలి. ఇంకా ఇది కొనసాగాలనే కోరుకుంటారా?

"వద్దు వద్దు ఈ కథకొక ముగింపు ఇవ్వండి" అందరూ ఒక్క పెట్టున అరిచారు.

"చూడండి - తగాదాల పేరుతో ఒకళ్ళనొకళ్ళు చంపుకుంటే చివరికి మిగిలేదేమి శ్మశానం తప్ప. పదిమందికి అన్నం పెట్టే రైతు సహనశీలిగా ఉండాలి. భూమి, జలం నీదికాదు నాదికాదు. ఒకరోజు గాలికూడా ఈ శరీరాన్ని విడిచిపెడుతుంది. ఎంతోమంది నాది నేను అనే అహంకారంలోనే నశించిపోయారు. వేటికోసం వినాశనం సృష్టించుకున్నారో అవిమాత్రం శాశ్వతంగా ఉన్నాయి. ఎందరినో మోస్తూ - మరెందరికో దారి ఇస్తూ వాటికి మాత్రం అహంకారంలేదు.

"ఈ సమస్యకు నాకు తోచిన మార్గం నేను సూచిస్తాను. ఉభయదేశాల రైతులు నీటిని వాడుకునే విషయంలో ఒక ఒప్పందానికి రావటం మంచిది. సహజంగానే ముందు పై పొలాలు తడుస్తాయి. అదే సమయంలో కొంతనీరు దిగువ పొలాలకు విడచిపెట్టండి. కొంత తడిసిన భూముల్లో నారుపోసుకోవటానికి వీలుంటుంది. రెండోసారి పుష్కలంగా నీళ్ళు ఇవ్వొచ్చు. ఇది మీ ఇద్దరికి అంగీకారమయితే పత్రం వ్రాసుకుని దానిమీద అందరూ సంతకాలు పెట్టండి."

చాలాసేపు రైతులు తర్జన భర్జనలు పడ్డాక అందరకు అంగీకారం కుదిరింది.

జలాలు సమానంగా పంచుకోవాలనే విషయం మీద ఒప్పందానికొచ్చారు. అప్పటికప్పుడే తాటాకు పత్రాలు మీద కొన్ని షరతులతో రాసుకుని సరిహద్దు రైతులు సంతకాలు పెట్టారు. ఇద్దరూ కలిసే ఆ పత్రాన్ని గౌతముడి పాదాల దగ్గర ఉంచి నమస్కరించారు.

ఇక అక్కడ ఆనందం. సముద్రంలా పొంగింది. నింగిని తాకింది. ఒకళ్ళనొకళ్ళు చేతులు చేతులు కలుపుకున్నారు. గాఢంగా కౌగిలించుకున్నారు. ఇన్నేళ్ళ పగ, క్రోధం ఏమయ్యాయో పరస్పరం ప్రేమాలింగనాలు చేసుకున్నారు.

స్త్రీలయితే మరీ. సాక్షాత్తూ తమ భాధలు తీర్చటానికొచ్చిన దైవంలా కొలిచారు. ధూపదీపాలు పండ్లు పూలు సమర్పించి భక్తిగా సాష్టాంగపడ్డారు. ఇక నిశ్చింతగా బ్రతకవచ్చు. ఇక కడుపుకోతలు, తాళితెగటాలు ఉండవు. అంతా జయజయధ్వానాలు చేస్తున్నారు.

"బుద్ధదేవుడికి జయముగుగాక

కరుణమతం వర్ధిల్లుగాక

సత్యమార్గం శాశ్వతమగునుగాక"

మైత్రికి చిహ్నంగా ఆ రాత్రి శాక్య రైతులు కులియులను విందుకాహ్వానించారు. భారీ ఏర్పాట్లు సాగుతున్నాయి. కానయితే మునుపటిలా ఆ విందులో ఎక్కడా మాంసాహారాలు లేవు.

మంచితేనె, మధురఫలాలు శాక్యాలు తప్ప మదిరలు కూడా లేవు. ఇంత ఆనందానికి కారకుడయిన ఆ తేజోమూర్తి మాత్రం సూర్యాస్తమయం వైపు ఉదయిస్తున్న సూర్యుడిలా కదలిపోయాడు.

ఒక వైపు గౌతముడి కీర్తి ప్రభలు పెరుగుతుంటే మరోవైపు వ్యతిరేకులు వాళ్ళ దుష్ప్రచారం సాగిస్తున్నారు. వారికి నాయకుడు దేవదత్తుడు. అతనిలో రోజు రోజుకు అసహనం పెరుగుతూనే ఉంది . ప్రతి సంఘటనలో అవమానాలు ఎదుర్కొంటున్నా ఇంకా అతనికి బుద్ధిరాలేదు.

అతడు కూడా గుండు చేయించుకుని కాషాయ బట్టలు కట్టుకున్నాడు. తాను మారిపోయానని తనను కూడా శిష్యుడిగా స్వీకరించమని అడిగాడు.

బుద్ధుడు ఔననలేదు, కాదనలేదు. నిజమైన పరివర్తన వచ్చినప్పుడు చూద్దాం అనుకున్నాడు. రోజూ ఆశ్రమానికి వెళ్ళొస్తున్నా అక్కడేం ప్రాధాన్యత లభించలేదు. "నిష్కారణమేవ వైరిణో జగతి" అన్న సామెతగా అవతలివాళ్ళు అపకారం తలపెట్టటానికి ఏకారణాలూ పనిలేదు. వాళ్ళ ఈర్ష్యాసూయలే మంచివాళ్ళకు అడుగడుగున అవరోధాలు కల్పిస్తుంటాయి. తేలు ఎందుక్కుడుతుంది. పామెందుక్కరుస్తుంది. దానికయినా ఒక కారణముందేమోకాని ఈర్ష్యాపరులకు కారణాలతో పనిలేదు. వాళ్ళలో లేని మంచితనాన్ని చూసి అసూయపడుతుంటారు. మంచిని అడుగడుగున అవమానించాలనుకుంటారు. ఇది నైజం - అందువల్లనే మంచితనం కష్టాలుపడ్డా కీర్తి సంపాదిస్తుంది. చీకటుంటేనే కదా వెలుతురు విలువ.

ఒకనాటి రాత్రి యశోధర మందిరం ముందు ఒక బౌద్ధభిక్షువు నిలుచున్నాడు. కావలివాళ్ళు అతడికి భక్తితో నమస్కరించారు.

వచ్చిన భిక్షువు యశోధరాదేవిని కలుసుకోవాలని చెప్పాడు.

ఆ వార్త విన్న వెంటనే ఆమె భిక్షువును తన అంతఃపురంలోకి ఆహ్వానించింది.

రండి భిక్షూ! ఈ ఆసనం అలంకరించండి. మీరాక నాకెంతో సంతోషంగా ఉంది. పౌర్ణమినాటి ఏర్పాట్లు బాగా సాగుతున్నాయా! ఆశ్రమంలో ఏ లోటూ లేదుకదా. మీ గురువుగారు కుశలమేనా?" అన్నీ అడుగుతూనే పరిచారికలతో పాలుపండ్లు తెప్పించింది. అవి ఆరగించాక.

"ఇప్పుడు చెప్పండి మీకోసం నేనేం చెయ్యగలను"

"అంటే మీరు నన్నింకా గుర్తుపట్టలేదా వదినగారూ"

ఆమె ఒక్కసారి త్రుళ్ళిపడింది.

"వదినగారా? అంటే మీరు.. మీరు బుద్ధుడి శిష్యులుకారా, మరెవరు? ఈ సమయంలో ఎందుకొచ్చారు?" ఆమె కంఠంలో ఆందోళన తొంగిచూసింది.

"నేను దేవదత్తుణ్ణి, మీ మరిదిని"

"మీరు ఈ వేషం ఏమిటి? సన్యాసం ఎప్పుడు తీసుకున్నారు?"

"సన్యాసమా! పాడా! ఇదొక వేషం. అన్నగారిని నమ్మించటానికి, ఆశ్రమంలో నేను పనికిరానట. ఆయన శిష్యులే ముఖ్యులట. అందుకే అవమానం భరించలేక ఇక్కడికొచ్చాను - మీరయిన చెప్పండి. స్వంతవారిపట్ల అన్నగారి విముఖత. న్యాయమేనంటారా?" అప్పటికే ఆమె ముఖం మ్లానమయింది.

"ఇది మీకు పద్ధతిగా ఉందా? భిక్షువు వేషం వేసుకుని నా అంతఃపురానికి రావల్సిన అవసరం ఏమిటి?"

"అవసరం ఉంది కనుకనే వచ్చాను. ఆయన వలన మీరు అవమానపడ్డారు. నేనూ అవమాన పడ్డాను."

"అయితే"

"మనిద్దరం కలిసి పగతీర్చుకోవాలి"

"పగా - వారిమీదా ప్రజలందరూ దైవంగా ఆరాధిస్తున్న ఆయనేం ద్రోహం చేసారు మీకు, నాకు" ఆమె కళ్ళలో క్రోధఛాయలలుముకుంటున్నాయి.

"ఎంత అమాయకులు మీరు. ఆయనే సర్వస్వం అనుకుని నమ్మి వచ్చినందుకు మీ జీవితాన్ని వ్యర్థం చెయ్యలేదా, మీ యవ్వనంంతా అడవికాచిన వెన్నెల విధంగా లేదా. బ్రతుకంతా ఇలాగే మోడులాగా బ్రతకాలి. సన్యాసం పేరుతో ఊళ్ళు పట్టుకు తిరుగుతుంటే మీకొరిగేదేముంది. అందుకే మీరు ఒప్పుకుంటే మిమ్మల్ని వివాహం చేసుకుంటాను. అప్పుడుకాని గౌతముడికి బుద్ధిరాదు" ఇంకా మాటపూర్తికాలేదు. ఆమె కొట్టిన దెబ్బకు కళ్ళు తిరిగి క్రిందపడిపోయాడు. తామరతూడుల్లాంటి ఆ చేతుల్లో అంతబలం ఎలా వచ్చిందో ఆమెకే తెలియదు. పడిపోయిన దేవదత్తుణ్ణి లేపి కూర్చోబెట్టింది.

"చూడు బాబూ! బిడ్డ పశువులా మారితే తల్లి ఇలాగే దండించి దారిలో పెడుతుంది. మరిది అంటే బిడ్డతో సమానం. వయస్సుకాదు ప్రధానం మనసు. స్థానం కూడా గుర్తించాలి. శాక్యవంశానికే కాదు మనదేశానికేకాదు. ప్రపంచానికే పూజనీయుడతను. అతని భార్యను నేను. నీ తల్లి స్థానంలో ఉన్నదాన్ని. జంతువులకు వావివరసలు తెలియవు. అవి గడ్డి తింటాయి కనక, నువ్వు అన్నం తింటున్నావు. మరి ఇంత నైచ్యమెక్కడినుండి వచ్చింది. శలభం దీపానికి ఆకర్షింపబడి దాని జ్వాలలో దగ్ధమైనట్లు నువ్వుకూడా పెనుమంటనాహ్వానిస్తున్నావు. కన్నతల్లి కూడా కాముక దృష్టితో చూసే నీవంటి కాపురుషులకు కనువిచ్చుకునే రోజు వస్తుంది. ఒకవైపు నీవు చేస్తున్న పాపాలు మరోవైపు ఉత్తములకు తలపెడుతునన్ హాని. రెండువైపులా కోరి నరకాన్ని ఆహ్వానిస్తున్నావు. రాహులుడెంతో నువ్వూ అంతే. చివరిసారిగా ఈ తల్లి చెబుతున్న మాటలనర్థంచేసుకోవటానికి ప్రయత్నించు. నాలుగ్గోడలమధ్య మనం చేసే పాపం ఎవ్వరూ చూడరనుకోకు. దైవం కళ్ళు విశాలమైనవి. ఆ దృష్టినుండి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఇకనైనా ఈ చెడ్డబుద్ధి వదలి పవిత్రమూర్తి మీ అన్నగారి అంతర్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. ద్వేషమనే ముసుగు తొలిగినప్పుడు ప్రేమనే వెలుతురు కనిపిస్తుంది. మంచి భవనానికి పునాది సత్సంకల్పం. ఆ ఆలోచనలు సక్రమంగా నడిపించుకుంటే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది. మీ అమ్మగారు - నాన్నగారు అందరూ సంతోషిస్తారు. నా మాటలు విని మంచిమనిషిగా మారితే ఈ భవనంలో అడుగుపెట్టు లేదా పశువులా అడవిలో సంచరించు. వెళ్ళు. ఇప్పటికే నీ గాలివలన అపవిత్రమైన ఈ చోటును శుభ్రపరచాలి. వెళ్ళు దేవదత్తా! వెళ్ళి మనిషిగా మారి తిరిగిరా. ఈ అమ్మ ప్రేమకు ఏ లోటూ లేదు.

"అతడు ఒక్కమాట కూడా మాట్లాడలేదు. మౌనంగా వంగి ఆమె పాదధూళి గ్రహించి గిర్రున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు. ఈ వార్త ప్రధాన చెలికత్తె ద్వారా గౌతమికి తెల్సింది. ఆమె బాధకు అంతులేదు. కోడలి చేతులు పట్టుకుని ఏడ్చింది. యశోధర ఓదార్చింది. శుద్ధోధనుడు విన్నాడు. భారంగా నిట్టూర్చాడు. తులసి వనంలో ఈ గంజాయి మొక్క ఎలా వచ్చిందో? తండ్రి నోటి వెంట గౌతముడు విన్నాడు. ఎందుకో క్షణకాలం అతడి మనస్సులో యశోధర పట్ల ప్రేమ గౌరవం రెట్టింపు పెరిగినట్లనిపించింది. ఆమె ప్రవర్తన మహిళలందరికీ ఆదర్శమని తండ్రిముందు పొగిడాడు. ఆ వార్త తెలిసి యశోధర పొంగిపోయింది. తన జన్మకింత కంటే సార్థకత ఏంకావాలి - తన మనస్సును భర్త గుర్తించాడు చాలు - అదే పదివేలు.

పౌర్ణమి ఇంకా మూడురోజుల్లోకి వచ్చింది. నగరంలో ఏర్పాట్లు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. అన్ని దేశాలనుండి అనేకమంది వస్తున్నట్లు శుద్ధోధనుడికి కబుర్లందుతున్నాయి. దీక్షలకు కావలసిన బట్టలు వస్తువులు తయారవుతున్నాయి.

శాక్యరాజ్యం ఏర్పడ్డాక చూడనంత పెద్ద వేడుక జరగవచ్చని నగరపౌరులు ఊహాగానాలు చేస్తున్నారు.

సాయంత్రమయింది. చైత్రమాసం గాలులు కొంచెం చల్లబడ్డాయి. వసంతఋతువు నగరశోభనే మార్చివేసింది. ఎక్కడ చూసినా పచ్చదనం పమిట వేసుకున్నట్టుంది. గున్నమావిడి చెటమీద గండుకోయిలల పలకరింపు. కుర్రకారు ప్రతిసమాధానాలు. పూచిన పున్నాగలు

నగరకన్య చెవిపోగుల్లా వేలాడుతున్నాయి. గుత్తులు గుత్తులుగా మన్మథబాణాలు ముద్దమందారాలు లత్తుక పూలు సాయం సంధ్యకు తమ రంగు అరువివ్వటానికి పోటీపడుతున్నాయి.

రోహిణీ నదిపై నుండి వస్తున్న తరంగాల నిస్వనం భృంగాల ఝుంకారం మదనుడి క్రీడోత్సవానికి రంగం సిద్ధం చేస్తున్నట్లుంది.

నందుడి మందిరం కూడా గౌతముడి మందిరానికేమాత్రం తీసిపోదు. చలువరాతితో మెరిసిపోతూ లే ఎండలో రే ఎండలా ప్రకాశిస్తూ ఉంటుంది. ఏ ఉద్యానవనంలో లేని ప్రత్యేకత సుందరి తోటలో ఉంది. అవే రాయంచలు. ఆమె మక్కువపడి ఎక్కడినుండో తెప్పించింది. మొదట్లో జనం వాటిని చూడటానికి వేలం వెర్రిగా వస్తుండేవాళ్ళు. అవంటే ఆమెకు ప్రాణం. ఏ మాత్రం సమయం దొరికినా వాటితోటే ఆడుకుంటుంది.

ఈ రోజుకూడా సరోవరం ప్రక్కన చలువరాతి తిన్నెమీద కూర్చుని హంసల ఆగడాన్ని చూసి ఆనందిస్తోంది. అప్పటికి మాలికను మూడుసార్లడిగింది. యువరాజుగారు రాలేదా అని. నందుడు లేకుండా కూర్చోవటం ఆమెకు విసుగ్గా ఉంది. ఈ సాయం సంధ్యలోని అందాలను ఇద్దరూ పంచుకోవాలి. అందుకే మాటిమాటికీ తలతిప్పి తోట ద్వారంవైపు చూస్తోంది.

"మాలికా! మరొక్కసారి చూడవూ. నీలాంగుడిని ప్రధాన మార్గంలోకి వెళ్ళి చూడమను. వేటకెళ్ళిన మనిషి తిరిగిరావటానికింత ఆలస్యమా?"

"అలాగే దేవీ ఇప్పుడు పంపించివస్తాను. తమకు తోడుగా నీలాలకను పిలవమంటారా?"

"వద్దు. ఈ ప్రశాంతతను నన్నొక్కదాన్నే అనుభవించనీ - నువ్వెళ్ళిరా"

"దేవిగారు నా కోసం ఎక్కువగా నిరీక్షిస్తున్నారా?" మాటలోనే నందుడొచ్చాడు. అతడిని చూడగానే ఆమె ముఖం కలువలా వికసించిద్మి. అయినా తెచ్చిపెట్టుకున్న అలకతో -

"ఎంతసేపటినుండి మీకోసం నిరీక్షిస్తున్నానో తెలుసా. ఈ అందమైన సాయం సంధ్యను మీరెక్కడ వదులుకుంటారోనని బాధపడ్డాను"

"ఈ సాయంత్రం కంటే అందమైన నిన్ను నీతో గడిపే మధురక్షణాలు అసలు వదులుకోగలనా?"

ఆమె ప్రక్కనే చతికిలబడ్డాడు.

"అరె. స్నానం కూడా పూర్తిచేసారే"

"అవును. దేవి దగ్గర కెళ్ళేటప్పుడు శుచిగా వెళ్ళాలి. లేకపోతే ఆమెకాగ్రహం వస్తుంది"

"మాటలతో నన్ను మత్తులో ముంచుతారు. ఆలస్యానికి కారణం మాత్రం చెప్పరు"

"ఈ రోజు వేటలో ఏం జరిగిందనుకున్నావు?"

"ఏమయింది నాథా! వేటలో ఏమయినా విశేషమా?"

"అవును దేవీ. ఆ సంఘటన నుండీ నా మనస్సు మళ్ళటం లేదు. ఎంత మర్చిపోదామన్నా మరపురావటం లేదు. మనసంతా భారంగా ఉంది. అందుకే రాగానే స్నానం చేసాను."

"అయితే ఇలా రండి. నా ఒళ్ళో తలపెట్టుకోండి. కొంత ఉపశమనంగా ఉంటుంది. నందుడామె చెప్పినట్టే చేసాడు.

"చూడండి. కాసేపు ఈ ప్రకృతి సౌందర్యాన్ని. మనసు విషయం నుండి మళ్ళిస్తే కొంత ఆందోళన తగ్గుతుంది. ఈగాలి, పూలు, సరోవరం, హంసలు ఇంత సౌందర్యాన్ననుభవిస్తున్న మానవులెంత సంపన్నులు.

"కానీ వాటినెంతమంది ఆస్వాదించగలరు దేవీ! మనలాంటి సంపన్నులకు ప్రకృతివరం. కడుపుకాలే పేదవాళ్ళేం అనుభవిస్తారు?"

"ఈరోజు మీ మనస్సేంబావుండలేదు. పోనీ ఏం జరిగిందో చెప్పండి. కొంతభారం తగ్గుతుంది" మెల్లగా అతని తలనొక్కుతూనే అడిగింది.

"పొద్దున్నే ఆర్యమైత్రుడితో కలిసివేట కెళ్ళాను కదా. వేటలో అనుకోని సంఘటన ఒకటి జరిగింది. ఉదయం నుండి మధ్యాహ్నం దాకా ఎంత తిరిగినా చిన్న చిన్న పక్షులు కుందేళ్ళు తప్ప మాకు పెద్దమృగమేమీ తగల్లేదు –

"బాగా అలసిపోయారా!"

"అవును ఎండవల్ల బాగా అలసిపోయి ఒక చెట్టు క్రింద విశ్రాంతిగా కూర్చున్నాం. అంతలో బాగా బలిసిన దుప్పి ఎదురుగా పొదల్లో తిరుగుతూ కనబడింది. దానిని చూడగానే ఉత్సాహంతో విల్లుబాణాలు తీసుకుని దాని వెంటపడ్డాను – ఎంత దూరం పరుగెత్తానో నాకే తెలియలేదు.

"అప్పుడేమయింది. పరివారం వెంటలేదా?"

ఆమెలో ఆందోళన.

"లేరు. వారంతా వెనకబడిపోయారు. తీరా చూసుకుంటే నేనొక్కడినే ఉన్నాను. అదికూడా బాగా బలంగా ఉండటంతో చాలా వేగంగా పరుగెడుతోంది. తుప్పలు, పొదలు డొంకలు, గుట్టలు దాటుకుంటూ పరుగుతీసింది. అబ్బ. ఎంత అలసిపోయాననుకున్నావు. కనిపించినప్పుడల్లా పటుదలగా బాణాలు విడుస్తూనే ఉన్నాను"

"మీ బాణాలు వ్యర్థమయ్యాయా? ఆశ్చర్యంగా ఉందే ఈ శాక్యదేశంలోనే మీ అంతవిలుకాడు లేడని ప్రతీతి. ఊ! తర్వాతేమయింది" కుతూహలంగా అడిగింది.

"నిజమే తిన్నగా ఉంటే బాణం తప్పిపోదు. అడ్డదిడ్డంగా పొదలను చాటుచేసుకుని పరుగెడుతుంటే ఏం చేయగలను. పరుగులో అంత లాఘవాన్ని మునుపెన్నడూ ఏ జంతువులో చూడలేదు. ఆ వేగానికి తగ్గట్టే రూపం కూడా నుదుటిమీద కృష్ణవర్ణపు మచ్చ. ఇప్పటికీ నా కళ్ళముందునుండి తొలగటం లేదు"

"అయితే చంపేసారా?" పాపం జాలిగా అడిగింది.

పూర్తిగా విను. ఏం జరిగిందో. నన్ను అంత తిప్పలు పెట్టింది. చివరకు పొదల్లో మాయమయింది. చాలాసేపు పొదల్లో వెదికాను. కనిపించలా – మధ్యాహ్నం దాటిపోయింది. చీకటిపడి క్రూరమృగాలు బయటికొస్తాయి. నేను ఒక్కడ్నే ఉన్నాను. ఇకదానిమీద ఆశవదులుకుని వెనక్కు మళ్ళాను. తిరిగివస్తుంటే అక్కడే పొదలకవతలగా నేను వేటాడిన మృగం చచ్చిపడున్నది.

"మీ బాణం తగల్లేదన్నారుగా. మరే జంతువయినా చంపిందా?"

"కాదు దేవీ! దాని ఒంటిమీద చిన్నగాయం కూడాలేదు"

"మరెలా?" ఆమె కళ్ళు విప్పార్చి చూసింది.

"అదే నా బాధకు ప్రధానకారణం. అది బాణం తగిలి మరణించినా ఆలోచించి ఉండేవాడిని కాదు. అది మరణించింది కేవలం ఆయాసంతో. ఏ దెబ్బ తగలకుండా అధిక శ్రమ వలన చనిపోవటం చాలా విషాదం అనిపించింది. ఎంత మర్చిపోదామన్నా ఆ సంఘటన మరుపురావటం లేదు దేవీ! అదే నా మనస్సుకలతకు కారణం"

"నిజంగా బాధాకరమైన సంఘటనే. కొన్ని విషయాలు మనస్సును ఎక్కువగా కదిలిస్తాయి. అయితే దాన్నిగురించి ఆలోచించి మీ మనశ్శాంతిని దూరం చేసుకోకండి. ఇక ఆ విషయాన్ని మర్చిపోండి" తన చీర కొంగుతో అతని ముఖాన్ని తుడిచింది.

మెల్లగా వీవనలాగా విసురుతోంది.

"లేదు దేవీ సాధ్యపడటంలేదు. ఇంత ఆహ్లాదకరమైన వాతావరణంలో కూడా మనసును మళ్ళించలేకపోతుందంటే ఆ విషయం నా మీద ఎంత ప్రభావం చూపిందో అర్థం చేసుకో!

"నిజమే ఎక్కడో అడవిలో చచ్చిన మృగం కోసం అందమైన ఈ సాయంత్రాన్ని వృధాచేస్తారా. ఇటుచూడండి గుట్టగా రాలిన విరజాజులు. వాటి రంగుల మిళితం అద్భుతంగా ఉందికదూ. ఆ మాధవీలత మామిడిచెట్టును పెనవేసుకుని ఎంత వయ్యారాలు పోతోందో. నాలాగా" అని భర్తను కౌగిలించుకుంది. అయినా అతనిలో చలనం లేదు.

"ఇటుచూడండి. ఈ రోజు సన్నజాజి మొగ్గలు, ఆకుల్ని కనిపించనీయటం లేదు కోసిపెట్టరూ"

మల్లెల గుబాళింపు మత్తెక్కిస్తోంది.

ఆమె ఎంత రెచ్చగొడుతున్నా అతడు తన స్థితినుండి బయటకు రావటంలేదు - పైగా....

***********

(8)

**"ఉండు సుందరీ! నన్ను కొంచెం** సేపు ప్రశాంతగా ఉండనీ" అంటున్నాడు.

"ఏమండీ మీ బాధకు మిమ్మల్ని వదిలేయనా?. అదేం కుదరదు. మీరు బయటకు రావాల్సిందే హాయిగా ఈ రాత్రి మన సొంతం కావాలి. పోనీ ఒక పనిచేయనా?"

"ఏం చేస్తావు"

"పాటపాడనా?"

"సరే..పాడు"

"పాట నచ్చితే నాకు బహుమతి ఇవ్వాలి"

"ఏ బహుమతి కావాలి"

"చెప్పనా?" ఆమె కళ్ళల్లో కవ్వింపు.

"ఊఁ చెప్పు" అతడు కూడ కొంతదారిలో పడ్డాడు. ప్రియురాలు కన్నుగీటి కవ్విస్తుంటే ప్రతిస్పందించని రసికులెవరు?

"తనవిదీరా నన్ను ముద్దుపెట్టుకోవాలి. ఆ చుంబనం కనీసం కొన్ని ఘడియల కాలం ఉండాలి. పెదవులు వేరుచేయకూడదు. సరేనా?"

హఠాత్తుగా నందుడు లేచి కూర్చున్నాడు. అప్పటికే అతని కళ్ళల్లో ఎర్రజీరలు అలముకుంటున్నాయి. అప్పుడప్పుడే పరిసరాల ప్రభావం అతనిపై మెల్లగా పరచుకుంటోంది -

తియ్యటి గొంతుతో కోయిలలు సిగ్గుపడేలా ఆమె గొంతు విప్పింది.

**"మల్లెల వేళలో**
**మనోజ్ఞ సీమలో**
**వలపు గీతి పంటగా**
**విహరింతుమా ప్రియా!**
**విరహమెరుగని వాకిట**
**కమ్మని సుమతావుల్లో**
**కరిగిపోని కౌగిళ్ళ కలలే కందామా**
**బ్రతుకంత నిండుగా**
**మదురసేహం కరగనీకుమా**

**మధువు కురిసే ఆమనిలో**

**పరిమళాల పాన్పుపై**

**పరువాలు పండగా"**

తీగెలా ఆమె గొంతులో సాగిపోతున్న మధురగానానికి ప్రకృతి పరవశించింది. ఉపాయనంగా గుప్పెడు మల్లెలు ఆమె మీద రాలాయి. నందుడానందంగా కౌగిలించుకున్నాడు.

"ఎంత తియ్యటి గొంతుదేవీ! బహుశా సరస్వతి దగ్గర అరువు తెచ్చుకున్నావేమో! పాటకూడా కొత్తగా ఉంది" మధ్యమధ్యలో మదిరనాస్వాదిస్తూ ఆమె పెదవులను చుంబిస్తున్నాడు.

"ఊఁఊ, ఈ మదిరికంటే నీ పెదవులే మత్తుగా ఉన్నాయి. ఇంత రుచి ఈ భూప్రపంచంలోనే లేదు - నువ్వు నా అందానివి ఆనందానివి. మదన సామ్రాజ్య మహారాణివి - నిన్ను విడిచి ఒక్క నిముషం ఉండలేను. నా ప్రణయినీ రా, నాలో కలిసిపో.. మన మనసులు శరీరాలు ఒకటి కావాలి. మనమధ్య ఈ వస్త్రాలెందుకు రా ప్రియా - బహుమతి అడిగావు కదూ. ఒకటి నువ్వడిగావు. ఆపైన నేనిస్తాను. తీసుకో నేనే నీవాడిని. నువ్వు నా దానివి. ఈ మదిరాస్వాదనలో నీ సౌందర్యం కలసి నా మనసు వెర్రెక్కిస్తోంది. సుందరలోకాలు కనిపిస్తున్నాయి. ఆవేశంలో పలవరిస్తూ ఆమె నల్లుకుపోయాడు. మత్తులో ఏదో కలవరిస్తున్నాడు. అతని కౌగిలిలో ఆమె ఉక్కిరిబిక్కిరైపోతోంది.

"ఏమండీ! నా మాట వింటారా?" విడిపించుకోటానికి ప్రయత్నం చేసింది.

"వద్దు దేవీ, కళ్ళు తెరిస్తే ఈ మధురస్వప్నం కరిగిపోతుంది. మెత్తని నీ ఒళ్ళో కమ్మని ఈ పూలవాసనల్లో మధురమైన ఈ పానీయం రుచుల్లో నన్ను మరచిపోతున్నాను. నీ కౌగిలి కోటి స్వర్గాల కలయిక - ఎప్పటికీ ఇలాగే బందీలా ఉండిపోనీ"

క్షణక్షణం అతడు రెచ్చిపోతున్నాడు. సన్నని ఆమె నడుము అతడి పిడికిట్లో నలిగిపోతోంది. పదే పదే చుంబించటం వల్ల పెదవులు ఎరుపెక్కుతున్నాయి. ఆ ఎరుపు చూసి మరింత వివశుడౌతున్నాడు. మత్తుతో అతని కళ్ళు అరమోడ్పులయ్యాయి. ఆమెలో కూడ సుమశకాల తాకిడి. మున్నెన్నడు కలగని అనుభూతి ఈ రోజనుభవిస్తోంది. అతని కౌగిలిలో మైమరిచి పోతోంది. హద్దుమీరిన వారి ప్రణయానికి పచ్చగడ్డే పట్టెమంచమయింది. ఒత్తుగా రాలిన పూలు పట్టుపరుపులా మారాయి.

సుందరితో కూడి నందుడు ఆ సాయంత్రం సుమకేళిలో తేలిపోయాడు. యధేచ్ఛగా ఆమె అందాలను కొల్లగొట్టి ఆనందంలో తేలిపోయాడు. ఇద్దరు అలసి ఆ తోటలోనే నిద్రపోయారు. సంధ్య చీకటి వాళ్ళ మీద దట్టంగా దుప్పటికప్పింది.

"తామ్రవర్ణా! ఏమిటి ఆ ఆకులు సర్దటం. ఒకొక్కటి లెక్కబెడుతున్నట్టుందిగానీ తోరణాలు కడుతున్నట్టు లేదు. "

"లేదు. లేదు తోరణాలే కడుతున్నాను"

"ఏదీ నన్ను చూడనీ. ఇంత చిక్కుముడులతో నా తోరణాలు కట్టేది. దారమంతా ముళ్ళుపడి పోయిందేమిటి? అసలు నువ్విక్కడ పనిచేస్తున్నావా? ఎక్కడన్నా ఆలోచిస్తున్నావా? ఉదయం నుండి చూస్తున్నాను. నీ వరసేమీ బాగుండలా."

"అదేం కాదు. నేను బాగానే ఉన్నాను. కాకపోతే ఈరోజెందుకో ఎక్కువగా ఆలోచిస్తున్నాను. ఆ ఆలోచన ఎంత స్థాయిలో ఉందంటే మధ్య మధ్య నన్ను నేను మర్చిపోయేంత"

"చాలా తప్పుచేస్తున్నావు. అంత ఆలోచన మంచిదికాదు. "

"ఆలోచన మనసుకు సంబంధించింది. మనస్సంటే ఆలోచనలకు పుట్టిల్లు. ఆలోచించకుండా ఎవరయినా ఉంటారా?" తామ్రవరుడడిగాడు -

"లేకేం ఉన్నారు. వారే సేవకులు. యజమాని చెప్పినట్టు మనం ఆలోచించాలి తప్ప మనిష్టం వచ్చినట్టుకాదు. కనుక ఏమయినా ఉంటే ఈ పనులైపోయాక తీరుబడిగా ఆలోచించుకో. ఇప్పుడు మాత్రం ఒళ్ళు దగ్గరపెట్టుకుని పనిచేయి" అధికారం చెలాయించాడు స్వర్ణముఖుడు.

ఆ రోజే వసంతోత్సవం ఏర్పాట్లు జరుగుతున్నాయి - పరిచారకులంతా వివిధ పనులకు నియోగించబడ్డారు - వారందరి మీద పరధాన పర్యవేక్షకుడుగా స్వర్ణముఖుడు నియమించబడ్డాడు. అతడు అందరిని అదలిస్తూ బెదిరిస్తూ పనులు చేయిస్తున్నాడు.

ఈ ఏర్పాట్లన్నీ సుందరి తన భవనంలోనే నిర్వహిస్తోంది. ప్రత్యేకంగా వచ్చే అతిధుల కోసం ఉద్యావనంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంచిగంధపు ద్వారాలకు ముద్రలేసిన ఆకుల తోరణాలు కడుతున్నారు. దారికి రెండువైపుల అమర్చిన శిల్పసుందరుల చేతిలో స్వాగత దీపాలమర్చారు - వెండి బంగారు జరీతో నేసిన కంబళ్ళు దారిపొడవునా పరిచారు - ఏర్పాట్లు ఆర్భాటంగానే ఉన్నా అందరిముఖాల్లో ఉత్సాహం కనిపించటంలేదు -

అదేమాట తామ్రవర్ణుడు పైకే అన్నాడు.

"నిజం చెప్పు స్వర్ణముఖా! ఈ పనులన్ని నువ్వు మనస్ఫూర్తిగా చేస్తున్నావా?"

"ఏం ఎందుకు చేయను. ముందే చెప్పానుగా మన వృత్తిలో మనస్సుండకూడదని." ముడులు పడ్డ దారాన్ని మెల్లగా విప్పదీస్తూ అన్నాడు స్వర్ణముఖుడు.

"నువ్వు ఆత్మద్రోహం చేసుకుంటున్నావు.. నిజం. ఎంత పరిచారకులయినా మనస్సుకు మంచి చెడులున్నాయి. నిరుడు వసంత మాసంలో చెట్లనిండా కాయలు గుత్తులు గుత్తులుగా కాసాయి. చేతికందివచ్చాయి. కానీ ఈ సంవత్సరం కాపేలేదు. చెట్లన్నీ బోడిగా అన్పిస్తున్నాయి. అప్పుడు చెయ్యని ఈ ఉత్సవం ఇప్పుడు జరపటం సంతోషంగా అనిపిస్తుందా? నిజం చెప్పు"

స్వర్ణముఖుడు కొంచెం కలవళపడ్డాడు. వెంటనే తన బాధ్యతను గుర్తుతెచ్చుకుని -

"తామ్రవర్ణా! నిన్ను అతిగా ఆలోచించవద్దని చెప్పానా? అమ్మగారు వచ్చారంటే కోప్పడతారు. ముందు నీ పనిపూర్తి చెయ్యి"

"నా వల్లకాదు. ఈ పనిచెయ్యాలన్నా చెయ్యలేకపోతున్నా. నా ఆవేదనలో యజమానుల గౌరవం కూడా ఉంది. ఉదయం నుండి కళ్ళముందు నల్లమబ్బు ఆవరించినట్టుంది. ఆకులు కడుతున్నాననుకుని ఒట్టిదారమే ముళ్ళు పెడుతున్నాను."

అతని గొంతులో నిస్సహాయత తొంగిచూసింది.

"తప్పు తామ్రవర్ణా! వాళ్ళ ఉప్పుతిని బతుకుతున్నాం. ఏది చెప్పినా చెయ్యాలి. తప్పు ఒప్పుతప్పులు నిర్ణయించే అధికారం మనకు లేదు" అన్నాడు స్వర్ణముఖుడు.

"నిర్ణయించే అధికారం లేకపోవచ్చు. కానీ ఆలోచన తప్పనే అధికారం ఎవ్వరికుంది. అక్కడ పెద్దమ్మగారు యశోధర గారి మందిరంలోనే ధర్మదీక్షలు జరుగుతున్నాయి. నగరమంతా అక్కడే ఉన్నారు. ఉత్సాహం లేని ఈ చోట వసంతోత్సపు వేడుకులు - ఏమిటో అయోమయంగా ఉంది" నిట్టూర్చాడు తామ్రవర్ణుడు.

ఇంతలో సుందరి మాలికతో మాట్లాడుతూ అటువైపు రావటం కనిపిస్తుంది - స్వర్ణముఖుడు తత్తరపడుతూ "ఊ.. ఊ.. కానివ్వు. ఇంకా ఎంతసేపు తోరణాలు కట్టాలి. వాటిమీద గంధపు ముద్రవేయాలి."

"నీహారికా! నువ్వు కోసుకొస్తున్న పూలు ఇవేనా. ఇవి ఉత్సవానికా? లేక నీ జళ్ళో పెట్టుకోటానికా. ఎంతమంది అతిధులొస్తారు ఈరోజు. భవనమంతా పూలతో అలంకరించాలి. ఇంకా చాలా కావాలి. వెళ్ళి కోసుకురా"

"శపాలికా! దీపాల్లో నూనె నింపే కార్యక్రమం పూర్తయిందా? పొద్దుకుంకక ముందే వెలిగించాలి. ఇంత నెమ్మదిగా నడిస్తే కుదరదు" ఆజు జారీ చేసునాడు.

సుందరి మాలిక రానే వచ్చారు. జరుగుతున్న ఏర్పాట్లన్ని సంతృప్తిగా చూసుకొంది. ఆమె కళ్ళల్లో విజయగర్వం.

"స్వర్ణముఖా! ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయా?"

"చిత్తం దేవీ.. అన్నీ పూర్తికావస్తున్నాయి" వినయంగా జవాబిచ్చాడు.

"మంచిది. మాలికా! ప్రత్యేక మదిరలు తయారు చేయించమన్నాను. వాటిపనెంత వరకొచ్చింది? - మన అతిథులు వాటి రుచి జన్మలో మర్చిపోకూడదు. "

"కొంతసేపట్లో ఆ పని కూడా పూర్తవుతుంది దేవీ!"

"ఇదేమిటి తామ్రవర్ణుడు ఈ ఆకులతో కుస్తీ పడుతున్నాడు. ఇవి కూర్చేదెప్పుడు? కట్టేదెప్పుడు?"

"ఏం తామ్రవర్ణా! ఆకుల్లో దారముందా, దారంలో ఆకులున్నాయా? అని చూస్తున్నట్టుంది నీ వ్యవహారం. ఎప్పటికి పూర్తిచేస్తావు?"

"లేదమ్మా. దారం చిక్కులుపడింది. వాటిని విడదీస్తున్నాను. కానీ నా మనసులోని చిక్కుముళ్ళనే విడదీసుకోలేకపోతున్నాను" చిన్నగా గొణిగాడు.

"నీ వల్ల కాకపోతే ఎవరికయినా అప్పచెప్పి ఈ దీపాల పని చూడు"

"సరే.. దేవీ!"

"మాలికా! పద తోటలో కెళ్దాం. అక్కడి ఏర్పాట్లు ఎంత వరకొచ్చాయో చూద్దాం"

"పూర్తికావచ్చాయి దేవీ! మీరు చెప్పినట్లు ప్రతి చెట్టు క్రింద ఆసనాలు వేయించాను. పద్మ సరోవరం దగ్గర ప్రత్యేక అతిథుల కోసం ఏర్పాట్లు చేయించాను"

"ఓహ్! ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. ఎన్నో సంవత్సరాల తర్వాత ఈ ఉత్సవం నా చేతిమీదుగా జరుగుతుందంటే పట్టరాని ఆనందంగా ఉంది. చూడూ ఈ రాత్రిని కపిలవస్తు పురప్రజలు తమ జీవితంలో మర్చిపోరు. రాజనర్తకి చంద్రిక నృత్యగానాల్లో పరవశించి మృదుమంజీర రవళిలో మైమరచిపోతారు - మధురరసాస్వాదనలో మత్తిల్లి ఈ నగరంలో పుట్టినందుకు జన్మధన్యమయిందనుకుంటారు. అవును కదూ?" చిన్నపిల్లలా అడిగింది.

మాలిక సమాధానం చెప్పలేదు.

"ఏమిటి మాట్లాడవు.. నీక్కూడా యువరాజుగారిలా మౌనం జబ్బు పట్టుకుందా?"

"లేదు దేవీ! కొంత పరధ్యాన్నంలో ఉన్నాను"

"ఈ వయసుకది సహజమేలే" ఆమె పరిహాసం చేసింది.

"అదికాదు దేవీ! తెల్లవారు ఝామున వచ్చే కలలు నిజమౌతాయంటారు. నిజమేనా?"

"పిచ్చిభ్రమ - మనసుకు ఆలోచించటం దాని లక్షణం. అది నిద్రలో కూడా కొన్నిటిని పోగుచేసుకుంటుంది. అందుకే కలల్లో మన పరిసరాలు వ్యక్తులు - మనసు పొరల్లో దాగిన ఊహలు. సంఘటనలు ఇవే వస్తాయి. ఇదిదాటి వేరే గ్రహాలురావుగా. ఇంతకీ నీకొచ్చిన కలేంటో చెప్పు. అంతర్లీనంగా ఒదిగిపోయిన నీ భావాలను బయటకు తీస్తాను" ఆమె భుజం మీద చెయ్యేసింది.

"ఎందుకో ఆ కల నా కళ్ళముందు కట్టినట్లే ఉంది యువరాణీ! ఎంత మర్చిపోదామన్నా మరపురావటం లేదు - మన నగరంలో చెట్లన్నీ ఎండిపోయాయి. వాటికి ఆకుకూడా లేదట. ముఖ్యంగా నిత్యం పచ్చగా ఉండే మనతోట కూడా మోడుగా హరితమంతా ఎండి బీడుగా కనబడింది. పద్మసరోవరంలో హంసలు ఎగిరిపోయాయి. శుష్కించిన కాసారంలో ఒక్క పద్మం కూడా లేదు. దుమ్ము ధూళితో నిండిన ఆకాశం. దేవీ! నన్ను మన్నించండి. నా నిమిత్తం లేని కల అది. ఉదయం నుండి మనసు శంకిస్తోంది. ఇటువంటి కలలాంటి నిజం ఎన్నడూ జరక్కూడదని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. " మాలిక కళ్ళు చెమ్మగిలాయి.

నడుస్తున్న సుందరి ఆగి మాలిక ముఖంలోకి సూటిగా చూస్తూ -

"నిజంగా ఈరోజు మీ అందరికేదో అయింది. స్థిరచిత్తం లేని వాళ్ళే అనవసర భయాందోళనలు లోనవుతారు. మీ మనసుల్లో బహుశా వేరే ఆలోచనలుండి ఉండవచ్చు. నిజం చెప్పు. యశోధరాదేవి దీక్షగురించి ఆలోచిస్తున్నావు కదూ - శాక్యర్షికి వ్యతిరేకంగా ఈ ఉత్సవం చేస్తే ఏమయినా జరుగుతుందని భయపడుతున్నావు. కాకపోతే వయసులో ఉన్న నీకు ప్రియుడి గురించి ఆలోచనలు రావాలికాని ఎండిపోయిన సరోవరాలు వృక్షాలు ఏం బాగాలేదు. ఇటువంటి కలల వలన మనకొచ్చే ముప్పేమీ లేదు. సంతోషంగా పనులు పూర్తిచేయించు."

"చిత్తం అటువంటి ఆలోచనలేం లేవు. ఈ ఉత్సవం బాగా జరగాలనే నా కోరిక" వెళ్ళిపోయింది మాలిక.

"సుందరి కూడా శయనమందిరానికి వెళ్ళిపోయింది. తెలియని వ్యాకులత ఆమె మనస్సులో కూడా చోటుచేసుకుంది. ఈ హడావుడిలోనే ఆమెకు గుర్తొచ్చింది. ఉదయం నుండి నందుడు భవనంలో లేడని - సేవకుడి ద్వారా వాకబు చేయించింది. మామగారి మందిరానికెళ్ళాడేమోనని. అక్కడ లేడని తెల్సాక మనస్సు కొంత శాంతించింది.

దీపాలు వెలిగించే పనికూడా సక్రమంగా చేయలేకపోతున్నాడు తామ్రవర్ణుడు. అతడి పరిస్థితేమీ బాగాలేదు. శరీరం తూలిపోతున్నది. కళ్ళు తిరుగుతున్నాయి. ఒళ్ళంతా చెమట్లు పడుతున్నాయి. దీపమేదో వెలిగించే పుల్లేదో అర్థం కావటంలేదు. అతని పరిస్థితిచూసి స్వర్ణముఖుడు అమ్మగారినడిగి విశ్రాంతి తీసుకోమని సలహా చెప్పాడు. అయినా అతడు కదల్లేదు. తన కళ్ళముందు తిరుగుతున్న నీడల్ని తరిమేయటానికి ప్రయత్నిస్తున్నాడు. మరోసారి అటువచ్చిన సుందరి అతని పరిస్థితి చూసి వెళ్ళి విశ్రాంతి తీసుకోమని చెప్పింది.

తామ్రవర్ణుడు తిన్నగా ఉద్యానవనంలోకి వెళ్ళాడు. అప్పటికి అపరాహ్నం దాటింది. సంధ్యాసమయానికి ఇంకా రెండుగంటల సమయముంది. భవనంలో కోలాహలం పెరిగింది.

పద్మసరోవరం ప్రక్కన కూర్చున్న అతడి కళ్ళముందు వ్యాపిస్తున్న చీకట్లకు మాటిమాటికీ తల విదిలించుకుంటున్నాడు. జరుగుతున్న విషయాలేమీ గ్రహించలేనంతగా మనసు మొద్దుబారుతున్నది.

పేరుకు అతడు పరిచారకుడే కానీ నందుడికి బహిఃప్రాణం. అంతరంగిక విషయాలు అప్పుడప్పుడు అతనితో చర్చిస్తుంటాడు. వయసులో చిన్నవాడయినా లోక జ్ఞానం బాగా ఉన్నవాడవడంతో అందరికీ అతని పట్ల ఒక గౌరవం ఉంది.

ఈరోజు ఉదయం కూడా నందుడు చాలాసేపు తామ్రవర్ణుడితో ఏకాంతంగా మాట్లాడాడు. వాళ్ళ మధ్య జరిగిన సంభాషణ పైకి తెలియకపోయినా ప్రొద్దుటినుండీ అతడి ప్రవర్తన ఇబ్బందిగా ఉంది. నందుడైతే ఉదయమే ఇల్లు విడిచి వెళ్ళాడు. అందరూ అభిమానించినా ఆమెకు మాత్రం అతడంటే ఏదో చిరాకు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ తెలుసుకోవాలనుకుంది కానీ పరిచారకుల ముందు తేలిక పడగూడదని ఊరుకుంది. అతడి చర్యలన్నీ ఓ కంట కనిపెడుతూనే ఉంది. అన్యమనస్కమైన అతని పనులు అనారోగ్యం ఆమె సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ రోజంతా ఉల్లాసంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది కనుక అతడి తప్పులు క్షమిస్తోంది.

ఇక్కడ ఏర్పాట్లు జరుగుతుండగానే భవనం వెలుపలి నుండి కొన్ని వేల గొంతులు ఒక్కసారి 'బుద్ధం శరణం గచ్ఛామి' అని పలికాయి. ఆ శబ్దం తరంగాలుగా మారి నగరమంతా మోసుకెళ్ళినట్టుంది. క్షణకాలం ఆమె ముఖం మ్లానమయింది. ఒకవైపు తోడికోడలి ఇంట్లో సన్యాస దీక్షలు, ఇక్కడ వసంతోత్సవం. అక్కడ వేలాది జనం. ఇక్కడ అతిథుల మాటటుంచి భర్తకూడా ఇంటికి రాలేదు. ఒక్క క్షణం అంతులేని నిస్పృహ. అందమయిన వదనం మీద నీలినీడలు కమ్మాయి. దానినుండి తప్పించుకోవటానికి ఏర్పాట్లు మరింత చురుగ్గా చూడసాగింది.

ఇక్కడ యశోధర మందిరం చాలా సందడిగా ఉంది. ఇన్నేళ్ళ తర్వాత. ఇంత జనం మళ్ళీ ఈరోజే బంధువులు - మిత్రులు - ఎక్కడెక్కడినుండో రాత్రికే వచ్చి చేరారు.

శుద్ధోధనుడికి క్షణం తీరకలేదు. వయసు మర్చిపోయి ఉత్సాహంగా ఏర్పాట్లు చూస్తున్నాడు.

సరిహద్దు దేశాలనుండి రాజులు రాజప్రతినిధులు వచ్చారు. మగధనుండి బింబిసారుడు కానీ ఆయన సందేశం తీసుకుని ప్రధానామాత్యుడు వచ్చాడు. కోసల చక్రవర్తి ప్రజేనజిత్తు. వైశాలినుండి భిక్షువులు వచ్చారు తల్లివైపు వారయిన కులియులు.

మిధిలనుండి విదేహులు, కేసిపుత్రనుండి కళింగులు, పిప్పలవనం నుండి మేర్వులు వచ్చారు.

శాక్యదేశం చిన్నరాజ్యమైనా గౌతమబుద్ధుడి వలన అన్నిరాజ్యాలు కలిసిపోయాయి.

అగ్నికాశ్యపుడు ఐదువందలమంది శిష్యులతో వచ్చాడు. సారనాథ్‌లో మొదటి సంఘారామం స్థాపించబడింది. దాని ప్రధాన నిర్వాహకుడుగా ఉన్న మౌద్గల్యాయనుడు బుద్ధుడి వెంట వచ్చాడు. అతడే నందుడికి ప్రథమ బోధ చేసింది. మిగిలిన వారు శౌరిపుత్రుడు. కాశ్యపుడు - గౌతముడి మొదటి శిష్యులు సహచరులు వారూ వచ్చారు.

అందరికి తగిన వసతులు ఏర్పాటు చేయబడ్డాయి పుష్పారామాలన్నీ బౌద్ధారామాలుగా మారాయి. నగరంలో ఎక్కడ చూసినా కాషాయరంగు రెపరెపలు, బోడితలల మిలలే - నగర వీధులన్నీ పచ్చని కళ్ళాపుజల్లులతో తెల్లని రంగవల్లులతో వచ్చినవారికి స్వాగతం చెబుతున్నాయి. వచ్చిన వారంతా వీధులన్నీ తిరిగి రోగగ్రస్తులకు సేవలు చేస్తున్నారు. అనాథలను ముసలివారిని పరామర్శిస్తూ బుద్ధుని ఔన్నత్యాన్ని ప్రచారం చేస్తున్నారు.

ఆ సాయంత్రం చంద్రోదయం తర్వాత దీక్షోత్సవం. ఇక్కడ చంద్రోదయం తర్వాతే వసంతోత్సవం రెంటికీ సాక్షీభూతుడు చంద్రుడే

సుందరి భవనంలో ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఇంకా నందుడు రాలేదు. మనసంతా ఆందోళనగా ఉంది. తామ్రవర్ణుడికి రోగం వచ్చింది. ఇంతవరకు ఒక్క అతిధికూడా రాలేదు. ఈ ఉత్సవాన్ని ఆయన జీర్ణించుకోలేక ముఖం చాటుచేసారేమో. బహుశా ఎక్కువమందిని బాధపెట్టి ఉండవచ్చు. పరిచారకులదేముంది. మరయంత్రాల్లాంటివారు. ఏది చెబితే అది చేస్తారు తప్ప వారిని గురించి ఆలోచించాల్సిన పనిలేదు. బంధువులొచ్చారు కానీ ఉండలేదు. మళ్ళీ వస్తామని చెప్పివెళ్ళారు. కానీ వస్తారని నమ్మకంలేదు. వారందరూ యశోధర మందిరంలో ఉన్నారు. తను తీసుకున్న నిర్ణయం అందరికీ ఇష్టంలేకపోతే? అది ఎవరు నిర్ణయించాలి? తను చెయ్యాల్సిందేమిటి? కందిరీగల్లా ఆలోచనలు మెదడును తొలుస్తున్నాయి. ఏది ఏమయినా తన నిర్ణయం మారదు. తాను చేస్తుంది తప్పుకాదు. సాంఘిక ధర్మాన్ని కాపాడే విషయంలో ఎన్ని నిందలైనా భరిస్తుంది. ఒకనాటికి తన మంచిని గుర్తించకపోరు -

ముఖ్యంగా స్త్రీలకు న్యాయం జరగాలనేగా ఈ పోరాటం. రేపటినుండి దీక్ష తీసుకున్న వారంతా కుటుంబ వ్యవహారాలను విడిచిపెట్టి, బాధ్యతలను పక్కకు పెట్టి ధర్మం పేరుతో వీధులు పట్టుకు తిరుగుతుంటారు.

ఎవడో పెళ్ళిపీటల మీదనుండి సూత్రధారణ కాగానే లేచి వచ్చేశాడట. సన్యాసం స్వీకరించి  భార్య, తల్లి ఎవరూ వద్దని కబురు పెట్టాడట. ఆ పెండ్లికూతురి జీవితం ఏమవుతుంది? అందరూ ఆ అమ్మాయిని దోషిగా చూస్తారు. భర్త ముఖమన్నా సరిగా చూడని ఆమె ఏం తప్పు చేసిందని ఈ శిక్ష? తప్పుచేసిన వారొకరయితే నింద మరొకరికి. జీవితమంతా తన బ్రతుకును నిందించుకుంటూ వ్యర్థమైన యవ్వనంతో తాళిగట్టిన నేరానికి మోడులా మిగిలిపోవాల్సిందేనా?

ఏమయ్యా బుద్ధదేవా! ఇదెక్కడి న్యాయం? ఇంత కఠినచిత్తం మీకెట్లా వచ్చింది. మగవారిని బోడులుగా చేసి ఆడువారిని మోడులుగా మిగల్చడమేనా మీరు తెలుసుకున్న సత్యం? ఇదెంత మాత్రం సాగకూడదు. కరుణ అహింస - దీనజన సేవ ఇవి కాదనదెవరు?

దానికోసం స్త్రీలను బలిపశువులుగా మార్చటం ఎందుకు? అందుకే తనకింత పట్టుదల. అక్కడ రాగరహితమైన జీవితానికి సన్యాసం ఇస్తుంటే - ఇక్కడ ప్రేమమయ జీవితానికి వసంత వేడుకలు నిర్వహిస్తోంది.

తను చేసేది ధర్మం, సత్యం.. అంతే -

మాలిక రావటంతో ఆమె ఆలోచనల్లోనుండి తేరుకుంది. "అమ్మా! యువరాజుగారొస్తున్నారు - మీరు కూడా మీ అలంకరణ పూర్తిచేసుకోవాలి." చెప్పింది -

"మంచిది వారి స్నానపు ఏర్పాట్లు చూడు. ప్రత్యేక మదిరలు కలపటం పూర్తయిందా? వాటి రుచి ముందు కొంచెం నాకు చూపించు"

ఇంతలో ఉద్యానవనంలో హంసరెక్కల చప్పుడు పెద్దగా వినిపిస్తుంది. దాంతో పాటు వాటి అరుపులు కూడా వినవస్తాయి. పద్మసరోవరంలో ఎవరో రాళ్ళేస్తున్న చప్పుడు. సుందరి మితిమీరిన కోపంతో

"ఈరోజంతా నేను ఉల్లాసంగా ఉండాలనుకున్నాను. కానీ దాన్ని పాడుచేస్తున్న వాళ్ళను నేనుపేక్షించలేను. కఠినంగా దండించాల్సిందే ..మాలికా! పోయి చూడు. వెంటనే ఆ దోషులను నా ముందు పెట్టు"

మాలిక గాభరాగా అటు వెళ్ళిపోవటం నందుడిటు రావడం ఒకేసారి జరిగాయి. అసహనంగా ఉన్న సుందరి ముఖం చూసి భయపడ్డాడు.

బహుశా తన ఆలస్యం వల్లనేమో అనుకున్నాడు.

"ఏమయింది దేవి! ఏం జరిగింది?"

"కొంచెం సేపు నన్ను మాట్లాడించకండి. నేను చాలా కోపంలో ఉన్నాను"

"అందుకేనేమో సూర్యుడు పారిపోతున్నాడు. పన్నీరు చిలకరించనా! కస్తూరి గంధం పూయించనా"

"దయచేసి విషయాన్ని మరలించొద్దు. ఈరోజు జరిగిన సంఘటనకు సరయిన శిక్ష వేయకపోతే నన్ను నేను క్షమించుకోలేను."

మాలిక వెంట తామ్రవర్ణుడు తలవంచుకుని మెల్లగా వచ్చాడు. అతనిని చూడగానే ఉదయం నుండి ఆమెలో రగులుతున్న క్రోధం ఉవ్వెత్తున లేచింది. ఉత్సవమనే మాటే మర్చిపోయింది.

"ఏం మహానుభావా! నువ్వేనా ఆ పనిచేసింది. ప్రొద్దుటినుండీ నీ ధోరణి చూస్తున్నాను. ఈ ఉత్సవం జరపటం నీకస్సలు ఇష్టంలేదు. ఏవో పిచ్చిపనులు చేస్తున్నావు. అయినా భరించాను. ఇప్పుడు హంసల మీద రాళ్ళేసింది కూడా నువ్వేనా" క్షణక్షణం ఆమెలో కోపం పెరిగిపోతున్నది. ముఖమంతా ఎర్రగా కందిపోయింది. శరీరం కంపిస్తోంది. నందుడు తామ్రవర్ణుడి వైపు ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

"రాళ్ళేసింది నేనే దేవీ! కానీ హంసలు మీదకాదు"

"హంసల మీద కాక భూతం మీద వేసావా" మరింత కటువుగా అడిగింది.

"నిజం దేవీ! నా మాట నమ్మండి. మీ పరిచారకుడ్ని మీకు వ్యతిరేకంగా చేస్తానా? నేను రాళ్ళేసింది నిజంగా భూతం మీదే"

"చూసారా ఆ కట్టుకథలు. అయితే ఆ భూతం నువ్వే అయ్యుంటావు"

"ఏం జరిగిందో నిజం చెప్పు, కథలు చెప్పకు"

"సత్యం దేవీ! మీరు విశ్రాంతి తీసుకోమన్నారుగా, అందుకే పద్మసరోవరం దగ్గర కొంచెం సేపు గడుపుదామని వెళ్ళాను. ఇంతలో పొడవయిన నీడ పద్మాలను హంసలను సరోవరాన్ని కమ్మేసింది. అవన్నీ ఒకొక్కటిగా అదృశ్యమవుతున్నాయి. చివరికది నన్ను కూడా మింగేస్తుందని భయపడి ఆ నీడ మీద రాళ్ళేసాను. అంతే తప్ప హంసలమీద కాదు. వాటిని ఆ నీడ భూతం నుండి కాపాడాలని ఎంతో ప్రయతించాను" అతని కళలో ఆందోళన తగలేదు.

"నీడమీద రాళ్ళేస్తే హంసలెందుకరిచాయి" ఆమె గొంతులో కోపం ఏ మాత్రం తగ్గలేదు.

"ఆ నీడ వల్లనే అమ్మా అవి భయపడి రెక్కలు టపటపా కొట్టుకుంటూ పెద్దగా అరిచాయి. అది బలవంతంగా వాటిని తనలోకి లాక్కుంటోంది. ఇదే నేను చేసిన తప్పు. మీకు బాధకలిగిస్తే నన్ను శిక్షించండి - కానీ ఒక్కటి మాత్రం నిజం. ఈ నీడలు ఈ రోజు నాలోనే కాదు అందరి మనసుల్లో ఉన్నాయి. వాటినుండి ఎవరూ బయటకు రాలేకపోతున్నారు. ఏదో జరగబోతోంది" మెల్లగా తనలో తానే ఏదో గొణుక్కున్నాడు. ఇక కోపాన్ని ఆపుకోలేక ఆమె స్వర్ణముఖుడిని పిలిపించి అతడి పిచ్చి తగ్గేదాకా చీకటి కూపంలో బంధించమని ఆజ్ఞవేసింది.

స్వర్ణముఖుడి వెంట తామ్రవర్ణుడు తలవంచుకుని వెళ్ళిపోయాడు. ఆ సంఘటనతో సుందరీనందుల మధ్య మరింత దూరం పెరిగినట్లనిపించింది. మాలిక ముఖంలో ఉత్సాహమంతా ఆవిరైపోయింది. ఈ గొడవలో పడి ఉదయం నందుడు ఎక్కడికెళ్ళాడనే విషయం సుందరి అడగడం మర్చిపోయింది.

మెల్లమెల్లగా చీకట్లావరించుకుంటున్నాయి. ప్రియుని సమాగమానికి సమాయత్తమవుతున్న పడతిలా నగరం అలంకరించుకుంటున్నది. తోటంతా దీపాలకాంతిలో నవవధువులా మెరిసిపోతోంది. చక్కగా అలంకరించుకున్న సుందరీనందులు అతిథులను ఆహ్వానించటానికి ఎదురుచూస్తూ నిలబడ్డారు. రకరకాల సుగంధలేపనాల పరిమళం హాయిగా ముక్కులను తాకుతోంది. ప్రత్యేక అతిథుల కొరకు సరోవరం ప్రక్కన అందమైన ఆసనాలమర్చబడ్డాయి. రుచికరమైన పదార్థాల గుబాళింపు, మరోవైపు మత్తెక్కించే మధురపానీయాలు, పరిమళభరితపుష్పాలు ఆ నాకమే భూలోకానికి దిగివచ్చినట్టుంది.

ఆ రాత్రి రాజనర్తకి నృత్యం కోసం ఏర్పాట్లు చేసిన వేదిక, కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నది. ఆ రోజు సుందరీనందుల అలంకరణ చెప్పేపనిలేదు. పొరపాటున భూలోకానికొచ్చిన రతీమన్మధుల్లా ఉన్నారు.

ఏర్పాట్లు చివరిసారిగా మరోసారి చూసుకుంటున్న సుందరి దగ్గరకు మాలికవచ్చి మౌనంగా నిలబడింది. ఆమె ముఖం వాడిపోయిన పద్మంలా ముకుళించుకుని ఉంది. కళ్ళు శ్రావణ మేఘాల్లా ఏ క్షణమైనా వర్షించటానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఏమయింది మాలికా? అలాగున్నావేమిటి?" అడిగింది సుందరి.

"మీరేమనుకోనంటే ఒక్కమాట చెప్పాలని వచ్చాను."

"చెప్పు నా దగ్గర భయమెందుకు?"

"ఈ రోజు మీరే వ్యక్తినయితే శిక్షించారో అతడు నిజానికి దోషికాదు. ఒళ్ళు తెలియని జ్వరంతో బాధపడుతున్నాడు. అతడేమయినా చేసాడు అంటే అది అతనికి తెలియని స్థితిలో జరిగింది. కనుక మీరతన్ని క్షమించాలి" మాలిక సుందరి పాదాలు తాకింది.

"అదేమిటి? అతడి విషయమై నీకెందుకింత ఆందోళన?" అనుమానంగా చూసింది సుందరి. మాలిక నేలచూపులు చూస్తూ నిలబడింది. ఆమె ముఖంలోమారే భావాల్లో సరైన అర్థం దొరికింది. ఆమెకేదో స్ఫురించింది.

ఒక్కక్షణం ఆశ్చర్యం. ఆమె తన ప్రాణస్నేహితురాలు. ఇన్నాళ్ళుగా ఈ రహస్యాన్ని తన దగ్గర దాచడమే కాదు ఎవరినయితే తను దూరంగా ఉంచాలనుకుందో ఆ వ్యక్తినే ప్రేమిస్తోంది.

"నిజం చెప్పు మాలికా! నువ్వతన్ని ప్రేమిస్తున్నావా?"

మాలిక అవునన్నట్లు తలవూపింది.

"మీరు అతన్ని క్షమించండమ్మా. మరెప్పుడూ అటువంటి పరిస్థితి రాకుండా చూసుకుంటాను. అతడు పూర్తిగా అస్వస్థతలో ఉన్నాడు. వైద్యసేవలవసరం. నా కోసం అతడ్ని కాపాడండి" చెక్కిళ్ళమీద ధారగా కన్నీళ్ళు కారిపోతున్నాయి. నందుడు కూడా సర్దిచెప్పాడు.

"ఈరోజంతా ఉత్సాహంగా ఉండాలి. నిజానికతడు మన శ్రేయోభిలాషి. ఏదో పొరపాటు జరిగుంటుంది. విడిచిపెట్టు సుందరీ. మాలిక నీకు ఆప్తురాలు. ఈరోజు ఆమె కళ్ళ నీళ్ళు పెట్టటం బాగాలేదు. అతడ్ని క్షమించి విడిచిపెట్టు" అన్నాడు.

సుందరి ఆలోచనలో పడింది.

వీరందరికి నచ్చిన వ్యక్తి తనకెందుకు నచ్చటంలేదు.

***********

(9)

**అతడిని చూస్తే ఏదో ఆందోళనగా ఉంటుంది.** ఎదురుగా నిల్చుని నా ప్రతి ఆలోచనను పనిని ప్రశ్నిస్తూ ఉన్నట్లనిపిస్తుంది. ఒక వ్యక్తికి సంబంధించి పరస్పర విరుద్ధ భావాలెలా కలుగుతాయి? ఆశ్చర్యమే. అసలతడు ఒక వ్యక్తి లాగే అనిపించడు. రెండు కళ్ళు పెట్టుకుని గాలిలో ధూళిలో కలిసిపోయిన అవాంఛిత భావంలా అనిపిస్తాడు. అయినా తన కిష్టమయిన ఇద్దరు వ్యక్తుల ఆనందం కోసం విడుదల చేయకతప్పదు.

"సరే మీ ఇష్టం. మాలికా! స్వర్ణముఖుడిని పిలిచి నా ఆజ్ఞగా చెప్పు. చీకటి కూపం నుండి అతడిని బయటకు తీసుకురమ్మని. అలాగే వైద్యుడిని కూడా పిలిపించు. నువ్వెళ్ళి ఆ పనులు చూసుకో. ఇక్కడనీ అవసరం లేదులే వెళ్ళు." మాలిక వెళ్ళిపోయింది.

ఎంతసేపు నిరీక్షించినా అతిధులు వస్తున్న జాడ మాత్రం లేదు. బయట కోలాహలం అంతకంతకు అధికమవుతుంది. తండోపతండాలుగా జనం వీధుల్లో పరుగులు తీస్తున్నారు. ఆ కార్యక్రమానికి సుందరీనందులు మాత్రమే వెలిగా ఉండిపోయారు. సుందరి భిన్నమైన ఆలోచనావిధానం నందుడికి భార్యమీదున్న ప్రేమ ఈ వసంతోత్సవాన్ని ప్రేరేపించాయి.

కాని...

అతిధులొస్తున్న జాడమాత్రం లేదు. అంత అలంకరణ, మధురపదార్థాలు, మత్తుపానీయాలు నిరాశగా చూస్తున్నాయి వచ్చేవారికోసం.

నిజానికి ఆ ఉదయం నందుడు, తామ్రవర్ణుడు మాట్లాడుకున్నది ఈ విషయమే. లోకపూజ్యుడైన తథాగతునికి స్వయంగా తోడబుట్టిన వారు వ్యతిరేకంగా వ్యవహరిస్తే బాగుండదని, ఈ వసంతోత్సవం స్వయంగా పరిహాసాన్ని కొని తెచ్చుకున్నట్టవుతుందని నచ్చచెప్పాడు. అయితే నందుడు అశక్తుడు. ద్వైదీభావాలతో అతడి మనస్సు అల్లకల్లోలమవుతున్నది. ఒకవైపు ఆరాధకుడైన అన్న, మరోవైపు ప్రేమించిన భార్య ఇద్దరిలో ఎవరిని సమర్థించాలి ఆ తూకంలో అతని మనస్సు సుందరివైపే మొగ్గు చూపింది.

అయితే నగరంలో ఎవరయినా వస్తారనే నమ్మకం మాత్రం లేదు. ధైర్యం చెప్పే తామ్రవర్ణుడు అధైర్యంతో మంచం పట్టాడు. ఈ విషయమ్మై అతడెంత కలత చెందాడో నందుడికి అర్థమైంది.

వసంతోత్సవం సుందరి కన్నీటి ఉత్సవం కాకూడదనే నందుడు ఆ ఉదయమే బయటికెళ్ళాడు. స్వయంగా అందరిని పిలిచాడు. ప్రాణస్నేహితులు, బంధువులు కొంతమంది ప్రధానోద్యోగులు వ్యాపారులను అందరిని ఆహ్వానించాడు. కానీ అక్కడ తిరస్కారమే ఎదురయింది. మొహమాటం కోసం కొందరు వస్తామని చెప్పారు. ప్రాణస్నేహితులైన మైత్రేయుడు, విశాఖదేవుడు, సోమదత్తుడు వస్తామంటూనే ముఖం మీద విమర్శించారు. ఇది మంచిపని కాదని.

అక్కడినుండి నందుడు యశోధరాదేవి మందిరానికి వెళ్ళాడు. ఆమె సుందరి గురించి అడిగింది. చెప్పలేక చెప్పాడు వసంతోత్సవ నిర్వహణ గురించి. ఆమె ఒక్క క్షణం మౌనం వహించినా చివరకు సోదరికి ఆశీస్సులు చెప్పమన్నది. తానీ భవనం విడిచి వెళ్ళేలోపు అందరిని ఒక్కసారి చూడాలని కోరింది.

పగలంతా వ్యాకులచిత్తంతో నందుడటూ ఇటూ తిరుగుతూనే ఉన్నాడు. గౌతముడి శిష్యులతో చర్చల తర్వాత బాధ మరింత పెరిగింది. తనకేం కావాలో తనకే అర్థం కావటం లేదు. ఇంటికొస్తే ఇక్కడి పరిస్థితి ఇట్లా ఉంది. తన మీద తనే పట్టుకోల్పోయిన భావన మనసంతా శూన్యంగా వెలితిగా ఉంది. సుందరి చేస్తున్న పనినేమాత్రం సమర్థించలేకపోతోంది.

ప్రొద్దుకుంకే కొద్దీ బయటలాగా అతని మనసంతా చీకట్లు వ్యాపించాయి. అథిధులొస్తున్న జాడేలేదు. ఎంతో ప్రత్యేకంగా తయారు చేసానని భార్య అందించిన మధిరకూడా తాగలేకపోయాడు.

కొంచెం సేపటికి మైత్రేయుడొక్కడే వచ్చాడు. అతడిని చూడగానే నందుడి ప్రాణం లేచొచ్చింది. ఎంతో ఆత్రుతగా అడిగాడు.

"మిగిలిన వాళ్ళేరి మైత్రేయా!"

"వాళ్ళు రాలేదు" మైత్రేయుడు బాధగా తలవంచుకున్నాడు.

సుందరి నవ్వుతూ పలకరించింది.

"మా మొదటి అతిధులకు స్వాగతం, ఏమిటి మైత్రేయా! మీరుకూడా ఇంతాలశ్యంగా వస్తారనుకోలేదు" కొంచెం నిష్ఠూరంగా అంది.

"అదేం లేదమ్మా! మిగిలిన వాళ్ళను కూడా కలుపుకొద్దామని వెళ్ళాను."

"అయితే వాళ్ళేరీ?"

"అదే మీకు చెప్పబోతున్నాను - ఉదయం కుమార నందులు వచ్చినప్పుడు అందరూ వస్తామని చెప్పారు. కానీ ఇప్పుడేదో చెప్పి తప్పించుకుంటున్నారు. మీరు ఎదురు చూస్తుంటారని నేను వచ్చేసాను. బహుశా చివరి అతిథిని కూడా నేనేనేమో?' అతడి ముఖంలో నీడలు చెప్పలేక ఏదో బాధపడుతున్నాడు. అప్పటిగ్గాని సుందరి కర్థంకాలా. ఉదయం నందుడెందుకు ఇల్లొదిలిపెట్టాడో - వెంటనే ఆమెకు కోపం ముంచుకొచ్చింది.

"అదేమిటి? మీరు స్వయంగా పిలవటానికి వెళ్ళారా? ఇంతకన్నా అవమానమైన విషయం మరోటుందా?" ఆమె కళ్ళల్లో ఎరుపుచారలు.

"ఇందులో అవమానమేముంది సుందరీ! ఈ రోజు ఈ ఉత్సవం జరగాలని నీవు పట్టుబట్టావు. నిజానికి రెండు రోజుల క్రితం నేను కబురుపంపినపుడు వారెవ్వరూ రావటానికి సుముఖంగా లేరని తెలిసింది. నీ ఆనందం పాడుకాకూడదని స్వయంగా నేనే పిలవటానికెళ్ళాను. బహుశా ఇంకొంచెం సేపట్లో అందరూ రావచ్చు. నువ్వేమీ బాధపడకు" అతని గొంతులో అనునయం.

"నేనెందుకు బాధపడతాను. ఇటువంటి ఆనందంలో పాలుపంచుకోలేక వాళ్ళే బాధపడాలి. జరుగుతున్న అవమానాలకు మాత్రం బాధపడక తప్పటంలేదు"

"మనబాధలెలా ఉన్నా మరెవరో వస్తారనే నమ్మకం నాకు మాత్రంలేదు" అన్నాడు మైత్రేయుడు. మదిరా పాత్ర తెచ్చుకుంటూ - నందుడు కూడా తన పాత్రలో మరికొంచెం మదిర పోసుకున్నాడు. మైత్రేయుడి మాటలకు సుందరి పూర్తిగా హతాశురాలైంది.

"రాని అతిధులను నేను గౌరవించాలనుకోవటం లేదు. మా అభిప్రాయాలను గౌరవించగలిగిన వారే మా మిత్రులు"

"కానీ దేవీ నేనిలా మాట్లాడుతున్నానని మీరు వేరు విధంగా భావించకండి. ఈ రోజు ఉత్సవం మీ పట్టుదలకు ప్రతిరూపంగా ఉంది తప్ప మరెవరి ఆనందం కోసమైతేకాదు. ఎందుకంటే ఎవరూ ఉత్సాహంగా లేరు కనుక. అదే మరోరోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తే బాగుండేది. ఈ రోజంత అవమానం మిగిలేదికాదు యధాలాపంగా అన్నాడు.

"ఏమిటి మైత్రేయా! మీరు కూడా ఇలా అంటారనుకోలేదు. ఈ ఉత్సవం ఏర్పాటుచేసింది ఒక ఆశయం కోసమే అనే విషయం మీరు మర్చిపోకూడదు. ప్రకృతికి ఎదురీదే పరివ్రాజకాలకు ఎదురు నిలవాలనుకున్నాను"

"స్వాభావికంగా బ్రతకవల్సిన మానవుని జీవన విధానాలను యధాతధంగా కొనసాగించాలనుకోవటం నేను చేసిన తప్పా? అక్కగారిని తల్చుకుని నేను బాధపడని క్షణం లేదు. అందుకే శాక్యనగరం మర్చిపోయిన వసంతోత్సవం మళ్ళీ నిర్వహించాలనుకోవటం ఆమె గొంతు రుద్ధమయింది.

ఆ మాటలకు మైత్రేయుడు నొచ్చుకున్నాడు.

"అయ్యో మిమ్మల్నర్థం చేసుకోకకాదు. అయితే గౌతములు సాక్షాత్తూ భగవంతుడి అవతారం. మహాతల్లి యశోధరాదేవి మిగిలిన కుటుంబసభ్యులు దీక్ష తీసుకుంటున్న సమయంలో వారి సోదరి మీరు భిన్నంగా ఈరోజే ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం ప్రజలు వేరుగా అనుకుంటున్నారు – అదే అభిప్రాయాన్ని కొంతమంది పైకి వెలిబుచ్చారు కూడా"

మదిరా పాత్ర నోటిదగ్గర పెట్టుకుంటూ అన్నాడు.

"మీరు నన్ను సరిగా అర్థం చేసికోలేదు మైత్రేయా! ***ఆత్మవంచన కంటే ఆత్మహత్య చాలా ఉత్తమం. నా దృష్టిలో మన మనసులో కలిగిన ఒక కోరికను ఎవరికోసమో వాయిదా వేయాలనుకోవటం బలహీనత.*** కొంతమందినయినా భిక్షువుల్లా మారకుండా చేయాలనేదే నా ఆశయం. దీనినర్థం చేసుకున్న వాళ్ళే వస్తారనుకున్నాను"

"నిజమే. మీ ఆశయాన్ని కాదనటంలేదు – కానీ ప్రజలు దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు దేవీ. వారు తధాగతుడ్ని దైవంలా ఆమెను దేవతగా భావిస్తున్నారు. కనక మీరే"

"చెప్పండి. నన్నొక యక్షిణిగా తలుస్తున్నారా? ఆమె తన మాయాజాలంతో భర్తను బంధించి అయినవారి మీదేకత్తి కట్టిందని – గౌతములవారి నవమానించటానికే ఈ ఉత్సవం చేస్తోందనీ. ఇలాగే అనుకుంటున్నారా? ఇంకా అంటున్నారా"

అంతకంతకు ఆమెలో అసహనం పెరిగిపోతోంది –

దాన్ని దాచుకునే ప్రయత్నం కూడా చెయ్యటంలా

మరీ అంత కాదుగానీ దేవీ. కుడి ఎడంగా అలాగే అనుకుంటున్నారు" తలవంచుకుని చెప్పాడు మైత్రేయుడు.

ఇంకా మధిర అతని చేతిలో అలాగే ఉంది. అవమానంతో సుందరి ముఖం ఎర్రగా అయిపోయింది.

"చాలా సంతోషం మైత్రేయా! ప్రజల ప్రతినిధిగా ఈ వార్తలన్నీ మోసుకొచ్చినందుకు – మీరు కూడా ఇక్కడకు రావాల్సి వచ్చినందుకు బాధపడుతున్నారా"

అంతకంతకు ఆమెలో పెరిగిపోతున్న బాధకడ్డుకట్ట వేయాలని నందుడందుకున్నాడు.

"దేవీ! నువ్వు నాకు ముందే మాటిచ్చావు. ఈ ఉత్సవం గురించి నీ మనస్సేమీ కష్టపెట్టుకోనని. మర్చిపొయ్యావా?"

"మైత్రేయా ఆ ప్రసంగం విడిచిపెట్టండి. మన ముగ్గురమైనా ఆనందంగా గడుపుదాం. రాజభవనంలో ఈరోజు జరుగుతున్న రెండు ఉత్సవాల్లో ప్రజలు, బంధువులు ఒక్కదాన్నే ఆదరిస్తున్నారు. ఆమె అంతరంగాన్ని ఎవరూ అర్థం చేసికోవటం లేదు. అంతేగా దానికెందుకు బాధపడటం" అన్నాడు మెల్లగా.

"చూడు మైత్రేయా! ఈ శాక్య ప్రజలకోసం ఏర్పాట్లన్నీ గొప్పగా చేయించాను. వారు జీవితంలో రుచిచూడని మధురపదార్థాలు మదిరాపానీయాలు - కానీ వారు నన్నర్థం చేసుకోలేదు" ఆమె మాటల్లో బాధ తొంగిచూసింది.

"లేదు దేవీ! ఈ ఏర్పాట్లన్నీ ప్రజలు హీనంగా చూస్తున్నారు. ఉత్తమ నిర్వాణ మార్గం శాశ్వతానందం గౌతముని మార్గం. ఆ రుచి తెలిసినవారు మళ్ళీ ఇటువైపు వస్తారనుకోను"

"అయితే మీరెందుకొచ్చారు - ఇందులో మంచికనిపించేగా"

"కాదు. మిత్రులు స్వయంగా వచ్చి ఆహ్వానించారు - గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు - అందుకే క్షోభిస్తున్న వారి అంతరంగాన్ని అర్థం చేసుకున్నాను. అందుకే రావాల్సివచ్చింది" మైత్రేయుడన్నాడు.

"ఊఁ అందుకే - ఆయన మాట కాదనలేక - బలవంతంగా వచ్చారు - అంతేనా?" ఆ మాటలకడ్డుపడింది.

"ఆగు సుందరీ! కోపంతో నిన్ను నీవు మర్చిపోతున్నావు. వచ్చిన ఏకైక అతిథిని అవమానిస్తున్నావు. అతడు మనకోసం వచ్చాడు" నందుడామెకి అడ్డుతగిలాడు.

"నేను వారినవమానించటంలేదు. ఇక్కడకు వారు నన్నవమానిస్తున్నారు. అందరిలాగానే కాకుండా ఉంటే ఏ బాధాలేదు. వచ్చి అందరూ నన్నాడిపోసుకుంటున్నారని చెప్పటం. బాధాకరం కాదా - మంచిది ఆర్యమైత్రేయా! మీరు కూడా ఆ ఉత్తమ మార్గాన్ని ఆనందంగా ఎన్నుకోండి. ఇక్కడంతా దుఃఖం, దుర్గంధం, ఈ యక్షిణి సామ్రాజ్యం విడిచి తక్షణమే నిర్వాణపధానికి వెళ్ళండి - ఇప్పటికే ఆలస్యం చేయిచినందుకు క్షంతవ్యులం. తమరి త్యాగానికి మా ధన్యవాదాలు. 'ఆమె పూర్తిగా అదుపు తప్పిపోయింది' ఆయన ఎవరి తరఫున వచ్చారో వెళ్ళేటప్పుడు కూడా వాళ్ళ మనిషిగా వెళ్ళమనండి - వెళ్ళి వాళ్ళందరితో చెప్పమను నా దగ్గరకు రావటానికి ఏ రేపు కోసం నిరీక్షించనవసరంలేదని"

"సుందరీ!" నందుడు వారిస్తూనే ఉన్నాడు. మైత్రేయుడు అవమానంతో చేతిలో మదిరాపాత్ర తాగకుండానే క్రిందపెట్టేసాడు.

"క్షమించండి దేవీ! మీరు మీ మనస్సుపై అదుపుకోల్పోయారు. నేను కూడా చెప్పి వెళ్దామనే వచ్చాను తప్ప ఇక్కడ ఉత్సవంలో పాలుపంచుకోవాలని కాదు. వచ్చినందుకు మంచిశాస్తి జరిగింది. మిత్రమా! నేను ఉండి ఇంకా ఆమె కోపాన్ని పెంచదలచలేదు. శలవ్. మనసు దిటవు చేసుకో వస్తాను" మైత్రేయుడు వెళ్ళిపోయాడు.

నందుడు వారించబోయాడు. "ఆగు మైత్రేయా! ఆమె ఉద్విగ్నత నర్థం చేసుకో" అయినా ఆగకుండా మైత్రేయుడు వెళ్ళిపోయాడు.

"ఎవరో నా ఉద్విగ్నతకు కారణమయ్యే అధికారం నేనివ్వను. నాకు కారణం నేనే. ఆయన వెళ్ళాలనుకుంటే వెళ్ళనివ్వండి."

సుందరి ఉన్మాదస్థితిలో పూలహారాలు త్రుంచివేసింది. మదిరాపాత్రలన్నీ ఒంపేసింది. ఆహారపదార్థాలను ఆసనాలను అన్నిటినీ తన్నుకుంటూ తన శయనమందిరానికి వెళ్ళిపోయింది.

అస్తవ్యస్తమైన ఆమె అంతరంగంలాగానే ఆ ప్రదేశం ఒక స్థితిని కోల్పోయి కళావిహీనంగా కనిపిస్తోంది.

దూరం నుండి భిక్షువుల స్వరాలు పెద్దగా వినిపిస్తున్నాయి.

'బుద్ధం శరణం గచ్ఛామి'

ఎంతోసేపు తోటలో ఒంటరిగా కూర్చున్నాడు నందుడు. అతని మనసంతా శూన్యంగా ఉంది. జరిగిన సంఘుతన చిన్నదేమీకాదు. అతిథులు రాని అవమానం ఒకవైపు బాధిస్తుంటే సుందరి ప్రవర్తన మరింత బాధగా ఉంది - వచ్చిన ప్రాణమిత్రుడు అవమానంతో వెళ్ళిపోయాడు.

ఎప్పటికో లేచి నందుడు శయనమందిరానికి వెళ్ళాడు. సుందరి పాన్పుమీదకాక ఊయల బల్లమీదపడి నిద్రపోతోంది. నిద్రలో కూడా ఆ ముఖంలో అప్రసన్నత కనిపిస్తూ ఉంది. చాలాసేపు గదిలో అటూ ఇటూ పచార్లు చేసాడు. దూరంగా తామ్రవర్ణుడి గొంతు వినిపిస్తూ ఉంది - అతని జ్వరం బాగా ఎక్కువైందని. ఇంతకుముందే మాలిక చెప్పి వెళ్ళింది. ఇప్పుడది మరీ ఎక్కువగా ఉన్నట్టుంది -

"నీడ..నీడ.. అన్నీ తన్నుకుపోతుంది.. దాన్నాపండి.

చీకటి రూపం -- ఇక్కడ నీళ్ళులేవు. దాహం" ఏదో పిచ్చిగా ప్రేలాపిస్తున్నాడు.

నిద్రపోదామనుకున్న నందుడికీ ప్రేలాపనలు ఇబ్బందిగా ఉన్నాయి - తనలో అనుకున్నాడు.

ఈ స్వరం ఆగితే బాగుండును, కాసేపు నిద్రన్నా పోవటానికి వీలుంటుంది. కానీ ఈ శబ్దాలు రాత్రిమీదనే కాక నా చైతన్యం మీదకూడా పహరా కాస్తున్నట్టుంది. ఇదినన్ను నిద్రపోనివ్వదు. అతడు సుందరివైపు చూస్తూ. నువ్వు నిద్రపోవటం మంచిదయింది. లేకపోతే మరింత చిరాకుతో మండిపడేదానివి. నిజంగా ఈరోజు నువ్వెంత బాధాపడ్డావో నేనూహించగలను - ఉదయం నుండీ పనిభారంతో అలసిపోయావు. అతిథులు రాని బాధ ఎంతగా అనుభవించావు - కోపంగా ఉన్నప్పుడు ఎంత కఠినంగా ఉగ్రంగా కనిపించావో - ఇప్పుడు నిద్రపోతుంటే అమాయకంగా పసిపిల్లలా అనిపిస్తున్నావు. నిజంగా నీ నిరాశనుండి పారద్రోలాలని నేనెంత ప్రయత్నించానో అదికూడా అర్థంచేసుకోలేకపోయావు. అప్పుడప్పుడు అస్సలు మనిషిగా ప్రవర్తించవు. నాచేత నాగ్రంధులు విచ్ఛిన్నమయ్యేంతగా బాధకలిగిస్తావు. మళ్ళీ నీ కళ్ళల్లోకి చూడగానే అన్నీ మర్చిపోతుంటాను. బహుశా నాలో ప్రేమకంటే నీమీద మోహమే ఎక్కువుందేమో. ఆ బలహీనత నుండి బయటికి రానివ్వకుండా నన్ను పదేపదే ఆడిస్తున్నావు. ఒక్కోసారి దాన్నుండి పూర్తిగా విముక్తి పొంది వెళ్ళిపోవాలనిపిస్తుంది. కానీ వెళ్ళలేననే అనిపిస్తుంది. ఏమిటో - నేనేమిటో అర్థంకాని నా అయోమయస్థితినుండి ఎప్పుడు బయటపడతానో.. అనుకుంటూనే మెల్లగా నిద్రలోకి జారిపోయాడు.

"నిజానికి బౌద్ధం ఒక మతం కాదు. అది ఆనాటి సాంప్రదాయాల్లోని ఛాందసవాదాలకు ఎదురు తిరిగిన ఒక సిద్ధాంతం. మానవత్వానికి - వ్యక్తిత్వానికి తప్ప మరోదానికంత ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించదు. దేవుడు - ఆత్మ మొదలయిన ఊహాపోహలను కల్పితంగా కొట్టేసింది. మానవుడు తనకర్థంకాని వాటినన్నిటిని దైవంలాగో, ఒక అతీంద్రియ శక్తిలాగానో ఊహించుకుని ఏదో పేరు పెట్టి కొలుస్తున్నాడే తప్ప అది వాస్తవం కాదనేది బౌద్ధధర్మం. అదే బుద్దుడు తన శిష్యులకు ప్రబోధం చేస్తున్నాడు. ఎదురుగా కూర్చుని ప్రశాంతంగా వింటున్నారు శిష్యులంతా. హేతుబద్ధమైన సత్యాలతో కార్యకారణాలు విచారించి పనిచేయటమే జ్ఞానం. అంధవిశ్వాసాలను నమ్మి గుడ్డిగా ఆచరించే వాళ్ళెన్నడు అభివృద్ధి సాధించలేరు. స్వయంకృషితో సేవాదృక్పథంతో తనను సమాజాన్ని సంస్కరించుకోగలగాలి. దానికి ఉత్తమమైన మార్గం ధర్మాచరణం. నైతికవర్తనం. ధర్మాన్ని తాను పాటించటమే కాదు మిగిలిన వారిని పాటింపచేయాలి - దానికి వ్యక్తి చాలడు. - వ్యవస్థ కావాలి. ఒక్కసారి విలువలు దిగజారటం ప్రారంభిస్తే మనిషి పూర్తిగా పతనం అంచుకు చేరుకుంటాడు. మానవత్వ నశిస్తుంది. ఆ బాటనుండి మళ్ళించటమే బౌద్ధులు చేయాల్సిన పని.

"ఉత్తమ సంస్కారాలు మంచి కార్యాలను ప్రోత్సహిస్తాయి. సాధించిన ఫలితాని బట్టే నువ్వు చేసిన పనిమంచా? చెడా? అని నిర్ణయించుకోవచ్చు. దైవశాసనాలు విధిలిఖితాలు. కేవలం ఊహల్లో నిలిచిపోయేవే. సోమరికాకుండా కష్టపడి బ్రతికేవాడు విజయాన్ని సాధిస్తాడు. అతని సమర్థత మీదకూడా విజయం ఆధారపడి ఉంటుంది. నియమబద్ధమైన జీవితం సమాజానికి ఆదర్శం - కులాలు మతాలు మనిషి మనిషికీ - మనసు మనసుకు మధ్య పెంచే దూరమే తప్ప సాధించేదేమీలేదు.

"కోర్కెలు తగ్గించుకునేవాళ్ళు దుఃఖానికి దూరమవుతారు. ఏ వస్తువుమీద వ్యామోహం పెంచుకుంటామో అది దూరమైనప్పుడు మనకు మిగిలేది అంతులేని నిరాశ. మమకారాన్ని సమకారం చెయ్యగలిగినప్పుడు ఉండేదంతా ప్రశాంతతే అది ఒక్క విశ్వప్రేమలోనే సాధ్యమౌతుంది. దానిని తెల్సుకోవటమే నిర్వాణం. మరొకటి లేనేలేదు. ఆత్మ మనసుకు పర్యాయపదమే తప్ప వేరేలేనేలేదు"

గౌతముడి బోధలు ముగియగానే శిష్యులంతా లేచారు. చెట్టుమీద నిద్రపోతున్న పక్షులన్నీ ఒక్కసారి లేచినట్టు - ఆయనమాటల్లో సత్యాన్ని అవగతం చేసుకుంటూ భిక్షాటనకు బయలుదేరారు.

ఛాందసుల కోపాన్ని పెంచేవిధంగా రోజురోజుకు బౌద్ధసిద్ధాంతం పండిత పామరులనాకర్షిస్తోంది. దానికడ్డుకట్ట వేయాలని మరోసారి పండిత సమావేశం జరిగింది. మగధబ్రాహ్మణులు కూడా వచ్చిచేరారు. వారంతా దేవదత్తుడి కోసం అన్వేషిస్తున్నారు. అతడందుబాటులో లేడు.

యశోధర ఇంట్లో జరిగిన సంఘటనతో అతడిలో కొంత పరివర్తనం మొదలయింది. మాటిమాటికీ ఆమె మాటలు గుర్తుకు వస్తున్నాయి. "మనిషిగా మారితే ఈ భవనంలో కాలుపెట్టు - మానవత్వాన్ని చంపి ఇహానికీ పరానికీ దూరం కావద్దు - నా బిడ్డలా భావించి తప్పుదారిలో నడుస్తున్న నిన్ను తల్లిలా శిక్షించాను. మీ అన్నదేవుడు - ప్రేమతో ద్వేషాన్ని జయించు -" ఈ మాటలు పదేపదే అంతరంగంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

అతని జీవన శైలిలో కూడా కొంతకొంత మార్పు కనిపిస్తోంది. ఎప్పుడూ జూదశాలల వెంట తిరిగేవాడు కొంత తగ్గించాడు. కాకపోతే అతడి ప్రధానమైన బలహీనత ఆమ్రపాలి - తరచూ ఆమె కోసం వైశాలి వెళ్తుంటాడు. ఆమె సౌందర్యానికి పూర్తి దాసోహమన్నాడు. నిజంగానే అపూర్వమైన ఆమ్రపాలి అందాన్ని గురించి కవులు కవితలల్లారు - ప్రణయ కావ్యాలు వ్రాసారు. ఆమెను మగధ రప్పించాలని చక్రవర్తి ఎన్నిసార్లు ప్రయత్నం చేసినా మాతృభూమిని విడచిరాలేనని వినయంగా కబురుచేసింది.

ఆమె గజ్జెకడితే శివుడే వచ్చి కాలుకలిపి నాట్యం చేస్తాడు. కనుబొమ కదిలితే మన్మధుడే వింటినారి సరిచూసుకుంటాడు. సృష్టిలోని లావణ్యాన్నంతా పోగుచేసి ఈ ముద్దుగుమ్మను రచించాడు అని రసికులు పొగుడుతుంటారు. అటువంటి ఆమ్రపాలిని దేవదత్తుడు మనసారా ప్రేమించాడు. ఆమెకూడా అతని రూపం పౌరుషాలను మోహించింది. కన్నుగీటితే కనకవర్షాలు కురిసినా కాలుకదిపితే రత్నంకంబళ్ళు పరిచినా ఆమె మనస్సు దేవదత్తుడి మీద చిక్కుకుంది. ఎంతటివారయినా ప్రేమకు దాసోహమేగా. పండితులి వార్తలన్ని సేకరించారు. దేవదత్తుడి ప్రధానబలహీనత ఆమ్రపాలని అర్థమయింది. ఏదయినా పండుపండినపుడు తొడిమ ఊడక తప్పదు. పశ్చాత్తాపమనే రవ్వ రగలటానికి బలమైన గాలి వీచక తప్పదు. నిజంగా అతనిలో ఆ మార్పు జరిగిందనటానికి జరిగిన ఆ సంఘటన సాక్ష్యం.

మట్టిలో మాణిక్యం బురదలో పద్మం చించుకులంలో పుట్టిన అందాలబొమ్మ చించిత. పదాహారేళ్ళ పడచుపరువంలో విరిసీ విరియని కొత్త అందాలతో కుర్రకారు గుండెల్ని ఊపేస్తూ ఎప్పుడూ లేడిపిల్లలా చలాకీగా తిరుగుతుండేది. ఆమెకో చెల్లెలు తమ్ముడు రోగిష్టి తండ్రివున్నారు. తల్లి చిన్నతనంలోనే చనిపోయింది. కుటుంబభారమంతా ఆమె మీదే పడింది.

ఒకసారి గౌతముడు వీరు నివసిస్తున్న ప్రాంతానికి రావటం జరిగింది. చించుకులస్థులందరూ ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. వాళ్ళు పెట్టిన భిక్ష ఆనందంగా ఆరగించాడు గౌతముడు. ఆ రోజు ఆయనిచ్చిన సందేశంతో చించుకులమంతా దాసోహమన్నారు. అనేకమంది దీక్షలు తీసుకున్నారు.

రాజయినా పేదయినా పెద్దకులమయినా తక్కువ కులమయినా అందరూ మనుష్యులే. అందరిలో ప్రవహిస్తున్నది ఒకే రక్తం. చర్మం మీద ఏర్పడవే వరవ్యవసలనీ. వాటికతీతంగా అందరూ కలిసి మెలసి బ్రతకటంలోనే ఆనందముంది. సమాజంలో ఒకరినొకరితో

అవసరం ఉంది. కనుకనే ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ అనే బేధభావం, అజ్ఞానం అహంకారం వాటిని తొలగించి సమసమాజస్థాపనే లక్ష్యంగా ముందుకు పోవాలి. ముఖ్యంగా మీలోని పిరికితనాన్ని పోగొట్టుకుని ఆత్మవిశ్వాసంతో తలెత్తి మనిషిగా బ్రతకండి.

ఆ మాటలు చించితనెంత ఆకర్షించాయంటే ఆమె ఎవరితో మాట్లాడినా "ఆ ఏముంది బాబూ - ఊపిరిన్నంత వరకేగా భేదాలు, పొయ్యాక అందరూ ఆ మట్టిలోన, ఆకట్టెల్లో కలవాల్సిందే - నిప్పుకు మట్టికి లేని తేడా మనకెందుకంట. బూడిదలో ఏ కులాన్ని వెతుకుతారు - బతికిన నాలుగురోజులు మంచిగా కలసిమెలసి బతుకుదాం" అని చెబుతుండేది. ఆమే కాదు బుద్ధుడి బోధలు పామరజనంలో కూడా తేలిగ్గా చొచ్చుకుపోతున్నాయి, సాక్షాత్తూ భగవంతుడి అవతారంగా కొలుస్తున్నారు. మెల్లమెల్లగా మూఢనమ్మకాల పొరలు వీడిపోతున్నాయి. చదువు లేకపోయినా పామరులు తెలివిగా మాట్లాడుతున్నారు.

తమ శక్తేంటో తెలుసుకుంటున్నారు. దోపిడీ విధానం నుండీ శ్రమశక్తికి గుర్తింపు ప్రారంభమయింది. తరతరాలుగా గూడు కట్టుకున్న అంతరాల గోడలు మెల్లమెల్లగా బీటలు వారుతున్నాయి. అనేకమంది సాయంత్రం వేళల్లో నదీతీరానికెళ్ళి బుద్ధభగవానుని ప్రసంగాలు వింటున్నారు.

చించిత కూడా ఆశ్రమాన్ని శుభ్రపర్చటం భిక్షుణీ సంఘానికి కావల్సిన పనులు చేస్తూ కొద్దికాలంలోనే బుద్ధుడికి ఆత్మీయశిష్యురాలైంది. ఆమె ప్రతిరోజూ నిరాఘాటంగా అన్నిచోట్లకు తిరుగుతూ చలాకిగా పనులు చేసిపెడుతూ అందరికీ ఇష్టురాలయింది. ఎంతో భక్తిగా గౌతముడి ధార్మిక ప్రసంగం వినేది. ఉదయమే అడవికెళ్ళి కట్టెలు కొట్టుకొచ్చేది. పొలంలో కూలిపనిచేసేది. కుటుంబాన్ని పోషిస్తూనే బౌద్ధసేవ చేస్తుండేది.

బౌద్ధధర్మం ఇలా భూమి పొరలను చీల్చుకుంటూ వేళ్ళు నాటుకుంటుంటే ఛాందసవాదానికి గతులు తప్పుతున్నాయి. ఆయన కీర్తి ప్రతిష్టలు పెరిగేకొద్దీ కర్మవాదులుకు మతులు పోతున్నాయి. ప్రజల హృదయాల్లో పీఠం వేసుకుంటున్న నూతన ధర్మం సనాతన ధర్మానికి పెనుసవాలుగా నిల్చింది. క్రమక్రమంగా వర్ణవ్యవస్థ గోడలు కదులుతున్నాయి. తర్వాత మిగిలింది పునాదులే. అంతరాలదూరం తగ్గేకొద్దీ వ్యవస్థలో సంఘీభావం రోజురోజుకు పెరుగుతోంది.

వేల సంవత్సరాలుగా కరుడుగట్టిన మూఢాచారాలను బౌద్ధులు కదలిస్తున్నారు.

ప్రపంచమంతా ఒక తాటిపైకి తీసుకురాగలిగేది మతాలు, దైవాలు కాదు - యజ్ఞాలంతకంటే కాదు - ఈ ఆచారాలన్ని మనుష్యుల మధ్య విభేదాలు కలిగిస్తాయి మహోన్నతమైన మానవతా ధర్మమొక్కటే సరిహద్దులు చెరపగలిగింది. దీన్ని వ్యాప్తి చెందిచటమే భిక్షువులు చేయాల్సింది. ఈ ప్రాతిపదికమీదే బుద్ధధర్మం వేళ్ళూనుకుంటున్నది. దానికవరోధాలయిన అంధవిశ్వాసాలు తెరమరుగవుతున్నాయి.

"ఎలాగయినా దీన్నాపాలి. ఇన్ని సంవత్సరాలుగా దాని నీడలో బ్రతుకుతున్న మనజీవితాలకు పెద్ద ముప్పురాబోతోంది. మేలుకోక తప్పదు - పాలనారంగం దాన్ని శాసిస్తున్న మతాన్ని మానవ సమాన సహజీవనానికి అవరోధంగా ప్రజలు భావిస్తున్నారు. ఒకరకంగా భావవిప్లవం బయలుదేరింది. దీనినాపకపోతే వైదిక ధర్మం మూలపీఠం కదులుతుంది. చక్రవర్తులు సయితం గౌతముడి ఆకర్షణలో పడిపోతున్నారు. ఇక సనాతనాచారాలు నిలబెట్టుకోవటానికి ఆర్థిక ఇబ్బందులు కూడా ఎదురౌతాయి. మనందరం జాగ్రత్త పడకపోతే ముంచుకొస్తున్న ముప్పుతప్పుకోలేం.

"అందుకే ఈరోజు ఈ ప్రత్యేక సమావేశం. అందరూ వచ్చినందుకు సంతోషం జీర్ణమైపోతున్న సంప్రదాయాలను కాపాడాలనుకుంటున్న మీ అందరికి నా కృతజ్ఞతలు"

ఈ మాటలనది ఎవరోకాదు. సాకాతూ శుదోదనుడి ప్రదానపురోహితుడు కూటదంతుడు.

ఆ సమావేశం జరుగుతున్నది వైశాలి నగరంలో ఆమ్రపాలి ఇంట్లో. దేవదత్తుడు కూడా అక్కడుండటం మరో విశేషం. కూటవాదులంతా చేరారు. గౌతముడు వచ్చేంతవరకు అతని ఆటలు సాగాయి. రెండో దేవుడిలా వెలిగిపోయాడు. ఏ పుణ్యకార్యం చెయ్యాలన్నా అతడు ముహూర్తం పెట్టాకే. రాజపురోహితుడిగా రాజ్యాన్నే శాసించాడు. కానీ గతకొద్దిరోజులుగా రాజకుటుంబం దేనికీ ఆయనతో సంప్రతించటంలేదు. అందరూ దీక్ష తీసుకున్నాక పూజాతతంగాలే లేవు.

జారిపోతున్న విలువను నిలబెట్టుకోవాలనే ఆలోచన కూటదంతుడికి నిద్రాహారాలు లేకుండా చేస్తోంది. అతడికి మిగిలిన పండితులు తోడయ్యారు. మగధకు సందేశాలందాయి. చాలా రహస్యంగా ముఖ్యులతో ఈ సమావేశం నిర్వహించబడుతోంది.

ఇక ఆమ్రపాలి బుద్ధుడిమీద అకారణ ద్వేషం పెంచుకుంది. అతడు వైశాలికి వచ్చినపుడు ఆమె ఆశ్రమానికి వెళ్ళి దర్శించింది. అద్భుతమైన అతని సౌందర్యం చూసి వ్యామోహితురాలైంది దానికితోడు కొంతమంది ఆమెను సవాలు చేసారు. నీ సౌందర్యంతో అతడిని గెలవమని. ప్రతిజ్ఞ పట్టి గౌతముడిని తన దారిలోకి తెచ్చుకోవటానికి ఎన్నో విధాలుగా ప్రయత్నించి భంగపడి చివరకు దెబ్బతిన్న పాంలా పగబట్టింది. అందుకే పండితులతో చేయికలిపింది. దేవదత్తుడు పూర్తిగా ఆమె వ్యామోహంలో కూరుకుపొయ్యాడు కనుక అతడిని రప్పించటం పెద్ద కష్టంకాలేదు. మొత్తానికి సమావేశంలో కొన్ని తీర్మానాలు చెయ్యబడ్డాయి. అవి మాత్రం అత్యంత గోప్యంగా ఉంచబడ్డాయి.

************

## (10)

**పడమటి దిక్కు ఎర్రబడుతోంది.** సూర్యుడు ఇంటికి చేరే తొందరలో ఉన్నాడు. అందుకే కిరణాలంత వేడిగా లేవు. మేతకొచ్చిన పశువులు ఇంటిదారి పట్టాయి. కుర్రాళ్ళు మందను అదిలిస్తున్నారు. రోహిణీ నదీ జలాల్లో అస్తమయ బింబం గుండ్రటి బొట్టుదిద్దిన పేరంటాల్లా కనిపిస్తోంది. గాలి హుషారుగా గంతులు పెడుతోంది. కుర్రాళ్ళు ఉత్సాహంగా పాటందుకున్నారు.

**'దేవుడంటె దేవుడయా**
**మా బుద్ధాయన దేవుడయా**
**కన్నోళ్ళ కళ్ళు కప్పి**
**కట్టుకున్న భార్యనొగ్గి**
**కారడవుల కేగినాడంట**
**కాంతిమారగం కన్నాడంట ||దే||**
**అన్నమోసామీ అంటె**
**అమ్మలాగ ఆదరిత్తాడు**
**మా పేద బతుకుల్లోన**
**పెన్నిదిగా నిలిచాడంట ||దే||**

పశువుల కాపర్ల పాట ప్రకృతి విని పులకరిస్తోంది. దారి పొడువునా రాలిపడిన పండ్లనే కాన్కగా అందిస్తోంది. వాటినేరుకుంటూ తింటూ పిల్లలు ఇళ్ళదారి పట్టారు - పశువుల కాపర్లు పాడుతూ నడుస్తున్నారు. మధ్య మధ్య చేతిలో ఉన్న కొడవళ్ళతో వెదురు కర్రలను నరికి మురళి తయారు చేసుకుని వాయిస్తున్నారు.

చల్లగాలికి దారిపక్కన పొదలు తలలూపుతున్నాయి. పాటకు పరవశించినట్టు చెట్లు రాల్చిన కాయలను ఏరుకోవటానికి పోటీపడి పరుగెత్తుతున్నారు. అడవిదాటి డొంకదారిపట్టాయి ఆలమందలు.

అడవిలో ఎండుకట్టెల మోపు కట్టుకుంటోంది చించిత. తోడు వచ్చిన స్నేహితుల ముదుకెళ్ళిపోయారు. తమ్ముడు చెల్లెలు కూడా వాళ్ళతో వెళ్ళారు. వాళ్ళను తిడుతూనే కట్టెలమోపు తలకెత్తుకోవటానికి గుడ్డ మడిచి చుట్టగా చుట్టి పెట్టుకుంది. కట్టెలమోపు పైకెత్తుకుంది. నడుముచుట్టూ దోపిన పైట కొంగులో అడవి దుంపలు, కొన్నికాయలు మూటగట్టి ఉన్నాయి పగలంతా కష్టపడిందేమో ముఖం వాడిపోయింది. చెదిరిన కురులు, మబ్బులు కమ్మిన చందమామలా ముఖానికి సోయగాన్నిస్తున్నాయి. అడవి మల్లెలాంటి యవ్వనం, నిర్మానుష్యంగా ఉన్న పరిసరాలు. అక్కడక్కడ ఒక్కో కిరణం పలకరిస్తున్నా చీకటి ఛాయ అలముకొంది. అలవాటయిన దారి భయమేముంది. ముందుకు నడుసుంటే కాళ్ళకింద ఎండుటాకులు గలగలమంటున్నాయి. ముళ్ళపొదలో చిక్కుకుంటున్న చీరెను

విదుల్చుకుంటూ ఇల్లు గుర్తొచ్చి నడకలో వేగం పెంచింది. ఇంకో పదిబారలు నడిస్తే చాలు అడవి ముగుస్తుంది. చల్లటి నదీవాయువులు పీల్చుకోవచ్చు. ఇంకో బారగడిచింది. అదిగో ఆ చెట్ల తోపు దాటితే – డొంక.

అది దాటకుండానే పెద్ద కోరపళ్ళతో పొడవాటి గోళ్ళతో ఆరడుగుల పొడవున్న ఎలుగుబంటి దారిలో అడ్డంగా కూర్చుంది. నోరంతా తెరచి మీద పడటానికి సిద్ధంగా ఉంది. దాని గుర్రు ఎర్రటి కళ్ళు చూస్తుంటే పై ప్రాణాలు పైనే పోతున్నాయి. కాళ్ళల్లో ఒణుకు – అడుగులు నేలలో పాదుకుపోయినట్లు కాళ్ళు కదలటంలేదు – ఒళ్ళంతా చెమటలో తడిసి ముద్దగా అయిపోయింది. బెదురుచూపులు చూస్తుండిపోయింది.

ఒక్క నిమిషం గాలి స్థంభించింది. పక్షులు కూడా శబ్దం చేయటంలేదు – హఠాత్తుగా ఎలుగుబంటి ఆమె మీదికి ఎగిరిదూకింది. ఇక తనపని అయిపోయింది.

ఆ రోజుతో ఆయువు సరి. కళ్ళు గట్టిగా మూసుకుని ప్రాణాలమీద ఆశవదులుకుని నిలబడింది.

కొన్ని క్షణాలు గడిచాయి –

ఏంకాలేదు. ఆశ్చర్యంగా కళ్ళు తెరిచింది. ఎదురుగా ఆమె ఊహించని దృశ్యం. ఎవరో అందమైన యువకుడు దానితో పోరాడుతున్నాడు. దాని గోళ్ళ రక్కుళ్ళకు శరీరం, పూచిన మోదుగు చెట్టులా తయారయింది. గాయాలనుండి రక్తం స్రవిస్తోంది. అయినా అతడు లెక్కచెయ్యకుండా దానితో కలబడుతున్నాడు.

చింబిత కూడా ధైర్యం తెచ్చుకుంది. తలమీదున్న కట్టెలమోపు క్రిందపడేసి దానిలో ఉన్న చిన్న గొడ్డలి తీసి యువకుడికి అందించింది. అతడు కృతజ్ఞతగా చూస్తూ ఆ ఆయుధంతో దాన్నెదుర్కొన్నాడు. ఆ భీకర పోరాటం ఇక మరెంతో సేపు పట్టలా. ఎలుగుబంటి తోక ముడిచి పారిపోవటం అతడు అలసటతో భూమిపై వాలిపోవటం ఏకకాలంలో జరిగిపోయాయి. పక్కనున్న నీటి కుంటలో తన చీరకొంగు తడుపుకొచ్చి అతని గాయాల్ని శుభ్రం చేసింది. తనకు తెల్సిన ఆకుపసరు గాయాలమీద పిండి పైటతో విసురుతూ కూర్చుంది.

కాసేపటికి అతడు తేరుకున్నాడు –

"మీరెవరు? ఈ అభాగ్యురాలికోసం ఇంత సాహసం చేసారు? మీకేమయినా అయితే?" ఆల్చిప్పల్లాంటి కళ్ళను గుండ్రంగా తిప్పింది.

"నేనా? పరదేశిని. ఇకనా అదృష్టం కొద్దీ సమయానికొచ్చాను. లేకపోతే మొగ్గలాంటి ఈ అందం దాని గోళ్ళకు బలయ్యేదేగా" అతడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

ఆ చూపులు తన వయసుకు గిలిగింతలు పెడుతున్నాయి. సూటిగా చూడలేక కళ్ళు వాల్చుకుని

"పరదేశిబాబూ! మాలాంటివాళ్ళ బతుకులకు విలువేముంది మీరు చూస్తే గొప్పింటి బిడ్డలాగున్నారు. చాలాసాహసం చేసారు"

ఆమె కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

"పిచ్చిదానా! ప్రాణం అందరికి విలువయిందే దానికి గొప్ప తక్కువ తేడాయేముంది. అందరం మనుష్యులమేగా"

"బలే. మీరూ బుద్ధదేవుడులా చెబుతున్నారే. మీరు కూడా ఆయన శిష్యులా?" ఆమె కళ్ళల్లో ఆనందం తొంగిచూసింది.

"నిజం చెప్పటానికి ఆయన శిష్యుడే అవ్వాలా అభిప్రాయం మరెవరికీ ఉండకూడదా కలువరేకుల్లాంటి నీ కళ్ళమీద ఆన. నా మాటలే నేను చెప్పాను"

అతని చూపుల్లో కొంటెతనం. గాలం వేసి మనసును లాగేస్తోంది. దాన్ని మించి రూపం, సంధ్య వెలుగులో పచ్చగా మెరిసిపోతున్నాడు. తుమ్మెద రెక్కల్లాంటి జుట్టు ముఖానికి మరింత అందంగా ఉంది. కోరమీసం ఓరచూపులు. సంపూర్ణ పురుషత్వాన్ని చాటుతున్నాయి. అసలే కోతి కల్లుతాగిందన్న సామెతగా –

మంచి వయసు – దానికి తోడు ఒంటరితనం. పడుచుదనం ప్రేమగాలంలో చిక్కటానికెంత సమయం కావాలి? తొలిచూపులోనే ఆమె మనసు అతని రూపంలో చిక్కుబడింది కన్నె వయసుకు నచ్చేది ముందు రూపమే – మౌనంగా అతనివైపు చూస్తుండిపోయింది. అతడు కూడా సన్నజాజిలాంటి ఆమె అందాన్ని చూస్తున్నాడు. పరస్పరం చూపులయ్యాక ఒకరి మనసు ఒకరికర్థమయ్యాక ఇచ్చిపుచ్చుకునే ధోరణి వచ్చింది –

మొదటిరోజు కనుక ఒక చిరుముద్దు, చిన్న కౌగిలింతతో సరిపుచ్చుకుని మళ్ళీ ఎక్కడ కల్సుకోవాలో సంకేతం ఏర్పాటుచేసుకుని ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆమె పేదబ్రతుక్కు పెళ్ళికావటమే కష్టం. పైగా కుటుంబ సమస్యలతో సతమతమవుతోంది. అటువంటి తన వయస్సుకు వసంతమే రాదనుకుంటున్న సమయంలో అందగాడు వలిచాడు. వలపించుకున్నాడు. ఇంకేం కావాలి. కన్నకలలు సఫలం కాబోతున్నాయి. అతని నీడలో తన బ్రతుకు పండుతుంది. అతడు మోసగాడు కాదు. ఆ కళ్ళల్లో ఎంత ప్రేమ, ఆరాధన. లోకమంతా అతనిమయమైపోయింది. అద్దం చూసుకోవటం ఎక్కువయింది. బుద్ధుడి బోధలు చెవికెక్కటం తక్కువయింది.

అనుకున్న ప్రకారం సంకేతస్థలంలో కల్సుకుంటున్నారు. ప్రేమవూసులు మొలకెత్తి పెళ్ళనే చెట్టువరకు పెరిగింది.

అతడామెను ఎంతగా నమ్మించాడంటే నిద్రగన్నేరు పూలమాల మెళ్ళోవేసి ఇదే పెళ్ళివేడుకని చెప్పాడు. పొగడపూలతలంబ్రాలు పోసాడు. ఎండుటాకులు రగిల్చి అగ్నిదేవుడి సాక్షిగా ఏడడుగులు నడిపించాడు. ఆకాశమే పురోహితుడన్నాడు. వీటన్నింటికి అడవి తల్లి సాక్షి. అని దండం పెట్టాడు. కరిగిపోయింది కన్నెమనసు. పెద్దలు సాక్ష్యం లేరు. వరుడెవరికీ తెలియదు ఇది నిజమో – కాదో అనే అనుమానమే రాలేదు ఆ పసి హృదయానికి.

మెత్తని పచ్చటాకుల పాన్పుపై గుట్టగా పెరిగిన పొదరిండ్లలో తన తొలియవ్వనాన్ని ఆనందంగా పరిచింది. 'సాగింది ముందుకు తుమ్మెదరాజు విరబూసిన అందాలకు మహారాజు త్రాగింది విందుగా మకరంద పరువం.

పొంగింది పరవళ్ళుగా లేతప్రాయం. అలంకరించుకున్న బలిపశువులా తన జీవితాన్ని తానే పతనం చేసుకుని మురిసిపోతుందా ముగ్ధపరువం.

కొన్నిరోజులు గడిచిపోయయి. యవ్వనపు పొంగు చల్లారుతున్న సమయంలో ఆమె గర్భవతయింది. అప్పటికి అతని పాత్ర ముగిసింది. కలిమి దోచిన తుమ్మెద చోటు విడచింది. చెలిమి మీర పూబొమ్మ రారమ్మని అరచింది. జారిన రెక్కల పయ్యెద విసిరింది. మరువకు స్నేహమంచు అరచింది.

కానీ, ఈ తుమ్మెద మళ్ళీ రాదు. మరో పుష్పాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయింది. ఆ విషయం అర్థమయ్యేసరికి మూడునెలలు గడిచాయి. దాచలేని గర్భాన్ని దాగని రహస్యాన్నెంత కాలం మూయగలదు – తండ్రితో చెప్పీ ప్రయోజనం లేదు – తోడబుట్టిన వాళ్ళు చిన్నవాళ్ళు. కడుపులో దాచుకునే తల్లి తనే మృత్యుకడుపులో ఒదిగిపోయే. ఏం చెయాలి.

అతనికోసం ప్రతిరోజూ ఎదురుచూస్తూనే ఉంది. ప్రతి కొమ్మను అడుగుతూనే ఉంది. పరదేశిబాబూ అని. గొంతెత్తి అరిస్తే ఆమె ప్రతిధ్వనే తప్ప సమాధానం లేదు. సాక్షిగా నిలిచిన అడవితల్లి ముందు కుమిలి కుమిలి ఏడ్చింది అదీ మౌనంగా. శోకించి శోకించి చివరికో నిర్ణయానికొచ్చింది. బ్రతికి అందరికి తలవంపులయ్యే కంటే చచ్చి సానుభూతి సంపాదించవచ్చు. అందరికీ విషయం

తెలిసేలోపల ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికొచ్చింది. ఒకరోజు గుడిసె ముందు విచారంగా కూర్చున్న ఆమె దగ్గరికి ఇద్దరు మనుష్యులొచ్చారు. వాళ్ళ ముఖాలమీద ముసుగు ఉండటంతో గుర్తుపట్టలేకపోయింది.

"ఎవరు మీరు?" ఆందోళనగా అడిగింది.

"ఎవరయితే నీకెందుకు. మా వెంటరా. నీకు మంచి జరుగుతుంది" వాళ్ళ గొంతులు కర్కశంగా ఉన్నాయి.

"ముక్కు మొహం తెలియకుండా ఎలారాను?"

"ముక్కు మొహం తెలిసే కడుపు తెచ్చుకున్నావా?"

ఒకడు హుంకరించాడు.

ఆ మాటకు పిడుగు పడ్డట్టు ఉలిక్కిపడింది. ఇంతవరకా రహస్యం తనకు పరదేశికి తప్ప మరెవరికి తెలియదు. వీళ్ళకెలా తెలుసు. భయంతో వణికిపోతోంది.

"భయపడకు. నీకు మంచిచేద్దామనే వచ్చాం. మర్యాదగా మా వెంటరా. లేకపోతే చంపేస్తాం"

"ఆ పని చెయ్యండి బాబూ! నా పాలిట దేవుళ్ళనుకుంటాను. లజ్జాహీనమైన ఈ బ్రతుకు ఎలా అంతం చెయ్యాలా అని అస్తమానం ఆలోచిస్తున్నాను. పుణ్యపురుషులు ఈమంచి కార్యం మీ చేతుల్తో పూర్తిచేసి భూమికి భారం తగ్గించండి. నన్ను చంపేయండి" ఏడుస్తూ అంది.

"పిచ్చిదానా! మా గొంతులు మొరటుగా ఉన్నంత మాత్రాన కసాయివాళ్ళమనుకున్నావా? మా చెల్లిగా అనుకుంటాం. తోడబుట్టిన అన్నయ్యలం అనుకో. నీకే అపకారం జరగదు - పైగా నిన్ను నమ్మించి మోసం చేసిన వాడెవడో కూడా తెల్సు. వాడిపేరు పరదేశి అవునా?"

ఆమె కళ్ళల్లో కోటి సంబరాలు. ఎక్కడా లేని ఆనందంతో మనసు ఊగిపోయింది - అమాంతం వాళ్ళ కాళ్ళమీద పడింది.

"నిజంగా మీరు నా దైవాలు - చిమ్మచీకటిలాంటి ఈ బతుకును వెలిగించటానికొచ్చిన దీపాలు. లోకనింద ఒకవైపు మరోవైపు నా కుటుంబం. ఈ రెండింటి మధ్య సతమతమైపోతున్నాను. నా భర్తను నన్ను కలిపి నా పరువు నిలబెటండి అన్నలారా! జీవితమంతా మీకు రుణపడి ఉంటాను. తొందరగా ఆయన దగ్గరకు నన్ను తీసుకెళ్ళండి. నరకంలోకయినా నేను రావటానికి సిద్ధం. పదండి" తొందరచేసింది. వాళ్ళు ముందు ఆమె వెనకా బయలుదేరారు.

చించిత ఆలోచిస్తూనే నడుస్తోంది. ఏదయినా చావటానికి సిద్ధంగా ఉంది తను. తన రహస్యం చెప్పారంటే తప్పక తన భర్తకు తెలిసినవాళ్ళే. ఏదో పనులవల్ల ఆయన రాలేకపోయుంటాడు. గొప్పోడు కదా బయటపడితే వాళ్ళమ్మా నాన్నా ఒప్పుకోవద్దూ. అందుకే రహస్యంగా కబురుచేసుంటాడు. ఏమయితేనేం తనవాడ్ని తాను చేరబోతోంది. ఈ అవమానం నుండి కాపాడితే చాలు ఇంకేం వద్దు. ఈ జన్మకు.

పదే పదే ఆకాశం వైపు తిరిగి దండం పెట్టుకుంటున్న ఆమెను చూసి వాళ్ళల్లో వాళ్ళు నవ్వుకుంటున్నారు. ఎన్నో సందులు గొందులు తిప్పించి చివరకొక భవనంలోకి ఆమెను తీసుకెళ్ళారు.

వసంతోత్సవం సుందరి మనసులో తీరని అవమానాగ్ని రగిల్చింది. ఎందుకోసం ఆ ఉత్సవాన్ని ఆమె నిర్వహించాలనుకుందో ఆశయం నెరవేరకపోగా మరింత బాధను పెంచుతూ కపిలవస్తు నగరం దాదాపు అంతా దీక్షలు తీసుకున్నారు, ఎందుకోసం పోరాడిందో ఆ ఫలితం మాత్రం పొందలేదు. పైగా ప్రజల్లో చాలా చెడ్డపేరు వచ్చింది. దేవుడిలాంటి గౌతముడిని వ్యతిరేకించిందని కుంటుంబంలో

చిచ్చులు పెట్టి భర్తను దీక్షోత్సవానికెళ్ళనీయలేదని నందుడ్ని అమాయకుడ్ని చేసి కొంగున కట్టుకు తిరుగుతోందని. ఎవరికి తోచినట్టు వారు మాట్లడుతున్నారు. ఏదో విధంగా ఆ మాటలు చెవిన పడుతున్నాయి.

మామూలుగా పురుషులెవరూ స్త్రీ ఆధిక్యత సహించలేరు. వారు విమర్శించినా ఒకర్థముంది. కానీ ఏ స్త్రీల పక్షాన తను ప్రతినిధిగా నిలబడిందో వాళ్ళు కూడా ఆమెను హేళనగా మాట్లాడటం, పైపెచ్చు యశోధరాదేవిని సాక్షాత్తూ సతీదేవిగా ఆరాధించటం చూసి ఆమె విరక్తిగా నవ్వుకుంది.

సమాజం ముఖ్యంగా స్త్రీలు ఎప్పటికీ వాళ్ళ బానిస వ్యవస్థ నుండి బయటపడలేరు. తమకు తామే వేసుకున్న సంకెళ్ళను ఛేదించాలని కోరుకోరు. మూఢాచారాల ముసుగులో జీవితాన్ని బలిచేసుకుంటూ ఇదే ఆదర్శమనుకుంటున్న యశోధరాదేవి ప్రశంసాపాత్రురాలు. కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తల అనుబంధం పటిష్టంగా నిలవాలని, దాన్ని కాపాడుకోవటం కోసం స్త్రీలు కొంత చొరవచూపాలని కోరుకునే తను రాక్షసి గయ్యాళి. ఇదీ సమాజం తీరుతెన్నులు.

కొద్దిరోజులు గడిచాయి. ఆమె హృదయంలోని గాయం ఇంకా మానలేదు. ఆరోజు యశోధరాదేవి దగ్గర నుండి కబురొచ్చింది. బంధువులందరిని చివరిసారిగా భవనంలో చూడదల్చుకున్నానని – ఇకపై ఆ భవనం విడచి భిక్షుణీ సంఘంలోకి వెళ్ళిపోతున్నట్టు తప్పనిసరిగా తనిచ్చే విందుకు రావాలని దాని సారాంశం – సుందరీనందులు ప్రత్యేకంగా ఆహ్వానింపబడ్డారు. సుందరి నిర్ద్వంద్వంగా ఆహ్వానాన్ని తిరస్కరించింది. బంధుత్వాలనడ్డం పెట్టుకుని తన మనసును చంపుకోలేనని నిష్కర్షగా చెప్పేసింది. చేసేదేం లేక నందుడొక్కడే వెళ్ళాడు.

యశోధర మందిరం బంధువులతో కళకళలాడిపోతోంది. ముండనం చేయించుకుని కాషాయ చీర కట్టుకున్న యశోధర రూపం చూడటానికి ఇబ్బందిగా ఉంది. పైగా సాంప్రదాయక ముసుగును ఆమె వదిలేసింది. రేపటినుండి చాలా సాధారణ జీవితం గడపబోతోంది. అందుకే అంతఃపుర మర్యాదలు విడిచిపెట్టింది. రేపే భిక్షుణీ మందిరానికెళ్ళిపోతోంది. వాళ్ళకు చాలా సాధారణమైన జీవితాన్ని నిర్దేశించాడు గౌతముడు. భిక్షా యాచనం తప్ప మిగిలనవన్నీ సామాన్యుల్లాగానే ఆచరించాలి. ఎవరి బట్టలు వారే ఉతకాలి. ప్రతిరోజూ రోగుల ఇళ్ళకు వెళ్ళి సేవలు చెయ్యాలి. అనాధలయిన స్త్రీలనాదరించాలి. సామాన్యమైన ఆహారం తీసుకోవాలి – ఈ విషయంలో అందరూ సమానులే.

బంధువులందరితో యశోధర చక్కగా నవ్వుతూ మాట్లాడింది. తన చేతులమీదుగా స్వయంగా భోజనం వడ్డించింది. ఆమె ముఖంలో ఎంతో ప్రశాంతత. దారిదొరికిన సంతృప్తిని నందుడు చూడగలిగాడు.

సుందరి గురించి ప్రత్యేకంగా అడగడమే కాదు ఆమె మార్గంలో ఆమె సఫలమవ్వాలని ఆశీర్వదిస్తున్నట్టుగా చెప్పమంది.

నందుడెంత ప్రయత్నించినా ఆ మాటలకర్థం తెలియలేదు.

తెల్లవారీ తెల్లవారకముందే కపిలవస్తు నగరం వీధుల్లో దండోరా వేయబడింది. తప్పెట్లు మోగించుకుంటూ వీధివీధి తిరుగుతూ కొందరు భటులు ఒక ప్రకటన చదివి వినిపిస్తున్నారు –

'ఇందుమూలంగా అందరికి తెలియజేసేదేమంటే సాయంత్రం నగరం వెలుపల చేతవనానికి సమీపంలో పెద్ద మర్రి మైదానంలో విచారణ జరుగుతుంది కనుక యావన్మది రావాలహో.. ఇది రాజపురోహితులు కూటదంతుల వారి ఆజ్ఞ తప్పనిసరిగా రావాలహో..'

అది విని పౌరులంతా గుసగుసలాడుకుంటున్నారు. మళ్ళీ ఎవరికి మూడిందో పేరుకు తగినట్టు ఎప్పుడూ ఏవో కుటిలప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. ఈసారి ఏదో పెద్ద యత్నంలోనే ఉన్నాడు. చాలాకాలం తర్వాత తెరపైకి వస్తున్నాడు. పైగా విచారణట. అన్నీ ముందే తయారుచేసుకుని పెకి మాత్రం విచారణని పేరు పెడుతున్నాడు. ఏ అమాయకుడి తలో ఎగిరిపోతుంది.

అయినా గౌతమబుద్ధులు నగరంలోనే ఉన్నారుగా. ఏ భయంలేదు - ఇలా ఎవరికి వాళ్ళు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుకుంటున్నారు.

ఏం జరుగుతుందో చూడాలనే కుతూహలంతో అందరూ వెళ్ళాలనే నిశ్చయానికొచ్చారు. గౌతముడి ఆశ్రమం దగ్గరకూడా ప్రకటన చదవటమేకాక - ఆయన్ని శిష్యులను ప్రత్యేకంగా ఆహ్వానించారు -

మధ్యాహ్నం దాటగానే పౌరులంతా గుంపులు గుంపులుగా బయలుదేరారు. ఆనందుడికెందుకో అనుమానంగానే ఉంది. అతడు చాలా విషయాలు వింటున్నాడు. బుద్ధమతానికి వ్యతిరేకంగా పండితులంతా సమావేశమయ్యారని కూడా తెల్సింది. అయినా నిప్పుకు చెద అంటుతుందా? సర్వోత్కృష్టుడైన బుద్ధదేవుడినెవ్వరేం చెయ్యగలరు. అయినా ముందు చూపుతో సహచరులతో చర్చించాడు. బౌద్ధాన్ని గురించి ఏదయినా వారు అవమానం చెయ్యదలిస్తే అందరం ఎదిరించి నిలబడాలని చెప్పాడు. అందరూ సిద్ధపడిపోయారు. ఇవేమీ పట్టించుకోని తథాగతుడు తన దైనందిన కార్యక్రమంలో భాగంగా ధ్యానంలో ఉండిపోయాడు.

ఆరోజు దేవదత్తుడు నగరంలో లేడు. కానీ విచారణ సమయానికి వస్తానని ఆమ్రపాలికి మాటిచ్చాడు.

విచారణ సమయం సమీపించింది. వేలాదిగా పౌరులు నదీతీరమంతా ఆక్రమించారు. ఎవరు విచారకులో ఎవ్వరికేమీ అర్థంకావటంలేదు - విషయమంత రహస్యంగా ఉంచబడింది.

ఉన్నతాసనం మీద కూటదంతుడాసీనుడయ్యాడు. అతడు ప్రధాన విచారకుడి స్థానంలో ఉన్నాడు. మరికొంతమంది పండితులు వారి ఆసనాల మీద కూర్చున్నారు. జనం ఇంకా తరలివస్తూనే ఉన్నారు. ఆ దృశ్యం అతడికెంతో ఆనందాన్నిస్తోంది. తన మిడిగుడ్లు తిప్పి అటూ ఇటూ చూస్తున్నాడు.

గౌతముడు ఆశ్రమంలో ఉండటంతో శిష్యులంతా అక్కడే నిలబడి చూస్తున్నారు.

కూటదంతుడు లేచి నిలబడ్డాడు. భుజం మీద పట్టుశాలువా సరిచేసుకున్నాడు. గొంతు సవరించుకుని -

"శాక్యనగర ప్రజలకు నా అభివాదం. ధర్మానికి న్యాయానికి కట్టుబడ్డ శాక్యరాజుల ప్రధాన పురోహితుణ్ణి. ఇన్నేళ్ళ శుద్ధోదన మహారాజుగారి పరిపాలనలో ఎవరికీ అన్యాయం జరగలేదు. ఎంతోమందికి నా సమక్షంలో న్యాయవిచారణ జరిపించి న్యాయం చేయించాను"

"ఎక్కడ చేయించావు? - ముదనష్టపోడా - ఎన్నికుటుంబాలార్పావు?" ఎవరో ప్రజల్లోంచి పెద్దగానే తిట్టారు - మరికొంతమంది ఆ మాటలకు నవ్వారు.

"ఎవరదీ? నిశ్శబ్దంగా ఉండాలి. ఈ విషయం నా దృష్టికి వచ్చిందగ్గరనుండి నా మనసు మనసులోలేదు. తిండీ నిద్రసహించటంలేదు. మన మహారాజుగారు ధర్మదేవతకు ప్రతిరూపం మన యువరాజుగారు. నమ్మిన సిద్ధాంతం కోస్మ రాజ్యాన్ని వదులుకున్న ఆదర్శమూర్తి. అటువంటి ఈ రాజ్యం సత్యానికి నెలవు. న్యాయానికి కొలువు అయిన కపిలవస్తు నగరంలో ఈరోజు జరిగిన ఈ సంఘటన ఎలా చెప్పాలో నాకర్థం కావటంలేదు. బాధగా నొసలు విరిచి తలవంచుకున్నాడు.

"చెప్పకుండా ఉంటేనే ఎక్కువ సంతోషిస్తాం"

"నీ బాధ చూడలేకపోతున్నాం. ఇక ముగిస్తారా..?"

జనం రకరకాలుగా ఆటపట్టిస్తున్నారు.

"అదేమిటో త్వరగా చెప్పండి - పొద్దువాలి పోతోంది. ఇళ్ళకెళ్ళొద్దా" దూరప్రాంతం నుండి వచ్చినవాళ్ళు కేకలు పెట్టారు.

"తప్పక చెబుతాను - ఆయన ఉప్పు, పులుసు తిన్నవాడ్ని. ఆ ఇంటి పరువు ఎలా బయట పెట్టాలా అని బాధపడుతున్నాను.

పదిమంది ఉన్నచోట దేవుడుంటారంటాడు.

ఒక ఆడపడుచుకు జరిగిన అన్యాయం చూస్తూ ఎలా ఉండగలం కనుక ఈ బాధ - బాధ్యత మనందరం తీసుకోవాల్సిందే మన ఆడపిల్లకులా న్యాయం జరిపించాల్సిందే

ఈ ఘోరం నా దృష్టికి రాగానే మహారాజుగారికి తెలియజేసాను. వారు న్యాయవిచారణకు ఆదేశించిన మీదటే ఇక్కడ సమావేశం జరపటం తక్కిన న్యాయమూర్తులు కూడా నాకు అనుమతిస్తే అసలు విషయం మీ ముందుంచగలను"

కూటదంతుడు పండితులవైపు తిరిగాడు. "న్యాయానికి మేము కట్టబడి ఉన్నాం ఆ భారం మీమీదే పెట్టాం. కానివ్వండి" అన్నారు తక్కినవాళ్ళు. జారిన వెంట్రుకలు మళ్ళీ గట్టిగా లాగి ముడేసాడు. కొంచెం నశ్యం పట్టించాడు.

"ప్రజలవైపు తిరిగి మీ అందరికి ఆమోదమైతే బాధితురాలిని పిలిపించి విచారిస్తాను - మీకు సమ్మతమేనా?" పెద్ద గొంతుతో అడిగాడు.

"సమ్మతమే. ఆ పిల్లకు న్యాయం జరగాలి" గుంపుగా అరిచారు.

విచారణ ప్రారంభమైంది.

యజ్ఞవేదికపై బలివ్వటానికి సిద్ధంగా ఉన్న మేకపిల్లను తెచ్చినట్టు ఆమెను తెచ్చి జనం ముందు నిలబెట్టారు. నిల్చున్న స్థానం ఎత్తుగా ఉండటంతో అందరికి స్పష్టంగా కనిపిస్తోంది. జనం పోల్చుకోవటానికి కొంచెం సమయం పట్టింది. అందరూ ఆసక్తిగా ముందుకు వచ్చి చూస్తున్నారు - ఎవరోఅరిచారు.

చించిత..చించిత.

అదేమిటి? చించితకేం అన్యాయం జరిగింది. ఆమె గౌతముని ప్రియశిష్యురాలు. కాసేపు ఆమె కోలాహలంగా మారింది. గౌతముడి శిష్యులు కూడా కుతూహలంగా చూస్తున్నారు. తమ సోదరి.. చించిత.. ఆమెకేమయింది?

బుద్ధుడి పరికించి చూస్తూ కూటదంతుడు గుంభనగా నవ్వుకున్నాడు.

"చూసారా! ఈమెను. మీలో చాలామందికి ఈమెవరో తెలుసు. చించుకులానికి చెందిన కరదీపుడి కూతురు - పాపం పసితనంలో పెద్ద కష్టాన్ని మోస్తోంది. న్యాయవిచారణ జరిపించమని నా దగ్గరకొచ్చింది. మహారాజుగారి దృష్టికూడా ఈ విషయం తీసుకెళ్ళాను - వారు అనుమతించిన మీదటే ఈమెను మీ న్యాయస్థానం ముందు నిలబెట్టాను -

"మీలో ఎవరయినా వచ్చి ఆమెను విచారించినా మాకభ్యంతరం లేదు" ఒక్క నిమిషం ఆగాడు - ముందుకాలికి లంకెవేయడంలో అతడు దిట్ట.

"మీరే అడగండి" జనంలో నుండి సమాధానం.

"చూడమ్మా! నీ పేరేమిటి?"

"చించిత" చిక్కి శల్యమైన ఆ శరీరంలో ప్రాణాలెక్కడో ఉన్నట్టున్నాయి.

"ఏం పనిచేస్తుంటావు?"

"అన్ని పనులూ చేస్తుంటాను - కడుపు నింపుకోవటానికి."

"అలాకాదు. ప్రత్యేకంగా ఏం చేస్తావో చెప్పాలి"

"కూలిపని - అడివికెళ్ళి కట్టెలు - కొట్టుకురావటం - ఆకులేరటం - ఆశ్రమంలో శుభ్రపరచటం - అమ్మగార్లకు కావలసింది చేసిపెట్టటం"

"అయితే రోజూ ఆశ్రమానికి వెళ్ళొస్తుంటావా?"

"అవునండి. అక్కడ శుభ్రపరచాలి కదా - ఊడ్చి కళ్ళాపి చల్లి ముగ్గులేస్తాను. ఆయన చెప్పే మంచి మాటలు చెవినేసుకుంటాను"

"అయితే ఇప్పుడు నీకు జరిగిన అన్యాయమేమిటి?"

"చించిత కాసేపు మాట్లాడలేదు"

"చెప్పు" ఆయన గద్దించి అడిగాడు.

"నేను.. నేను... గర్భవతిని."

***********

(11)

**ఆ మాటలు పిడుగుపాటులా** ఒక్క క్షణం అందరూ నిశ్శబ్ధమైపోయారు. గౌతముడి శిష్యుల్లో ఆందోళన కలిగింది. ఈ నీచుడు చివరికి ఆశ్రమం మీదకు తోసెయ్యడు కదా. వాళ్ళల్లో వాళ్ళు చర్చించుకుంటున్నారు.

మళ్ళీ కూటదంతుడందుకున్నాడు -

"నాకు తెలుసు. మీరందరు ఆశ్చర్యపోతున్నారని - దానికంటే ఇంకా తట్టుకోలేని వార్త విని రెండురోజులు లేవలేకపోయాను" ముఖం బాధగా పెట్టాడు.

"ఇంతకీ ఎవరంట ఆ మహానుభావుడు" వేదిక ముందు కూర్చున్న ఒక పౌరుడు లేచి నిలబడి అడిగాడు. మళ్ళీ కూర్చుంటూ -

"బహుశా మీరే అయ్యుంటారు!" మెల్లగా గొణుక్కున్నాడు.

"అదే నేను అడుగుతున్నాను. మీ అందరి ముందు నిజం తెలియాలికదా -

ఆశ్రమానికి రోజూ వెళ్తుందో లేదో విచారించటానికి బుద్ధుడి శిష్యులెవరైనా ముందుకు రావాలి"

కంగారు పడుతున్న సహాధ్యాయులను శాంతంగా ఉండమని ఆనందుడు ముందుకు వచ్చాడు.

"అడగండి"

"ఈమె నీకు తెలుసా. రోజూ మీ కుటీరానికి వస్తున్నానని చెప్పిన మాట నిజమేనా?"

"అవును నిజమే - అనేకమంది సోదరీమణుల్లాగా ఆమె రోజూ వస్తుంది. అందరికంటే ఈ సోదరికి భక్తి ఎక్కువ. అందుకే ఆశ్రమం శుభ్రం చేస్తూ ఉంటుంది. ఈ మధ్య మాసం రోజులుగా రావటంలేదు - ఎందుకు రాలేదని అనుకున్నాం కూడా అయితే విషయం ఇప్పటివరకు మాకు తెలియదు - ఆమెకు అన్యాయం చేసిన పాపిని శిక్షించండి. అతడు మాత్రం క్షంతవ్యుడుకాడు"

వెంటనే కూటదందుడన్నాడు.

"చూసారా ప్రజలారా! పదహారేళ్ళ పడుచుపిల్ల రోజూ ఆశ్రమానికి వెళ్తోంది. ఇప్పుడు గర్భవతయింది. అందరూ శ్రీవైష్ణవులే - చేపల బుట్టలే మాయం అన్నాట్ట వెనకటికెవరో - ఇంతకంటే ఏం చెప్పాలి అయినా నేనెందుకు తొందరపడటం. ఆమె చేతే అసలు నిజం చెప్పిస్తాను"

"ఏమ్మా! చించితా! నువ్వు నిజం చెప్పకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. నీ తండ్రి, తోడబుట్టిన వాళ్ళు ఉరేసుకుని చస్తారు. నిన్నీ స్థితికి దిగజార్చిందెవరు? చెప్పు నీ బిడ్డకు తండ్రెవరు?"

అతని కళ్ళల్లోని ఎర్రజీరలు చూసి ఆ బాలిక వణికిపోయింది. గాలికి కంపించే చిగురుటాకులా అడుగువేస్తే తొట్రిలిపోతోంది. భీతహరిణిలా అందరివైపు భయంభయంగా చూసింది. ఆ కరుణాంతరంగుడు తప్ప కాపాడగలిగిందెవ్వరీ ప్రపంచంలో. కానీ ప్రతి అడుగు తప్పుదారినే పడుతున్నాయి.

"చెప్పవేం. అతడెంత గొప్పవాడయినా, ఉన్నతస్థానంలో ఉన్నా, ఏకులమైనా, గోత్రమైనా అతడిని నిష్పక్షపాతంగా ఈ న్యాయస్థానం విచారిస్తుంది. ఇంతమంది ప్రజలు నీకు న్యాయం చెయ్యాలని కోరుకుంటున్నారు. ధర్మదేవత నాలుగుచేతులు చాపికూర్చుంది. నీకన్యాయం జరగదు. నీ బిడ్డకు తండ్రెవరు?"

"గౌతముడు.."

తుఫానుముందు ప్రశాంతత. అతి నిశ్శబ్దం గాలికూడా కదలిక లేదు. నెమ్మదిగా సాగిన హోరు కర్మేంద్రియాల్ని చేరి జ్ఞానేంద్రియాలకు సోకేసరికి మనసు మౌనవ్రతం పాటిస్తోంది. ఏమీ ఆలోచించలేనంతగా మెదళ్ళు స్థంభించాయి.

ఆనందుడికయితే స్పృహ తప్పినంత పనయింది. ఆమేం చెప్పిందో అతడికర్థంకావటంలేదు. శ్రవణ కుహరాలు మూసుకుపోయినట్లయింది –

ఎవ్వరూ ఏమాత్రం ఊహించలేని మాట – ఉరిమురిమి ఏ మంగలం మీదో పడుతుందనుకున్నాడు. కానీ సరాసరి దైవం మీదే పడుతుందనుకోలేదు. ఇంత నీచంగా దిగజారిపోతారని వ్యవస్థ ఇంత కుళ్ళి కంపుకొడుతోందని మొదటిసారి అర్థమైంది.

ఎవరో ఐతే కొట్టిపారేయొచ్చు. సాక్షాత్తూ బుద్ధుని శిష్యురాలు, ప్రతిరోజు ఆశ్రమానికొస్తుంది. పైగా ఆమెకు గౌతముడంటే సాక్షాత్తూ దైవం –

కాసేపు ఎవరికీ ఏమీ అర్థంకాని అయోమయ పరిస్థితి. హోరువాన జోరయింది. ప్రజల కలకలం అంబరాన్ని తాకుతోంది. అనేకమంది ఉద్రేకంతో వేదికమీదకొచ్చారు. చించితని కూటదంతుడిని తన్నటానికి – ఆ ఉద్రేకపరిస్థితుల్ని ఆనందుడాపాడు –

"శాంతించండి సోదరులారా! పవిత్రమైన బుద్ధభూమిలో హింసకు తావులేదు – నిజం నిప్పులాంటిది. అది ముట్టుకుంటే కాల్చకమానదు. అగ్నికంటె పవిత్రుడు మా గురుదేవులు. అసాధారణ సౌందర్యవతి, గుణవతియైన తన భార్య ముఖాన్ని ఆనాటి నుండి ఈనాటివరకు చూసి ఎరుగడే – అచంచలమైన కర్తవ్య నిర్వహణలో సమస్త ఇంద్రియాలను జయించి తనను తాను సమాజానికి అర్పణ చేసుకున్న మహాత్ముడికా ఈ నిందారోపణలు – ఈ పాప సంబంధాలంటగట్టటాలు.

ఆహా! సమాజమా! నీ నైజమే అంత. మంచివారినెపుడు మననిచ్చావు. నీ దుర్మార్గపు స్వభావంతో నిన్ను బాగుచేయాలని వచ్చిన మహనీయులందరిని బలితీసుకున్నావు. నువ్వేసే రాళ్ళను భరిస్తూ పూలలాంటి సుకుమార జీవితాల్ని మీకరకు కసాయితనానికి ఒప్పచెప్పి బాధలను భరిస్తున్న ఏ మహనీయుడు చరిత్రలో సుఖించలేదు. కాదు – కాదు నువ్వు సుఖపడనీయలేదు. నిందలతో అవమానాలతో వారిని వేధిస్తూనే ఉన్నావు. ఈరోజు ఇంత పాపాన్ని మా చెవులారా వినాల్సివచ్చిందే

ఒక్కసారిగా ఉద్వేగం ఆపుకోలేక ఆనందుడు వేదికమీదే పడిపోయి పిల్లవాడిలా ఏడ్చాడు. అందరి గుండెలతోపాటు అక్కడి బండలు కూడ కరిగినీరవుతున్నాయి.

కాని పాపీ చిరాయువన్నట్లు మంచివాళ్ళను ఏడిపించటానికే పుట్టిన అసూయపరులకది ఆనందమే. గౌతమబుద్ధుడు వస్తున్నాడు. జనంలో కేకలు వినిపించాయి. వెంటనే తొక్కిసలాట ప్రారంభమయింది. విచారణ ప్రదేశానికి ఆయన చేరుకోగానే జనమంతా లేచి నిలబడ్డారు. జయజయధ్వానాలు చేసారు. జై బుద్ధభగవానుడికీ జై.. ధర్మమూర్తికి జై.. ఇంతకు క్రితమే మహానేరం మోపబడ్డ అతడికి అపూర్వనీరాజనాలు. అసలు వారెవరూ ఆ మాటను కొంచెం కూడా విశ్వసించినట్లు లేదా వాతావరణం. ఇంతసేపు కష్టపడి చెమట కక్కుకుంటూ వాళ్ళు తయారుచేసిన అబియోగం కణంలో వీగిపోయింది.

సూర్యకాంతికి చీకట్లు చెదిరిపోయినట్లు ఆ దివ్యతేజస్సు ముందు అల్పమైన ఆరోపణలు పట్టించుకునేవారు లేరు - మళ్ళీ మునుపటిలా కాళ్ళకు నమస్కరించాలని దగ్గరగా చూడాలని ఒకళ్ళనొకళ్ళు తోసుకుంటున్నారు - ప్రజలందుకే దేవుళ్ళు.

ఏడుస్తున్న ఆనందుడ్ని ఓదార్చాడు గౌతముడు.

"కష్టమొచ్చినప్పుడే భిక్షువులు మరింత సంయమనం చూపాలి. మనం పండ్లనిచ్చే వృక్షాల్లాంటి వాళ్ళం. ఇటువంటి సమస్యలెదుర్కొన్నప్పుడే మన వ్యక్తిత్వం మరింత వికాసం చెందుతుంది. సిద్ధాంతం వజ్రపుతునకలా గట్టిపడుతుంది.

నేనేకాదు సమాజాన్ని సంస్కరించదలచుకున్న వారెవరయినా ముందు ఈ రాళ్ళ దెబ్బలు తినకతప్పదు. దోషిగా ఆరోపించబడ్డానుకనుక విచారణ ఎదుర్కోకతప్పదు - మీరు ప్రశాంతంగా ఉండండి" అని ప్రజలక్కూడా నమస్కరించి చెప్పాడు. కల్లోలం అణిగింది.

కూటదంతుడు మాత్రం క్రూరంగా చూస్తూ "తియ్యగా మాట్లాడినంత మాత్రాన అన్యాయం న్యాయమవుతుందా? మీ రూపంతో జనాల్ని మోహితుల్ని చెయ్యొచ్చుకాని, ధర్మదేవతను కాదు. నేనీచేతికి ధరించిన కంకణం నిష్పక్ష న్యాయవిచారణకే. నా కర్తవ్య నిష్ఠలో వెనకాడను. ఎంతటి వారయినా విచారణీయులే" కఠినంగా.

తథాగతుడు చిరునవ్వు నవ్వి.

"కానివ్వండి. మహాశయా! మీ విచారణ సక్రమంగా, జరగాలనే నేను వచ్చాను. పూర్తిగా మీతో సహకరిస్తాను" కొనసాగించండి అన్నాడు వినయంగా.

పండితులకయితే నోటమాటరావటంలేదు. క్రితం రాత్రి వల్లెవేసుకున్న మాటలన్నీ మర్చిపోయారు. నోరు వెళ్ళబెట్టి గుడ్లు మిటకరించి గుటకలు మింగుతూ చూస్తున్నారు.

చించిత తల భూమిలోకి వాలిపోయింది.

అక్కడికక్కడే భూమి పగిలి తనను లోపలికి లాక్కుంటే బాగుండదనిపిస్తోంది.

అందరి బాధలు కూటదంతుడు పట్టించుకోలేదు. అతడు గౌతముడివైపు చూస్తూ -

"తథాగతులవారు నన్ను క్షమించాలి. ఎందుకంటే నేను సాక్షీభూతుడ్ని మాత్రమే. న్యాయాన్ని కాపాడమని కోరితే వచ్చాను. అంతే తప్ప నాకెవరిమీద ఎక్కువతక్కువలు లేవు. ఇంతమందిలో కన్యగా తల్లికాబోతున్న ఈమె తమరి మీద అభియోగం చేసింది. ఏ స్త్రీ తన శీలం మీద నిందలు వేసుకోదు కనుక - దీన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతమీదే"

ప్రజలు మరోసారి హాహాకారాలు చేసారు వద్దని - ఇదంతా పండితులాడుతున్న నాటకమని కేకలేసారు. కానీ బుద్ధుడు తన చేతితోనే వారించి -

"న్యాయనిర్ణేతలకు ధర్మస్వరూపులయిన ప్రజలకు నా అభివాదం. ప్రజాస్థానంలో నేనొక దోషిగా నిలబెట్టబడ్డాను. తప్పు ఎవరు చేసినా తప్పే. ఇంతచిన్న నిష్ఠూరాన్ని నేను సహించలేక పోతే మహోన్నతమైన నాసిద్ధాంతాన్ని ప్రజలకెలా అందించగలను? నిజంగా ఈ పరీక్ష ఎదుర్కోవటానికి నేను సంతోషంగా సిద్ధపడుతున్నాను. ఎందుకంటే సత్యం వెల్లడయినప్పుడు నామాట మీద మీరు మరింతగా గౌరవం పెంచుకుంటారు. మీరందుకే ప్రశాంతంగా ఉండండి. కంటకాలను తొలగించుకుంటూ మార్గాన్ని సుగమం చేసుకుంటూ పోగలిగినవాడే పరివ్రాజకుడు తన దారిలోనే కాదు ఇతరుల దారిని కూడా నిష్కంటకం చెయ్యాలనే తాపత్రయం నాది.

"కూటదంతుల వారూ! కానివ్వండి. న్యాయ విచారణ"

విజయగర్వంతో పురోహితుడి ముఖం చేటంతయింది. ఛాతీ ఉప్పొంగింది. ఇక గౌతముడు తనకు తాను వలలో చిక్కుకున్నాడు. ఇంకెక్కడికి పోగలడు. సాక్ష్యాలేమున్నాయి. ఈరోజుతో అతని పరువు మర్యాద గంగలో కలవాల్సిందే తోకముడిచి కపిలవస్తుపురం విడిచి పరుగెత్తాల్సిందే లోపల్లోపల ఆనందిస్తున్నాడు. పైకిమాత్రం -

"శాక్యమునిగారూ! ఈమెను ఎన్నడూ చూడలేదా?"

"చూసాను - చూస్తున్నాను" నిశ్చలమైన సమాధానం.

"ఆశ్రమంలో ఏకాంతంగా ఈమెతో గడిపిన క్షణాలకు ఫలితం గర్భధారణం. స్వయంగా బాధితురాలు ఇంతమంది జనంలో నిర్భయంగా మీ పేరే చెప్పింది. దానికి మీరేం సమాధానం చెబుతారు."

గౌతముడు మెల్లగా చించిత దగ్గరకు వచ్చి ఆమెవైపు నిర్వికారంగా చూస్తూ - "సోదరీ! మీకు నావల్ల అన్యాయం జరిగిందా?"

ఆమె ఏం మాట్లాడలేదు - మళ్ళీ గౌతముడు "చూడమ్మా! నీ మౌనం వలన న్యాయం జరక్కపోగా నీ జీవితం శోకసముద్రమవుతుంది. పసివయస్సు లేతలోనే మొగ్గలా రాలిపోతుంది. జరిగిన తప్పుకు బాధ్యులెవరో చెప్పు. నీ సమాధానం నిర్దోషి దండింపపడకూడదు. దోషి తప్పించుకోకూడదు."

"నీ అంతరాత్మ సాక్షిగా దోషి ఎవరో ఈ న్యాయ స్థానం ముందు నిలబెట్టు" శాంత గంభీరమైన ఆ మాటలకు ఆమె విలవిల్లాడిపోతోంది - ఇంకాసేపుంటే నిజం చెప్తుందనే భయంతో కూటదంతుడు -

"చెప్పవేం - స్వయంగా ఆయనే అడుగుతున్నారుగా, ఇందాక ఏం చెప్పావో అవే చెప్పు" గద్దించాడు.

"ఏం చెబుతుంది. అసలది నిజమైతేగా - నాలుగు తన్నండి. అసలు వాడెవడో బయటకొస్తాడు" జనం పెద్ద పెట్టున లేస్తున్నారు. వారి సహనం హరించిపోతోంది. కూటదంతుడిలో ధైర్యం జారిపోతోంది. కొంపదీసి నిజం చెబితే. జనం ఇక్కడే చంపేస్తారు - ఎముకల్లో సున్నం ఉండదు. దగ్గరకెళ్ళి మెల్లగా హెచ్చరించాడు. జాగ్రత్త నీవాళ్ళంతా నా దగ్గర బందీగా ఉన్నారు - ఆ ఘోషలో ఈ మాటలెవరు వినలేదు. చించిత ధైర్యం తెచ్చుకుంది.

"అవును. ఈ గౌతముడే కారణం. ఇతనితో మూడు రాత్రులు గడిపాను - అందుకే గర్భం వచ్చింది. నాకు న్యాయం చెయ్యండి"

అరచింది పిచ్చిపట్టినట్టుగా -

అయిపోయింది. న్యాయదేవత నోరు నొక్కుకుంది.

అధర్మం అగ్రస్థానంలో నిలబడి పరిహాసం చేస్తోంది.

ఈ విషమ పరిస్థితినుండి కాపాడేదెవరు?

సాక్ష్యమేలేని న్యాయానికి నిరూపణ ఎట్లా? అందరి ముఖాల్లో ఆందోళన. కూటదంతుడికి పగ్గాల్లేవు -

అటువంటి విషమ సమయంలో "ఆగండి" పెద్ద కేక.

అప్పుడెవ్వరూ ఊహించని అద్భుతం జరిగింది. మాదే జయమని విర్రవీగుతున్న కుటిలాత్ముల గుండెలు ఝల్లుమన్నాయి. ఆనందిస్తున్న వ్యతిరేకవర్గం వాళ్ళంతా తలలు తిప్పి చూస్తున్నారు. బాధతో తలలు వంచుకున్న శిష్యులంతా తలెత్తి దిక్కులు చూసారు.

ఒక విధంగా అక్కడున్న అందరు కేక వచ్చిన వైపు చూస్తున్నారు. సత్యదేవత సంకెళ్ళు వేసుకున్నట్టు చేతులు కట్టుకుని నిలబడ్డ బుద్ధదేవుడిని చూసి బాధతో ఆవేశపడుతున్న జనం కూడా ఒక క్షణం నోళ్ళు మూసారు.

తలపాగా ముఖం మీదికి జారుతుండగా ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయిన బట్టలతో ఎంతో దూరం నుండి ప్రయాణం చేసి వస్తున్నట్టున్న వ్యక్తి ఒకడు గుర్రం దిగి వస్తూనే 'ఆగండి' అని అరిచాడు. అతడు వేగంగా నడుస్తూ పై ఉత్తరీయంతో చెమటలు

తుడుచుకుంటూనే వేదిక మీదికి వచ్చాడు. అప్పటివరకెవ్వరూ పోల్చుకోలేకపోయారు. వస్తూనే బుద్ధుడి పాదాలకు నమస్కరించి జనంవైపు తిరిగి నమస్కరించాడు.

"అరే! దేవదత్తుడు - దేవదత్తుడు!" జనమంతా అరిచారు. పండితులకు పోయిన ధైర్యం వచ్చింది. ప్రజల్లో తగ్గింది. మొదటినుండి గౌతముడికి వ్యతిరేకంగా అతడెన్నో పనులు చేస్తూనే ఉన్నాడు. అజాత శత్రువుతో కలిసి వధించటానిక్కూడా సిద్ధపడ్డవాడు. ఈరోజు న్యాయం చెబుతాడంటె ఎవరికీ నమ్మకం లేదు. ఈర్ష్యాపరులతో కలిసి వ్యతిరేకంగా చెడుప్రచారం చేస్తుందీ అతడే - అటువంటివాడు చెప్పబోయేదేమిటి? అయితే ఆశ్చర్యకరంగా అతడీరోజు గౌతముడి పాదాలకు నమస్కరించాడు - ఏమయితేనేం అగ్నికి వాయువు తోడు. జనం రకరకాలుగా విమర్శించుకుంటున్నారు.

"సాక్షాత్తూ న్యాయదేవతొచ్చి అబద్ధం చెప్పినా మేం నమ్మం" అంటున్నారు.

శాక్యుల్లో గౌతముడి కారణంగా రెండు వర్గాలయ్యాయి. అందులో ఒకటి ఆయన్ని సమర్థిస్తుంటే మరోవర్గం వ్యతిరేకిస్తున్నారు. వాళ్ళుకూడా పండిత వర్గంతో చేతులు కలిపి - కానివ్వండి విచారణ జరిపించి శిక్ష వేయండి అని పెద్దగా అరుస్తున్నారు. ఈ గందరగోళాల మధ్య కూటదంతుడు దేవదత్తుణ్ణి ఆహ్వానిస్తూ -

"రండి రండి దేవదత్తులవారు మీకోసమే చూస్తున్నాం. అమ్మయ్య మా భారం తగ్గింది. లేకపోతే ఏకపక్ష నిర్ణయాలని చెడ్డపేరు మాకొచ్చేది. మీరంతా ఒక కుటుంబంలోనివారు కనుక మీరు చెబితే ప్రజలకు నమ్మకం"

"పులి - సింహాన్నడిగిందట. మనం అసలు మాంసం తింటామా" అన్నట్టుంది దేవదత్తుడి సాక్ష్యం. ఎవరూ! ఈ దేవదత్తయ్య సాక్ష్యమా - ఏడ్చినట్టుంది. ఈయనకు పేరే గొప్ప - బుద్ధులన్నీ దయ్యపు బుద్ధులే" అరిచారెవరో.

"ఆగండి - నా మాట వినండి పూర్తిగా నేను చెప్పింది విని నా తప్పు ఉంటే శిక్షించండి లేదా సంఘానికి అప్పచెప్పండి. కానీ, నన్ను నిజం చెప్పనివ్వండి. ప్రాధేయపడ్డాడు."

"చెప్పండి" తొందర చేసారు పండితులు.

"ఇంతకుముందు ఎన్నోసార్లు అబద్దాలు చెప్పిన మాట వాస్తవం. అన్నగారిమీద కక్షగట్టి ఎన్నోసార్లు ఆయనకు ద్రోహం చేసాను కానీ లోకపూజితుడు, స్నేహశీలుడు, నిష్కళంకుడయిన ఆయన తేజస్సు ముందు నేనోడిపోయాను. ఒక మహాతల్లి నాకళ్ళు తెరిపించింది. నా తప్పు తెలుసుకున్నాను. నన్ను మనిషిగా మారమన్న ఆ దేవత నా తల్లి యశోధరాదేవి పాదాల సాక్షిగా - మా కులదేవత ఆఖ్యాదేవి సాక్షిగా ఈ గౌతములు నిర్దోషి - ఇతడికేపాపం తెలియదు" అన్నాడు ఉద్వేగంగా. అతని కళ్ళు చెమరుస్తున్నాయి.

"ఆ సంగతి మాకు తెలుసు. ఎందుకీ అభియోగం వారిపైన మోపబడిందో? కారకులెవరో చెప్పండి" జనం కేకలు పెట్టారు. పండితుల ముఖాలు నల్లబడిపోయాయి. ప్రాణభయంతో నెత్తురంతా ఆవిరైనట్టు తెల్లబడిపోయింది పురోహితుడి ముఖం. దేవదత్తుడిలోని మార్పు సభికులకు శిష్యులకు సంతోషమైంది. వాళ్ళు ఆనందంతో జేజేలు కొట్టారు.

పరిస్థితి తిరగబడుతుందని గ్రహించి కూటదంతుడు తిరగబడ్డాడు -

"మీరు స్పృహలో ఉండే మాట్లాడుతున్నారా! మత్తులో ఉన్నారా? ఎందుకంటే మధుపానమత్తుల సాక్ష్యం చెల్లదు కనుక" అన్నాడు ఆవేశంగా.

"ఎవరయినా నన్ను పరీక్షించుకోవచ్చు. ఇన్నాళ్ళూ ఆ మత్తులో ఉండే అపరాధాలు చేసాను. ఈరోజు మత్తువీడి తెలివిలోకి వచ్చాను. నా జీవితంలో నేను చేస్తున్న మొదటి మంచి పనేదయినా ఉంటే ఇదే. ఈ పుణ్యాత్ముడి విషయంలో ఈ మాత్రం నేను ఉపయోగపడుతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. మీలో ఇంకా చాలామంది నన్ను నమ్మలేకపోవచ్చు. ఇప్పటిదాకా కత్తులు దూసి ఒక్కసారిగా కాళ్ళు పటుకుంటునాడేమిటని?"

"అవును - ఇంకా నమ్మలేకపోతున్నాం. ఇది మరో నాటకమా"

"కాదు, కాదు, ఆ నాటకాల జీవితానికి స్వస్తి చెప్పి మారదామనుకుంటున్న తరుణంలో ఈ సంఘటన నిద్రపోతున్న నా మానవత్వానికి మొదటి మేలుకొలుపు - అందుకే మీ అందరి ముందు ధైర్యంగా ఒప్పుకుంటున్నాను. రాజుతో కలిసి అన్నగారి మీద హత్యాప్రయత్నం కూడా చేయించాను. నాలో మార్పుకోసం ఎదురుచూసారు. ఈరోజు సంపూర్ణంగా మారిన మనస్సుతో నన్ను నేను వారి పాదాల కంకితం చేసుకుంటున్నాను" నేలమీద పడిపోయి గౌతముడి రెండు కాళ్ళు చుట్టేసి చిన్నపిల్లవాడిలా ఏడ్చాడు - అతని కన్నీళ్ళతో పాటు మనసులోని మాలిన్యమంతా కడిగేసినట్టయింది.

ఈ దృశ్యం చూసేవాళ్ళందరి కళ్ళు చెమరింపచేసాయి. గౌతముడు తమ్ముడిని ఎత్తికౌగిలించాడు. మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు.

మహోన్నతమైన మానవత్వం తనకు తాను ఆవిష్కరించుకున్నప్పుడు కలిగే మహాస్పందన, ప్రకంపనం అది. జనం ఒకేసారి దిక్కులు పిక్కటిల్లేట్టు చప్పట్లు కొట్టారు. తమ ఆనందానికి సూచనగా.

"సోదరా! ధన్యుడివి. ధర్మదేవత పాద పీఠాన్నాశయించిన నీకు ఏ విచారం లేదు - ఆమె చల్లని ఒళ్ళో నిశ్శోకమైన ఆనందస్థితిలో నీ భవిష్యత్తు ఉజ్వలమౌతుంది. పశ్చాత్తాపాగ్నికి తప్పుడవయిన నీకు మరే మలినమంటదు - నిర్మలకాంతిలో నిత్యత్వాన్ని పొందు. ఈ ప్రపంచంలో శత్రుత్వమనేదేలేదు. అదేదయినా మనలోనే ఉంది. అంతరంగంలోని దుష్టస్వభావాన్ని జ్ఞానమనే కరవాలంతో ఛేదించగలిగితే విశ్వానికి మిత్రుడౌతావు.

ఆ మాటలకు ముగ్ధులైన జనం 'నమో బుద్ధదేవా' అని ఒక్కసారిగా అరిచారు. కథ మళ్ళీ మొదటికొచ్చింది. ఎవరీపని చేయించిందో సాక్ష్యం కావాలని జనం పట్టుబట్టారు. దేవదత్తుడు - ఆమ్రపాలి ఇంట్లో జరిగిన సమావేశాన్ని గురించి చెప్పాడు. అన్నగారిని పెద్దయెత్తున దెబ్బతీయాలని అక్కడే ఆలోచించారని - అయితే వాళ్ళ ప్రణాళికేమిటో తనకు తెలియనివ్వలేదని చెప్పాడు. చెప్పటమేకాదు - ఆవేశంతో ఒరలో కత్తిదూసి చించిత దగ్గర కొచ్చాడు. ఒక చేత్తో ఆమె జుట్టు గట్టిగా పట్టి "చెప్పవే? విశ్వాస ఘాతకురాలా! పవిత్రమైన ఆశ్రమంలో చోటిచ్చి చెల్లెలి కంటే ఎక్కువాదరించిన అన్నమీదే నిందమోపుతావా? ఈ రోజుతో నీకంఠం నరికి పాపాన్ని కడిగేస్తాను. చెప్పు. నీ పాపానికి కారకుడెవరు" అన్నాడు ఆగ్రహంగా -

చించిత ఏడుస్తూ -

"ఆపని చేయండి దొరా! తప్పు చెప్పిన ఈ నాలుకను మీ కత్తితో ముక్కలుముక్కలుగా నరకండి. దిక్కులేని అభాగ్యురాల్ని. నా కుటుంబాన్ని చంపుతానని బెదిరిస్తే భయంతో అబద్ధం చెప్పాను తప్ప - ఆ దేవుడికి నింద అంటుతుందని కాదు. సూర్యుడిమీద ఉమ్మేస్తే వాళ్ళ ముఖం మీదే పడుతుందని తెల్సు. నా మనసు ముక్కలు ముక్కలైపోయింది. మా కులదైవం కంటే ఎక్కువ పూజిస్తున్న నా దైవం మీదే వెయ్యరాని నింద వేసాను. దానికి ప్రాయశ్చిత్తం చేయండి దొరా. ఇంక బతికి ఆ దేవుడి ముఖం చూడలేను" - దేవదత్తుడి చేతిలో ఉన్న కత్తిని కంఠానికి ఆనించుకుని రెండు చేతులతో గట్టిగా నొక్కుకుంది. అది కంఠం సగంలోతు వరకు మెత్తటి చర్మంలో కోసుకుపోయింది. క్షణంలో రక్తపు వెల్లువ -

దేవదత్తుడు, గౌతముడు, పండితులు ఎవ్వరూ ఊహించని విధంగా క్షణంలో జరిగిపోయిందా సంఘటన. రక్తం కారుతున్న శరీరంతోనే బుద్ధుడి పాదాలపై పడిపోయింది.

"చాలు దైవమా! ఈ జన్మకు నేను చేసిన పాపానికి నేనే విధించుకున్నాను. మీకు చేసిన ద్రోహానికిదే సరైన శిక్ష. నా తోడబుట్టిన వాళ్ళను కాపాడండి - పురోహితులగారి అధీనంలో ఉన్నారు - బహుశా - నన్ను వలచి వలపించుకున్న ఆ మా...యు...గా...డు - కూ...డా.... వీళ్ళ.. మనిషే అయ్యుంటాడు.... అ....డ...వి. తల్లి.. సాక్షిగా - మనువాడి తనువిచ్చాను. దొరా - మీ శిష్యురాల్ని. నేనేపాపం చెయ్యలా... వాళ్ళే నా బతుకు.. తో ఆటలాడారు.. నన్ను బెదిరించా..రు. అందుకే అబదమాడాను. నన్ను మన్నించు దొరా. ఈ పాపిని

క్షమించు. ఈ జన్మకు మీ పాదా...లు... ముట్టుకోలేను.. వచ్చే జ...న...మ...లో మళ్ళీ సే....వచేసుకుంటాను" శాశ్వతంగా - బ్రతికుండి తనదేవుడి ముఖం చూడలేక చిన్నారి తల్లి వెళ్ళిపోయింది. ఇన్నాళ్ళుగా పడుతున్న క్షోభకు కారణం వెతుక్కుని హాయిగా నిద్రపోతున్నది.

ఆ దృశ్యం చూసి ఏడవనివారు లేరు. దుఃఖం క్రోధంగా మారి వీరభద్రుడిలా విజృంభించారు జనం. గౌతముడడ్డుకోకపోతే ఆ రోజు కూటదంతుడితో సహా పండితుల తలలు పుచ్చకాయల్లా విచ్చుకుని ఉండేవి - ఉప్పెనగా వస్తున్న ఆవేశప్రవాహానికి ఆయన మాటలడ్డుకట్టేసాయి.

"సోదరులారా! శాంతించండి. రక్తంతో రక్తం - కత్తితో కత్తి కాదు - మనసిద్ధాంతం. జరిగిన దానికి నా మనసెంతో బాధపడుతున్నది. వాదాన్ని వాదనలద్వారా ఎదుర్కోవాలి తప్ప అమాయకుల ప్రాణాలద్వారా కాదు - ఎవరికి నచ్చిన మార్గం వాళ్ళెన్నుకుంటారు - దాన్ని అనుసరించకపోతే మానె - పరులను పావులుగా చేసే కుటిలత్వం మంచిదికాదు - బౌద్ధ భిక్షువులు అహింసాపరులు - తెలిసీ చీమకూడా అపచారం చెయ్యని వాళ్ళం మీకే విధంగా శత్రువులమయ్యాం. ఏమయినా ఈ చిన్నారి సోదరి ఆత్మత్యాగమయినా మీ కళ్ళు తెరిపిస్తుందని ఆశిస్తున్నాను. భవిష్యత్తులో నయినా మీకు నావాదం నచ్చకపోతే ప్రత్యక్షంగా నన్నడ్డుకోండి. ఇలా - పేదవాళ్ళు. దిక్కులేని దీనుల జీవితాలతో ఆడుకోకండి" పండితులకు మెత్తగా చివాట్లు పెట్టాడు. ఒక్కరుకూడా వంచిన తల ఎత్తలేదు.

మళ్ళీ ప్రజలవైపు తిరిగి -

"శాంతికాముకులైన మీరు ప్రశాంతంగా ఉండాలి. ఈ చిన్నారి ఆత్మశాంతి కలగాలంటే వీళ్ళ తప్పులు మీరు క్షమించకతప్పదు. వాళ్ళే తెలుసుకుంటారు దారి విడిచిపెట్టండి" అన్నాడు శాంతంగా

తలవంచుకుని పురోహితుడు తక్కిన వారంతా వెళ్ళిపోయారు. వాళ్ళనేం చేయకపోయినా జనం ఛీత్కారం చెయ్యకుండా ఉండలేకపోయారు. ప్రతి ఒక్కరూ అసహ్యించుకున్నారు. తరువాత గౌతముడు చింపిత శరీరం మీద పూలమాల వేసాడు. గౌతముని శిష్యులు అల్లాడిపోతున్న తండ్రి తోడబుట్టువులను వెంటబెట్టుకుని ఆమె శవాన్ని దహన సంస్కారంకోసం తీసుకెళ్ళిపోయారు.

మూగుతున్న నక్షత్రామధ్య చంద్రుడిలా శిష్యసమూహం మధ్య గౌతమబుద్ధుడు నిష్కళంకమైన చంద్రుడిలా ఆశ్రమం దారిపట్టాడు.

************

## (12)

**సుందరిలో మునుపటి** ఉత్సాహం తగ్గింది. ఆమెకన్నా అతడెక్కువ బాధపడుతున్నాడు. పైకి మాత్రం లేని సంతోషం నటిస్తున్నాడు.

తామ్రవర్ణుడు ఆ రోజు పడిపోవటం, ఇప్పటికీ కోలుకోలేదు - బాగా జబ్బునపడి లేచాడు - మాలికకు అతని పరిచర్యలతోనే సరిపోతున్నది.

యధావిధిగా స్నానం చేసి ఆ రోజు సుందరి శృంగార మందిరంలో అలంకరించు కోవటానికి కూర్చుంది. కొంత వన్నె తగ్గినా విదియనాటి చంద్రకళలా నాజూకుగా కనిపిస్తున్నది. నిడుపాటి కురులు జారి నేలను తాకుతున్నాయి. ఆకుపచ్చటి చీరలో ఒంటిరంగు మెరిసిపోతోంది.

"మాలికా! మాలికా!" పిలిచిందామె.

మాలిక రాలేదు కానీ మందారమాలనే చెలికత్తె పరుగెత్తుకుంటూ వచ్చింది.

"అమ్మా! పిలిచారా?"

"అవును. అలంకరించుకోటానికి మాలిక సాయం కావాలి. ఆమెను పిలువు" అంది దర్పంగా -

"మీతో చెప్పమని మాలిక నన్నిక్కడుంచింది. "

"ఏం చెప్పమని?"

"అదే తాను అత్యవసర పనిమీద బయటకు వెళ్తున్నానని. మీ అలంకరణలో అవసరమైతే నన్ను సాయం చెయ్యమని" ఆమె వినయంగా చేతులు కట్టుకుని చెప్పింది.

"ఉదయమే అంత అవసరమేమొచ్చింది?"

ధన్వంతరిగారి దగ్గర ఔషధం తీసుకురావటానికి కెళ్ళింది.

"ఓహ్! ఆ సంగతే మర్చిపోయాను. అతడింకా కోలుకోలేదా?" పేరు ఉచ్చరించటానిక్కూడా ఇష్టం లేనట్టు ముఖం పెట్టింది.

"లేదమ్మా! చాలా జబ్బు చేసింది. ఇప్పుడిప్పుడే కొంచెం తెలివిగా మాట్లాడుతున్నాడు. మీ అలంకరణలో నేను సాయం చేయనా?"

"వద్దు. ఇది నీ వల్లకాదు. మాలిక వస్తే పంపించు - నువ్వెళ్ళి మరో పనిచూడు"

"చిత్తం దేవీ?" వంగి నమస్కరించి ఆమె వెళ్ళిపోయింది.

గవాక్షం దగ్గర నిలబడి బయటకు చూస్తున్న నందుడిని పిలిచింది సుందరి.

"ప్రియా! ఇటు వస్తారా? నా అలంకరణకు కొంచెం సాయం చెయ్యాలి."

"తప్పక దేవీ! అంతకంటే ఆనందం ఏముంది" లోపలికొచ్చాడు నందుడు.

"ఏమలంకరించమంటావు? నదీపాయలుగా విస్తరించిన ఈ కేశపాశాన్ని త్రివేణీ సంగమంలా కలపమంటావా? హిమాలయ శృంగంలా అమర్చమంటావా?" మెత్తని జుట్టు చేతిలోకి తీసుకున్నాడు. మంచి పరిమళంతో వున్న వెంట్రుకలను ముక్కు దగ్గర పెట్టుకుని గట్టిగా గాలి పీల్చాడు.

"వాటిని చిక్కుల్లోకి నెట్టకుండా ఉంటే చాలు - అలంకరించినంత గొప్ప. మీరలా కూర్చుని మధ్య మధ్య నాకవసరమైన సాయం చేయండి చాలు - నేనలంకరించుకోగలను."

"సరే. దేవి గారి ఆజ్ఞ ఏది చెయ్యటానికైనా సిద్ధం - కొంచెం తలవంచి అభివాదం చేసాడు - ఆ నటన చూసి ఆమె ముచ్చటపడింది."

"ఏమలంకరించగలరు?" మురిపెంగా అడిగింది.

"ఏదయినా సరే. పాదాల పారాణి దిద్దనా! నిగ్గుటద్దాల్లాటి చెక్కిళ్ళపై కలపములు తీర్చనా. కనీసం కళ్ళకు కాటుకయినా అద్దనీ చెలీ! వెన్నెల బింబంలాంటి ఈ ముఖం మీద ఆకాశం గ్రహాలు చిత్రిస్తాను - ఏం చెయ్యమంటావో చెప్పు"

"వూఁ హు. ఈ రోజంతా మీరు నా ఎదురుగా కూర్చుంటానని మాటివ్వాలి. ఇది మీకు శిక్షగా భావించినా సరే"

"ఇది శిక్షా - సరి సరి - చూడు సుందరీ! ఇప్పటికీ ఒక విషయంలో నేనో నిర్ణయానికి రాలేకపోతున్నాను."

వెంట్రుకలతో ఆడుకుంటూనే అన్నాడు.

"ఏ విషయం" ఆమె గిర్రున వెనక్కు తిరిగింది.

"నీ విషయంలోనే. నన్నెక్కువాకర్షిస్తుంది నీ అందమా లేక చాతుర్యమా? నిర్ధారణకు రాలేకపోతున్నానంటే నమ్ము"

"అయితే మీరు కూడా నన్ను చతురురాలు అంటున్నారా?" కోపాన్ని నటించింది.

"కాదా మరి. లేకుంటే నీకింత బందీనెందుకవుతాను?"

"చాతుర్యం తప్ప ప్రేమతో కాదా బంధించింది"

"ప్రేమా? అదెక్కడ? నువ్వెప్పుడాజ్ఞాపిస్తూ, శాసిస్తున్నావే కానీ ప్రేమతో కాదే" పరిహాసంగా అన్నాడు.

"అంటే - అందరనుకున్నట్టే మీ మనసులో రాక్షసిననే భావం ఉంది కదూ. ఇప్పుడర్థమయింది మీలోని భావన"

నిజంగా నా ప్రేమను గుర్తించటంలేదా? ఆమె స్వరంలోని వేదనకు నందుడు చలించిపోయాడు.

"పరిహాసానిక్కూడా అంత ప్రాధాన్యమిస్తావెందుకు సుందరీ? ఈ మధ్య నీ ఆలోచనల్లో బాగా బలహీనత కనిపిస్తోంది. నీ మనసులోని బాధ నువ్వే బయటపెట్టుకుంటున్నావు పిచ్చిదానా! ప్రేమ ప్రేమనే ఆకర్షిస్తుంది. అందుకే ఈ దాసుడింత దాసోహం" చేతులు కట్టుకుని చూపించాడు.

"ఏమో - ప్రపంచమంతా ఏమన్నా అంత బాధపడను. నా మార్గం నుండి తొలగను - కానీ మీరు నా మనస్సు - ఊపిరి - నా సర్వం - మీ ఆలోచనల్లో తేడా ఉన్నా భరించలేను" అతని గుండెలో తలదాచుకుంది.

లీలగా - బయటినుండి ఎవరిదో భిక్షువు స్వరం వినబడుతోంది.

'భవతీ భిక్షాందేహి'

ఊ - హు - వారికి వినిపిస్తేగా - ఒకరి కౌగిలిలో ఒకరు మైమరచి ఏదో లోకంలో విహరిస్తున్నారు -

"ఇంత సున్నిత మనస్కురాలివి. అప్పుడప్పుడూ బాధపెడుతున్నాను కదూ -"

"అవును - ఇప్పుడు కూడా బాధించారు - మీకు శిక్ష తప్పదు"

"ఆజ్ఞాబదుడను శెలవీయండి"

"అయితే ఎండిపోయిన ఈ చందనం గిన్నె తడిపి తీసుకురండి"

"అలాగే" గిన్నె తడిపి తీసుకొచ్చాడు.

"నా అలంకరణ పూర్తయ్యే వరకు ఈ దర్పణం పట్టుకుని నిలబడాలి. కదలకూడదు"

"చిత్తం" అమాయకంగా ముఖం పెట్టి దర్పణం చేతిలో పట్టుకుని నిల్చున్నాడు బుద్ధిగా.

సుందరి తలదువ్వుకుంటూ. "లోకులంతా ఏమనుకుంటున్నారో తెలుసా? మీ పెళ్ళి ఒక యక్షిణితో జరిగిదని. అది మిమ్మల్నాడిస్తోందని"

"అవునా - ఈ మాటయితే నేను వినలేదు - నేను విన్నది వేరేమాట"

"ఏమిటో ఆ వేరు మాటలు" కుతూహలంగా అడిగింది.

"అప్సరసలను తలదన్నే అద్భుత సౌందర్య రాశి సుందరని, ఆమె అందానికతడే మాత్రం చాలడని విన్నానే"

ఆ మాటతో ఆమె ముఖం వెలిగిపోయింది.

"మీరిలా అద్దం పట్టుకుంటే ఈ గదిలో నా ముఖాన్ని ఎక్కడ వెతుక్కోవాలి?"

"ఇదిగో నా కళ్ళల్లో" ముఖం ముందుకు తెచ్చాడు.

మరోసారి ‘భిక్షాందేహి‘ బయట ఎవరో అరుస్తున్నారు.

"సరే ఇలా పట్టుకోండి" అద్దాన్ని సరిచేసి ఇచ్చింది. చేతిలోకి చందన లేపాన్ని తీసుకుని ముఖం మీద పెట్టుకోవాలని ప్రయత్నించింది. కానీ హఠాత్తుగా బయట తుఫాను వచ్చినట్టు పెనుగాలి వీచింది. ఒక్కసారిగా చెట్లన్నీ ఊగిపొయ్యాయి. తలుపులు గాలి విసురుకు ధడాలున తెరచుకున్నాయి. ఆ వేగానికి సుందరి చేతిలో గంధపు గిన్నె నేలమీద పడి ఒలికిపోయింది.

"ఇదేమిటి - ఇంత హఠాత్తుగా మబ్బులేకుండా ఇంత పెద్దగాలి. ఆశ్చర్యంగా వుందికదూ" నందుడద్దం పక్కన పెట్టి తలుపులు మూయటానికెళ్ళాడు. తెరచుకున్న ద్వారం నుండి బయటకు చూస్తే తోటంతా అల్లకల్లోలంగా ఉంది. పంజరాల్లోని పక్షులన్ని రెక్కలు టపటపా కొట్టుకుంటూ గోలచేస్తున్నాయి. కొన్ని పంజరాలు తెగి నేలమీద పడున్నాయి. ఆశ్చర్యమేమిటంటే - ఆకాశంలో ఒక్క మబ్బుకూడా లేదు - ఎట్లా వచ్చిన గాలి అట్లాగే ఆగిపోయింది. నందుడు విస్మయపడుతూ తలుపులు మూసి వచ్చాడు.

"సుందరీ! ఇంతగాలి ఒక్కసారిగా ఎందుకొచ్చినట్టు"

"అంటే గాలి కూడా మనల్ని అడిగిరావాలా?"

"అదికాదు. బయట ఒక్క మేఘం కూడా లేదు. పక్షుల శబ్దాల్లోకూడా ఏదో అసహజత్వం వినిపిస్తోంది"

"మీ మనసు ఇంత అపరిపక్వంగా ఉందని నాకు తెలియదు" సుందరి చిరాకు పడింది.

"అంటే అది అసాధారణమైన విషయాల్లో అసాధారణమైన అర్థాలను వెతకలేదు"

"నా మనసెప్పుడు సాధారణమైన విషయాల్లో అసాధారణమైన అర్థాలను వెతకలేదు"

"సరి..సరి.. సంతోష సమయంలో వాదన లెందుకు? తిలకం పూర్తిగా ఒలికిపోయినట్టుంది. మరికొంచెం కలిపి తీసుకురానా?"

"వద్దు, గిన్నెలో ఉంది సరిపోతుంది. క్రిందపడిన గిన్నె పైకి తీసింది. అయితే గ్రహాలు చిత్రించనా నుదుటి మీద"

"వూ..హు.. ఆ కోరిక పోయింది. నేనే పెట్టుకుంటాను అద్దాన్ని సరిగా పట్టుకోండి చాలు"

అతడు సరిగా పట్టుకోవటానికి ప్రయత్నిస్తుంటాడు.

కానీ జరిగిన సంఘటన గురించి అతడాలోచిస్తూండటంతో ఆమెకు బొట్టు పెట్టుకునే వీలు మాత్రం కలగలేదు. చాలాసేపు ప్రయత్నించి చిరాకుతో గిన్నె అవతల పడేసింది.

"మీ మనస్సిక్కడలేదు - అందుకే దాన్ని సరిగా పట్టుకోలేకపోతున్నారు - మీరిక పట్టుకోనక్కరలేదు. అద్దం అక్కడ పడేయండి - నేను బొట్టే పెట్టుకోను" విసురుగా అక్కడ నుంచి లేచి గది మధ్యలో కొచ్చింది.

"అలాగా - నువ్వు బొట్టు పెట్టుకునేంత వరకు అద్దం నుంచి నీ ప్రతిబింబాన్ని దాటిపోనివ్వను. చూడు అద్దం నీడ నీ మీద. నీ ప్రతిబింబం అద్దంలో చూడు" చిలిపిగా నవ్వాడు.

"మీరేం చేసినా ఈ రోజు నేను పెట్టుకోను" పంతంగా అన్నది.

"సరే అదీ చూస్తాను"

ఆమె ఎటువెళితే అటే అద్దాన్ని తిప్పుతున్నాడు.

ఒక్కసారిగా బయటనుండి అనేక మంది భిక్షువుల స్వరాలు వినిపిస్తాయి. "ధర్మం శరణం గచ్ఛామి" భవనానికి దగ్గరగా వినిపించిన ఆ శబ్దానికి నందుడులికిపడి అద్దాన్ని వదిలేసాడు. అది క్రిందపడి మూడుముక్కలుగా పగిలిపోయింది.

వచ్చిన పెనుగాలిలాగానే భిక్షువుల స్వరాలు దూరమయ్యాయి. బయటంతా ప్రశాంతత. నందుడి మనసులో అలజడి. విరిగిన అద్దం ముక్కల్లో నుండి అతని రూపం ఖండఖండాలుగా భరించలేనంత వికృతంగా కనిపిస్తోంది. అది తన మనసులో రేగుతున్న అస్థిత భావాలకు రూపం వచ్చినట్లు, ఉనికిని కోల్పోతున్న వ్యక్తిత్వానికి ప్రతీకగా కనిపిస్తోంది. చూడలేక భయంతో రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు.

సుందరి దగ్గరగా వచ్చి - అతని ముఖంలోని ఆందోళన గమనించి అతడి మానసిక స్థితినర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. ఏదో తెలియని భయం ఆమె నరనరాలలో వ్యాపిస్తోంది. భిక్షుకుల స్వరం వినగానే అతడెందుకలా అయిపోతున్నాడు. అతని మనసులో రేగుతున్న ఆలోచనలేమిటి?

"అద్దం పగిలిపోయిందా?" సౌమ్యంగా అడిగింది.

"అవును. సుందరీ - చెయ్యి జారిపోయింది" మాటల్లో బాధ తొంగిచూసింది.

"మీరు మీ మందిరానికెళ్ళండి. నేను కొంచెం సేపు ఏకాంతంగా ఉండాలనుకుంటున్నాను."

"వెళ్ళే అధికారం నాకు లేదు. ఇంతకు ముందే నీకు మాటిచ్చాను. ఈ రోజంతా నీ దగ్గరే ఉంటానని"

"మాటిచ్చింది నాకేకదా - ఆ మాటనుండి మిమ్మల్ని విముక్తుడ్ని చేస్తున్నాను - దయచేసి వెళ్ళండి"

"లేదు. నేను నా మాట మీదే నిలబడాలనుకుంటున్నాను. పైగా గ్రహాలు చిత్రిస్తానని చెప్పాను. కనుక అనవసరమైన ఆలోచనలు మాని కుదురుగా కూర్చో" తిలకం గిన్నె చేతిలోకి తీసుకున్నాడు, భుజాలు పట్టి తీసుకెళ్ళి ఆసనం మీద కూర్చోబెట్టాడు. గిన్నెలోనుండి గంధాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

"మీరొక్క ప్రశ్నకు సమాధానం చెప్పండి"

అడుగు ఎన్నయినా చెబుతాను"

"బావగారు వచ్చిన దగ్గరనుండి మీలో ఏదో మార్పు కనిపిస్తోంది. ప్రధానంగా అక్కగారు దీక్ష తీసుకున్న దగ్గరనుండి మరింత ఎక్కువయింది. భిక్షుల స్వరం వినిపిస్తే చాలు మీరు మీరుగా ఉండటంలేదు. ఈ రోజు అద్దం పగిలిపోవడానిక్కూడా కారణం అదే - నిజం చెప్పండి మీ మనసులో మరో ఆలోచనలు కూడా వస్తున్నాయి కదూ!"

నందుడు కాసేపు మౌనంగా నిలబడిపోయాడు ఆలోచిస్తూ - తర్వాత ఆమె ముఖం వైపు చూస్తూ.

"సుందరీ! నువ్వూహించేది నిజమే - ఎంతోమంది బలహీన మనస్కుల ప్రతినిధిని నేను - నా స్వభావాన్ని నేనొప్పుకుంటున్నాను. ఏ బావాలూ బలంగా నిలబడవు. చోటుచేసుకోకుండానూ ఉండవు. ఎందుకో ఈ దేదీబావనలు నాకరం కాదు. అది సెబావ లకణం

కానీ - ఒక్కటి మాత్రం నిజం. నిన్ను విడిచి ఎక్కడా ఉండలేను" అతడి మాటల్లోని నిజానికి ఆమె మనసు కొంత శాంతపడింది. అతడు తనను విడచి వెళ్ళడనే విశ్వాసం కలిగింది. దాంతో పోయిన కళ వచ్చి చేరింది. హాయిగా నవ్వుతూ -

"మీ మనసు నాకు తెలుసు. పసిపిల్లవాడి తత్త్వం. మీకేం కావాలో కూడా మీకు తెలియదు - నాకొక్కమాటివ్వండి అగ్నిసాక్షిగా ఏడడుగులు నడిచి ఏ కరగ్రహణం చేసారో ఆ చేయి పెట్టనని - మీరు లేకపోతే నాకు మృత్యువే అనే మాటలు చెప్పలేను కానీ ప్రాణం లేని శరీరంలా మృతప్రాయమౌతుంది జీవితం."

"వద్దు దేవీ ఆ మాటలు ప్రస్తుతం అవసరం. పూవు - తావిలా కలసి జీవిద్దాం. రా. నా చేత్తో ఏడు గ్రహాలు చిత్రించనీ."

సుందరి బుద్ధిగా కూర్చుని ముఖాన్ని ముందుకు వంచింది. నందుడు పుల్లతో చందన లేపాన్ని కలుపుతున్నాడు. ఎవరో బయట తలుపులు బాదుతున్నారు. ఆ శబ్దానికి సుందరి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా మాలిక. ఒళ్ళంతా చెమట్లతో ముఖమంతా ఆందోళనతో మనిషి నిలువెల్లా కంపిస్తోంది.

"దేవీ! ఘోరం జరిగిపోయింది. యువరాజా! మీరు ఇక్కడే ఉన్నారా"

"ఏం జరిగింది మాలికా! తామ్రవర్ణుడికేమయినా అయ్యిందా?" నందుడాత్రుతగా అడిగాడు.

"కాదు - ఆ విషయం కాదు. నేనాందోళన పడుతున్నది - మీరు కూడా ఆ గొంతు వినలేదా?"

"ఏ గొంతు - చెప్పదేదో సరిగ్గా చెప్పు" సుందరి చిరాకు పడింది.

"నేనిప్పుడే బయటినుండి వస్తూ మన వాకిటి ముందు నిలబడ్డ ఒక భిక్షువును చూసాను. ఆయన మూడుసార్లు భిక్ష అడిగి సమాధానం రానందువల్ల తిరిగి వెళ్ళిపోయారు - వారు.. వారు స్వయంగా గౌతమబుద్ధులు"

ఆ మాటతో సుందరీ నందులు ముఖాలు వెలవెలా పోయాయి. శరాఘాతం తిన్న మృగంలా నందుడు విలవిల్లాడిపోయాడు.

"ఆఁ అన్నగారా!? వారే నా ఇంటికి భిక్షకొస్తే గుర్తించలేని మందమతినయ్యానే - ఆ రోజు దీక్షలక్కూడా వెళ్ళలేదు. అయినా ఆయన మనసులో పెట్టుకోకుండా వచ్చారు. నేనే అవమానించి పంపాను. ఎంత దురదృష్టవంతుడ్ని. దైవం కోరివచ్చి తలుపు కొడితే తలుపులు మూసాను - ఎంత అభాగ్యుడ్ని" తలకొట్టుకుంటూ ఆవేదన పడుతున్న భర్తను సుందరి ఓదార్చింది.

"నేను కూడా చాలా బాధపడుతున్నాను స్వామీ! మనవల్ల ఘోర తప్పిదం జరిగింది. ఇంట్లోకి పిలిచి ఆతిథ్యమిచ్చి వారి ఆశీస్సులందుకోవాల్సింది. చాలా దురదృష్టం. వారి రాకను గుర్తించలేకపోయాం"

"చూసావా సుందరీ హఠాత్తుగా పెనుగాలి వచ్చి వెళ్ళిపోయింది. నా ఆంతర్యాన్ని నువ్వు నమ్మలేదు. అది తప్పక వారి రాకకు సంకేతం అయ్యుంటుంది. ప్రకృతి కూడా మహాత్ములకు దాసోహం అంటుంటే అందివచ్చిన అదృష్టాన్నందుకోలేని మందభాగ్యుడ్ని నేనే"

"చూడండి - జరిగిందానికి నేను కూడా బాధపడుతున్నాను. మనం మాటల్లో పడి ఆయన గొంతు వినలేకపోయాము. ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించండి. ఊరికే బాధపడి ప్రయోజనం ఏముంది" అతని భుజం మీద చెయ్యివేసింది అనునయంగా.

"ఏముంది దేవీ! జరిగిన పొరపాటును క్షమించమని ఆయన కాళ్ళమీద పట్టమే. ఆయనెంతో దూరం వెళ్ళివుండరు. వెళ్ళి కలుసుకుని ఇంటికి రమ్మని ప్రార్థిస్తాను. నాకు అనుమతివ్వు సుందరీ" హడావుడిగా లేచాడు - ఉత్తరీయం భుజాన వేసుకున్నాడు.

"స్వామీ! మనస్సెందుకో తెలియని ఆందోళనకు గురవుతోంది. మీరు వెంటనే వచ్చేస్తారా?"

"వచ్చేస్తాను దేవీ! నేను మాత్రం నువ్వులేకుండా స్వర్గంలోనైనా ఉండగలనా - మన ప్రేమమీద ఒట్టు. త్వరగా వచ్చేస్తాను."

"ఎందుకో ఎప్పుడూ లేనంత వ్యాకులంగా ఉంది. మీరు వెళ్ళిపోతే మళ్ళీ మిమ్మల్ని చూడలేనేమో అనిపిస్తోంది"

"ప్రవాసదేశమెళ్తున్నట్టు ఈ బాధేమిటి" ఆమెలో ఏదో పిరికితనం.

నందుడామెను దగ్గరకు తీసుకుని "ఏమిటిది సుందరీ! ఎంతో ధైర్యం నాకు చెబుతుంటావు - చూడు ఈ తిలకం నీ నుదుట దిద్దుతున్నాను. ఇది ఆరకముందే వచ్చి నీ కౌగిట్లో ఉంటాను సరేనా?"

"ఏమో - ఎన్నడూ లేని ఈ బలహీనతేమిటో నాకూ అర్థం కావడం లేదు. అయ్యో - ఇంత బేలనవుతున్నానేమిటి?"

"పూజ్యుల పాదసేవ కెళ్తున్న మిమ్మల్నెట్లా వారిస్తాను? ఆందోళన చెందే మనసును సంబాళించుకోనూలేను"

ఒక్క క్షణం ఆమె వివశురాలయింది. సాధారణ స్త్రీలాగా అహంకారం పక్కన పెట్టి నందుడిని కౌగిలించుకుని ఏడ్చింది.

"దేవీ నాకు మాత్రం సంతోషమా నిన్ను విడిచివెళ్ళటానికి. పైగా నగరంలోకేగా. చూడు ఆలస్యమయేకొద్ది ఆయన మరింత దూరం వెళ్ళిపోతారు - నీ తిలకం తడి ఆరకముందే రావాలి. మాటిచ్చాను కదా - అది నిలబెట్టుకోనివ్వు. ఏదీ నవ్వుతూ పంపు" ఆమె గడ్డం పైకెత్తి కళ్ళల్లోకి ప్రేమగాచూసాడు. సుందరి సిగ్గుపడింది.

"ఈ సింధూరం మీకోసం తడారకుండా ఎదురుచూస్తూ ఉంటుంది. మాటతప్పకుండా ముందే వస్తే వేడి ముద్దులు, వెచ్చని కౌగిలింతల విందు సమర్పించుకుంటాను. సరేనా"

"సరే దేవీ! ఆలస్యమయ్యే కొద్దీ అన్నగారు దాటిపోతారు వెళ్ళిరానా?" అతడు కూడా పోలేకపోతున్నాడు. మూడడుగులు ముందుకు వేస్తూ ఆరడగులు వెనక్కు అన్నట్లుంది.

ఆమె కళ్ళల్లో బేలతనం. ఎంత ధైర్యవంతురాలయినా తరాల స్త్రీ జాతి నిస్సహాయత ఆ బలహీనతే పురుషుడికంటే తక్కువ చూడబడటం - అతడు వెళ్ళిపోతుంటే తన ప్రాణాన్నెవరో లాక్కుపోతున్నట్లు భావన.

నందుడు వెళ్ళిపోయాడు. సుందరి ఏకాంతంగా మిగిలిపోయింది. క్షణంలో శృంగార మందిరమంతా శూన్యంగా అలంకార హీనంగా కనిపించిందామె కళ్ళకు - ఆలోచిస్తూ కూర్చున్న ఆసనం మీదే వాలిపోయింది.

అన్నగారి దర్శనంకంటే సుందరి నుదుటి తిలకం ఎక్కడారుతుందో అనే భయంతోనే నందుడు త్వరత్వరగా విడచి ప్రధాన రాజద్వారం గుండా నగర వీధి చేరాడు.

అక్కడక్కడ గౌతముని గురించి విచారిస్తూ ముఖ్యకూడలికి వెళ్ళాడు. అక్కడ నాలుగువైపుల వీధులు కలసే ప్రదేశం అవటంతో జనం రద్దీ ఎక్కువగా ఉంది. విలువయిన రత్నాల అంగళ్ళు. మేలి వస్త్రాల విక్రయశాలలు ప్రత్యేక ఆకర్షణ. ఉన్నత కుటుంబాల వారు మాత్రమే కొనగలిగిన అంగళ్ళవి.

విశాలమైన వీధులకు రెండు వైపులా కట్టబడిన ఎత్తైన సౌధాలు పొందిగ్గా కట్టబడి ఉన్నాయి. ప్రతిమందిరం సుందరకళా నిలయంగా భాసిస్తోంది. ఎర్రరాతిగోడలు అందానికి నగిషీలు దిద్దినట్టుంది. ప్రధాన ద్వారాలమీద చెక్కిన అద్భుతమైన దారు శిల్పసంపద వీధుల్లో నడిచే వారి కళ్ళు తిప్పుకోనీయటం లేదు.

నాగరికతలో మగధకంటే శాక్యనగరవాసులే ముందున్నారు. వ్యవసాయం, చేతివృత్తులకు ఆ ప్రభుత్వం ప్రోత్సాహమివ్వటం వల్లనే అక్కడి ప్రజలు అన్నిరంగాల్లో ముందంజ వేస్తున్నారు.

ఆ దేశ ప్రజలు సహజంగానే మృదుస్వభావులు - యుద్ధ విముఖులు. తప్పనిసరిగా యుద్ధం చేయాల్సివస్తే అఖండ పరాక్రమవంతులు - విద్యావినయ సంస్కారాలకు ఆ నగరం పుట్టిల్లు. అటువంటి శాక్య మహానగర వీధుల్లో అన్నగారికోసం వెతుకులాట మొదలుపెట్టాడు నందుడు. చెదరిన వెంట్రుకలతో, చెమటతో తడిసి ఒంటికంటుకుపోయిన బట్టలతో ముఖంలో ఆందోళనతో, బికారిలా వీధుల్లో తిరుగుతున్న నందుడిని చూసి జనం ఆశ్చర్యపోతున్నారు - కొంతమంది దగ్గరకొచ్చి పలకరిస్తున్నారు. చివరకు ప్రధాన కూడలిలో ప్రజాసమూహం మధ్య చుక్కల్లో చంద్రుడిలాగా ఉన్న గౌతమ బుద్ధుడిని చూసాడు. ఆ దివ్య తేజస్సుకు తలవంచి నమస్కరిస్తున్నారు. అంగళ్ళు వదిలి వ్యాపారులు దర్శనకోసం గుంపులో జొరపడుతున్నారు. ఎటు చూసినా జనం - ఆ ఆకర్షణేమిటో? ఎవరికీ అర్థంకాదు -

పాదాల మీద పడేవాళ్ళు - దర్శనమే చాలనుకుంటున్నవాళ్ళు కనీసం తలకనిపించినా ఆ రోజుకు పుణ్యదర్శనం జరిగినట్టే అతని ఎత్తైన ప్రదేశాల్లో నిలబడి తొంగితొంగి చూస్తున్నవాళ్ళు. అక్కడంతా పెద్ద కోలాహలం.

ఆ జనాన్ని తప్పించుకుని అన్నగారిని ఎట్లా కలవాలో అర్థంకావటం లేదు - మనసంతా ఆయనపట్ల పెరిగిపోతున్న భక్తి గౌరవాలకు వివశుడౌతున్నాడు. ఒక్కసారి ఆయన దృష్టిలో పడితే తన జన్మ భాగ్యమనుకుంటున్నాడు.

నిజానికి గౌతముని దర్శనం నందుడికానందమయింది. ఆ క్షణం అతడు సుందరిని తప్ప సర్వం మరిచాడు. గుంపులో చొరబాటు చేసుకుని లోనికి పోవటానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ ఇసుకేస్తే రాలనంత జనం.

ఎలా? సమీపించేదెట్లా? ఆహ్వానించేదెట్లా? ఒకవైపు భార్యకిచ్చిన మాట ప్రకారం బొట్టు ఆరకముందే ఇల్లు చేరుకోవాలి. ఈ ఆలోచనలతో అతడు సతమతమవుతున్నాడు. ఎండకన్నెరుగని సుందరమైన ముఖం ఎండ తీక్షణతకు వాడిపోతోంది. నిరంతర ధారగా స్రవిస్తున్న స్వేదజలాన్ని పై ఉత్తరీయంతో మాటిమాటికి తుడుచుకుంటున్నాడు - మళ్ళీ గుంపులో చొరపడుతున్నాడు.

ఇదంతా గౌతముడో కంట కనిపెడుతూనే ఉన్నాడు. తమ్ముని అవస్థ చూసి ఆయన పెదవులపై చిరుమందహాసం వెలసింది. చూసి చూసి చివరికతనికవకాశం ఇవ్వాలని జనాన్ని తప్పించుకుని కొంత ఏకాంత ప్రదేశం చేరాడు. నందుడానందంతో అన్నగారి కాళ్ళమీద పడిపోయాడు. తన తప్పు మరదలి ఆతిథ్యం స్వీకరించటానికి రమ్మని గద్గద స్వరంతో ప్రార్థించాడు. అపరాధికి దండం విధించమని అయితే తన ఇంట భిక్ష తీసుకోవాలని వేడుకున్నాడు. గౌతముడు ఉలకడు. పలకడు. నోరెత్తి సమాధానం చెప్పడు. అన్న మనసు తమ్ముడికర్థం కావటంలేదు. సమాధానం పొందకుండా వెళ్ళిపోతే పెద్దలనవమానపర్చినట్టవుతుది.

రెండు చేతులు జోడించి కందిపోయిన ముఖంతో దీనంగా అపరాధిలా నిలబడ్డాడు నందుడు.

కళ్ళెత్తి తమ్ముడి ముఖాన్ని చూసి మారు పలుకేమీ లేకుండా తథాగతుడు తన చేతిలో భిక్షాపాత్ర నతడి చేతిలో ఉంచి తన వెంట రమ్మని సైగ చేసి ముందుకు నడిచాడు.

క్షణకాలం అతడికేమీ అర్థంకాలేదు. చేత ఉన్నది ఆదిభిక్షువు మహాపాత్ర. ఆజ్ఞాపించింది లోకారాధ్యుడు బుద్ధుడు. మనస్సు భార్యాధీనం - ఈ ద్వైదీభావనలోఎటూ తేల్చుకోలేక నిస్సహాయంగా కసాయివెంట నడుస్తున్న గొర్రెలా వెంబడించాడు -

అతని అంతరంగం కల్లోల సాగరతరంగ వేదనా రంగం.

చేతవనం ప్రశాంతంగా ఉంది. పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. అక్కడ క్రమశిక్షనే ముఖ్యమన్నట్టు చెట్లన్నీ ఒక పద్ధతిలో ఉన్నాయి. మధుర రసాలూరు మామిడి పళ్ళ వాసన గాలి మోసుకొస్తోంది. మంచి బత్తాయిలు నారింజ గుత్తులుగా వేలాడుతున్నాయి. తరువుకు కాయలు భారం కాదని నిరూపిస్తున్నాయి. పసుపు పచ్చని నిమ్మపళ్ళు ముట్టుకోకుండానే రసాన్ని ఒలికిస్తున్నాయి. పెద్ద సంతానవతులయిన పనసచెట్లు మాతృత్వశోభతో నిండుగా కనిపిస్తున్నాయి. జామ అనాస పాలకాయలు. దానిమ్మ, నల్లనేరేడు, బొప్పాయి ఒకటేమిటి - ఎన్నో రకాల పండ్లు అతిథుల సేవకోసమే మా జీవితాలన్నట్లు వచ్చిన అతిథులను స్వాగతిస్తున్నాయి. అక్కడక్కడ నికుంజాలు విరబూసిన పూలతో మాధవీలతలు, రెల్లుపూలగడ్డితో కప్పిన శిష్యుల కుటీరాలు, శాంతిసందేశకుల్లా నిలబడి చూస్తున్నాయి.

దారి పొడవునా బుద్ధభగవానుడి పాదాలు కందకుండా ఒత్తుగా పూలను రాలుస్తూ తమ అదృష్టానికి పొంగిపోతున్నాయి. రెండు వైపులా నాటిన పారిజాత వృక్షాలు, కొలనులోని నీళ్ళు భిక్షువుల స్వచ్ఛతకు ప్రతీకగా ఉన్నాయి. కంటిపాపల కదలికలు సైతం బంధించగలిగిన నిర్మలత్వం వాటిది. లతల అల్లికతో గోరువంకల చేరికతో వెన్నెల స్నానాలు కోకిలల ఆలాపాలు. ఇక్కడ మాత్రం కవులు చెప్పినట్లు విరహాప్రలంభాలు కాదు. అక్కడున్నది స్నేహసౌభ్రాతృత్వాలే.

నానాజాతి మృగాలు సఖ్యంగా కలిసిమెలిసి తిరుగుతున్నాయి. భిక్షువుల చేతిలో గడ్డి చనువుగా లాక్కొని తింటున్న హరిణమైత్రి. ఆదర్శజీవన వైచిత్రి కొండలపై నుండి జాలువారుతున్న జలధారల్లో ప్రణవఘోష.

నందుడు మైమరిచిపోయాడు. శిషులొచ్చి అతని చేతిలో భిక్షాపాత్ర అందుకుని అరుగుమీద కూర్చోబెట్టారు. ఒకరు వచ్చి చల్లటి మంచినీరందించారు.

బుద్ధుడి ఆజ్ఞమేరకు కొందరు కుటీరంలోకి వెళ్ళి కొంచెం సేపట్లోనే తిరిగొచ్చి నందుడిపక్కనే కూర్చున్నారు.

"మీరు భగవానుడి సోదరులటగా. ఆహా! మీ భాగ్యమేభాగ్యం. లోకహితుడైన ఆ మహాత్ముని అంతరంగాన్నర్థం చేసుకుని ఆ బాటలో నడిచిపోవటం ఉత్తమం. లోకమంతా ఆయన వెంట ఉండగా మీరింకా దీక్ష తీసుకుపోవటానికి కారణం తెలుసుకోవచ్చా. ఇప్పుడైనా మించిపోయేదేముంది. వారి ఆజ్ఞ అయిందిగా - ఇక దీక్ష తీసుకుందుకు సిద్ధంగా ఉండండి" అని. దానిక్కావలసిన వస్తువులు సమకూర్చుకుంటున్నారు. అప్పటివరకు వారి మాటలకు వినోదిస్తున్న నందుడు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

"తనకు దీక్షేమిటి? అందుకోసం వచ్చానని వీళ్ళనుకుంటున్నారా?"

"అయ్యో! మీరు పొరపాటు పడుతున్నారు. నేను వచ్చింది ఇందుకోసం కాదు. అన్నగారిని ఇంటికాహ్వానిద్దామని అంతే."

కంగారుగా లేచి నిలబడ్డాడు.

"మీరెందుకొచ్చింది. మాకనవసరం భగవానుడి ఆదేశమయింది తమరికి దీక్ష ఇవ్వమని అందువలన కుదురుగా కూర్చోండి."

"ఆ లేదు. లేదు. నేను గృహస్తును. మీకిది ధర్మం కాదు. మీరయినా మనసుకిష్టమైంది ఆచరించటం పద్ధతి. బలవంతంగా ఎవరినయినా దారి మళ్ళించగలమా? జంతువుల చేతే ఆ పనిచేయించలేం. ఆలోచన వున్న మనిషినెట్లా శాసిస్తారు. దయచేసి ఈ దీక్షా ప్రయత్నం మానండి. నేను తీసుకోలేను. ఈ శరీరం నాదికాదు. నా భార్యది. వివాహవేళ ధర్మబద్ధంగా ఆమెకు దారాదత్తం చేసాను కనుక అన్యమైన వస్తువును నాదిగా ఉపయోగించటం తప్పు. నన్ను విడిచిపెట్టండి. ఇంటికి తిరిగి వెళ్ళాలి" అన్నాడు నందుడు.

***********

(13)

**దానికి ఉపాలి అనే శిష్యుడు –**

"సోదరా! ఎంత అజ్ఞానంతో మాట్లాడుతున్నావు – ఇక్కడ ఉన్న చాలామంది భార్యలున్నవాళ్ళే – రాజ్యాలను సైతం విడిచి భార్యలను మరచి బుద్ధ దేవుని నూతన ధర్మ నిర్వహణలో ఎందరో ముందుకు వస్తుంటే స్వయానా సోదరుడివై యుండి దీన్ని నిరసించడం మీకు గౌరవమేనా? ఆలోచించండి. మీరు ముందుండి మమ్మల్ని నడిపించాల్సింది పోయి స్వయంగా వారు ఆదేశించినా పామరుడిలా మాట్లాడటం పాడికాదు – ఇంతవరకు కోరి వారెవ్వరికీ ఇవ్వలేదు – మీరు మొదటివారు – అందువలన ఈ దీక్షను స్వీకరించి అందరికి ఆదర్శప్రాయులుకండి" అన్నాడు.

"ఊఁడు. ఏ మాత్రం నాకిష్టంలేని పని నేను చేయలేను – నా మనసు ఈ నీరస సన్యాసాన్ని కోరుకోవటం లేదు. ఉత్తమ గృహస్థ ధర్మానికి ప్రతీకగా నా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను. మీరన్నట్లు మీ ధర్మాన్ని గుర్తించలేనంత మాత్రాన వాళ్ళంతా మూర్ఖులు అజ్ఞానులా? నాదనుకున్న మార్గంలో నేనే ప్రయాణం చేస్తున్నాను. అది నాకు సమ్మతం – అందుకే బలవంతం చేయకండి" అన్నాడు దూరంగా జరుగుతూ.

వాళ్ళూరుకోకుండా పట్టుకొచ్చి బలవంతంగా కూర్చోపెట్టారు – చిన్నబోయిన మోము వెలవెలబార ఒడలు గజగజవణికిపోతుండగా అతడు వాళ్ళను బ్రతిమిలాట్టం మొదలు పెట్టాడు.

"సోదరా! నా మాట వినండి. నా భార్య నాకు ప్రాణం కంటే ఎక్కువ. ఇది ఆమె ధనం, ఆమె అనుమతి లేకుండా సన్యాసం ఎలా తీసుకోగలను. అది పాపంకాదా, ఆమెను విడిచి మోక్షం కూడా నేను కోరుకోనంటే ఆమె పట్ల నాకెంత ప్రేమో ఆలోచించండి – ప్రేమ జీవులను విడదీయటం మహాఘోర నేరం – అందువలన ఈ పని విడిచిపెట్టి అన్నగారికి చెప్పండి – వారు వస్తానంటే కూర్చుంటాను – రారంటే వెళ్ళిపోతాను దయచేసి అడిగిరండి"

"పిచ్చివాడా! స్త్రీ వ్యామోహం నిన్నెంత దిగజార్చింది. కళ్ళముందున్న దైవాన్ని గుర్తించలేని గుడ్డివాడివయ్యావు. నిజమైన సంపద ఇది. శాశ్వతం. కీర్తికరమైన ఉత్తమ మార్గాన్ని విడిచి సంసారం కోసం తాపత్రయం పూర్తి అజ్ఞానమే. పట్టిన పంతం విడిచి బుద్ధిగా కూర్చో" అని నలుగురు చుట్టూ మూగారు. ఇద్దరు గట్టిగా పట్టుకునేసరికి నందుడు పూర్తిగా భయపడిపోయాడు. తన్నెవరో పాతాళానికి తోసేస్తున్నట్లు నడిసముద్రంలో ముంచుతున్నట్లు విలవిల్లాడిపోతున్నాడు ఊపిరందనట్టు గిలగిలా తన్నుకుంటున్నాడు. పెద్దగా గొంతెత్తి అరుస్తున్నాడు. వాళ్ళను ఇష్టం వచ్చినట్లు తిట్టాడు. చేతులతో కాళ్ళతో అడ్డుకోవటానికెన్ని ప్రయత్నాలు చేసినా ఎలుగుబంటి పిడికిలిలా గౌతముని శిష్యులు బలవంతంగా అతని తల గొరిగి కాషాయ బట్టలు కట్టి వాళ్ళ పనిపూర్తిచేసుకుని వెళ్ళిపోయారు.

పాపం సుందరి ప్రాణం!! పెనుగులాడి పెనుగులాడి ఏడ్చి అలసిపోయి భూమ్మీద వాలిపోయాడు – అతన్ని గురించి ఇక పటించుకునవాళ్ళేలేరు.

క్షణంలో అంతా తారుమారయింది. సుందరి కౌగిలిలో సమస్త సౌఖ్యాలనుభవిస్తున్న అతడు పరివ్రాజకుడయ్యాడు. కనుసైగ చేస్తే చాలు వేలమంది దాసీలు చేతులు కట్టుకుని నిలబడేవారు. ఏడుస్తున్నా 'అయ్యో' అనేవారు లేరిప్పుడు. ఆజ్ఞలివ్వటమే తెల్సిన అతడు సన్యాసుల ఆజ్ఞకు తలవంచాల్సి వచ్చింది. మెత్తటి హంసతూలికా తల్పం మీద పరుండాల్సిన శరీరం, కఠినమైన రాళ్ళరప్పల మధ్య ధూళిధూసరితమై పొర్లాడుతోంది. పసిడి పట్టు వస్త్రాల స్థానంలో ముతక కాషాయం అందుకేనేమో - 'విధిరేవ బలీయసీ' అన్నారు పెద్దలు.

అక్కడ నందుడి కోసం ఎంతో సమయం సుందరి ఎదురు చూస్తూ కూర్చుంది. మధ్యాహ్న సమయమయింది. సాయంత్రమయింది. అప్పటివరకు ఆమె తిలకాన్ని ఆరిపోకుండా నీటితో తడుపుతూనే వస్తూంది. ఎప్పుడయితే చీకటి ముసుగులోకాన్ని ఆవరించిందో ఆ పని విడిచిపెట్టింది.

మనసులో ఊహామాత్రంగా ఉన్న అనుమానం బలమై పెనుభూతంలా నిల్చింది.

మనసులో ఒక్కటే అనుకుంది,

"మీ గురించి మీకే మాత్రం తెలియదు. కానీ మీరేమిటో నాకు బాగా తెలుసు. స్థిరత్వం లేని మిమ్మల్నెక్కువగా ప్రేమించాను కనుకనే ఈ బాధ నేననుభవించక తప్పదు" రాగాలు మూగబోయిన వీణలా పలుకలేని పూలరెమ్మలా మౌనంగా కూర్చున్న సుందరి దగ్గరకు మాలిక వచ్చింది.

ఆమెనా స్థితిలో చూసి లోపల్లోపలే ఎంతో ఆవేదన పడింది.

"మన్నించండమ్మా! నా మూలంగానే ఇదంతా జరిగింది. ఆ కబురే కనుక నేను చెప్పి ఉండకపోతే ఈ దుఃఖం ఉండేది కాదు. అయినా నాకు ధైర్యంగానే ఉంది. మిమ్మల్ని కాదని యువరాజుగారు ఏ నిర్ణయం తీసుకోలేరు. మీరు లేవండి - వారు వచ్చేలోపు మీ అలంకరణ పూర్తిచెయ్యాలి"

"వద్దు. అలంకరణ మీద శ్రద్ధలేదు. వదిలేయ్. పైగా నేనే యువరాజుగారి కోసం ఎదురుచూట్టం లేదు. ఎందుకంటే చూడాల్సిన సమయం కంటే ఎక్కువే చూసాను. ఇక పనిలేదు. నన్ను కాసేపు ఒంటరిగా ఉండనీ. నువ్వెళ్ళు."

మధుపాలికనే చెలికత్తె పరుగెత్తుకుంటూ వచ్చింది. ఆమె చాలా ఆందోళనగా ఉంది.

"దేవీ! దేవీ!.. గొప్ప అనర్థం జరిగిపోయింది."

"ఏమయ్యింది?" సుందరి అలక ఒకేసారి అడిగారు.

"నేరం చేసిందెవరో తెలియలేదు. కానీ జరిగిన తప్పిదం మాత్రం ఘోరమయిందమ్మా. మీరు ముందుగా నన్ను మన్నించాలి. జరిగిన దాంట్లో నాకేమాత్రం సంబంధం లేదు" అన్నదామె వణికిపోతూ.

"సరే! నీకు అభయం ఇస్తున్నాను. ఏం జరిగిందో చెప్పు"

"అమ్మా! తమరికి ప్రాణప్రదమైన రాజహంసలు సరోవరం విడచి ఎక్కడికో ఎగిరిపోయాయి"

సుందరి, మాలిక ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సుందరి కూర్చున్న ఆసనం మీదనుండి బుసకొట్టే నాగులా విసురుగా లేచింది.

"ఇదెవరి పని? ఎందుకిలా జరిగింది మాలికా?" ఆమె గొంతులో కఠినత్వం భయపెడుతోంది.

"ఈరోజంతా నేను భవనంలో లేనమ్మా, ఇంత సాహసం ఎవరు చెయ్యగలరు?" మెల్లగా అంది మాలిక.

"ఎవరూ చేయక వాటంతటవే ఎగిరిపొయ్యాయా? చూద్దాం పద" ఆమె ముందు వెనక చెలికత్తెలు అనుసరించారు.

శూన్యమైన సరోవరం వెక్కిరించినట్లనిపించింది. కళ్ళతో చూస్తున్నా నమ్మబుద్ధి కావటం లేదు. సరోవరం దగ్గరకు రాగానే కిలకిల శబ్దాలు చేసుకుంటూ ఒడ్డుకు ఈదుకొచ్చే దృశ్యమే కనిపించి ఆమె గుండె కదిలిపోతోంది.

"ఎందుకో... ఎందుకో.. ఈ విషయం నమ్మలేకపోతున్నాను. బహుశా. నేను భవనంలో, లేకుండటం కూడా కారణం కావచ్చు. ఎంతాలోచించినా ఈ పనెవరు చేసారో అర్థం కావటం లేదు దేవీ" అంది మాలిక.

"నీకే కాదు మాలికా! ఇలా జరిగిందని ఇప్పటికీ నా మనసంగీకరించలేకపోతోంది. రాజహంసలు స్వయంగా ఎగిరిపోయాయంటే ఇదికూడా ఆశ్చర్యమే. ఆ పనివాటంతటవి చేయలేవు. ఎవరో వాటిని బలవంతంగా తరిమేసి ఉంటారు. లేదా దొంగిలించి ఉంటారు. ఎందుకంటే నామీద నాకున్న నమ్మకం. నా సాహచర్యం నుండి తొలిగిపోవాలని ఎవరూ అనుకోరు. కనుకనే ఎవర్నో అనుమానించాల్సి వస్తోంది" ఆమె గొంతులో వేదన స్పష్టంగా కనిపిస్తోంది.

మాలిక తన మనస్సులో కలిగిన అనుమానానికి భయపడుతూ..

"అమ్మా! మీ మనస్సులో ఎవర్ని అనుమానిస్తున్నారో తెలియదు. కానీ మీరనుకున్న వ్యక్తి మాత్రం కారకుడు కాడు. అతడింకా లేవలేని స్థితిలోనే ఉన్నాడు అతడే కాదు. మరెవ్వరూ ఇంత ధైర్యంగా ఆ సాహసం చెయ్యలేరు దేవీ! మీకవి ఎంత ప్రాణమో అందరికి తెలుసు. తెలిసి వాళ్ళ శిరస్సులను పోగొట్టుకోలేరు కదా"

"లేదు. మాలికా! అతడి మీద నాకే మాత్రం సందేహం లేదు. అతడి భావాల్ని నేను వ్యతిరేకించినా అతడటువంటివాడుకాడు కాదని తెలుసు. నువ్వు ప్రేమిస్తున్న వ్యక్తి సంస్కారం గొప్పగానే ఉంటుంది. "

"బహుశా.. వాటికి దెబ్బతగిలిన కారణం అయివుండవచ్చు. రెక్కలు విరిగినా ఎగిరిపోయాయంటే వాటికాశక్తి ఎక్కడినుండొచ్చింది?" ఆమె సందేహం చూసి మాలిక అంది.

"రోజులు గడిచాయికదా. తిరిగి రెక్కల్లో అవి బలం పుంజుకుని ఎగరగలిగిన శక్తి సంపాదించి ఉండవచ్చు" సరోవరం నాలుగువైపులా కలియజూస్తూ అంది.

"కావచ్చు. శక్తివచ్చినంత మాత్రాన వాటి ఇష్టం వచ్చినట్లు ఎక్కడికో ఎగిరిపోగలవా? ఇన్నాళ్ళ చెలిమి - సరోవరం అనుబంధం - ఆకర్షణ ఇంత తొందరగా మర్చిపోయాయా"

"ఏమో - ఆలోచించే ఓపికలేదు, మాలికా తలభారంగా ఉంది. మనస్సేం బాగోలేదు. లోపలికెళ్దాం పద"

"పదండమ్మా ఉదయం నుండీ మీరు విశ్రాంతిగా లేరు. మానసికంగా చాలా అలసిపోయారు. మీరనుమతిస్తే సుగంధ జలంతో పాదాలు మర్దిస్తాను" అనుసరిస్తూ అంది.

"వద్దు. ఈరోజే పనీ చేయించుకోవాలని లేదు. కొంచెం ఉయ్యాలమీద తలగడలు పెట్టు. అక్కడ పడుకుంటాను" అంది సుందరి భవనంలోకి దారితీస్తూ-

మాలిక త్వరత్వరగా వెళ్ళి మెత్తటి దిండ్లు తలవైపు - కాళ్ళ వైపు ఉయ్యాలబల్లమీద సర్దింది. సుందరి పడుకున్నాక ఆమె దగ్గర కూర్చుంది. మెల్లగా కాళ్ళు ఒత్తుతూ.

"మీరు నా మాట వినడంలేదు. బహుశా నా మీద కూడా కోపం వచ్చి ఉంటుంది."

"కోపం కాదు. అప్పుడప్పుడు మనసు చేసే హఠాన్ని మనం భరించక తప్పదు. అయినా ఈ మధ్య మరీ మొండిదానివై పోతున్నావు" మాలిక ముఖంలో చూస్తూ అంది.

"నేను మొండి దాన్నయితే. ఈరోజంతా మిమ్మల్నిలా బోసిగా ఉంచేదాన్నా. కొంచమయినా అలంకరించనివ్వండి. వారొచ్చే వేళయింది. "

"మాలికా ఇంకామాట విడిచిపెట్టు. ఎంతవరకు తను తిరిగిరావటం కోసం ఎదురుచూసానో అంతవరకు చూసాను. ఇంకా చూడాలి అని అనుకుని ఉంటే ఈ బొట్టు ఎండనిచ్చేదాన్నికాదు. ఉంచాల్సిన సమయం కంటే ఎక్కువే తడిగా ఉంచాను - ఆపై నేను నిరీక్షించటం ఆపేసాను ఇప్పుడు రాకపోయినా బాధలేదు. "

చాలా నిర్లిప్తంగా ఉన్నాయామాటలు.

"నిజంగా మీరామాటలు అంటున్నారా? మీ హృదయం నాకు తెలియదా వారు రారనే ఆలోచన రానివ్వకండి."

"మాలికా! ఆలోచనా స్థితిగతుల్ని మనం అర్థం చేసుకోగలిగితే అవి మన అదుపులోనే ఉంటాయి. ఏ విషయాన్ని నేను ఆలోచించానో దానికంటే ముందే అతడు రావాల్సింది. ఒక నమ్మకంతో అతడిని పంపించాను. వద్దనుకుంటే వెళ్ళకుండా ఆపేదాన్నిగా. కానీ ఆపటమనేది బలవంతంగా శాసించటమే. ఒకరకంగా అది మానసిక దౌర్భల్యం. ఈ మాత్రమయినా నేను స్థిరంగా ఉన్నానంటే ఆ దుర్భలత నాకు లేకపోవటమే. ఇక నేను నిద్రపోవాలి. ఉయ్యాల మెల్లగా ఊపు"

"దేవీ! మీ భోజనం తీసుకురానా?"

"వద్దు మాలికా - నాకు మానసిక విశ్రాంతి కావాలి. నన్ను నిద్రపోనీ. అలాగే అమ్మా.. మీరు పడుకోండి." లేచింది మాలిక. సుగంధ జలాన్ని తెచ్చి మెల్లమెల్లగా ఆమె పాదాలను మర్ధించడం ప్రారంభించింది. సుందరి మెల్లగా కళ్ళు మూసుకుంది. మూసిన కనురెప్పలనుండి రెండు కన్నీటిబొట్లు చెక్కిళ్ళ మీదుగా జారిపోయాయి. అది చూసి మాలిక బాధపడుతూ.

"దేవీ! ఎవరినయినా పంపించనా వారిజాడ తెల్సుకోవటానికి?"

"వద్దు మాలికా! ఆ పని చెయ్యాలనుకుంటే ముందుగా నేనే చేసేదాన్ని. ఎవరినయినా బలవంతం పెట్టి చేయించటం నేనంగీకరించను రావాలనుకుంటే వారే వస్తారు. ఆ విషయం ఇక మాట్లాడకు - నన్ను నిద్రపోనీ.."

మాలికతో మాట్లాడుతూనే సుందరి మెల్లగా నిద్రలోకి జారిపోయింది. మెల్లగా ఉయ్యాలూపుతూ మాలిక ఆలోచన్లో పడిపోయింది. ఆమె మనస్సులాగానే చీకట్లు దట్టంగా ఆవరించుకున్నాయి. దీపాల్లేని భవనం ఆ రోజు రాత్రికి పూర్తిగా ఆహ్వానం పలికింది.

సుందరికి చెప్పకుండా మాలిక స్వర్ణముఖుడిని నదీతీరానికి ముందే పంపింది. అప్పుడే తిరిగొచ్చిన స్వర్ణముఖుడు నెమ్మదిగా మాలికను పిలిచాడు. ఆమె చప్పుడు కాకుండా బయటికొచ్చి తలపులు దగ్గరగా వేసింది. ఆ తర్వాత ఇద్దరూ తోటలోకి నడిచారు. తాను తెలుసుకున్న విషయమంతా మాలికతో చెప్పాడు. నందుడికి బలవంతంగా దీక్ష ఇవ్వబడిందని. అదికూడా గౌతముడి ఆజ్ఞ ప్రకారం జరిగినదని చెప్పాడు. ఆ మాటలు విని మాలిక ఎంతోసేపు ఒంటరిగా ఏడుస్తూ ఉండిపోయింది.

ఇక్కడ గౌతముని ఆశ్రమంలో బలవంతంగా సన్యాసం ఇప్పించబడ్డ నందుడు చాలాసేపు బాధపడ్డాడు. తరువాత అన్నగారితో మాట్లాడాలని కబురు పంపించాడు.

కొంత సమయం తరువాత బుద్దుడు కుటీరంలో తమ్మునికి దర్శనమిచ్చాడు. లోపలికి రాగానే ఎంతో ప్రేమతో కౌగిలించుకుని ధూళి ధూసరితమైన అతనిదేహాన్ని స్వయంగా తన పైకండువాతో శుభ్రం చేసాడు. మధురమైన పండ్లరసాలను తాగించి పక్కనే కూర్చుండబెట్టుకున్నాడు. ఈ చర్యలతో మనస్సు కొంత శాంతించింది.

"సోదరా! నీకు నామీద కోపం ఉంటుందని తెలుసు. నీ భార్యకు దూరం చేసానని నన్నాక్షేపిస్తున్నావుకదూ. బలవంతపు దీక్ష వలన నాపై కినుక పూనావా? మాట్లాడు" బుజ్జగించాడు బుద్దుడు.

నందుడు ముఖం గంటుపెట్టుకునే కూర్చున్నాడు. అన్నయ్యవైపు చూడటం లేదు. పసివాడు అలిగినట్లు కోపంగా కూర్చున్న నందుడిని చూసి చిరునవ్వు నవ్వాడు శాక్యముని.

"నందకుమారా! నువ్వెలా అనుకున్నా ఒక్క విషయం నీకు గుర్తుచేయకతప్పదు. సమస్త శోకాల్ని దూరం చేసే ప్రదేశం ఇది. ఇక్కడి భిక్షువులు దయాస్వభావులు. ఎవరి బాధను చూడలేరు. దైన్యమనే రోగాన్ని తగ్గించే దివ్యౌషధశాలిది. రోగాలకు శస్త్రచికిత్సలు చేసుకుని పరిపూర్ణానందమనే ఆరోగ్యంతో తిరుగుతున్న భిక్షూత్తములు వీరు. కనుక నీ బాధను వారు చూడలేరు. శోకాన్ని విడిచి అందరితో కలసి ఆర్తుల సేవలో పాలుపంచుకో. నీ మేలుకోరి చెబుతున్నాను. " అన్నాడు బుద్ధుడు అనునయంగా.

ఆపుకోలేని ఉద్వేగంతో నందుడు తలెత్తి సూటిగా అన్నగారి ముఖంలోకి చూస్తూ -

"ఇదేనా శోక నివారణమార్గం? ఇన్ని రోజులుగా నేను భ్రమలో ఉన్నాను. నా అన్నగారు సాక్షాత్తూ దైవస్వరూపమని ఆ మహానుభావుడికి కరుణ తప్ప కఠినత్వం తెలియదని అనుకున్నాను. కానీ ఈరోజు నా ఆలోచనలకు భిన్నంగా జరిగిన ఈ సంఘటన. నా మనసు కలత వారజేస్తోంది. మా భార్యాభర్తలను విడదీసి మీరు సాధించిందేమిటి? నా తలగొరిగినంత మాత్రాన మనస్సేమయినా మారిందా? కాళ్ళూ చేతులూ కత్తిరించండి, ఇంకా మారుతుందేమో చూడండి" అన్నాడు ఆక్రోశంగా.

"ఎంత అమాయకుడివి తండ్రీ! రోగ తీవ్రతను బట్టి వైద్యుడు వైద్యం చేస్తాడు. ఔషధం రుచిగా లేనంతమాత్రాన మంచిది కాకపోదుగా. దాన్నిచ్చిన వైద్యుడు చెడ్డవాడూ కాదు. వ్యామోహమనే భయంకరమైన జబ్బుతో బాధపడుతున్నావు. అందుకే ఈ వైద్యం చేయాల్సి వచ్చింది" అన్నాడు గౌతముడు శాంతంగా -

"లోకంలో భార్యను ప్రేమించటం కూడా వ్యామోహమేనా! అటువంటప్పుడు సన్యాసం - కాషాయం ఇవి మాత్రం వ్యామోహాలు కావా? సాంఘిక వ్యవస్థకు మూలాధారమైన గృహాశ్రమ ధర్మాన్ని విడిచిపెట్టడం ఏం న్యాయం? భార్యలను దుఃఖంలో ముంచి ఎవరినో ఉద్ధరించాలనుకోవటం ధర్మంకాదు. మీరు సాక్షాత్తూ దైవ స్వరూపులు మీతో మాకు పోలికలేదు - ఎంతో అన్యోన్యమైన మా దాంపత్య జీవితాన్ని విడదీయకండి. ఒక్క నిమిషం కూడా ఎడబాటెరుగని జంటమాది. నా వియోగం ఆమె మరణానికి దారి తీస్తుంది. దయతో ఈ సంకెళ్ళనుండి నన్ను విముక్తిడిని చేసి ఇంటికి అనుమతి ప్రసాదించండి"

కన్నీళ్ళతో నందుడు గౌతముడి పాదాల మీద పడ్డాడు. నందుడిని సరిగా కూర్చోబెడుతూ "చూడు కుమారా! పసిబిడ్డ తినుబండారం కోసం ఏడ్చినట్టు నువ్వు భార్యకోసం తపనపడుతున్నావు. ఇంతసేపు మాట్లాడినా నీ మాటల్లో మరో వ్యక్తికాని, పరమార్థం కాని గోచరించలేదు

"అయంబంధురయంనేతిలఘుచేతసామ్

ఉదారచరితానాంతు వసుధైక కుటుంబకమ్" అని వినలేదా?

నాది అనేది స్వార్థం. దాన్ని విడిచి పెట్టినవారికి ప్రపంచమే కుటుంబం. ఏ బంధాన్ని తెంచుకోనవసరంలేదు. పెంచుకోకుండా ఉంటే చాలు. అదే బౌద్ధ ధర్మం. ఏ బంధమైనా మన మార్గానికి తోడు వచ్చేలా ఉండాలి తప్ప కంటకంలా బాధించకూడదు"

"అంటే కట్టుకున్న భార్యను ప్రేమించటం తప్పంటారా?"

"తప్పని ఎవరంటారు? హృదయ తటములనుండి పొంగి పొర్లే ప్రేమగంగ ఒక్కరినే అభిషేకించటం తప్పంటాను. వయసు గడిచేకొద్దీ వ్యామోహాలు నశించి రూపహీనమైన శరీరాల్ని ఒక్కసారయినా చూడాలనిపించదు"

"లేదు. నా ప్రేమ శాశ్వతం - మేము ఒకరికోసమే ఒకరం పుట్టాం - మా అన్యోన్యత జీవితాంతం ఉంటుంది" అన్నాడు నందుడు మొండిగా.

చిన్నపిల్లవాడి మారాం చూసి తండ్రి నవ్వినట్టు బుద్ధుడు తమ్ముడిని చూసి చిరునవ్వు నవ్వాడు.

"రేపనేది ఏమిటో తెలియనిది జీవితం. మనిషికి కావల్సిన ప్రేమ సంకుచితమై చివికి దేవుడిలా నాలుగు గోడల మధ్య బందీకాకూడదు - అది విశాలమై విశ్వాన్ని ముంచాలి. అందులో తడిసి ఎంతోమంది దరిద్రులు వాళ్ళ జీవితాల్ని పవిత్రం చేసుకోవాలి.

కళ్ళు వాల్చి చూస్తే కనిపించేది నీ నీడ మాత్రమే - తలెత్తి చూడు. ఎంతో విశాలమైన ఆకాశం కనిపిస్తుంది. కుటుంబం కూడా నీడలాంటిదే - మనిషి నీడ మరొకరికి ఆశ్రయం ఇవ్వలేదు - అందుకే, తాను చెట్టులా ఎదగాలి. రెండు బాహువులు చాపి కాలేకడుపు మండే గుండెలతో నీ సాయాన్నర్థిస్తున్న దరిద్రులకు నీడనివ్వు.

"కన్న బిడ్డలకు పిడికెడు కూడు పెట్టుకోలేక కళ్ళముందే బిడ్డలు మట్టి తింటున్నా నివారించలేని మాతృమూర్తుల శోకం విను - రాజభోగాల్లో తేలుతున్న మన తల్లికి మనవసరం ఉందా? లేక వాళ్ళకా? ఆలోచించు - జబ్బున పడ్డ భర్తలను బ్రతికించుకోవటానికి మెళ్ళో తాళి బొట్టుకూడా అమ్ముకుంటున్న ఇల్లాళ్ళెందరో. ఆశగా చూస్తున్నారు - ఎవరైనా సాయం చేస్తారని. ఆదరించాల్సింది ఈ నిర్భాగ్యులనా? పట్టుపరుపుల మీద కాలుక్రింద పెట్టకుండా పరిచారకులతో సేవలందుకునే నీ ఇల్లాలినా? కళ్ళు తెరువు నాయనా.

ఎంతమంది దీనులు నిర్భాగ్యులు. తిండిలేక ఒంటికి జానెడు గుడ్డ, ఉండ ఇల్లులేక ఏడుస్తున్నారో చూడు. ఎందుకీ దౌర్భాగ్యపు బ్రతుకని వాళ్ళ దురదృష్టాన్ని నిందించుకుంటూ కన్నీళ్ళతో కాలం గడుపుతుంటే మూడు పూటలా మృష్టాన్నారగిస్తున్న మన స్వార్థం మీద అసహ్యం వేయటంలేదా - పాలకులమనే పేరుతో వాళ్ళ రక్తమాంసాలను తినటం ఎంత హేయం. సోదరా! మనసు పొరలు ఛేదించు. నూతన ధర్మాన్ని ఆహ్వానించు - కాముడికంటె శ్రామికుడిగా గౌరవాన్ని పొందు" అనునయంగా తమ్ముడి భుజాలు చుట్టూ చెయ్యేసాడు.

వాస్తవాన్ని కళ్ళముందు చూపిస్తూ తన మూర్ఖత్వాన్ని సున్నితంగా మందలిస్తున్న అన్నగారిపట్ల నందుడిలో కోపం బదులు గౌరవం పెరిగింది - అయినా అతనిలోని వ్యామోహాలు బలహీనతుల్ని రెచ్చగొడుతున్నాయి. సుందరి సౌందర్యం, పాశంలా వెనక్కు లాగుతోంది.

ఏమాత్రం బింకం తగ్గకుండా అన్నగారిని చూస్తూ -

"అందుకు మమ్మల్ని విడదీస్తే లోకమంతా ఉద్ధరించబడుతుందా? ఎంతమంది కుటుంబాల్ని విడచి ఈ దీనజనోద్ధరణకు రాగలరు? మరెంతమందిని బలిచేస్తారు బలవంతపు సన్యాసానికి?" అన్నాడు.

"పిచ్చివాడా! అందరూ మహానుభావులే అయితే నాకీ సన్యాసమెందుకు? నీకీ బలవంతపు కాషాయమెందుకు? - కొందరయినా త్యాగంతో ముందుకు రాగలిగితే వ్యవస్థలో మార్పు తీసుకురావచ్చు. వ్యక్తి పాలనం అంతమై ప్రజాశక్తి విజృంభించాలి.

"ఎవరికివారు తమ స్వార్థాలకే పరిమితమైతే సామాజిక వ్యత్యాసాలు పెరుగుతూనే ఉంటాయి. ఏడ్చేవాళ్ళు ఏడుస్తూనే ఉంటారు. ఆ ఏడ్పుల మీద భవనాలు కట్టికొందరు పెత్తనం సాగిస్తుంటారు.

"మీ భార్యా భర్తల్ని విడదీసానని నువ్వు బాధపడుతున్నావు. నా కుంటుంబాన్నే నా బాటలో నడిపించుకోలేనని నేను ఇతర్లకేమి ఉపదేశం ఇవ్వగలను. అందరూ నన్ను వేలెత్తిచూపరా? పైగా బలవంతపు దీక్ష నీవరకే పరిమితం. అందరూ స్వచ్ఛందంగా ముందు కొస్తున్నవారే.

"అహింసా సూత్రానికి కట్టుబడ్డ ఈ జాతి మౌక్తికాల నొక్కసారి చూడు. నీకంటే చిన్న వయసువారు. నీతోడివారే. సత్యదేవత ఆదరంతో ఎత్తుకున్న ముద్దుబిడ్డలు. వీరి ముఖాలపై పసితనపు ఛాయలింకా తొలగలేదు.

"ఇతడు ఆనందుడు తన తల్లికి ఒక్కగానొక్క బిడ్డ. భావి సామ్రాట్టు కాగలిగిన ఇతడు తల్లిని, రాజ్యాన్ని నిస్సందేహంగా విడచివచ్చాడు. పేదవాళ్ళ కష్టాల్లో సర్వం చూసుకుంటున్న భాగ్యశీలి. ఇంకా వివాహమే కాలేదు.

"అతడో - అశ్వజిత్తు. స్వయంగా కోరివరించిన వధువు ప్రాణం. పాదాల పారాణి ఆరలేదు - నుదుటి బాసికం వీడలేదు. బందుగుల ముచ్చట్లు తీరలేదు. దాంపత్య జీవితాన తొలి అడుగైనా వేయకముందే అన్ని బంధాలు తెంచుకుని జత్కళ్యాణమే శాశ్వతమని పెండ్లిపీటలపై నుండి వచ్చిన పుణ్యశీలి.

"బయటి శత్రువులకంటే అంతశ్శత్రువుల మీద విజయం సాధించాలి. నీ ప్రేమ విశ్వజనీనం కావాలి. ధర్మదేవత పాదాల చెంత ప్రమాణం చేసి ప్రజాసేవకోసం ముందుకు సాగుదామని వచ్చిన వీరందరికంటే నువ్వేమాత్రం త్యాగమూర్తివో చెప్పు. బంధాలు - ప్రేమలు అందరికీ ఉన్నాయి. అందరికోసం తనవారిని త్యాగం చేసేవాడే మనీషి. తన కోసం ఇతరులను బలిపెట్టేవాడు పిశాచి.

"ఇంత విన్నాక ఇంకా నీ భార్యే నీకు సర్వమనుకుంటే నీ ఇష్టం. నీవిక వెళ్ళొచ్చు. శాక్యవంశంలో అంత బలహీనులు పుట్టరనే భావిస్తున్నా - నా అనుష్ఠానానికి వేళయింది. ఇంకేమయినా సందేహాలుంటే ఆనందుడ్నడిగి తెలుసుకో" - గౌతముడు కుటీరంలోకి వెళ్ళిపోయాడు. నందుడానందుడివైపు చూసాడు. అతని చూపులు ప్రశాంతంగా తనవైపే చూస్తున్నాయి. ఏమనుకున్నాడో లేచి నిలబడ్డాడు నందుడు. ఆనందుడతన్ని వారించాడు.

*******

(14)

"**చూడు సోదరా! పెరటిమందు** వైద్యానికి పనికి రాదన్నట్టు ఎంతో మందిని ప్రభావితం చేస్తున్న బుద్ధదేవుని బోధలు నీ చెవికెక్కటం లేదు. విన్నంతనే మేమంతా దీక్ష స్వీకరించాం. తమ్ముడివై యుండి ఆయన్నర్థం చేసుకోకపోవటం నిజంగా దురదృష్టం" అన్నాడు మందలింపుగా.

"మీరెన్నయినా చెప్పండి. పెండ్లినాటి ప్రమాణాలు మర్చి నా భార్యకు ద్రోహం చెయ్యలేను - ఇప్పుడే వస్తానని మాటిచ్చి వచ్చాను - కానీ ఈ రూపం చూస్తే ఆమె తట్టుకోగలదా?" నందుడికి మళ్ళీ కళ్ళనీళ్ళొచ్చాయి.

"చెట్టుకు పండ్ల రుచి తెలియనట్లు నీకు జీవిత రహస్యం బోధపడటం లేదు. ఎంతసేపున్నా నీ దుఃఖం ఒక ప్రాణికోసమే - కనీసం రాజువనే సంగతైనా గుర్తుందా! రాజధర్మాన్ని మరచి ఇంతగా స్త్రీ వ్యామోహితుడువా? వయసు పొంగు తగ్గాక కామం ఎక్కడిది? ముడుతలు పడ్డ దేహం. వ్యాధి బారిన పడ్డ శరీరం, వికృతమై కళ్ళముందు కనిపిస్తుంటే ఇవే మాటలు ఆ రోజు చెప్పగలవా - లేదు స్వసుఖాలకు బానిసలైన వారికి ఉన్నత మార్గం అలక్ష్యమే - శాశ్వతానంద సంధానకర్తలైన గౌతముని బోధలు రుచించకపోవచ్చు. నిజాన్ని గ్రహించే తరుణం దగ్గర్లోనే ఉంది. నిన్నిక్కడాపేవారెవ్వరూ లేరు - నిరభ్యంతరంగా వెళ్ళొచ్చు" అతని కళ్ళల్లో తీక్షత నందుడి పిరికితనాన్ని ఎగతాళి చేస్తున్నట్టనిపించింది. "నిజంగానే అన్నగారి మాటల్లోని సత్యాన్ని గ్రహించనంతటి మూర్ఖుడా. తనది కేవలం వ్యామోహమేనా? వదినగారి దీక్ష రోజు తనకూ తీసుకోవాలనిపించింది. ఈరోజు అదే దీక్ష వద్దనిపిస్తుంది. మరోవైపు భార్య ఆకర్షణ పట్టి బంధిస్తోంది. మనసులో ఆలోచన మెదిలితేనే సహించలేని ఆమె, వికారంగా మారిన తనను ఆదరిస్తుందా? అసలు తన మార్గం ఎటో ఏ నిర్ణయం తీసుకోవాలి? తన మనసు అక్కడున్నప్పుడు ఇక్కడ గురించి ఆలోచిస్తుంది. ఇక్కడుంటే ఆ మార్గం సరయిందనిపిస్తుంది. ఇంతకీ తనకేది దారి? ఇదే కొనసాగించటమా? భార్యదగ్గరికెళ్ళి పోవటమా?"

ఎటూ తేల్చుకోలేక అన్యమనస్కంగానే నందుడు అడవి దారిపట్టాడు. అతన్ని మానసికస్థితి బాగోలేదు - కుటీరంలో నుండి గౌతముడిదంతా గమనిస్తూనే ఉన్నాడు. బంగారాన్ని కరిగించేటప్పుడు తొట్రేలు పాటు సహజం. తరువాత దాని మెరుపే వేరు - ఇప్పుడతని పరిస్థితి అలల మధ్య రాజహంసలా డోలాయమానంగా ఉంది. ఆనందుడ్ని పిలిచి నందుడ్ని వెంబడించమని ఆదేశించాడు.

మాలిక ఆదేశం మీద స్వర్ణముఖుడు యువరాజు గురించి ఎప్పటికప్పుడు వివరాలు మాలికకు చేరుస్తూనే ఉన్నాడు. అన్నదమ్ముల మధ్య జరిగిన వివాదం, మతి తప్పిన నందుడు అడవికేసి వెళ్ళటం, ఆనందుడతన్ని వెంబడించటం అన్నీ తెల్పాయి. అయితే ఏక్షణమైన యువరాజు తిరిగొస్తాడని నిద్రపోకుండా ఉండమని స్వర్ణముఖుడ్నాదేశించింది.. అతడి స్నానానికి ఏర్పాట్లు చేసి మధ్యలో ఒక్కసారి సుందరి దగ్గరకెళ్ళింది. ఆమె ప్రశాంతంగా నిద్రపోతుండటంతో తృప్తిగా నిట్టూర్చి వెనక్కు మళ్ళింది.

ఆ రాత్రి చాలా పొద్దుపోయాక ఒంటినిండా గాయాలు, బోడి తలతో నందుడు అతని వెంట ఆనందుడు భవనానికి తిరిగి వచ్చారు. అతన్ని చూసి మాలిక భయపడిపోయింది.

"ఏమిటీ గాయాలు యువరాజా? ఏమయింది?"

"హుష్ - పెద్దగా మాట్లాడకు - సుందరి నిద్రపోయిందా?"

"అవును. ఈరోజంతా మీకోసం చూసారు. ఎంతోసేపు బొట్టు ఆరకుండానే ఉంచారు. చివరకు అలసిన హృదయంతో నిద్రపోయారు" అంది మాలిక మెల్లగా.

"అదేమంచిది. లేకుంటే ఈ రూపాన్ని చూసి ఆమె భయపడేది" గదిలోకి తొంగిచూసాడు.

"మీరు స్నానం చేయండి. అన్ని ఏర్పాట్లు చేసాను."

"తరువాత చేస్తాను. మాలికా - నాతో ఒక అతిథి వచ్చారు. వారిని లోపలికి తీసుకురా"

మాలిక వెళ్ళి ఆనందుడిని తీసుకొచ్చింది.

"రండి - మహాభిక్షూ! స్వాగతం నా స్వర్గమందిరానికి" ఆహ్వానించాడు.

"స్వర్గ భావన మనస్సుకు సంబంధించిందేకాని భవనాల్లో ఉండదు నందకుమారా" అన్నాడానందుడు నిర్లిప్తంగా చూస్తూ -

"కానీ నేనిప్పుడు నా మనసులోని మాటే చెబుతున్నాను. అక్కడ వారిపట్ల ఉన్న గౌరవంతో నేనేం మాట్లాడలేకపోయాను. నాకున్నది వ్యామోహం కాదు - చర్మం ముడతలు పడ్డా నా భార్యను ప్రేమించగలను. స్వల్పమైన జీవితకాలంలో ఆయువు అంతంత మాత్రమే. దానికి తోడు జరావ్యాదులు, శోకభూయిష్టమైన ఈ నరకాన్నుండి ప్రాణుల్ని రక్షిస్తోంది ప్రేమ ఒక్కటే - దానిని నేను పరిపూర్ణంగా పొందాను. నా పొరపాటేముంది"

"పొరపాటని ఎవరనగలరు? లోకసామాన్యంగా అందరిలానే మీరు ప్రవర్తిస్తున్నారు. జంతువులు - కీటకాలు అన్నీ ఇందులో పడికొట్టుకుంటున్నవేగా - వాటితో సమానంగా భావించుకుంటున్న మీ ప్రేమను గూర్చి నేనెక్కువ మాట్లాడలేను. నాకు తెల్సిన ప్రేమ విశ్వాంతరాళానికి సంబంధించింది. దానిలో యవ్వనవంతులు - వృద్ధులు రోగగ్రస్తులు కుంటివారు. ఒకరేమిటి, ప్రేమించటానికి అవకాశమున్న ప్రతి ఒక్కరు ఆ పరిధిలోకే వస్తారు. " నందుడు చూపించిన ఆసనం మీద కూర్చున్నాడు ఆనందుడు.

"అంతటి విశాలహృదయునింకా కాలేదు. నన్ను నమ్ముకుని వచ్చిన ఇల్లాలికి మోసం చెయ్యలేను - ఆమెను ప్రేమిస్తున్నాను. ఇదేమీ సమాజానికి వ్యతిరేకం కాదే ఇటురండి - నా భార్యను చూపిస్తాను" మెల్లగా తలుపులు తీసి నిద్రపోతున్న సుందరిని వేలితో చూపించాడు.

"చూడండి. లోకంలో ఇంతటి అందాన్ని ఎక్కడైనా చూసారా? ఆ అద్భుత సౌందర్యరాశే నా ఇల్లాలు" నందుడు గొప్పగా చెప్పాడు.

అతని అమాయకత్వానికి ఆనందుడు చిన్నగా నవ్వాడు. "సోదరా! అందమనేది చూసే కళ్ళను బట్టి ఉంటుంది. నీ భార్య నీకు అందగత్తే - అలాగే కోతికి దాని భార్య గొప్ప సౌందర్యవతి. నీకనిపిస్తున్న అందం నాక్కనిపించటంలేదు. తోలుకప్పుకున్న ఒక మాంసపిండంలాగానే ఉంది. మూసిన కళ్ళవెనక రెండు రంధ్రాలు - లావణ్యం వెనుక అస్థి పంజరం. ఇది వాస్తవం - పైదంతా భ్రమ. దానినుండి తప్పించటానికే ఆచార్యులు నీ వెంట ఉండమన్నారు" అన్నాడు ఆనందుడు.

నందుడి ముఖం రోషంతో ఎర్రబడింది. అసలే గాయాల నుండి స్రవిస్తున్న రక్తం.. భయంకరంగా ఉన్నాడు.

"శరీరంలో ఉన్నది మాంసఖండాలేనా? మరేమీలేవా? లేనప్పుడు ఈ సిద్ధాంతాలెవరికోసం" ఆవేశంగా అడిగాడు భార్య సౌందర్యాన్ని అస్థిపంజరంతో పోల్చటం అతడికి బాధగానే ఉంది.

"బురదలో కూరుకుపోయినవాడు అదే ప్రపంచమన్నాడట. అలాగే ఉంది నీ పరిస్థితి. దేహసంబంధమైన వ్యామోహాలు తొలిగించుకోమని చెప్పాను కానీ మానసిక విలువలు గురించి కాదే మనస్సు ప్రధానం కనుకనే మనిషి బాధలనుభవిస్తున్నాడు. వాటిని తొలగించటానికే మహాత్ముడి మహాప్రస్థానం మొదలయింది. వ్యక్తి స్వార్థం కంటే సమాజమే మేలనేది నేర్చుకో."

"మంచిది.. మీ మాటలు గుర్తుంచుకోటానికి ప్రయత్నిస్తాను. ఉదయం నుండి నీడలా వెన్నాడుతున్నారు. తమరొచ్చిన పని పూర్తయిందా?" నందుడి మాటల్లో కొంచెం వ్యంగ్యం.

"అవును - ఉద్విగ్నమైన మనసుతో నువ్వేం చేస్తున్నావో నీకే అర్థంకాని పరిస్థితిలో వెళ్ళిపోయావు. నీ మానసిక స్థితిని వారు సరిగానే ఊహించి నన్ను పంపించారు. అడవిలోకి ఒంటరిగా వెళ్ళటం. అక్కడ నిరాయుధంగా పులితో పోరాటం.. అంతా చూసాను - నీ దేహానికున్న బలం మనస్సుకు లేదనిపిస్తోంది. బహుశా వారు నాటిన బీజం తొందర్లో ఫలిస్తుందనే నమ్మకం నాకుంది. తొందర్లోనే మీ సమాధానం అందుకుంటాను - నాకు శలవిప్పించండి" లేచాడు ఆనందుడు.

మాలిక వేడినీళ్ళు - గుడ్డ తీసుకొచ్చింది. వెంట స్వర్ణముఖుడు కూడా వచ్చాడు. అతడు కూర్చున్న నందుడి గాయాలు శుభ్రం చేయటానికి అనుమతడిగాడు. అది వినిపించుకోకుండానే నందుడు -

"వెళ్ళేముందు నా సమాధానం వినండి. ఇక ముందు కూడా నా మనస్సటువైపు మళ్ళదు. నన్ను ప్రభావితం చేస్తున్న ఆమె ఛాయనుండి వైదొలగాలని నేనెన్నడూ కోరుకోను - ఇదే నా సమాధానంగా వారిక్క్యూడా చెప్పండి"

అతడు కూడా లేచి నిలబడ్డాడు. శరీరం నుండి బొట్లు బొట్లుగా రక్తం నేలమీద పడుతున్నది.

"అయితే గౌతమ బుద్ధున్ని గురించి మీకు తెల్సింది చాలా తక్కువ. నీ గురించి నీకంటే వారికే ఎక్కువ తెలుసు - వారు నాటిన బీజం ఎన్నటికీ వృధాకాదు. అందుకే నీ సమాధానం ఎన్నటికీ పూర్తికాని అసంధిగ్ధ చిత్రం." రెండడుగులు ముందుకు నడిచాడు ఆనందుడు.

"అంటే - ఎప్పటికీనా?" నందుడు రెట్టించాడు.

"అవును - నీలో వ్యాకులత తొలగేంత వరకు అది పూర్తికాదు"

"అయితే దీక్షని అంగీకరిస్తే పూర్తవుతుందా?"

"అంతమాత్రం చేత కూడా పూర్తికాదు. అది నీకు నీవు వేసుకోవాల్సిన ప్రశ్న. " మరికొంచెం ముందుకు నడిచాడు ఆనందుడు.

"వద్దు భిక్షూ! ఈ మాటల క్రీడ మన మధ్య వద్దు. స్వర్గం - నరకం, వైరాగ్యం శీలం - ధర్మం ఇటువంటి మాటలతో మీరు నన్ను మభ్యపెట్టాలనుకున్నా ఆ మార్గంలోకి నేను రాలేను. ఇప్పుడే కాదు. మరెప్పటికీ" అతడి గొంతులో ఒక స్థిరత్వం కనిపించింది.

"పొరపడుతున్నావు సోదరా! నీ మార్గాన్ని నీవింకా సరిగా నిర్ణయించుకోలేకపోతున్నావు. ఏది నీదని గట్టిగా చెబుతున్నావో అదికూడా నీదికాదు - ఆమాట నువ్వే ఒప్పుకుంటావు కొద్దిరోజుల్లోనే"

వాకిలి దగ్గర ఆగాడు ఆనందుడు.

నందుడు వెనక నాలుగడుగులు నడిచి -

"వద్దు భిక్షూ! నా అంతరాంతరాలు శోధించకు. నిజంగా నేనేమిటో అర్థంకాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాను. ఒకవేళ భయంకరమైన నా అస్థిర స్వరూపాన్ని నువ్వు బయటపెడితే ఈ మాత్రం ఉనికిని కూడా కోల్పోతాను. ఇక మాటలొద్దు. ఒక్కసారి మా భవనం చూడకుండానే వెళ్ళిపోతావా?"

"వద్దు. సోదరా! ఈ మాత్రమైనా అంగీకరించావు. అదే చాలు నాకు"

"మందిరాన్ని చూడాలన్న ఇచ్ఛ నాకు లేదు. లోకమందిరం మా నివాసం, భగవానుని ప్రేమామృతాలే మా తల్లిదండ్రులు. ఇక ఒక్క ఘడియ కూడా ఇక్కడుండలేను. వెళ్ళొస్తాను" నందుడు పిలుస్తున్నా వినిపించుకోకుండా ఆనందుడెళ్ళిపోయాడు. సుందరింకా నిద్రపోతూనే ఉంది. స్వర్ణముఖుడితో గాయాలు శుభ్రం చేయించుకుని నందుడు భార్య గదిలోకొచ్చాడు. ఆమెకేమాత్రం మెలుకువ రాకుండా తల్పం పక్కనే కూర్చుని ఆమె ముఖాన్ని చూస్తూ.

'దేవీ! నువ్వు కళ్ళు తెరవద్దు. లేకుంటే తట్టుకోలేని దుస్స్వప్నాన్ని చూస్తావు. నువ్వడిగే ప్రశ్నలన్నిటికి నా దగ్గర సమాధానం లేదు - మౌనం అంతకన్నా భరించలేను. ' హఠాత్తుగా అతడిలో భార్యమీది మమకారం రెట్టింపయింది. ఆర్ద్రతాభావంతో.

'అవును - నిన్ను ఎప్పటికప్పుడు బాధపెడుతూనే ఉన్నాను - నీ చిన్న కోర్కెలను కూడా సఫలం చేయలేనంతటి నిస్సహాయుడిని ఎందుకవుతున్నాను. నుదుటి బొట్టు ఆరకముందే వస్తానని చెప్పి రాలేకపోయాను. గ్రహాలు ఆకాశం అన్నీ నీ నుదుట చిత్రిస్తానని అదీ చేయలేదు. నీకిష్టం లేకపోయినా అక్కడికెళ్ళాను - ఈ వికృత రూపంతో తిరిగొచ్చాను. నీకూ - నాకూ ఎంత తేడా! నీ అభిప్రాయాలమీద నువ్వు స్థిరంగా ఉంటావు. అలాగే అన్నగారు ఆయన సిద్ధాంతమీద వారున్నారు - నేనే.. ఎటూ తేల్చుకోలేక నలిగిపోతున్నాను. నాకేమవుతుందో కూడా నాకర్థం కావటంలేదు'

కాసేపు మౌనంగా రోదించాడు. తరువాత గుర్తుకొచ్చినట్టు ఎండిపోయిన చందనపాత్రను తడిపి తీసుకొచ్చాడు. చిన్న బొట్టు ఆమె ముఖం మీద దిద్దాలని మీదకు వంగాడు - ఏదో నీడపడినట్టె సుందరికి వెంటనే మెలుకువ వచ్చింది. పూర్తి మెలుకువ రానందువల్ల ఏదో వికృతమైన ఆకారం తన మీద పడుతున్నట్లు అనిపించి సుందరి కెవ్వున కేకేసింది. ముఖం చెల్లక నందుడు తెరచాటుకు వెళ్ళాడు. చెలికత్తెలు పరుగెత్తుకుంటూ వచ్చారు.. ఆమె ముఖంలో ఆందోళన చూసి ఏమయింది దేవీ అని ప్రశ్నించారు.

"మాలికా! ఈ గదిలో మీరు తప్ప ఎవరైనా ఉన్నారా? లేక భయంకరమైన కలగన్నానా. ఎవరొచ్చారు?" ఆమె లేచి కూర్చుంది.

మాలిక నందుడివైపు చూసింది. అతడు చెప్పొద్దని సైగ చేసాడు.

"మీరనుకున్నట్లు పరాయి వాళ్ళయితే ఈ గదిలోకి రాగలరా! అంత సాహసం ఎవరికుంది?" అన్నది మాలిక భయం భయంగా.

"మరెవరొచ్చారు? ఎవరిదో చెయ్యి నా నుదుటి మీద కొచ్చింది. ఆ రూపం ఎంత వికారంగా ఉందనుకున్నావు. తలబోడిగా ముఖమంతా గాయాలతో రక్తం కారుతూ - అబ్బ. నేను పుట్టాక చూడలేదు అటువంటి స్వరూపాన్ని" సుందరి ముఖం వికారంగా పెట్టింది.

"నిన్నటి నుండీ మీ మనస్సు బాగాలేదు కదా. బహుశా నిద్రపోయే ముందున్న వ్యాకులతే ఆ భ్రమకు కారణం కావచ్చు" అంది మాలిక.

"అదీ నిజమే. నా మనస్సులాగే ఆ రూపం కూడా అసందిగ్ధంగా ఉంది. భిక్షుకి తల యోధుడి వస్త్రాలంకరణ - ఇప్పుడు తల్చుకుంటే నవ్వొస్తుంది. ఎంత అసహజమైన రూపం. చూడు మాలికా! మాటిమాటికి 'నిన్న'ను గురించి గుర్తుచెయ్యొద్దు. గడిచిపోయిన రోజును నా మనస్సునుండి పూర్తిగా తుడిచేసాను మళ్ళీ ఆ నీడలోకి వెళ్ళేందుకు నేనిష్టపడను. మరోసారి మాట్లాడకు"

"దేవీ! మీరర్థం చేసుకోవాల్సింది వేరే ఉంది. బహుశా యువరాజుగారు బలవంతం చెయ్యబడి ఉంటారు" ఆమె చూపులు మాటిమాటికీ నందుడు నిల్చున్న వైపే చూస్తున్నాయి.

"బలవంతమా! నన్ను బలవంతం చేస్తే నేను వారిని విడిచివెళ్తానా? మనలో బలహీనత ఉంటేనే ఇతరులు మనల్ని శాసించగలరు. అయినా పదే పదే అటు చూస్తున్నావు" మాటల్లో తడబాటు.

"అక్కడేముంది. ఏదో దాస్తున్నట్టుంది నీ వ్యవహారం" ఆమె లేచి రెండడుగులు ముందుకొచ్చింది. ఇక దాపరికం అనవసరమని నందుడు వెలుపలికొచ్చాడు. ఇదరి చూపులు కణకాలం కలుసుకున్నాయి. సుందరి కళ్ళలో నమ్మలేని ఆశ్చర్యం. ఆ వెన ఒక నిస్సహాయిత.

ఎన్నో సంవత్సరాలుగా నిర్మించుకుంటూ వచ్చిన విశ్వాసపు భవనం పునాదుల్తో కూలిపోతున్న భావన. నమ్మలేని నిజం ఆకారాన్ని ధరించినట్లున్న నందుడ్ని కళ్ళు విప్పార్చుకుని చూస్తుండిపోయింది. కలలాంటి మెలుకువతో తాను చూస్తున్న నిజాన్ని జీర్ణించుకోలేక ఆసనం మీద వాలిపోయింది.

**'కళ్ళముందే కలల పుష్పాలు విచ్చుకుంటూ**

**సౌరభాన్ని కోల్పోతుంటే**

**ఆపలేని నిస్సహాయపు బ్రతుకునాది.**

నా వ్యక్తిత్వం ఇంతహీనంగా నిర్లజ్జగా సవాలు చేస్తుందని ఊహించలేకపోయాను. ఎవరికో మరెవరి దగ్గరో అర్థాలు తెలుసుకోమని చెప్పాను. ఇప్పుడు నేనే అర్థం వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. సాటి స్త్రీలందరినుద్ధరిద్దామని కంకణం కట్టుకున్నాను. ఇప్పుడు నన్నుద్ధరించేదెవరు? నా ప్రేమ నన్నపహాస్యం చేస్తోంది. నా లక్ష్యం నా వెనకే గోతులు తవ్వుతున్నది. ఇన్నాళ్ళ ఇన్నేళ్ళ సాహచర్యం మరచిన హంసల్లా అతడు ప్రవర్తించాడు. శూన్యమైన పద్మసరోవరం బ్రతుకు నాదయింది. రేపటినుండి అందరి కళ్ళల్లో కనిపించే పరిహాసాన్నెలా ఎదుర్కోగలను? త్రామవర్ణుడి ముఖంలో సమాధానం లభించిన తృప్తి. ఆర్యమైత్రేయుడి అవమానానికి తగిన ప్రతీకారం. ఇవన్నీ నన్ను అడుగడుగునా కాల్చేస్తుంటే ఎలా తలెత్తుకుని నిలబడాలి. ఇన్నాళ్ళూ నీ ప్రశ్నలక్కూడా నేనే సమాధానం చెబుతూ వచ్చాను. ఇప్పుడు నాకు నేను చెప్పుకోవాల్సిన పరిస్థితి. అది కూడా సమాధానం లేని ప్రశ్నకు.'

ఆమె మూగగా లోలోన కుమిలిపోతోంది. గుండెల్లో సముద్రాలు పొంగుతున్నాయి ఏది ఆపాలని ఇంత ప్రయత్నం చేసిందో అదే కళ్ళ ఎదుట కట్టెలా నిలబడింది.

నందుడికీ అర్థం కావటంలేదు - ఏం మాట్లాడితే ఏమర్థం తీసుకుంటుందో, దానివల్ల మరింత దూరం పెరుగుతుంది - మూగగా రగిలిపోతున్న ఆ గుండె ఘోష తనకర్థమవుతూనే ఉంది.

**'ఎదకాగులో వేదనగా రగులుతున్న**

**వేదనామయ స్వరాన్ని**

**వివశనై వింటున్నా,**

**నిస్సహాయంగా నిదుర పోతున్నా**

**అంతరంగాన్ని ఆదరంగా తట్టిలేపకున్నా**

నన్నెంతో ప్రేమిచిన వ్యక్తివి నువ్వు. కానీ నిన్నుకూడా పోగొట్టుకుంటున్న దురదృష్టవంతుడ్ని. '

ఎవరికి వారే వాళ్ళ ఆలోచనల్లో ఉండిపోయారు, మాటల్లేని మౌనం మరింత భయంకరం. పరిస్థితి చూసి మాలిక ధైర్యం చేసి -

"దేవీ! ఇప్పుడు బాగానే ఉంది కదా! శిరోవేదన పోయిందా?" అని పలకరించింది.

"మాలికా! మీరందరు ఇక్కడనుండి వెళ్ళిపోండి"

"అలాగే వెళ్ళేముందు మీరు నా మాటలు వినక తప్పదు. ఆయన తనంతట తనే తిరిగివచ్చారు. కేవలం మిమ్మల్ని విడిచివుండలేక వచ్చేసారు. దయచేసి ఆ నిన్నను మీరు మర్చిపోవాలి. రేపటినుండి కొత్త జీవితం ఆరంభం కావాలి. "

"ఏం మాట్లాడకుండా వెళ్ళలేవా మాలికా! నన్ను అర్థం చేసుకున్నది ఇదేనా? ఆయన తిరిగొచ్చారా? లేదు.. తిరిగి రాలేదు ఆ వచ్చింది వేరే వ్యక్తి." ఆమె మాటల్లో నిర్లిప్తత.

"నేను వేరే వ్యక్తినా? నువ్వు కూడా అలాగే అంటున్నావు. కేవలం నా జుట్టు కత్తిరించినంత మాత్రాన మనస్సేమయినా మారిందా. ఇపటికీ నీ వాకినే" నందుడావేదనగా అనాడు.

"ఏం మాలికా ఒక్కసారి చెబితే అర్థం కాలేదా? ఇక్కడనుండి వెళ్ళవేమిటి?"

"పగిలిపోయిన అద్దం ముక్కలు కొన్ని మిగిలిపోయాయి. వాటినేరుతున్నాను దేవీ."

"అవసరంలేదు. వాటినక్కడే ఉండనీ నువ్వెళ్ళు"

ఆమె గొంతులో ఆజ్ఞకు మాలిక వెళ్ళిపోయింది.

నందుడు నిస్సహాయంగా చూసాడు. తనకు తనే కూడగట్టుకుంటున్నట్టు

"చూడు సుందరీ! నేనెప్పుడూ నీకు ద్రోహం చెయ్యాలనుకోలేదు - అటువంటి భావనే ఉంటే మళ్ళీ ఎందుకు తిరిగొస్తాను. నామాటవిను" రెండడుగులు ముందుకేసాడు.

"ఆగండి. ఏదయినా మిమ్మల్నడిగానా? ఈ గదిలో నాకు ఒంటరిగా ఉండాలనిపించి మాలికను వెళ్ళిపొమ్మన్నాను"

"అంటే నన్ను కూడా వెళ్ళిపొమ్మంటావా?"

"మీరిక్కడున్నా నేనొంటరిగా లేనా?"

"అంటే నీ మనస్సునుండి నన్ను తొలగించేసావా సుందరీ? ఇక నా సాన్నిధ్యం నీకేవిధమైన సంతోషం కలగదన్నమాట"

"అది నేనేం చెప్పగలను. సమాధానం మీరే చెప్పాలి. ఏ మనస్సుతో మీరు వచ్చారో నాకేం తెలుసు. నేను మాత్రం నా భర్తకోసం ఆయన మాట మీద నమ్మకంతో చాలాసేపు ఎదురుచూసాను. ఆయనైతే ఇంతవరకు రాలేదు. అందుకే ఎదురు చూట్టం మానేసాను."

"నువ్వు నన్నెంత బాధపెడుతున్నావో తెలుసా? ఈరోజు - నేను పడ్డ వ్యధనంతా నీతో చెప్పుకోవాలని ఆవేదనతో వచ్చాను. కానీ నువ్వు.. ఇలా ప్రవర్తిస్తున్నావు. నేనిక ఊరట పొందేదెట్లా? కేవలం బాహ్యరూపాన్ని చూసి నిర్ణయం చేయకు" నందుడి ముఖంలో బాధాచాయలు కనిపిస్తున్నాయి.

"అవును, మీ బాహ్యానికి అంతరానికీ మధ్య ఉన్న తేడా చూస్తున్నాను. అవి రెండూ రెండు మార్గాల్లో నడుస్తున్నాయి"

"అంతేనా, నువ్వు చూడలేంది, అర్థం చేసుకోవాల్సింది చాలా ఉంది. ఈ గాయాలు చూసయినా తెలుసుకోలేకపొయ్యావు. బలవంతపు దీక్షతో మనసు చెదిరి తిన్నగా నీ దగ్గరకు రాలేక, చనిపోయిన ఆ మృగాన్ని చూడాలనిపించి ఒంటరిగా నిరాయుధంగా అడవికెళ్ళాను. అక్కడ ఎండిపోయిన దాని కళేబరాన్ని చూస్తుండగా పులి నా మీద దూకింది. నిజానికి అడవికెళ్ళినప్పుడు ప్రాణాలమీద ఆశలేదు. కానీ పులితో పోరాడేటప్పుడు ప్రాణ రక్షణ కావాలనిపించింది. ఎందుకు విరక్తి కలిగిందో మళ్ళీ బ్రతుకు మీద అనురక్తి ఎందుకో నాకు తెలియదు. ఇవన్నీ నేను ఒక ఉన్మాద స్థితిలోనే చేసాను. ఆ మార్గమే నాకిష్టమైతే నేనెందుకింత బాధపడాలి"

"ఇద్దరం హోరాహోరీగా పోరాడాం. చివరికిద్దరం పారిపొయ్యాం. అంటే ప్రాణాలు మీద తీపితోనే కదా! ఆ తీపి సన్యాసి కావటానికా? కాదు - నీపై ప్రేమతో. ఏ పన్లో కూడా నీ ఛాయ నుండి తప్పించుకోలేను - అన్న నెదిరించాను. ఆనందుడ్ని వెనక్కు పంపించాను. తండ్రిగారి బోధ పెడచెవిన పెట్టాను. ఎన్నో నీడలు నా వెనక ఉన్నా వాటన్నిటిని తప్పించుకోగలిగాను. కానీ ఒక్క నీడనుండి నేను తొలగాలని అనుకోవటంలేదు - ఎందుకంటే ఆ నీడవు నువ్వేకనుక - ఇదంతా చెప్పుకోవాలని వస్తే నువ్వేమో ఒంటరిగా ఉండాలంటావు"

"ఇదంతా చెప్పాలనే వచ్చారు, లేకపోతే రారనేగా. ఏ విషయంలో నేను పూర్తి వ్యతిరేకంగా ఉన్నానో అదే విషయం మీరు మాటిమాటికీ దగ్గర చేసుకుంటున్నారు. అనేకసార్లు బాధపడే విధంగా ప్రవర్తించే మనస్తత్వాల్ని నేను గౌరవించలేను" సుందరి కళ్ళల్లో కోపం.

"లేదు సుందరీ! నువ్వు చాలా అమాయకురాలివి. కేవలం నీకంతా తెల్సనే నమ్మకం తప్ప మరోటి తెలీదు. అందువల్లనే ఎక్కువ బాదలు కొనితెచుకుంటునావు. ఆలోచించి చూడు. నేనే ఎంతో సరుకుపోతుంటే నువు ఎంతసేపు నిషూరమెన మాటలతో

గాయపర్చావే కానీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు. నీ కోసమేగా కుటుంబమంతా దీక్ష తీసుకున్నా నేను వెళ్ళలేదు. లోక నిందను భరించాను. కనీసం పూజనీయురాలైన ఒదినగారి ఆహ్వానాన్ని కూడా గౌరవాన్నుంచలేదు ఎక్కడ నువ్వు బాధపడతావో అని"

మధ్యలోనే అడ్డొచ్చింది సుందరి.

"అంటే నేను బాధపడతాను, నొచ్చుకుంటాను అనే తప్పు మనఃస్పూర్తిగా నన్నర్థంచేసుకుని మీరు వ్యవహరించలేదు అవునా?"

"అవును. అదేరోజు వినకుండా నువ్వు నిర్వహించిన వసంతోత్సవం. ఎంత అవమానాన్ని మిగిల్చింది. మిత్రులంతా దూరమయ్యారు - బంధువుల్లో తలెత్తుకునే పరిస్థితి పోయింది. ఇవన్నీ ఎవరికోసం భరించాను!?" అతని గుండెల్లో బాధపైకి తన్నుకొస్తోంది. దాన్నాపాలని అతడు ప్రయత్నించటంలేదు. ఆ మాటల్తో సుందరి కోపం మరింత తీవ్రమయింది.

"నాకు తెల్సు. ఏదో రోజు మీరీ బాధంతా బయట పెడతారని. పైకి నా మాటను గౌరవిస్తున్నట్లు నటిస్తున్నా లోపల పూర్తిగా వ్యతిరేకిస్తున్నారనీ తెలుసు. నిర్మొహమాటంగా ముఖాన అవమానించిన వారికంటే నువ్వు చేసిన అవమానమే ఎక్కువ. నీ మాటలకు చేతలకు పొంతన లేదని మొదట్నుంచీ తెలుసు"

"ఇదే. ఇదే మనిద్దరి మధ్య మరింత దూరాన్ని పెంచుతోంది. నీ అభిప్రాయాలు బలవంతంగా రుద్దాలని నువ్వనుకుంటావు. గౌతములు కూడా అదే అనుకున్నారు. మీ ఇద్దరి సిద్ధాంతాలకు నేను కేంద్రబిందువయ్యాను - నేనూ మనిషిని నాకూ మనసుందనే విషయం ఇద్దరూ మర్చిపోయారు -" అలసటతో అతను నీరసిస్తున్నాడు.

"అయితే మీ అభిప్రాయాలపై మీ స్పష్టతేమిటో చెప్పండి. అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను" అంది సుందరి.

"అలా చెప్పటం బహుశా ఎవరికీ సాధ్యంకాదు. పరిస్థితుల్ని బట్టి మనిషి సమాజానికి కొన్ని ధర్మాలకు కట్టుబడి నడుచుకోవాల్సి ఉంటుంది. సమయానుకూలంగా ప్రవర్తించటం నా మనిషి ధర్మం. దాన్ని శాసించాలనుకున్న మీ ఇద్దరు నిరంకుశులే నా దృష్టిలో" అలసటతో ఆసనం మీద కూర్చున్నాడు.

************

(15)

**సుందరి నందుడి దగ్గరగా వెళ్ళి.**

"నేనేం శాసించానో ఒక్కటి శలవిస్తారా? అనవసరపు వాగ్దానాలు చేసేది మీరు. మాట తప్పుతుంది మీరు - మీ అన్నగారి కోసం వెళ్తానంటే నేనాపానా? మీరే గొప్పలకు పోయి బొట్టు ఆరకముందే వస్తానని చెప్పారు. మీరు వస్తారని దినమంతా నిరాహారంగా బొట్టు ఎక్కడారిపోతుందోనని తడుపుతూనే కూర్చున్నాను. అది శాసనమా? మీమీద ప్రేమా? చెప్పండి. నాకు రెండు రకాలుగా వ్యవహరించటం తెలియదు. ఉన్నదంతా మీరే. నా మనస్సును మోసగించుకునే పరిస్థితి ఎప్పుడూ కలిగించుకోలేదు. నా ప్రణయం, ప్రణవం మీరు అని నమ్మాను. నన్ను విడిచి వెళతారనే భయంతోనే కదా. దీక్షవేళ ఒద్దన్నది. ఆ ప్రభావం మీమీద పడకూడదని, యశోధరలా నేను కూడా భర్తృవియోగంతో జీవితమంతా నలిగిపోకూడదనే తపనపడ్డాను.

"మీరు మాత్రం నన్నేమర్థం చేసుకున్నారు? లోకుల్లాగానే ఆలోచిస్తున్నారు. గౌతముల నగర ప్రవేశం నుండి మీలో నిజమైన నందుడ్ని చూడలేకపోయాను. నా సంతోషమే మీ సంతోషమన్నారు. అందులో నటనే తప్ప వాస్తవం లేదు. అది ఇప్పుడు మీ మాటల్లో పూర్తిగా అర్థమయింది. అందుకే ఇప్పుడు మీరు తిరిగొచ్చినా నమ్మలేకపోతున్నాను. మిమ్మల్నర్థం చేసుకోవాల్సింది నేనుకాదు."

"మరెవరు?" పాత్రలో మధిర గిన్నెలో ఒంపుకున్నాడు. ఆమెను నమ్మించాలన్నట్లు నోటిదగ్గర పెట్టుకున్నాడు. కానీ తాగలేకపోయాడు.

"ఇంకెవరు మీరే. మీ మార్గాన్ని నిర్ణయించుకోవటంలో ఇప్పటికయినా తెలుసుకోగలిగితే దాని ప్రకారం నా భవిష్యత్తు నిర్ణయించుకుంటాను" కూర్చున్న సుందరి ఆసనం నుండి లేచి గవాక్షం గుండా శూన్యమైన సరోవరం వైపు చూస్తూ నిలబడింది.

"నీ భావాలస్సలు నాకు నచ్చడంలేదు. సుందరీ! నీ నుండి నన్ను దూరం చెయ్యటానికి నీ ప్రవర్తన కారణమన్న విషయాన్ని ముందు తెల్సుకో, చూడటానికింత అందముంది. కానీ మనసే కఠినాతి కఠినం. ఇంతగా రక్తం కారిపోతున్నా కనీసం సానుభూతి చూపించలేకపోయావు. అసలు నన్నర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం లేదు"

కారిపోతున్న రక్తాన్ని తుడుచుకుంటూ అన్నాడు.

సుందరి హృదయం బాధతో మూలిగింది. దగ్గరకెళ్ళి ఓదర్చాలనే కోరికను బలవంతంగా ఆపుకుంది.

"మీరేమంత లోతైన మనిషని మిమ్మల్నర్థం చేసుకోవడానికి కష్టపడాలో చెప్పండి. మీ మనసు, చేతులు ఒకదానికొకటి పొందిక వుంటేగా"

నందుడి క్రాగ్రహం అవధులు దాటింది.

"అంటే నువ్వు దేన్ని గురించి మాట్లాడుతున్నావో స్పష్టంగా చెప్పు. ఆ స్పష్టమైన అర్థాన్ని నేను తెల్సుకోవాలనుకుంటున్నాను చెప్పు" కోపంగా అన్నాడు.

సుందరి ఏ మాత్రం తీసిపోకుండా "ఎన్నో సంఘటనలున్నాయి. అవన్నీ ఇప్పుడెందుకు. మీరు దేన్నయితే నానుండి దాచాలని నన్ను నమ్మించాలని ఆ పాత్రలో మదిరపోసుకున్నారో దాన్నయితే ఒక్క చుక్కయినా తాగలేకపోయారు.

"అంటే మీ మనస్సు పూర్తిగా పూర్వంలాగ మదిరనంగీకరించలేకపోతోంది. ఇంతకంటే స్పష్టత ఏం కావాలి. మీరిక్కడున్నారు మీ మనసు సన్యాసం మీదుంది. ఇది నిజమా? కాదా చెప్పండి" కిటికీ దగ్గరనుండి వాకిలి దగ్గరకు నడుస్తుంటే సుందరికాల్లో గాజుపెంకు గుచ్చుకుని నెత్తురు చిమ్మింది.

నందుడు దగ్గరకు రాబోయాడు. ఆమె వారించి తనే గాజుపెంకును లాగేసింది. ఆ పని చాలా సహజంగా ఏ మాత్రం బాధ వ్యక్తం కాకుండా చేసింది.

"సుందరి! నీ మాటల్లోని నిజాన్నంగీకరిస్తున్నాను. మదిర నేను తాగలేక పోయాను. ఏది దాచాలని ప్రయత్నిస్తున్నానో అంతగా ఓడిపోతున్నాను. దాచలేని నిజాన్ని తెలుసుకోగలిగావు" మదిర పాత్ర పక్కన పెట్టేసాడు.

"ఇప్పుడు తెలియటమేమిటి! ఎప్పుడో తెలుసు మీరేమిటో"

మాలిక మళ్ళీ లోపలికొచ్చింది నందుడి గాయాలకు కట్టుకట్టడానికి వైద్యుడ్ని పిలిపించానని చెప్పింది.

నందుడు బాధపడుతూ - "నీకెందుకు మాలికా తాపత్రయం!? - కావల్సిన వాళ్ళకే పట్టనప్పుడు నేనెలా ఉంటే ఏమిటి?" అన్నాడు నిర్లిప్తంగా.

"ఈ మాటలుకూడా మీ అపరిపక్వ మనస్సుకు నిదర్శనం. ఇదంతా చూసి సానుభూతి ప్రదర్శించాలని కోరుకుంటున్నారు. మీరు చాలా సాధారణ వ్యక్తులు. ఎంత తేలిగ్గా సామాన్యులు ప్రభావితమౌతారో మీరు కూడా అంత తేలిగ్గా లోనవుతారు. ఇతరులు ఎప్పుడన్నా అవుతారేమో గానీ మీరు మాత్రం మాటిమాటికీ చలిస్తుంటారు. ఇటువంటి వ్యక్తి సాహచర్యం ఎంత దుస్సాహమో ఆలోచించండి" అంది సుందరి.

"ఇంతేనా. సుందరీ నువ్వు తెలుసుకుంది. ఆ బలహీనత వెనక ఉంది నీ పైన ప్రేమేగా. గాయాల్తో వచ్చిన నన్ను మరింత గాయపరుస్తున్నావు. ఎంతో లోతుగా నా గురించి ఆలోచిస్తావనుకున్నాను. కానీ అర్థం చేసుకుంది చాలా తక్కువ."

"నేను తెల్సుకున్నదానికంటే లోతైన అర్థమేమీ మీ దగ్గర లేదు. ఇక తెల్సుకోవాలనే కోర్కెకూడా లేదు. నా మనసెందుకో బాగా దెబ్బతింది. ఇక ఎక్కువ మాట్లాడాలనిపించటం లేదు" వెళ్ళి ఉయ్యాల బల్లమీద కూర్చుంది. సున్నితమైన పాదం నుండి రక్తం స్రవిస్తూనే ఉంది. నందుడి గాయాలనుండీ కూడా!

వీరిద్దరి పరిస్థితి మాలికకు ఆందోళనగా ఉంది. ఎవరికెవరు తగ్గడంలేదు. మాటలతో, మనసుల దూరాన్ని పెంచుకుంటున్నారు. కొంచెం సేపటికి నందుడు నిభాయించుకుని -

"సుందరీ! మన కాపురం ఏం కావాలని కోరుకుంటున్నావో నాకు తెలియదు. నేనైతే జరిగిన దాన్ని సరిచేసుకోవాలనే ఆవేదనతో తిరిగొచ్చాను. ఇక నీ చేతుల్లో ఉంది. నిన్న ఎందుకులేను? ఇప్పుడిక్కడెందుకున్నాను? ఈరోజేకాదు కొన్ని సంవత్సరాలనుండీ నీతో ఎందుకుంటున్నాను అని ఆలోచిస్తే అదేదో ఆకర్షణమూలంగా అని మన బంధాన్ని తక్కువ చెయ్యొద్దు. అది కేవలం హృదయానికి సంబంధించింది. దాని అవసరం కోసమే నేనున్నాను. అలాగే నిన్నకు ఈ రోజుకు మధ్య కాలం ఈ బోడితనంతో ఉన్నానంటే అదికొన్ని

పరిస్థితుల వల్లనే తప్ప నేను పూర్తిగా ఇష్టపడికాదు. అలా అని నచ్చలేదని చెప్పలేకపోతున్నాను. అప్పుడప్పుడు దాన్నిగురించి ఆలోచించిన మాట వాస్తవం. అందుకే మదిర తాగలేకపోయాను. అలా అని అక్కడా ఉండలేకపోయాను" అతని కళ్ళల్లో అంతులేని నిస్పృహాయత.

"అంటే మీరు ఎక్కడ జీవించాలనుకుంటున్నారు?"

సుందరి ముఖంలో ఓడిపోతున్న భావన కనిపిస్తోంది.

"ఇంతకు పూర్వం అయితే సరిగ్గా చెప్పేవాడినేమో? ఇప్పుడు మాత్రం చెప్పలేను. నా మనస్సంతా అసందిగ్ధంగా ఉంది. పూర్తిగా ఇక్కడా జీవించలేకపోవచ్చు. ఇక్కడ నుండి తొలిగి వేరే జీవించటానికి మనస్సు రావటం లేదు"

"నిజంగా నేనెంత నిస్పృహాయుడ్ని. ఎక్కడా? ఎలా? ఏ బిందువును కేంద్రంగా చేసుకుని జీవించాలో ఈరోజు సమాధానం దొరకని పరిస్థితిలో ఉన్నాను. నా మిత్రులంతా ఆర్యమైత్రేయుడితో సహా దీక్ష తీసుకుని సంతోషంగా ఉన్నారు. నేనే ఎటూకాని స్థితిలో..!" రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు.

"మీరు అలాగే ఉండండి. కనీసం మీ సంతోషం చూసయినా తృప్తిపడటానికి ప్రయత్నిస్తాను."

ఆపుకుందామన్నా దుఃఖం ఆగటంలేదు సుందరి కంఠంలో.

"అయిపోయింది. నా చివరి ప్రయత్నం కూడా విఫలమయింది. అక్కున చేర్చుకుని మళ్ళీ నందుడిలా మారుస్తావని ఆశతో వచ్చాను. నా మాటలేవీ వినదల్చుకోలేదని అర్ధమయింది. అసలు వింటానిక్కూడా ఇష్టపడటంలేదు. ఎందుకంటే నువ్వనే కేంద్రం చుట్టూ ఎప్పుడూ తిరిగే నక్షత్రంలా ఉండాలని కోరుకుంటున్నావు. నా స్వంత ఆలోచనల్ని నియంత్రించటం నీకిష్టం. అందుకే ఈ తిరుగుబాటు సహింపలేకున్నావు.. చూడు సుందరీ.. నేనిప్పుడు కేంద్రంలేని నక్షత్రాన్ని, నా మనసులో మీరిద్దరూ లేరు"

నాలుగు వీధులు మధ్య నిలబడ్డ వ్యక్తిని. అన్ని దిశలు నన్ను తనలో ఆలింగనం చేసుకోవాలనుకుంటాయి. ఏ దిక్కువైపు వెడదామని అనుకుంటానో అది నాకందనంత దూరం కదిలిపోతూ ఉంటుంది. అందుకే మళ్ళీ వెనక్కు వచ్చేస్తున్నాను.

అతని కళ్ళల్లో అశ్రువులు ధారకారుతూ అవి రక్తంతో కలిసి ఎర్రగా అతని బట్టలమీద పడుతున్నాయి. ఆ దృశ్యం సుందరిని కలవరపెడుతుంది కానీ దగ్గరకెళ్ళలేకపోతోంది. స్వభావాలు ఇద్దరిమధ్యా అగాధాన్ని సృష్టిస్తున్నాయి. తెలియకుండా అందులోకి జారిపోతున్నారు. అనేక భ్రమలను తొలిగించుకుని వాస్తవాలు మనసు పొరల్ని ఛేదిస్తూ బయటికొస్తున్నాయి.

ఇన్నాళ్ళు పెంచుకున్న ప్రేమలతలు మొదలంట త్రుంచబడుతున్నాయి. బహుశా ఇదికూడా తాత్కాలికం కావచ్చు. నిలకడలేని మానసిక విన్యాసాలు - నిరంతర చంచలిత నీటి ప్రవాహాలు. ఏ ఆవేశాలు స్థిరం కాదు.

నందుడింకా కొనసాగిస్తూనే ఉన్నాడు.

"అక్కడవున్నప్పుడూ ఇక్కడికెందుకు రావాలనిపించింది. నీ దగ్గరుంటే మరెక్కడికో వెళ్ళాలనుకుంటోంది. ఇక్కడున్నా అక్కడున్నా సంపూర్ణమైన తృప్తిలేదు - నువ్వయినా తధాగతులయినా ఈ నిజాన్ని జీర్ణింపచేసుకోలేకపోవచ్చు.

ఇక ఈ జీవితాన్ని అబద్దాల ముసుగులో గడపలేను. బాగా విను. నేను నీకు బద్ధమై లేను. వారిక్కూడా.. ఈ రెండు మార్గాలూ నా మనస్సుకోరుకుంటున్నవే"

నందుడి మాటలకు సుందరి కుప్పకూలిపోయింది. ఎగసివస్తున్న దుఃఖం చెలియలి కట్టదాటిన సముద్రం అయ్యింది.

ఏ ప్రేమ గర్వాన్ని స్వాభిమానాన్ని ఆమెలో ఎక్కువగా పెంచిందో ఆ ప్రేమ ఎదురుగా నిలబడి పరిహసిస్తోంది. ఇన్నాళ్ళూ పెంచి పోషించిన మహావృక్షం సమూలంగా కూలిపోతున్న భావన. ఆకాశానికెగిరిన రంగుల పతంగం నేలకు జారుతున్న ఆవేదన. అంతా అయోమయం. నాలుగు దిక్కులూ తనను మధ్యలో ఉంచి కలసిపోతున్నట్టుగా ఊపిరందటంలేదు. తాను వెలిగించుకున్న ఆశల దీపం

తనకే వెలుగునివ్వనంటోంది. సంసారబంధాలు నిజం కావంటున్న గౌతముని వాక్యాలే సత్యాలా? ఇప్పుడు తన కర్తవ్యం? తన ఆకర్షణ నుండి నందుడు జారిపోయాడు. ఒక్కసారిగా ఆమె మనస్సు కోపంతో రగిలిపోయింది. ఒక్క ఉదుటున పైకిలేచి -

"ధూర్తుడా - ఇంతనాటకం ఆడాల్సిన అవసరం ఏమొచ్చింది? నువ్వు చెయ్యాలనుకున్నది ధైర్యంగా చెబితే నేను కాదన్నానా? బ్రతుకు కడదాకా మీతో పంచుకోవాలనుకోవటం నేను చేసిన తప్పా ఏనాడూ నీ మనస్సును బయట పెట్టలేదు. ఇప్పుడు కూడా అదే చపలచిత్తంతో బాధపెడుతున్నావు. ఏ ఆశయం లేని జీవితం నీది. నీవలన ఎవరికి ప్రయోజనం? నాకా? సంఘానికా? నీ రూపంలాగనే నీ మనస్సు కూడా మరింత వికారంగా కనిపిస్తోంది. నా ముందునుండి నువ్వు తొలిగేంతవరకు నాకు శాంతిలేదు. నువ్వు గొప్పగా చెప్పుకునే అర్థాలు అంతకంటే లేవు. చాలా సాధారణమైన మనిషివి. నీకోసం ఎదురుచూసేవాళ్ళంతగా లేరు. ఏ కేంద్రాన్ని వెతుక్కుంటూ వెళ్తావో నీ ఇష్టం" ఆయాసంతో ఆమె గుండెలు ఎగసిపడుతున్నాయి. నిలబడలేక శరీరం తూలిపోతున్నది. నందుడు కూడా కూర్చున్న ఆసనం మీద నుండి లేచాడు.

ఆపుకోలేని అసహ్యతతో ఆమె ముందుకు వచ్చాడు. చేతితో ఆమె గడ్డాన్ని విసురుగా పైకెత్తి.

"చూడూ! నువ్వేదో పెద్ద భ్రమలో ఉన్నావు. చూపవల్సిన సహనాన్ని చూపించాను. ఇక నావల్లకాదు - ఆనాడు మా ఒదినగార్ని నిందించావే. స్త్రీ ఆకర్షణ లేకపోతే సిద్ధార్థుడు బుద్ధుడవుతాడని. ఆ మాట పూర్తిగా అబద్ధం. ఆమె సహనంవల్లనే అన్నగారు లోకపూజ్యులయ్యారు. మరి నీ ఆకర్షణ నన్ను ఎటూ కానివాడిగా మిగిల్చింది. నందుడిగా బ్రతుకుదామని వచ్చిన నన్ను నీ అహంకారంతో భిక్షువుగా బ్రతకమంటున్నావు, మంచిది సుందరీ! నీ రూపాతిశయం, అభిమానం. వాటన్నిటిని పెంచి బాగా పోషించుకో - అయితే వాటిని తీరిగ్గా భరించి నిన్ను సమర్థించే నందుడు మాత్రం లేడని గుర్తుంచుకో"

అతడు విసవిసా నడుస్తూ బయటికెళ్ళిపోయాడు. ఏదో చెప్పబోయిన మాలిక మాట అసలు వినిపించుకోలేదు. సుందరి రెండు చేతుల్లో ముఖం కప్పుకుని చాలాసేపు దుఃఖించింది. ఆమె చేసిన తప్పేమిటో ఆమెకే అర్థం కావటంలేదు. వ్యధార్తమైన హృదయంతో అనుకుంది.

"ఇప్పటికీ నువ్వు పసివాడివే తల్లిదండనలో భార్య కోపంలోనూ వేరే అర్థాలు వెతుక్కుంటూ కానివాళ్ళుగా భావిస్తున్నావు. ఏ బిందువులను వెతుక్కుంటూ ఈ రోజు వెళ్ళావో అవేవీ నీకు సంతృప్తినివ్వలేవు. చివరకు ఏ బిందువు నీకళ్ళు తెరిపిస్తుందో అక్కడే ఆగిపోతావు. బహుశా ఆ బిదువును నేనుగా రూపుదిద్దుకుంటాను. ఈనాటినుండీ నాది అదే ప్రయత్నం. నింగికెగిసినా, నేల అంచులు జారినా నన్ను కలుసుకోక తప్పదు - నా ఒడిలో వాలకా తప్పదు" ఆమె హృదయం నుండి ఒక భారమైన నిట్టూర్పు బయటికొచ్చింది.

బాధ్యత కలిగిన ఉద్యోగిలా కాలం తన పని చేసుకుంటూ పోతోంది. తన వృక్షానికి నిన్నటి ఆకులు రాల్చుకుంటూ రేపనే మారాకును తొడిగిస్తూ ఋతువుల పూలు పూస్తూ వేగంగా వీస్తోంది.

ఇంటినుండి వెళ్ళిపోయిన నందుడు మిత్రుడింట్లో ఉంటున్నాడు. విషయం తెలిసి శుద్ధోధనుడు తన దగ్గరుండమని కబురు చేసాడు. అయినా వినలేదు. ఆర్యమైత్రేయుడు కూడా దీక్ష తీసుకున్నందువల్ల అతని భార్యకూడా దీక్ష తీసుకుని యశోధరతో పాటే భిక్షుకి మండలిలో నివసిస్తోంది.

మైత్రేయుడి భవనమంతా భిక్షువుల సమూహమే! ఏ మూల చూచినా కాషాయరంగు రెపరెపలు. మరోవైపు ఆర్తుల విలవిలలు. రకరకాల జబ్బులతో బాధపడుతున్న రోగులు. దిక్కులేని అనాధలకు అది నివాసమయింది. విశ్వకళ్యాణమందిరంగా మానవత్వం

రూపుదిద్దుకున్నట్టు సర్వమానవ సౌభ్రాతృత్వంతో విలసిల్లుతోందా మందిరం. ఎవరికెవరు తేడాయే లేదు. అందరికందరు కేవలం మనిషి ఇదే న్యాయం అక్కడ.

నందుడు కావాలనే అక్కడుంటున్నాడు. ఇన్నాళ్ళూ తనకనుభవానికి రాని కొత్తప్రపంచాన్ని చూస్తున్నాడు.

క్రమేపీ సుందరిమీద కోపం పోయింది. కానీ ఏదో దిగులు - కొన్ని రోజులు పూర్తిగా దైన్యంలో మునిగిపోయాడు. తప్పొప్పులు పరిశీలించుకోవటంలో మరి కొంత సమయం గడిచిపోయింది.

మైత్రేయుడు నచ్చచెప్పాడు.

ఏదీకాని మార్గంలో ఎంతో కాలం మనశ్శాంతిగా ఉండలేవని, ప్రపంచ మనుగడ పరస్పరాశ్రయం. అందుకే సన్యాసమో, సంసారమో నిర్ణయించుకుని ఆ బాటలో నడవటం ఉత్తమమని చెప్పాడు. ఎటూ కాని వ్యక్తి సంఘానికి కుటుంబానికి చివరకు తనకు తానే భారమవుతాడని చెప్పాడు.

అతడిలో అంతర్మధనం ప్రారంభమయింది. ఇప్పటివరకు కష్టమంటే ఏమిటో తెలియదు. సృష్టిలో ప్రతిజీవి కష్టపడి తనకు కావాల్సింది సాధించుకుంటోంది. స్వల్పమైన చీమ తన జీవిక కోసం శ్రమపడటం, ఏ కదలిక లేని చెట్లు వాటి వ్యాపారాన్ని అవీ సాగిస్తున్నాయి. తాను మాత్రం దిక్కులు చూస్తూ - కేంద్రాలు వెతుకుతూ - అవి దాటిపోతున్నాయనే నిరాశతో కాలాన్ని వ్యర్థం చేస్తున్నాడు.

బహుశా - ఈ సృష్టిలో అన్నిటికంటే అందరికన్నా వ్యర్థజీవితాన్ని నేనే నేమో.

ప్రాణాధికంగా ప్రేమించిన భార్య మనసు చూరగొనలేకపోయాడు. ఉన్నత రాజవంశంలో జన్మించి కనీస రాజధర్మాన్ని పాటించలేదు. ఏనాడయినా ప్రజలకష్టసుఖాలేమిటో తెలుసుకోలేదు. కాలేకడుపు, ఆకలి బాధంటే అర్థం కాదు.

కనీసం వాళ్ళ బాధల్ని, గాధల్ని ఏనాడయినా విన్నాడా? తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరిగి జీవజాలాన్ని పోషిస్తున్న భూమి, ఇతరుల కోసమే వర్షిస్తున్న మేఘాలు, పుష్పిస్తూ ఫలిస్తున్న వృక్షాలు, కొండలు నదులు, పరులకోసమే వాటి వ్యాపారాలు, సాగిస్తుంటే కనీసం శ్రామికుని కష్టం అతని స్వేదఫలం ఎంతవిలువైందో తెలుసుకోగలిగాడా?

తనలాంటి అసమర్థుల వలన ప్రయోజనం ఏమిటి?

చెట్లు కొండలు భూమికి బరువుకాదు. సోమరిపోతు మోయలేని బరువు.

ఆత్మపరిశీలనం ఎన్నో మార్పులకు మూలమయింది. స్వవిమర్శనం ఉన్నత లక్ష్యానికి నాంది. తన తప్పొప్పులు తెలుసుకోవటంలోనే మనసు మంచి బాటకు సమయాత్తమవుతుంది. ఇతరుల్ని విమర్శిస్తూ ఉండటం అదో బలహీనత. తప్పును కప్పిపుచ్చుకునే రోగమే పరనింద.

వారెన్నటికీ అభివృద్ధి సాధించలేకపోగా కార్యసాధకుల కాలిలో ముల్లవుతారు.

ఫలితంగా నందుడి దైనిక చర్యల్లో అనేక మార్పులు. ఒక మూల కూర్చుని ఆలోచించే అతడు మెల్లమెల్లగా బయటికొస్తున్నాడు. భిక్షువుల కార్యక్రమాల్లో చొరవచేసుకుంటూ వారితో కలసి తిరుగుతున్నాడు.

జబ్బుపడ్డ వారి దగ్గర కూర్చుని ఓదార్చుతున్నాడు.

స్వయంగా పాదులు తవ్వి మొక్కల్ని నాటుతూ తోటపని చూస్తున్నాడు. అవి పుష్పించినప్పుడు చిన్నపిల్లవాడిలా ఆనందపడుతున్నాడు.

ఆ కార్యక్రమం భవనానికి పరిమితం కాలేదు. సేవాదళాలతో కలిసి వీధి వీధి తిరిగి ప్రజల్ని పలకరించి వస్తున్నాడు. నగర పరిసరాల్లో ఉండే పల్లెలకు పోవటం అలవాటయింది. అభాగ్యులను చూసి కదిలిపోయాడు. కొన్ని రోజులు భోజనం మానేసి ఆకలిబాధేమిటో అర్థం చేసుకున్నాడు.

నిండు మనస్సుతో వారిస్తున్న ఆశీస్సులు మనస్సుకెంతో తృప్తినిస్తోంది.

గౌతముడి బోధల్లోని యధార్థాన్ని వర్తమానంలోకి మలచుకుంటున్నాడు.

ఇన్నాళ్ళుగా తనకర్థంకాని ప్రపంచం ఇది - దాసదాసీలు అమర్చిన అందలాల్లో రాచరికపు భోగాల్లో పెరిగిన తనకింతవరకు ఇటువంటి ప్రపంచం ఉంటుందని కూడా తెలియదు. గౌతముని త్యాగంలోని గొప్పతనం ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది.

మట్టిలో పొర్లాడుతూ మురికి గుంటల్లో నీళ్ళు త్రాగుతూ ఒంటిమీద సరైన బట్టయినా లేక దొరికిన ఆహారాలే పరమాన్నంగా భుజిస్తూ రేపనే ఆలోచన లేని ఆ జీవితాలు, సమాజం నిర్దాక్షిణ్యంగా తోసేసిన చెత్తకాగితాలు.

అధికార ధనస్వామ్యవ్యవస్థను నిలబెడుతున్న పీఠాలు. వర్గ వైషమ్యాల అణచివేతలో పెత్తందారులు చదవలేని పాఠాలు -

సమాజ భవనాన్ని సమతౌల్యంతో నిలబెడుతున్న మూలస్థంభాలెన్నడూ భూమిలోనే ఉంటాయి. వారి బ్రతుకులెప్పుడూ అట్టడుగునే కదలాడుతాయి. వ్యవస్థకు అన్నంపెట్టే రైతన్న తినేది పట్టెడు పచ్చడి మెతుకులు.

విలువయిన వస్త్రాలు నేసే నేతకార్మికుడి ఒంటిమీద చిరుగు బట్టలు.

ధనిక వర్గాలకు రథాలను తయారుచేసే శ్రామికుడెప్పుడూ కాలినడకతోనే బ్రతుకెళ్ళిపోతూంటుంది.

సంపదంతా ఒక వర్గం చేతిలో. దాన్ని పెంచి పోషిస్తున్న వారు దూరంగా విసిరేయబడ్డ చీకట్లో మూగగా నలిగిపోతుంటారు. తరతరాలుగా సాగుతున్న ఈ అంతరాలు - వైరుధ్యంలో కదలాడుతున్న అసమానతలు, సమానత్వం కావాలనుకున్నప్పుడే ఉద్యమాలు. అణచివేతలు వాళ్ళే అరాచక శక్తుల క్రిందకు వస్తారు.

దోపిడి వర్గానికి రాపిడి వర్గానికి దూరం తగ్గించాలని సాగిస్తున్న ఒక పోరాటానికి బుద్ధుడు నడుం కట్టాడనే విషయం ఇన్నాళ్టికర్థమయింది.

నిజంగా తాడిత పీడిత వర్గం ఎదురు తిరిగితే వ్యవస్థ దాని వ్యాపారాలు స్థంభిస్తాయి. సింహాసనాలు నేలకూలతాయి. పట్టెడన్నం కోసం సంపన్నులంతా వీధుల్లో చేతులు కట్టుకు నిలబడతారు. కిరీటాలను పేదవాళ్ళ కాళ్ళముందు పెట్టి బ్రతికించమని అర్థించరూ.

కానీ పేదవాడు ధనంతోనే కాదు మానసికంగా కూడా బలహీనుడే తనను దోపిడీ చేస్తున్న సమాజానికి దండం పెడతాడే తప్ప దండించలేడు. పేదరికం పాపమో శాపమో అనుకుంటూ తన ఖర్మ అనుకుని కుమిలిపోతాడే తప్ప ఎదురు తిరగడు. తన శక్తిని దోచుకుంటూ తన మీదే పెత్తనం చెలాయిస్తున్న సాటి మనిషిని ఏమనలేని అర్భకుడు. అందుకే యధేచ్ఛగా వారి ఆటలు సాగుతున్నాయి.

బానిస భావ అవ్యవస్థనుండి బైటపడనంతవరకు తిరుగుబాటు చెయ్యనంతవరకూ దొరలూ.. జయహో!

ఇన్నాళ్ళూ చెల్లుబాటవుతున్న ఆధిపత్యానికి సవాలుగా నిలిచాడు గౌతముడు. పుట్టింది రాజవంశం. దాన్ని పక్కకు నెట్టి స్వేచ్ఛాప్రపంచం కవాటాలు తెరిచాడు. అణువణువు నిండిన ఆశయాలతో అడుగడుగున త్యాగస్ఫూర్తితో అతడు సాగిస్తున్న ఉద్యమం సామన్యమైంది కాదు. అందుకే చలిచీమల్ని బలిచీమలుగా మారుస్తున్నాడు. ఒడిదుడుకుల సుడిగుండాలను అవలీలగా దాటి తన సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నాడు. ఎంతోమంది ధనవంతుల్ని తన బోధనలతో మార్చి వారి ధనాన్ని పేదవారికి వినియోగిస్తున్నాడు. కాలం చెల్లిన సిద్ధాంతాలు పక్కనబెట్టి పరిణామక్రమంలో వచ్చే నూతన ప్రపంచానికాహ్వానం పలుకుతున్నాడు. అతడి సాధన శోధన

సామాన్యమైందికాదు. కరుడుగట్టిన కసాయి వ్యవస్థలో అడుగడుగునా కాటు వేయటానికి సిద్ధంగా ఉన్న విషసర్పాలు. అవకాశం దొరికితే అవలీలగా మింగేస్తామంటున్న సనాతనాచారాల సరీసృపాలు.

సంవత్సరాలుగా గుడుకట్టుకున్న జాత్యంధకారాలు.

అందుకే పేదవర్గాల్లో నివిసిస్తూనే జన్మకారణంగా సంక్రమించిన ఆధిపత్యాన్ని సంపన్న వర్గాలను మార్చటం కోసం వినియోగించుకుంటున్నాడు. సమసమానత్వంతో నవ సమాజాన్ని రాబోయే తరాలకు అందించటమే అతని ధ్యేయం.

దానిలో భాగంగానే బింబిసారుడితో ప్రారంభమైన బౌద్ధ సిద్ధాంతం నందుడికి బలవంతంగా దీక్ష ఇప్పించటంలో కృతకృత్యంకాగలిగింది.

నందుడి దీక్షతో ఉన్నత వర్గాల్లో భయాందోళనలు పెరిగాయి. శాసించే రాజులంతా బుద్ధుడి వైపుంటే తాము దూరంగా ఉంటే మంచిదికాదనే అభిప్రాయంతో ఇటువైపు రావటం ప్రారంభించారు. మెల్లమెల్లగా ధనాగారాల్లో మూలుగుతున్న నల్లధనం వీధుల్లోకి రావడం ప్రారంభమైంది. దాంతో మురికివాడలు శుభ్రపడుతున్నాయి. మంచి ఇళ్ళ నిర్మాణం జరుగుతోంది. చింకిపాతల స్థానంలో శుభ్రమైన బట్టలు కనపడుతున్నాయి.

నాగరికంగా ఎలా మసలుకోవాలో శిష్యులు బోధిస్తున్నారు. నిజమైన మానవతా యుగానికి శ్రీకారం చుట్టింది ఈ కాలంలోనే.

అందరి హృదయాల్లో ఆయన కదిలే దేవాలయం. ఓదార్చే దేవుడు.

నందుడు పూర్తిగా ఆ సమాజానికలవాటుపడిపోయాడు. అందులో తరిచే కొద్దీ ఆర్తజీవాలనర్థంచేసుకునే కొద్దీ ఆత్మార్పణ పెరిగిపోతున్నది.

అతనిలోని నూతన మనిషిని నిశ్చలత్వాన్ని పొందుతున్నాడు. ఇప్పుడతడు ఏ కేంద్రాన్ని వెతుక్కోవటంలేదు.

ఆ వెన్నెల రాత్రి పట్టిపోయిన సరోవరం ప్రక్కన శూన్యదృక్కులతో కూర్చుని ఉంది సుందరి. నందుడితో గడిపిన ఆనంద క్షణాలన్నీ దృశ్యాల్లా కదలిపోతున్నాయి. ఇప్పుడామె ఒంటిమీద అసాధారణమైన దుస్తుల్లేవు. చాలా సామాన్య వస్త్రాలే ధరించింది. ముఖం మీద నవగ్రహాలు కాదుకదా ఒక్క గ్రహం కూడాలేదు. ఏ గ్రహం పగబట్టి ఆ పచ్చని జీవితాన్ని కాటేసిందో భర్త తన నుండి దూరం కావటానికి తనమొండి వైఖరి కూడా కారణమనే నిర్ణయానికొచ్చింది.

కాళరాత్రిలాంటి ఆ రాత్రి ఎన్నో సంవత్సరాలుగా పెంచుకున్న తమ దాంపత్యలతల్ని తెంచుకున్నారు. ఒకరికొకరు రెచ్చిపోయి సున్నితమైన మమతాపాశాల్ని విడదీసుకున్నారు - నిజంగానే తాను సహనం చూపించాల్సిందిపోయి మితిమీరిన అహంకారంతో వ్యవహరించటం వల్లనే అటువంటి పరిస్థితొచ్చింది. పోనీ అతడయినా ఓర్చుకున్నాడా - ఇన్నాళ్ళ ప్రేమను కాదని వెళ్ళిపోయాడు.

ఎంతో పండించుకోవాలనుకున్న వయసు బుద్ధుడి కారణంగా ఎండి బీటలు వారుతోంది. చిగుళ్ళు లేతప్రాయంలో వాడిపోతున్నాయి. మొగ్గలు పుష్పించకుండానే రాలిపోవటానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఏమయ్యా! బుద్ధదేవా! అందరికి న్యాయం చెబుతావు. మోసపోయిన ఆడపిల్లలకు ఆశ్రయమిప్పిస్తావు. కానీ నా బ్రతుకును అంధకారం చేసావే - చెల్లెలి వంటిదాన్ని నేను చేసిన ద్రోహమేమిటి? ఇరవైలోనే నా జీవితం అనుభవాల కడలిలో మునిగిపోయిందా. నీ కారణంగా మా దాంపత్యవనం ఎండిపోయింది. ఎన్నో ఆశలతో నిర్మించుకున్న మాప్రేమ సౌధాన్ని పేకమేడలా కూల్చావే - దీనివల్ల నువ్వు పొందిందేమిటి? ఎంతోమంది స్త్రీలను బాధపెట్టటం తప్ప. నీ నూతన ధర్మంలో కూడా పురుషాహంకారమే కనిపిస్తోంది. నీ సిద్ధాంతం విస్తృతం కావాలంటే మార్గం మాత్రం ఇదికాదు. భార్యాభర్తలు కలిసి ధర్మప్రచారానికి ఎప్పుడంగీకరిస్తావో అప్పుడే సాధ్యపడుతుంది.

తప్పకుండా ఇది నేను సాధిస్తాను. నా భర్తను కలుసుకుంటాను. అది మీ ఆశీస్సులతోనే మీకూ నాకూ మధ్య జరిగే ధర్మసమరంలో నేను గెలుస్తాను." చాలా నిశ్చయంగా అనుకుంది - ఆ నిర్ణయానికొచ్చాక తేలికపడ్డ మనస్సుతో ఇంట్లోకి నడిచింది.

ఆ రోజు నుండి ఆమెకూడా అనేక మార్పులు చేసుకుది. దీక్ష తీసుకోని భిక్షుణిలా మారిపోయింది. భర్తలు దూరమై అల్లాడిపోతున్న స్త్రీలను చేరదీసింది. వాళ్ళకు సంఘాలు ఏర్పాటు చేసి చేతివృత్తులు కల్పించింది. అనేకమంది అనాధబాలికలకు వివాహాలు చేయిస్తోంది. తన భవనంలో ప్రత్యేకంగా కళ్యాణ మండపం కట్టించింది. చీర సారెలతో వారు అత్తిళ్ళకు వెళ్తూ ఆమె పాదాలకు దండం పెడుతూ సాక్షాత్తూ పార్వతీదేవి దిగొచ్చిందని పొగుడుతున్నారు.

ఇప్పుడు సుందరిని గురించి పొగడనివాళ్ళు లేరు - ఏదయినా ప్రజాసేవేగా! ఆ తల్లి ఇంట్లో ఉండే ఎంతోమంది మహిళల కన్నీళ్ళు తుడుస్తోందని ఒకటే చెప్పుకుంటున్నారు - పొద్దున్నే ఆమె ముఖం చూస్తే పాపాలు పోతాయంటున్నారు.

నరుడి నాలిక్కి నరంలేదు - విమర్శించిన నోళ్ళే స్తుతిస్తున్నాయి.

ఆమె సుందర భవనం స్త్రీలకు ఆనందనిలయం.

ఈ మధ్యలో మాలిక - తామ్రవర్ణుల వివాహం జరిపించింది. తామ్రవర్ణుడు తన స్వభావం నుండి కొంత తేరుకున్నాడు ఇప్పుడతని బాధ సుందరీనందులు పూర్వంలా కలిసిపోవాలని

ఒకవైపు బౌద్ధధర్మం వేళ్ళూనుకుంటుంటే మరోవైపు మెల్లమెల్లగా కుటుంబ వ్యవస్థలో అసంతృప్తి బయలుదేరుతున్నది. సుందరి చెప్పినట్టు నాలుగురోజులే ఏ కొత్తవిషయమైనా పాతబడటానికి భిక్షువులుగా మారిన వారి భార్యల్లో తీవ్రమైన తిరుగుబాటు ధోరణి వస్తోంది. గౌతముడి మీద గౌరవంతో వాళ్ళు ఆయన్ని నిందించకపోయినా లోపల్లోపల బాధపడుతున్నారు.

వాళ్ళంతా సుందరిని కలిసి తమ సమస్యకు పరిష్కారం చూపించమంటున్నారు. సుందరి వాళ్ళనోదారుస్తోంది. తప్పకుండా పరిష్కారం లభిస్తుందని హామీ ఇస్తోంది.

అప్పుడప్పుడు ఇదే విషయం మీద మామాకోడళ్ళ మధ్య చాలాసేపు చర్చలు జరుగుతుంటాయి. అందరు భవనం విడిచి వెళ్ళటంతో శుద్ధోధనుడి బాధ్యత పూర్తిగా తానే చూసుకుంటోంది.

అనుకోకుండా జరిగిన ఒక సంఘటన సుందరి పోరాటానికి బలం చేకూరింది. అప్పటికే మహిళా సంఘాలు కుటుంబ వ్యవస్థ చేయకూడదని పోరాటాలు సాగిస్తున్నాయి.

వైశ్యకులానికి చెందిన ధనిక శ్రేష్ఠి శాక్యనగరంలోకెల్లా ధనవంతుడు. అతడికి ఒక్కడే కొడుకు రత్నశ్రేష్ఠి. ఆ మధ్యనే వివాహమైంది. సహజంగా అతడు కొంత లోభికూడా. ఒకసారి గౌతముడు భిక్షకెళ్ళినప్పుడు చాలా అవమానంగా మాట్లాడాడు.

"మీరంతా సోమరుల్లా తిరుగుతూ ఇతరుల తిండిమీద బ్రతుకుతున్నారన్నాడు"

వెంటనే గౌతముడు "వీధుల్లో తిరక్కుండా భిక్ష వస్తుందా - ఎండయినా - వానయినా - చలయినా లెక్కచేయకుండా వీధివీధి ఇల్లు ఇల్లు తిరిగి మేమార్జించే కొంచెం భిక్షతో మహత్తరమైన ఆశయం కోసం పోరాడుతున్నాం. సమాజాన్ని ధర్మమార్గంలో నడిపించటానికి మమ్మల్ని మేమే అర్పణ చేసుకుని. నాది అనే స్వార్ధాన్ని విడచి పరులకోసం సాగిస్తున్న ఈ వ్యాపారం మాత్రం శ్రమతో కూడుకుంది కాదా" అన్నాడు శాంతంగా.

అతని ఇల్లాలు మాత్రం బాగా చివాట్లు పెట్టింది. "ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదు. ఆ మహానుభావుడు ఈ రాజ్యానికి రాజు - నీలాంటి వాళ్ళనెంతో మందిని పోషించగలిగిన సంపదలు వదిలిపెట్టి వచ్చిన వాడ్నా సోమరిపోతన్నారు. మహామహా చక్రవర్తులంతా

ఆయన పాదాలకు రాజ్యాల్ని ధారపోస్తున్నారే! సంసారం వదులుకుని పరులకోసం కష్టపడుతున్న ఈ పుణ్యాత్ముడ్ని అంటానికి నోరెట్లా వచ్చింది!?" ఆ మాటలతో ధనిక శ్రేష్ఠి నోరు మూతపడింది.

ఆమె మాత్రం గౌతముడి పాదాలకు నమస్కరించి "స్వామీ! నా భర్త అపరాధాన్ని క్షమించండి. మా ఇంట భిక్ష స్వీకరించి మమ్మల్ని ధన్యుల్ని చేయమ"ని వేడుకుంది.

బుద్ధుడు చిరునవ్వుతో ఆమె నాశీర్వదించి వెళ్ళిపోయాడు.

అనుకోకుండా కొన్నాళ్ళతర్వాత తండ్రీకొడుకుల మధ్య బాగా తగాదా వచ్చింది. చిలికి చిలికి గాలివానయింది. ఆ పై తుఫానుగా మారింది. చివరకు కొంపకూలింది. కొడుకు ఇల్లు విడిచివెళ్ళిపోతూ -

"నీవంటి లోభి కడుపున పుట్టిన పాపానికి నా బ్రతుకుమీదే నా కసహ్యం వేస్తోంది. ఈ ఇంట్లో ఉండేకంటే స్వేచ్ఛగా సన్యాసిగా బతకడం మేలు"

ఆ పోవటం మళ్ళీ ఇంటికి రాలేదు. తల్లి మంచం పట్టింది. తండ్రి పశ్చాత్తాప్పడ్డాడు. కొడుకు కోసం అన్నిచోట్ల వెతికిస్తే తెల్సింది. గౌతముడి ఆశ్రమంలో భిక్షువుగా మారి భిక్షాటన చేస్తున్నాడని.

విషయం తెలిసి ఆశ్రమానికి పంపింది తల్లి. కానీ తండ్రిని కలుసుకోవటానికతడిష్టపడలేదు. నిరాశగా తిరిగొచ్చాడు ధనికశ్రేష్ఠి.

కొన్ని రోజులు గడిచాయి.

ఒకరోజు ఇంటిముందు భిక్షువొకడు నిలబడి

'భిక్షాందేహి' అని అరిచాడు.

ఇంటిదాసీది పాసిపోయిన అన్నం, వాసన వేస్తున్న కూరలు తెచ్చి భిక్షువు గిన్నెలో ఒడ్డించింది. ఆకలితో ఉన్న అతడు అక్కడే గోడప్రక్క కూర్చుని తింటున్నాడు. ఇంతలో అటుగా వచ్చిన స్నేహితుడొకడు గుర్తుపట్టి పెద్దగా అరిచాడు.

రత్న శ్రేష్ఠి వచ్చాడని -

క్షణాల్లో అందరూ పోగయ్యారు.

బోడితల మాసిపోయిన బట్టలతో ఎండకు తిరిగి లోతుకుపోయిన కళ్ళతో, ఆకలితో పాసిపోయిన అన్నాన్ని తింటున్న కొడుకును చూసి తల్లి భోరున ఏడ్చింది. దాసీదయితే కాళ్ళమీద పడింది.

"చెమించండి దొరా! తమరని తెలీక ఈ అన్నం పెట్టాను" అని అంటే

"ఇంకా ఈ ఇంట్లో మార్పు రాలేదన్న మాట - ఉన్న ఒక్క కొడుకు సన్యాసుల్లో కలిసినా, నీ బుద్దిమారలేదు. ధనమంతా తలకెత్తుకుని తీసుకుపోతావా? - భిక్షువుల్ని ఆదరించే తీరు ఇదేనా - పిడికెడు మెతుకులు పెడితే నీ కొంపమునిగిపోతుందా?" తండ్రివైపు చూస్తూ కోపంగా అడిగాడు కొడుకు.

కొడుకు మాటలకు తండ్రికి కోపం ముంచుకొచ్చింది.

*********

(16)

"**కష్టపడే వాళ్ళకు తెలుస్తుంది డబ్బు విలువ.** ఊరికే సోమరిగా తిరుగుతూ అందరి దగ్గర అడుక్కుతినే నీకేం తెలుస్తుంది?" అన్నాడు.

"ఆఁ చాలా కష్టపడి సంపాదించావు. ఎంతమంది నోళ్ళు కొట్టి వాళ్ళ కొంపలార్పి ఇంత ధనవంతుడి వయ్యావు. నిజంగా కష్టపడుతున్నవాళ్ళకు తిండే చాలటంలేదు" అని తీవ్రంగా ఎదుర్కొన్నాడు. తల్లిఅయితే పేగులు తెగిపోతున్నాయి. పట్టెడన్నంకోసం తన బిడ్డ తన ఇంటికొస్తే పాచిపోయిన అన్నం పెట్టింది కాక - ఇంకా విసుక్కుంటున్న భర్తను చూస్తే ఎక్కడలేని చిరాకు ముంచుకొచ్చింది. భర్తవైపు తీవ్రంగా చూసి కొడుకును కౌగిలించుకుని -

"నాయనా! నిన్ను ఈ విధంగా చూట్టానికేనా ఇంకా బ్రతికున్నది. ఒక్కగానొక్క బిడ్డవి. ధనవంతుడివి. ఏమిట్రా ఇది ఎందుకురా మా కడుపులో చిచ్చుపెడుతావు?" అని భోరున ఏడ్చింది. ధనిక శ్రేష్ఠి కూడా ఏడ్చాడు. అది చూసి దాసదాసీలు - బంధువులు ప్రక్కింటివాళ్ళు అందరూ ఏడ్చారు. శోకదేవత పనిబడి ఇల్లుకట్టుకున్నట్టు -

కొడుకు చిరాకుపడ్డాడు.

"ఆపండి ఏడ్పులు - ఎవరో చచ్చినట్టు ఎందుకీ శోకాలు. మంచి మార్గంలో ఉన్నందుకు సంతోషించండి."

"ఏదిరా! మంచి మార్గం. కన్నవాళ్ళను కడుపు కోతకి వదిలిపెట్టి నిన్ను పెళ్ళిచేసుకుని నీతో జీవితం పంచుకోవాలనుకున్న ఇల్లాలిని వదిలిపెట్టి ఎవరినుద్ధరించటానికిరా ఈ సన్యాసం" తండ్రి కోపంగా అరిచాడు తల్లి బ్రతిమలాడింది.

"చుడు నాయనా! ఎన్నో పూజలు వ్రతాలు చేస్తే నువ్వొక్కడివి పుట్టావు. నీద్వారానయినా నలుగురు బిడ్డలు పుడితే వంశవృక్షం పెరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నాము. నీ తర్వాత సంతానం లేకపోతే, ఇక ఇక్కడితో అంతరించిపోతుంది. అటేడు తరాలు ఇటేడుతరాలు నీ మూలంగా సద్గతులు లేకుండా పోతాయి. ముసలితనంలో తల్లిదండ్రులు నాదరించలేని ధర్మం ఎవరు మెచ్చటానికి - ఇంతకంటే పాపం మరోటి లేదు. నీ భార్య లోకం తెలియని చిన్న పిల్ల. మన సంప్రదాయప్రకారం మళ్ళీ పెళ్ళిళ్ళు లేవు. నువ్వు చేసిన పని ఆ పిల్ల జీవితాంతమంతా ఏడవాలా? ఎంత పాపమో ఆలోచించు - అయినా ఆ బుద్ధుడికైనా న్యాయం తెలియదా?" అంది ఆవేదనగా.

"అమ్మా! నన్నంటే అన్నావుకానీ ఆయన్నేం అనొద్దు. లోకాన్నే ఉద్ధరించటానికొచ్చిన అవతారమూర్తి - కరుణాసముద్రుడు"

"అదే బాబూ! ఆ అవతారమూర్తికూడా కొన్నాళ్ళు భార్యతో కాపురం చేసి బిడ్డను కన్నాడురా - వాళ్ళ వంశం పదిలంగానే ఉంది. కానీ మేమేమైపోవాలి. కనీసం మాకో మనవడినిచ్చి ఆ తర్వాత సన్యాసం తీసుకో - రేపో మాపో నీ భార్య వ్యక్తురాలవుతుంది. వాళ్ళు పిల్లని తీసుకుని వస్తారు. వాళ్ళకేం సమాధానం చెప్పాలి"

ఎలాగయినా బిడ్డ మనసు మార్చాలని తల్లిపడే తాపత్రయాన్ని చూసి అందరికళ్ళు చెమర్చాయి. రాయిలాంటి ధనిక శ్రేష్ఠికూడా కొడుకు కాళ్ళు పటుకున్నాడు.

నీ ఇష్టం వచ్చినట్టు దానధర్మాలు చేసుకోమన్నాడు.

గౌతముడి అంగీకారం తీసుకుంటే తప్ప గృహస్థధర్మం నిర్వహించలేనని చెప్పాడు కొడుకు -

అందరూ గంధ కుటీరం దగ్గరకెళ్ళారు -

వాళ్ళ బాధంతా విని గౌతమబుద్ధుడు -

"మీ అబ్బాయి గృహస్తుగా మారతానంటే మాకెలాంటి అభ్యంతరాలు లేవు. ఇక్కడున్న వాళ్ళంతా సమస్తం వదులుకునే వచ్చారు. సమాజమే మా కుటుంబం - అందరూ మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు. మా ఆస్తులు - వంశాలు. ఎవరు బాధల్లో ఉన్నా వారికి సేవచేస్తాం. వ్యక్తిగతమైన స్వార్ధాలకిక్కడ తావులేదు. పరివ్రాజక నియమాన్ననుసరించి నడుచుకుంటేనే ఈ సంఘంలో స్థానం, లేదా బహిష్కరించబడతారు. కొంత సన్యాసం, కొంత సంసారం రెంటికి చెడ్డ రేవడిలా ఉంటుంది. అది అతడి నిర్ణయం మీదే ఉంటుంది" అని చెప్పి లోపలికివెళ్ళిపోయాడు.

ఎంత బ్రతిమాలినా రత్నశ్రేష్ఠి గౌతముడిని విడిచి రాలేనని ఖచ్చితంగా చెప్పాడు. ఎంతోమంది మహామహుల త్యాగం ముందు తానెంత? సంసారం సామాన్యమైంది. మహాత్ముల సాహచర్యం. ఇహమూ పరమూ రెంటినీ కలుసుకోవచ్చు. అటువంటి కీర్తి శరీరానికి తనని దూరం చెయ్యొద్దని వేడుకున్నాడు.

తల్లి అక్కడే స్పృహ తప్పి పడిపోయింది. దాదాపు ఆమెను చేతులమీదే మోసుకొచ్చారు. ఆ దృశ్యం చూసిన వాళ్ళు కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఇంటికి రాగానే ఆమె మంచం మెక్కింది మనోవ్యాధితో -

అనుకున్నట్టుగానే కోడలు వ్యక్తురాలైందని కబురొచ్చింది - ఏదో వంకబెట్టి వెళ్ళకుండా తప్పించుకున్నారు.

చివరకు పిల్లతండ్రి పిల్లను తీసుకొస్తున్నట్టు వార్తందింది. భార్యాభర్తలు చాలాసేపు మధనపడి తీసుకురమ్మని కబురుపంపారు.

అనుకున్నట్టు వియ్యాలవారు అట్టహాసంగా తరలి వచ్చారు సారె చీరెతో సహా. కుందనపు బొమ్మలాంటి కోడల్ని చూసుకుని అత్తకళ్ళనీళ్ళు పెట్టుకుంది.

వయసు తెచ్చిన సోయగంతో కన్నెకలల్ని భర్త కౌగిలితో, పండించుకోవాలనే ఆశతో ఆ ఇంట కుడికాలు పెట్టింది సురమ. పేరుకు తగ్గట్టే పసిడి బొమ్మలా ఉన్న ఆ పిల్ల జీవితం ఏమవుతుందో అని బాధపడ్డారు చూట్టానికి వచ్చిన వాళ్ళు.

దాపరికాలెందుకని ధనిక శ్రేష్ఠి జరిగిందంతా వియ్యాలవారితో చెప్పాడు. కాసేపు ఇల్లు శోకసముద్రమైంది. శోభనానికి ఎదురుచూస్తున్న పెళ్ళికూతురికి భర్త సన్యాసం తీసుకున్నాడంటే - ఆమె మనస్సులో ఎన్ని తుఫాన్లు రేగాయో ఆ భగవంతుడికే తెలుసు - చివరి ప్రయత్నంగా మామగారు కూడా అల్లుడ్ని కలిసి మనసు మార్చటానికి ప్రయత్నం చేసాడు కానీ అతడు ససేమిరా వినలేదు -

సురమ పుట్టి బుద్దెరిగాక అంత ఏడ్పు ఏడ్చి వుండదు. కుమిలి కుమిలి రోదించిది. తన దాంపత్యం ఏ అనుభవం మిగలకుండానే కాలిబూడిదయింది. తన యవ్వనవనానికి వసంతం రాకుండానే ఆకులు రాలిపోయాయి. తన జీవిత మధువులో విషం చిందింది. ఇక ఎప్పటికీ అందుకోలేని దాంపత్య సుఖం ఆకాశపు ఫలంలా మిగిలిపోయింది. ఆశల సౌధం కట్టకుండానే కూలిపోయిన భావన.

ఏ పాపం తాను చేసానని తనకింత శిక్షవిధించాడు తన భర్త. ఆ గౌతముడు మాత్రం ఇంత నిర్దయగా ఎలా వ్యవహరిస్తున్నాడు. అంత శిలా సదృశమా అతని హృదయం. నాకన్నె బతుకులో నిప్పులు పోసి వాళ్ళు సాధించుకునేదేముంది.

జీవితమంతా భర్త ఉండి విధవలా బ్రతకాల్సిందేనా వీల్లేదు - మోడుబోయిన చెట్టులా బీడుపడ్డ భూమిలా ఏ పచ్చదనం లేకుండా తాను బ్రతకలేదు ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చింది.

అత్తమామలనడిగింది. ఒక్కసారి భర్తను చూపించమని. పాపం పెండ్లి సమయంలో సరిగ్గా చూడనేలేదు.

మరుసటి రోజు పక్క వీధిలో భిక్ష అడుక్కుంటున్న అతన్ని బలవంతంగా పట్టి లాక్కొచ్చారు, ధనిక శ్రేష్ఠి మనుష్యులు - వాళ్ళ చేతుల్లో గింజుకుంటూనే వచ్చాడు.

'నాకొద్దు సంసారం - ఏముంది అందులో - అంతా నిస్సారం. వరానికి గొడ్డలిపెట్టు. ఇహానికి చెంపపెట్టు' ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. కొత్త పిచ్చోడు కదా -

తండ్రి శాంతింపచేసాడు. బలవంతమేమీలేదు. ఒక్కమాట మాట్లాడి పొమ్మని -

ఈలోపు నూతన వధువు పెళ్ళికూతురిలా అలంకరించుకుంది. మేలిముసుగులో వచ్చి భర్త కాళ్ళకు నమస్కరించింది.

'స్వామీ! ఆశీర్వదించండి'

అతనికి ఏం ఆశీర్వదించాలో తెలియక 'దీర్ఘసుమంగళీభవ' అన్నాడు.

ఆ మాటకామె నవ్వుకుంది.

'నేను కోరుకుంటుంది కూడా అదే - మీరు నిండు నూరేళ్ళు ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని - మీ దారికి నేనడ్డురాను. అయితే ఒక ప్రశ్న నన్ను వేధిస్తోంది - అడగవచ్చా?"

"అడుగు" అన్నాడు బింకంగా -

"మీ బుద్ధ ధర్మం ప్రధాన ఉద్దేశ్యమేమిటి?"

"కులాలకు మతాలకు అతీతమైన నూతన వ్యవస్థకాహ్వానం పలకటం, ధనిక పేద అంతరాలను విడిచి సమసమాజాన్ని స్థాపించటం. తాడిత పీడిత శోకార్తుల కన్నీళ్ళు తుడవటం"

"అయితే శోకార్తుల్లో నేనూ ఒకదాన్నే. నా కన్నీళ్ళు తుడవండి" అతని రెండు చేతులు తన కోమల హస్తాలతో అందుకుంది. లేత పసిడి బుగ్గలపై కారిపోతున్న కన్నీళ్ళు తుడిపించుకుంది.

"ఒక్క విషయం - మిమ్మల్నేదో బలవంతంగా సంసారంలోకి దింపటానికి పిలిపించామనుకోండి. మీకంటే ఎక్కువ అభిమానం, ఆత్మనిష్ఠ నాకూ ఉన్నాయి. నా గౌరవాన్ని ఎలా కాపాడుకోవాలో నాకూ తెలుసు. ఎప్పుడయినా, మీ మనస్సులో.. ఒక్కక్షణం నాకోసం కేటాయించినప్పుడు నా మాటల్లో సత్యాన్ని గుర్తించి నాకోసం. ఒక్క కన్నీటి బొట్టు విడిస్తే చాలు - మీ భార్యగా నా జీవిత ధన్యం. ధర్మం పేరుతో సమాజాన్ని ఉద్ధరిస్తున్నామని పెద్ద పెద్ద మాటలు చెబుతున్న మీరు, మీ గౌతములు ఆలోచించుకుని ఆత్మవిమర్శ చేసుకోవాల్సింది చాలా ఉంది. ఇక్కడ కూడా పురుషాధిక్యత మా స్త్రీ జీవితాన్ని శాసిస్తోంది. మా దాంపత్య జీవితాల్ని మొగ్గలో తుంచేస్తున్నారు - ఏ తప్పుచేయకుండా శిక్ష అనుభవిస్తున్న నిర్దోషులం మేము - నిర్దోషికి శిక్ష విధించమని ఏ న్యాయశాస్త్రంలో ఉంది -

వివాహానికి ముందే మీ మార్గం నిర్ణయించుకుని ఉంటే కేవలం దుఃఖం మీకన్న వారికే పరిమితమై ఉండేది. కానీ అన్నెం పున్నెం ఎరుగని కన్నె మెడకు తాళికట్టి - నేను సన్యాసినయ్యాను, నువ్విలాగే మోడులా బ్రతుకు - నీదారినీది - నాదారినాది అంటే సరిపోతుందా? -

పరాయిబ్రతుకును పెళ్ళిపేరుతో శిక్షించే అధికారం మీకు మీ గురువుగారికి ఉన్నాయేమో ఆలోచించండి - ఈ మాట అడగటానికే పిలిపించాను. ఇలా బలవంతంగా తీసుకురావటం మీ మనస్సుకు కష్టాన్ని కలిగిస్తే క్షమించండి. ఇదే మొదటిసారి చివరిసారి కూడా - భవిష్యత్తులో ఇంకే ప్రతిబంధకముండదు - వెళ్ళిరండి - ఇక శలవు"

వంగి రెండు కాళ్ళు అంటి నమస్కరించింది. భర్త పాదాలు తాకిన రెండు చేతులు తన తలపై ఉంచుకుంది. ఆశీస్సులన్నట్టు వెనక్కు తిరిగి ఇంట్లోకెళ్ళిపోయింది.

చూస్తున్న వాళ్ళంతా బొమ్మల్లాగా నిలబడిపోయారు. రత్నశ్రేష్టికి నోటమాటరాలేదు. అద్భుతమైన సౌందర్యంతోపాటు అమోఘమైన విద్యాసంస్కారాలు కలిగిన భార్య మాటలు అతని మనసులో శూలంలా గుచ్చుకున్నాయి. అయినా తన ప్రయాణం ఇటుకాదు కనుక మౌనంగా తలొంచుకుని వెళ్ళిపోయాడు, కట్టు.కున్నవాళ్ళ కన్నవాళ్ళ కన్నీళ్ళతో తనకే సంబంధంలేనట్టు.

ధర్మం కఠినమే. అయినప్పుడు కసాయితనానికి దానికి తేడా ఏమిటో - ఇరుగుపొరుగు వాళ్ళు గొణుక్కుంటూ వెళ్ళిపోయారు.

ఇల్లంతా దుఃఖ వాతావరణం. పిల్ల తల్లితండ్రులకేం చేయాలో పాలుపోవటంలేదు - చూస్తూ చూస్తూ కన్నబిడ్డని ఒంటరిగా వదిలి వెళ్ళడమేనా? నూరేళ్ళ జీవితం ఏ అచ్చటా ముచ్చటా లేకుండా కాలిపోతుంటే చూస్తూ ఎలా బ్రతకాలి, ఎన్నాళ్ళీ బరువు మోయాలి?

తెల్లవారీ తెల్లవారకముందే ఒక వార్త గుప్పుమంది. దాని సంచలనానికి శాక్యనగరం గోడలు కంపించాయి. ఆబాలగోపాలం పరుగులు తీసారు.

ధనిక శ్రేష్టి ఇంటి దగ్గర గుంపులు గుంపులుగా జనం ఆ దృశ్యం చూసి ఏడవని వాళ్ళు లేరు.

పొద్దెక్కేకొద్దీ ఇంకా ఇంకా తీర్థంలా వస్తూనే ఉన్నారు.

మాలికను తీసుకుని సుందరి మొదటిసారిగా వీధిలోకొచ్చింది. తిన్నగా ధనిక శ్రేష్టి ఇంటికి వెళ్ళి వారి కుటుంబాన్ని పరామర్శించింది. అక్కడి దృశ్యం రాళ్ళు సైతం కరుగుతుంటే సున్నితమైన ఆమె హృదయం కరగదా! ఒంటినిండా నగలతో లక్ష్మీదేవి తోడబుట్టినదానిలా అప్పుడే విచ్చుకుంటున్న లేతవయసు పచ్చని శరీరఛాయ కొంచెం నలుపుకు తిరిగి ధూమ్రం కప్పిన పసిడిలా మెరుస్తోంది. మూసిన కంటిరెప్పలు దినకరుని చూసి ముకుళించిన కలువల్లా ఉన్నాయి. అన్ని సమస్యలకు మరణమే పరిష్కారమన్నట్టు దీర్ఘనిద్రపోతున్న కోడల్ని చూపించి కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు శ్రేష్టి. పక్కనే మరో శవం - నిండు ముత్తయిదువ పార్వతిదేవిలా చారెడు పసుపు పెద్దకుంకుమ బొట్టుతో స్వర్గానికి వాయనాలు పంచటానికి పోతున్న పుణ్యస్త్రీలా ఉంది - ఆమే ధనిక శ్రేష్టి భార్య.

మార్చి మార్చి చూసుకుంటూ ఏడుస్తున్న అతడిని ఓదార్చింది సుందరి. కోమలమైన కంఠంతో -

"ఎలా జరిగింది ఈ విపరీతం?" అడిగింది మెల్లగా. ఆ మృదుత్వానికి కదిలిపోయిన శెట్టి ఆమె కాళ్ళు పట్టుకుని ఏడ్చాడు -

"చూడు తల్లీ! మీ వంశానికిచ్చిన శాపంచూడు - నిన్ననే పసుపు బట్టలతో ఆనందంగా అడుగుపెట్టిన నా కొత్తకోడలు ఈమె - మనవడినెత్తుకుని మురిసిపోవాలని ఒక్క కొడుక్కు పెళ్ళి చేసి కోడల్ని కాపురానికి తెచ్చిన నా భార్యేమయిందో చూడు -

ఇదేనా అమ్మా సాటి మనుష్యులమీద చూపించే జాలి - బుద్ధదేవుడి నూతనకరుణ సిద్ధాంతం? భార్యాభర్తలను దూరం చేసి సమాజాన్ని ఉద్ధరించే న్యాయమేమిటో నాకు తెలియదు. నా శోకాన్ని ఎవరారుస్తారు? ఒక్కకొడుకూ సన్యాసిగా మారాడు. మా కుటుంబ శాపం వాళ్ళకూ తగిలింది. ఏ సుఖం తెలియకుండానే జీవితం మొదటి అడుగులో ఈ పిల్ల కన్నుమూసింది. ఈ పాపం మీకు తగలదా?

మీ శాక్య వంశం కోడళ్ళు ఎలాగూ ఏడుస్తునే ఉన్నారు. మీమీద ఆధారపడి మీరే పాలకులని బ్రతుకుతున్న పౌరులం. మా కుటుంబాలను కాటేసే హక్కు మీకెవరిచ్చారు."

అంతకంతకు అతని శోకం అధికమౌతోంది -

ఎలా ఓదార్చాలో ఆమెకర్థం కావటంలేదు. అతని ప్రశ్నలకే సమాధానం చెప్పగలదు? డోలుపోయి మద్దెలతో మొరపెట్టుకున్నట్టు - తన ప్రశ్ననే అతడు అడుగుతున్నాడు. దీనికి సమాధానం గౌతముడి దగ్గరే ఉంది.

వచ్చినవాళ్ళ సానుభూతి పెరుగుతోంది. ఎవరో అడిగారు. "ఏం జరిగింది శ్రేష్టిగారూ! " అనిఅతడు ఏడుస్తూనే జరిగిందంతా చెప్పుకొచ్చాడు.

భర్తకాళ్ళకు దండం పెట్టి సురమ గిర్రున ఇంట్లోకెళ్ళిపోయి ఆ తర్వాత అత్తమామలతో చాలా సంతోషంగా మాట్లాడింది. ఏడుస్తున్న అత్తగారిని తల్లిని ఓదార్చింది. తప్పకుండా అతడు తిరిగి వస్తాడని, తమకాపురం సజావుగా సాగిపోతుందని చెప్పింది. పుట్టింటినుండి తెచ్చిన పిండివంటలు అందరిచేత కొసరి కొసరి తినిపించింది.

పనివాళ్ళకు నూతన వస్త్రాలు, కొంత సొమ్ముదానంగా ఇచ్చింది. అత్తగారికి తనే స్వయంగా స్నానం చేయించి తను తెచ్చిన పట్టుచీర కట్టబెట్టింది. ఏడువారాల నగలు అలంకరించి అద్దం ముందు కూర్చోబెట్టి 'అత్త పెళ్ళికూతురిలా ఉందని మేలమాడింది. అందరిని నవ్విస్తూ తాను నవ్వుతూ పగలంతా లేడిపిల్లలా ఇల్లంతా తిరుగుతూనే ఉంది.

"పోనీలే. పిల్ల సంతోషంగా ఉంది. ఆమెను చూసుకుని బతుకుదాం - దానిరాత బాగుంటే మొగుడు తిరిగి రావచ్చుగా" అనుకుని మనసులు కుదుటపర్చుకుంటున్నారు.

అందరు లేనిలోటు తీర్చి ఒక్కరోజులోనే అందరికి ప్రాణమైపోయింది.

తమ ఆస్తిక్కూడా ఆమే వారసురాలని ప్రకటించుకున్నాము కూడా. మా ముసలి బతుకుల్లో చేతికర్రలా కంటి చూపులా నిలబడమని - ఇకనుండి అత్తమామలం కాదు - తల్లితండ్రులుగా పిలవమని కూడా చెప్పాం.

మనసు ఒకింత తేరుకుంటోంది - ఉప్పెనలా వచ్చిన తుఫాను చిన్ని జల్లుతో సర్దుకుపోవటం నాకు కొంతభారం తగ్గి తేలిగ్గా అనిపించింది.

ఆ రాత్రికూడా దగ్గరుండి స్వయంగా అత్తగారికి భోజనం తినిపించింది. నా కొడుకు సన్యాసుల్లో కలిసిన దగ్గరనుండి మంచమెక్కిన నా భార్య ముఖంలో నిన్ననే మళ్ళీ వెలుగు చూసాను - కోడలు ఏం చెబితే ఆమె అదే చేసింది.

అందరి భోజనాలయ్యాక స్వయంగా వాళ్ళమ్మచేత ముద్దలు పెట్టించుకుని తృప్తిగా భోంచేసింది. వాళ్ళత్తయ్య దగ్గర కూర్చుని చాలాసేపు కాళ్ళు పట్టింది -

"ఎందుకమ్మా నాకీ సేవ? చిన్నదానివి - పగలంతా ఏదో పనిచేస్తూనే ఉన్నావు. అలసటగా లేదూ? వెళ్ళిపడుకోరాదూ? ఆ దేవుడు నిన్ను చల్లగా చూడాలి" - ఆప్యాయంగా కోడలి చెయ్యిపట్టుకుంది.

"కనుకనే మీలాంటి అత్త దొరికింది - నాకేంలోటు?"

"లోటువుందో లేదో నువ్వు గడపబోయే నూరేళ్ళ జీవితమే చెప్పాలి - తల్చుకుంటేనే నా గుండె పగిలిపోతోఓంది. ఎటువంటి రాత రాసాడు ఆ మాయదారి దేవుడు" వచ్చే కన్నీళ్ళను ఆపుకోలేకపోతోంది అత్త.

"అదేంటత్తా ఇంతలోనే వరాలివ్వాలంటావు. మళ్ళీ అంతలో తిడతావు - ఆయనకు కోపం రాదూ?"

"వస్తే రానీవే నన్ను తీసుకుపోతాడు అంతేగా - నీ రాత సరిచేస్తే నాకింకేం కావాలి? ఒక్క బిడ్డని కడుపులో పెట్టుకుని పెంచుకున్నాను - వాడివల్ల నలుగురు మనవలు కలిగిరే ఆడించుకుంటూ శేషజీవితం గడపాలని ఆశపడ్డాను - నేనేమన్నా కోరరాని కోర్కెలు కోరానా. మోయరాని బరువు పెట్టానా. ఏం పాపం చేసానని నాకీ కడుపుశోకం. నీ బ్రతుకు శాపం -

ఆమె గాఢంగా నిట్టూర్చింది -

"నా గురించయితే బాధ మర్చిపోండి - నేను చాలా సంతోషంగా ఉన్నాను. కానీ మీ బాధ చూస్తుంటేనే తట్టుకోలేననిపిస్తోంది" అన్నది సురమ మెల్లగా కాళ్ళు ఒత్తుతూ -

"నువ్వున్నావుగా - నీలోనే వాడిని చూసుకుని బాధ మర్చిపోతాను - నీతోనే నేను సరేనా? ఇక పడుకో తల్లీ" కోడల్ని ముద్దుపెట్టుకుంది. కాసేపటికి తెలియకుండానే ఆమె నిద్రలోకి జారిపోయింది.

అందరూ నిదపోతునారు - మెలగా లేచింది -

ఆమె హృదయమంతా అంతులేని భారంతో ఉంది. పుట్టింటి వాళ్ళను మెట్టింటి వాళ్ళను కళ్ళనిండుగా కడసారి చూసుకుంది -

కులదేవత ఆఖ్యాదేవికి నమస్కారం చేసింది.

దిక్కులకు - తులసిమాతకు ప్రదక్షిణాలు చేసింది. గౌతముని ఆశ్రమం వైపు తిరిగి గౌతముడికీ, భర్తకూ దండం పెట్టింది.

నూరేళ్ళ జీవితం వ్యర్థం కాకుండా -

ప్రతిరోజూ కన్నవాళ్ళ కన్నీళ్ళు చుడకుండా - అత్తమామలకు ఆరని కుంపటికాకుండా - మరో సతీదేవిలా - మళ్ళీ పార్వతిగా పుట్టి భర్తను చేపట్టాలని కోరుకుంటూ

తనకలంకారమైన వజ్రమే తన ప్రాణానికి పరిష్కారంగా మార్చుకుని ఆ చిన్నతల్లి వెళ్ళిపోయింది. ఎవరు పిలిచినా రాని చోటికి.

ఆ దృశ్యం చూసి అత్తగారు ఒక్క మాట మాట్లాడకుండానే ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆమెకూడా కోడల్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయింది.

పచ్చని పెళ్ళి ఇల్లు స్మశాన భూమిగా మారింది. సురమ భర్త రత్నశ్రేష్ఠికూడా వచ్చాడు. ఒక పక్కన నిలబడి మౌనంగా చూస్తున్నాడు. నిన్న ఇదే వేళకు తనకు దండం పెట్టి ఒక్క క్షణం గుర్తుంచుకోమని చెప్పిన మధురమైన భార్య మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి. ముచ్చటైన ఆ ముఖం కళ్ళముందునుండి తొలగటంలేదు.

అందరూ అతడిని దోషిగా చూస్తుంటే తట్టుకోలేకపోతున్నాడు.

పట్టుపరుపులు విడిచి ఏడుకట్ల మీద సాగింది. ఇద్దరు పుణ్యస్త్రీల శవయానం రోదనలు వేదనలు బుద్ధుని రాతి గుండెకదిలిస్తుందా. అంత తేలిగ్గా కరిగితే సిద్ధాంతాలన్నీ పూటకొకటిగా మారేవి - ఉన్నత శిఖరాన్ని చేరటానికి ఒడిదుడుకులు మాములే.

ఇద్దరికి తనే తలకొరివి పెట్టి సంకోచాలన్ని మంటల్లో వేసి రత్నశ్రేష్ఠి తిరిగి ఆశ్రమానికి వెళ్ళిపోయాడు - ఆధ్యాత్మిక బంధం ఎంత బలమయింది.

మొదటిసారిగా అంతఃపురం విడిచి బయటికొచ్చిన యువరాణిని వేలమంది చూసారు. సాదా చీరెతో ఉన్నా అద్భుతమైన ఆమె సౌందర్యం - కళ్ళముందు దేవతా స్త్రీ దిగివచ్చినట్టనిపించింది. ఇంత అందాన్ని విడిచిపెట్టి నందుడెలా భిక్షువయ్యాడోనని గుసగుసలు పోయారు. భూమిమీద స్త్రీలకు ఇంత సౌందర్యం ఉండటం కల్ల అని ప్రతిజ్ఞలు చేసారు. ఇంత సుకుమారినా - గయ్యాళి రాక్షసి అని నిందించింది - ఎంత పొరపాటు - ముక్కున వేలు పెట్టుకున్నారు -

ఆమె సిద్ధాంతపు కొమ్మ మరో ఆకు తొడిగింది. ఆ రోజునుండి ఇక ఇంట్లోకే పరిమితం కాకూడాని నిర్ణయం చేసుకుంది.

ఈ విషయమై ఆ రాత్రి చాలాసేపు మామాకోడళ్ళు చర్చించుకుంటూ ఉండి పోయారు.

ఎందుకో ఆమె మనసుకు చాలా తృప్తిగా ఉంది. అనుకున్న లక్ష్యం చేరటానికెంతో సమయం పట్టదు. నిద్రపోయే ముందు అనుకుంది. "మీరెక్కడున్నా మళ్ళీ నాదారికి తెచ్చుకుంటాను" ఆపై తృప్తిగా నిద్రపోయింది.

మరునాటినుంచి ఆమె కార్యక్రమాల్లో కొన్ని మార్పులొచ్చాయి. సాదా తెల్లచీర ధరించి భూమికి అవతరించిన గంగామాతలా రూపుదిద్దుకున్న కరుణ దేవతలా నగరంలో తిరగటం మొదలు పెట్టింది. ఏ కంట కన్నీరు ఒలికినా ఏ ఇంట కష్టమొచ్చినా - వరాలిచ్చే దేవతలా ప్రత్యక్షమయ్యేది. బౌద్ధ భిక్షువలన మిత గౌరవంతో ఆదరిస్తోంది. ఇదివరకటి ఆమె విహారస్థలాలన్నీ భిక్షువుల విశ్రాంతి మందిరాలుగా చేసింది. దీనుల్ని ఆదరించటంలో ఆమె పేరు నగరంలో మార్మోగుతోంది.

ఈ వార్త బుద్ధుడికి తెలిసింది. దీక్ష లేకుండానే సాగిస్తున్న సమాజ సేవకు ఆయన మనసులో ఆనందిచాడు. ఇదొక పోరాటం. ఆయనకంతా తెలుసు. రాజమందిరంలో జరిగిన దీక్షల రోజున ఆమె రాలేదు. అంతేకాదు నందుడ్ని కూడా ఆపగలిగిన ఆ మానసిక

శక్తిని గుర్తించగలిగాడు. ఇంతవరకూ ఎవరిదారిలో వాళ్ళున్నారే తప్ప ఎదురుపడిందీ లేదు - ప్రచ్ఛన్నంగా కూడా ఒకరివాదాన్ని ఒకరు తప్పుపట్టిందీలేదు -

ఆశ్చర్యమేమిటంటే బౌద్ధధర్మమనే వలయంలోనే అందరూ ఉన్నారు. ఒకరినొకరు కలవని సమాంతర రేఖల్లా అదే ఆవర్తంలోనే తిరుగుతున్నారు.

యశోధర - శుద్ధోదనుడు - నందుడు - సుందరి వీరందరి కేంద్రబిందువు బుద్ధుడే

ఎవరికోణంలో నుండి వారు మనస్సులను సమన్వయ పరచుకోవాలనుకుంటున్నారు. కానీ సహజస్వభావాల మాటున ఎవరి విధానం వారిదే -

నిరంతరం ఆగక తిరిగే
అనంతమైన కాలచక్రం
ఎప్పుడు కలుపుతుందో
ఎలా విడదీస్తుందో
దానికే తెలియాలి.

గాయపడ్డ ఒక స్త్రీకి కట్టుకడుతోంది సుందరి. ఇంతలో పరిచారిక వచ్చి చాలామంది స్త్రీలు తమ దర్శనార్థం వచ్చారని చెబుతుంది. కట్టటం పూర్తిచేసి చేతులు కడుక్కుని సమావేశమందిరంలోకి వచ్చి వారిని కలుసుకుంది.

దాదాపు వెయ్యిమందిదాకా ఉన్నారు. కుశల ప్రశ్నలేసి కూర్చోటానికి కంబళ్ళు చూపించింది. మంచి తీర్థం తెప్పించి కొంతసేద తీరాక వచ్చిన విషయం అడిగింది.

వారిలో కొంచెం పెద్దావిడగా ఉన్నామె లేచి -

"అమ్మా! మేము మగధనుండి వస్తున్నాం. శాక్యనగర సరిహద్దుగ్రామాల్లో ఉంటాం - మాకొచ్చిన సమస్య ఎవరితో చెప్పుకోవాలా అని ఆలోచిస్తుంటే ఎవరో మీ పేరు చెప్పారు. మా బాధలు మీరర్థం చేసుకుంటారని గంపెడాశతో వచ్చాం తల్లీ. ఈ కష్టం మీరే తీర్చాలి."

"అవునమ్మా బళ్ళు కట్టుకుని మరీ వచ్చాం. ఏదో ఒక సమాధానం పొందిగానీ తిరిగి వెళ్ళలేం" మరి కొంతమంది అన్నారు.

"అయ్యో! మీరు అంతదూరం నుండి మా నగరానికి రావటమే మా భాగ్యం. పైగా నన్ను కలుసుకుని మీ బాధలు చెప్పుకోవాలనుకోవటం. అంత అర్హత నాకిచ్చినందుకు ధన్యవాదాలు చెప్పండి మీకు నేనేవిధంగా సాయపడగలను."

"మామగారు శుద్ధోధన మహారాజుగారున్నారు. పెద్దవారు మా బావగారు గౌతమ బుద్ధులు నదీ తీరంలో ఉన్నారు. వీళ్ళిద్దరూ తీర్చలేని బాధ నావల్లేమవుతుంది. చేతనైతే తప్పక తీర్చగలను."

అతిలోక సౌందర్యంతోబాటు తియ్యని కంఠస్వరం - నిరాడంబరమైన వేషం, భేషజం లేని ప్రవర్తనకి వారు ముగ్ధులైపోయారు.

ఆమె మర్యాద చేసిన తీరు కూడా ఎంతో నచ్చింది.

మళ్ళీ పెద్ద ముత్తయిదువ లేచి చెప్పటం ప్రారంభించింది.

"అమ్మా! మేమంతా భర్తలకు దూరమై బాధపడుతున్న ఇల్లాళ్ళం. యజమాని లేని ఇంట్లో ఉండలేక అల్లాడిపోతున్నాం. ఇప్పుడు మేమైతే రాగలిగాం. కానీ మాలాగా ఎందరో విలపిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలి. చిన్నతనంలో తల్లితండ్రులు, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకుల ఆలనలో స్త్రీ జీవితం గడిచిపోవాలి. కానీ భర్తలు కొడుకులు దూరమైతే వాళ్ళే అన్యాయం చేస్తే మాగతేమిటి? ఇక మా రాజుగారు రాణిగారు వారూ అదే మార్గంలో ఉన్నారు. ఇన్నాళ్ళూ ఏం చెయ్యాలో తోచక లోలోపల కుమిలిపోతున్నాం. ఎవరో పుణ్యాత్ములు మీ సంగతి చెప్పారు. ఏదో మార్గం దొరక్కపోదని ఆశతో వచ్చాం." చెప్పిందామె.

"నా సంగతి ఏం విన్నారు?" సుందరి కళ్ళల్లో కుతుహలం. మరో పడుచు స్త్రీ లేచి నిలబడింది.

సుందరి కళ్ళకు మెరుపు మెరిసినట్టనిపించింది. పాలరంగులో గులాబీ వర్ణం మిశ్రం చేసినట్టు ఒంటిరంగు. కళ్ళు సోగదీరి కలువరేకుల్లా తళతళమంటున్నాయి. ప్రపంచంలోని అందమంతా ఆ కళ్ళల్లోనే ఉందనిపించింది. అదే అడిగింది సుందరి.

"పాటలీపుత్ర సుందరీమణులా మీరు?"

"అవును. నా భర్త ఈ అందం చూసి మోహించే నన్ను వివాహమాడారు. నా పేరు శ్వేత లతిక. మొన్నటివరకు ఎడబాయని దాంపత్యం మాది - అపురూపమైన మా ప్రేమఫలాన్ని తనివితీరా భుజించకముందే ఆయన నాకు దూరమయ్యారు. నా ముఖం చూసి ఒక సంవత్సరమయింది.

పాటలీపుత్ర సుందరిగా పేరున్న నేను ఈనాడు శోకసుందరిగా పిలవబడుతున్నాను. నేనేకాదు. ఈ వచ్చినవాళ్ళు ఇంకా రాని వాళ్ళు గుండె పగిలే దుఃఖంతో నలిగిపోతున్నారు.

కొత్తగా పెళ్ళయిన వాళ్ళు, పిల్లలున్నవాళ్ళు ఎన్నో సంవత్సరాలు కాపురం చేసి అనుబంధం పెంచుకున్నవాళ్ళు, ఇంటికో కథ కంటికో ఏడుపు అన్నట్టుంది మా వ్యవహారం" ఆమె కళ్ళనీళ్ళు తుడుచుకుంది. ఆమె చెక్కిళ్ళు మరింత గులాబీ వర్ణంలోకి మారాయి. మరొకామె అంది -

"నా పేరు సువర్ణ - బుద్ధుడంటే మాక్కూడా దైవంతో సమానం. కానీ భార్యాభర్తలను విడదీసి స్త్రీలను దుఃఖంలో ముంచే ఈ పద్ధతే మాకు నచ్చటంలేదు. ఆ కుటుంబంలో ఉండి మీరు దీక్ష తీసుకోకుండా కుటుంబ వ్యవస్థను కాపాడాలని పోరాటం చేస్తున్నారట - అది విని మేము ఇక్కడకు వచ్చాం."

సుందరికంతా అర్థమయింది. తనలాగే ఎంతో మంది స్త్రీలు మౌనవిప్లవాన్ని కొనసాగిస్తున్నారు. అదే పెద్దదయితే -

మరొకామె ఏడుస్తూ -

తన ఇద్దరి బిడ్డలను చూపించింది. "చూడమ్మా వీళ్ళెలా అయిపోయారా - తండ్రి కోసం దిగులు పెట్టుకుని సరిగా ఆహారమే ముట్టడం లేదు. బక్కచిక్కి సగమయ్యారు. ఆయనకూడా బిడ్డల్ని విడిచి క్షణమైనా ఉండేవారు కాదు. ఆర్నెల్లక్రితం వేణువనంలో గౌతమబుద్ధుడి దగ్గర సన్యాసం తీసుకున్నారు. ఇంతవరకు ఇంటిముఖం చూడలేదు. నేనెలాగో, వీళ్ళను చూసుకుంటూ నెట్టుకొస్తున్నాను. కానీ ఈ బిడ్డలకెలా నచ్చచెప్పాలి. తెలిసీ తెలియని వయస్సు. ఏం చెప్పినా అర్థంకాదు. ఈ మధ్యనే బెంగతో జబ్బునపడ్డారు." ఆమె ముఖానికి కొంగడ్డం పెట్టుకుని రోదించింది. పిల్లలిదరూ బావురుమన్నారు. మిగిలిన ఆడవాళ్ళు ముక్కు చీదేస్తున్నారు. సుందరి పిల్లలిద్దరినీ దగ్గరకు తీసుకుంది. ఏడవద్దని అనునయించింది.

అందరి కథలు ఓపిగ్గా వింది. ఆమెకర్థమైనంత వరకు వచ్చినవాళ్ళెవరికీ గౌతముని మీద కోపంలేదు సరికదా భగవంతుడిగా ఆరాధిస్తున్నారు - అయితే వాళ్ళ సంసారాలు వాళ్ళక్కావాలి.

"చూడండి. నేను మొదటినుండి బుద్ధుడి సిద్ధాంతాన్ని అమితంగా గౌరవిస్తున్నాను. మా బావగారిగా కాదు దైవత్వం రూపుదాల్చిన మహామనీషిగా ఆయన త్యాగం ముందు మేఘాలయినా సిగ్గుపడాల్సిందే

సమాజంలో కుళ్ళును కడిగి, ద్వేషపూరితమైన అంతరాలను తుడిచి అంతరంగాలను మలినరహితంగా మారుస్తున్న గొప్ప సంస్కరణశీలి, నిజమైన మానవతావాదం ఆయన సిద్ధాంతంలో పెరిగిన మహావృక్షమౌతోంది. ఎంతోమంది పాంథులకు అంధులకు అది కల్పవృక్షం. దిక్కులేని దినదరిద్రనారాయణులు ఆ నీడలో హాయిగా సేదదీరుతున్నారు. వెలిసిపోయిన సమాజపు గోడలకు నూతన రంగులద్ది కొత్త శోభనిస్తున్నారు. మూఢనమ్మకాలనడ్డం పెట్టుకుని సమాజాన్ని మోసగిస్తున్న వంచకుల పాపాలు బయటపెట్టి అమాయకుల హృదయాలో విజ్ఞాన వెలుగునింపుతున్న జ్ఞానజ్యోతినెలా తప్పుపట్టగలం. వెలుగు చిమ్మటానికి కొన్ని ఆహుతికావాల్సిందేకదా -

వందల సంవత్సరాలకో యుగపురుషుడు జన్మిస్తాడు. వాళ్ళ సంస్కరణలతో సమాజాన్ని మరికొన్ని వందల సంవత్సరాల ముందుకు నడిపిస్తాడు.

మళ్ళీ ఈ యుగంలో ఈయన పుట్టింది అందుకోసమే. ఆయన అద్భుతమైన సిద్ధాంతంలో మానవాళికి నూతనాధ్యాయం మొదలైంది. అందరం సమర్ధించాల్సిందే. అయితే మీకులానే నేను ఒక విషయంలో వారితో విభేదించాను - మా ఇంట్లో అందరూ దీక్ష తీసుకున్నా నేను వ్యతిరేకించాను. ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నా - కారణం ఒక్కటే కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉంటే సమాజం పరిపుష్టంగా ఉంటుందనే నమ్మకం.

ప్రేమమూర్తులు సహనశీలురయిన స్త్రీలకు అన్యాయం జరక్కూడదనే అభిప్రాయంతో నేనున్నాను. నా భర్తకూడా దీక్ష తీసుకున్నారు. అయినా నా ఆలోచనలనుండి నేను వేరుకాలేదు.

అందువలన దీనికో పరిష్కారం కావాలనే నా పోరాటం కూడా. మనందరం కలసి వారినే అడుగుదాం. ఈ సమస్యకు వారే మార్గం చూపించగలరు. సొంత భార్యనే భిక్షుణిగా మార్చిన నిస్వార్ధ శీలి. ఇంతమంది స్త్రీల కన్నీటిని తప్పక అర్ధం చేసుకుంటారనే నమ్మకం నాకుంది.

ఈ రోజుకు మీరు విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం మరోసారి చర్చిద్దాం. శాక్య నగరంలో కూడా ఈ విషయం మీద మహిళా సంఘాలేర్పడ్డాయి. అందరూ కలసి మాట్లాడుకుని ఒక నిర్ణయానికి రావటం మంచిదని నా అభిప్రాయం. ప్రస్తుతం మీరు చాలా అలసిపోయి ఉన్నారు. స్నానాదికాలు పూర్తిచేసుకుని హాయిగా విశ్రాంతి తీసుకోండి. మళ్ళీ కలుద్దాం"

ఆమె మాటలు వారికెంతో ఊరట నిచ్చాయి. అందరూ తేలిక మనస్సుతో తప్పక మంచి జరుగుతుందనే నమ్మకంతో ఉత్సాహంగా లేచారు.

పరిచారకులు వచ్చి విశ్రాంతి మందిరాలకు తీసుకెళ్ళారు. సుందరిని అభినందిస్తూ వారివెంట వెళ్ళిపోయారు.

అనుకున్న ప్రకారం సుందరి శాక్యనగర మహిళలను పిలిపించింది. వారొక రెండువేలమంది దాకా వచ్చారు. పరస్పర పరిచయాలయ్యాక అందరి ధ్యేయం ఒకటే అని తేలింది. గౌతముని కలవటానికి బృందనాయకురాలిగా సుందరిని ఎన్నుకున్నారు. బుద్ధుడితో ఏం మాట్లాడాలో ఆ విషయం ఆమెకే వదిలిపెట్టారు.

ఆ రాత్రి మగధ, శాక్యనగర స్త్రీలంతా సామూహిక విందు కార్యక్రమాలేర్పాటు చేసుకుని మైత్రిని పెంపుచేసుకున్నారు.

ఏ స్త్రీలు ఆమెను విమర్శించి యశోధరను పొగిడారో, మళ్ళీ వాళ్ళే ఈమెను అభినందిస్తూ ఆమెను చూసి జాలిపడుతున్నారు. ఇప్పటిగ్గానీ అనుభవానికి రాలా - భర్తు వియోగంలో తపించిపోతున్న వారి మనసులకు ఈ రోజు సుందరి ఆరాధ్యదేవత - కథానాయకి - పోరాటశీలి - నాయకురాలు.

అందుకే కాలం చిత్రమయింది. అంతకంటే మానవ స్వభావం చిత్రాతిచిత్రం. ఒకనాటి నిజం మరోనాటి అబద్ధం. బలహీనమైన మనస్సులతో ఆడుకోవటం దానికో సరదా.

***********

(17)

**ఉదయకాలపు కిరణాలను** మోసుకుంటూ ప్రకృతికట్టిన, రంగురంగుల, పట్టుచీరెలా, కదలి వస్తున్న పూబాలికల్లా నడుస్తున్న చుక్కల పందిరిలా రసాధిదేవత రూపుదాల్చినట్టు అందగత్తెలైన ఆ ఆడవాళ్ళంతా ఉషోదయ లక్ష్మికి వింత వింత వన్నెలు కూరుస్తూ నదీ తీరానికి బయలుదేరారు. మరో సుందరమైన నదీపాయ రోహిణీ నదికి పోటీగా ప్రవహిస్తున్నట్టుంది.

అంతమంది స్త్రీలను ఒకచోట చూడటం శాక్యనగర చరిత్రలో లేదు. సహజంగానే ఆడువారు బయటికిరారు - క్రింది వర్గాల్లో తప్ప - వచ్చినా మేలిముసుగులో ఉంటారు.

మొదటిసారిగా సాంప్రదాయక స్త్రీలు వీధిలో కొచ్చారు. వారంతా గౌతముడ్ని నిలదీయటానికెళ్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలని నగర పౌరులంతా బయలుదేరారు. ఏది జరిగినా పెద్దకోలాహలమే - ఆ నగరానికి. వ్యతిరేకవర్గం వారుకూడా బయలుదేరారు - గౌతముడికి జరిగే అవమానాన్ని చూడటానికి సాగిపోతున్న రంగుల ప్రవాహం తథాగతుని కుటీరాన్ని ముంచెత్తింది.

అది చూసి ఒక శిష్యుడననే అన్నాడు.

"అయ్యబాబో ఏమిటీ దండయాత్ర. అసలే మనగురువుగారికి ఆడాళ్ళపొడంటేనే గిట్టదు. మాటిమాటికి వీళ్ళతోనే ఆయనకు తలనొప్పి వస్తోంది."

"అదేమరి ఆయన గొప్పతనం. వద్దుబాబో అన్నా వినకుండా ఒక వర్గమంతా వచ్చి దీక్షలు తీసుకున్నారా. మరో వర్గం ఏకంగా శిష్యరికం చేస్తున్నారా - ఈ రోజు ఈ దండు ఎందుకొస్తుందో మరింకేం కావాలని అడగటానికో.. పెద్ద పరీక్ష" అన్నాడు మరో భిక్షువు.

"ఏమయినా - ఈ ప్రవాహాన్ని తట్టుకోవటం కష్టమే. వాళ్ళ గొడవ అసలొద్దని గురువుగారు చెప్పినా ఆనందుడు వినలా. ఇంకెన్ని బాధలుపడాలో వీళ్ళతో - పాపం గురువుగారు"

"ఆయనకేమిరా - మేరు పర్వతం. ఎంతగాలొచ్చినా తొణకరు, బెణరు - చూస్తాండు ఆయన దర్శనంతో ఎలా చల్లారిపోతారో" శిష్యులు మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఇంతలో సుందరి ఆధ్వర్యంలోని స్త్రీలంతా వచ్చి చేరారు -

వేలాదిమంది మహిళలు తనను దర్శించటానికొచ్చారని విని గౌతముడు కుటీరంలో నుండి బయటకొచ్చి దర్శనమిచ్చాడు. దివ్యతేజస్సుతో మెరిసిపోతున్న ఆ రూపాన్ని చూసి సుందరి ఆశ్చర్యపోయింది. ఆయన వచ్చిన రోజు భవనంలో చూసింది. మళ్ళీ ఈ రోజు - కాంతిపుంజాల్ని ఒక చోట బంధించినట్టు. ఎంత లౌకిక సౌందర్యం. మగవాళ్ళల్లో ఇంత అందగాళ్ళుంటారా? ముఖ్యంగా ఆ కళ్ళు సమ్మోహితంగా ఎదుటివారిని ఇట్టే ఆకర్షిస్తున్నాయి. కనుకనే భార్యలను కూడా మర్చిపోయి పరుగెడుతున్నారు. నిజంగానే ఆయనలో ఏదో అద్భుతశక్తి ఉంది. తన మనసు ఇంత బలహీనపడుతుందే -

అప్రయత్నంగా చేతులు జోడించి మనస్ఫూర్తిగా నమస్కరించింది సుందరి. స్త్రీలందరు సాష్టాంగపడ్డారు.

'భవమోచనమసు' అని ఆయన ఆశీరఃదించారు -

"సోదరీ! కుశలమా?" సాదరంగా అడిగాడు.

కుశలమేనన్నట్టు తలాడించింది.

"మీరు చేస్తున్న సేవలు అభినందించదగినవి. భిక్షుకులకు అనాధలకు చూపిస్తున్న కారుణ్యం ప్రశంసనీయం"

"తమదాకా వచ్చినందుకు ధన్యురాల్ని - మేమందరం మీకో విషయం మనవి చేద్దామని వచ్చాం"

"తప్పకుండా ముందు అందరూ కూర్చోండి" ఆయన శింశుపావృక్షం అరుగుమీద కూర్చున్నాడు. అందరూ నేలమీద కూర్చున్నారు. హిమాలయాలనుండి వస్తున్న చల్లనిగాలులకు శరీరాలు, మనసులు సేదదీరుతున్నాయి. ప్రశాంతమైన వనవాటిక వారి కష్టాల్ని మరిపింపచేస్తోంది. దివ్యమంగళ స్వరూపదర్శనంతో అసలెందుకు వచ్చారో - ఇంతకు ముందు వాళ్ళనుభవించిన బాధేమిటో పూర్తిగా మర్చిపోయారు.

"ఊఁ మీ సమస్యేమిటో నిర్భయంగా చెప్పొచ్చు. మా ధర్మానికి విరుద్ధం కాని దాన్ని అమోదించటానికి సిద్ధమే చెప్పండి" అన్నాడు మృదువుగా.

నాగస్వరం వింటున్నట్టు మైమరిచివున్న వారందరిలో సుందరే ముందుగా తేరుకుంది. వాళ్ళందరిని క్లుప్తంగా పరిచయం చేసింది.

"ఈ స్త్రీలంతా మగధనుండి వచ్చారు. ఇదిగో వీరు మన శాక్య నగరానికి సంబంధించినవారు - గత కొద్దికాలంగా పురుషుల్లో దీక్ష తీసుకునే వారి సంఖ్య పెరిగిపోతున్నది. దాంతో ఎన్నో కుటుంబాల జీవన విధానం అస్తవ్యస్తమయింది. ఇది తమ దృష్టికి వచ్చిందో లేదో తెలియదు కాని నిజంగా జరుగుతున్న వాస్తవాల్ని తమరు గుర్తించాల్సిన బాధ్యత ఉంది"

"అవును స్వామీ! మా భర్తలకు దూరమై మేమెంతో అల్లాడిపోతునాం మాకు న్యాయం చెయ్యాలి" కొంతమంది స్త్రీలు అభ్యర్థించారు.

ఆయన తాపీగా సుందరివైపు చూస్తూ.

"భర్తలకు దూరమయ్యారనేనా మీ సమస్య?"

"అవును - మేమంతా యశోధరాదేవి ప్రతినిధులం" ఆమె గొంతులో ఆవేదన తొంగిచూసింది.

"అయితే ఆమె పరిష్కారం చేసుకుని సంతోషంగా ఉన్నారుగా"

గౌతముడు గంభీరంగా అన్నాడు.

సుందరికి కొంచెం కోపం వచ్చింది "అని మీరనుకుంటున్నారు. ఆమె చేసుకున్న పరిష్కారం నిజమయింది కాదు - కేవలం గత్యంతరంలేని పరిస్థితుల్లో విధిగా తీసుకున్న నిర్ణయం."

"అయితే మిగిలిన భిక్షుణీల సంగతి కూడా అంతేనంటావా సోదరీ!?"

"ఒక్కసారి వారి సంఘానికెళ్ళి వాళ్ళ కార్యకలాపాలు చూడండి - సంతోషంగా స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. ఇరుకు గదుల్లో నుండి విశాల ప్రపంచంలోకి అడుగుబెట్టి ఎంతో మానసిక వికాసాన్ని పొందుతున్నారు - మానవశక్తికి సంబంధించిన ఒక వినూత్న ప్రపంచాన్ని దర్శిస్తూ అందులో హాయిగా జీవిస్తున్నారు. కాదంటారా!"

"కాదని ఎలా అనగలం. ఈ భిక్షుణీ సంఘానికి ప్రథమంలో మీరంగీకరించలేదు. అది కూడా స్త్రీల ఒత్తిడిపైనే ఒప్పుకున్నారు. ఇక్కడ మీరు గుర్తించాల్సింది. ఆ మార్గం కావాలనుకున్నవాళ్ళకు అది ఆనందాన్నిస్తుంది. కానీ భర్తలు తమతో కలిసి జీవించాలనే మాబోటి వాళ్ళకు మీరేం పరిష్కారం చూపిస్తారు" ఆమె మాటల్లో పట్టుదల -

"మార్గాలను మార్చుకోవటం మాటిమాటికి జరగదు - నా లక్ష్యాన్నందుకునేవారే ధర్మస్వీకారాని కర్హులౌతారు. ఎప్పటికప్పుడు. ఎవరేది చెబితే దానినల్లా అంగీకరిస్తూపోతే సిద్ధాంతం మొదలంటూ శిథిలమౌతుంది. పాఠశాలలో నిర్ణయించిన పాఠ్యాంశాల్ని పూర్తిచేస్తేనే కదా ఉత్తీర్ణత. విశ్వసామ్రాజ్యంలో ఎల్లలెరుగని ప్రేమయే మా సిద్ధాంతం. వ్యక్తిగత త్యాగాలు దాని విధానం"

"అంటే భార్యాభర్తల ప్రేమ వైయక్తికమా? - దానిలో ఉన్న దోషమేమిటి? అందులోని స్వార్థమేమిటో అర్థంకాదు. ప్రపంచమంతా ఒకే విధానంలో రూపుదిద్దుకున్న వ్యవస్థ ఇది. ఈ వ్యవస్థకు కూడా మూలం ప్రేమ - దాన్ని ఎవరి శక్తికొద్దీ వాళ్ళు గ్రహించి ఆనందిస్తున్నారు - అందులో దంపతుల ప్రేమ ఒకటి. సుకుమారమై సుమనోజ్ఞమై లలిత సుమరేకు వాకిట చిన్న తాకిడికే కసుగందు మల్లెమొగ్గకు సమమైన ప్రేమలాలిత్యాన్ని అనుభవించనిదెవరు.

తొలి సంధ్య నూతన కాంతిలో తళతళలాడు సెలయేటి కెరటాల కదలికలో - చిరుగాలి సవ్వడిలో ఎలతేటిపాటలో - పూలగుబాళింపులో తానే జగత్తై జగత్తే తానై భాసించే ప్రేమరసాస్వాదనం మధురంకాదా? దానిలో తడిసి పులకించని వారెవరు? శోక సముద్రంలో మునిగి తేలుతున్న వారికి ఓదార్పు ప్రేమే అయినప్పుడు దానికి దంపతులు సన్యాసులనే భేదం ఎందుకు? అందరూ పరివ్రాజకులు కాలేరు కదా - అటువంటప్పుడు మా భర్తల ప్రేమకు దూరమై బ్రతకమంటం ఎంత వరకు న్యాయం?" ఆమె ఆగింది - అంత ధైర్యంగా గౌతమబుద్ధుని ఎదుట తాను మాట్లాడతాననుకోలేదు. బుద్ధుడు కూడా ఆశ్చర్యపోయాడు. చక్కటి సాహిత్యావగాహనతో ఆలంకారికమైన భాషా సౌందర్యం ఆయన్ను ముగ్ధుడ్ని చేసింది. వికసించిన పూవుకు పరిమళంలా ఈమె రూపానికి విజ్ఞానం వన్నె తెస్తోందనుకున్నాడు. పైకి మాత్రం ఒక చిరునవ్వు నవ్వాడు.

"అమ్మా! నువ్వు చెప్పింది కాదనటంలేదు. భౌతిక ప్రేమ సరిహద్దుల మధ్య బిగించబడి ఉంటుంది. అందువల్లనే అది విశ్వజనీనాన్ని వ్యక్తీకరించలేదు. ఈ ప్రేమకు అవధుల్లేవు. ఇది అనంతం. ఒకచోట పరిమితమయ్యేది ప్రేమెలా అవుతుంది? వ్యామోహమవుతుంది. తనను అందరిలో చూసుకోగలిగిన దివ్యసౌందర్యభావన కావాలి. అది మానవాళిని ఒకే ప్రేమ సముద్రంలో అలలుగా మారుస్తుంది. ఒకే ఆకాశంలో నక్షత్రాల్లా కూరుస్తుంది. అనంతంలో ఏకత్వం కావాలి. సార్వజనీనమైన ప్రేమ ఒక వృక్షానికి ఫలాలుగా అవనికి కురిసే జలాలుగా పరోపకార భావనతో హృదయం నిండిపోవాలి. కారుణ్య భావనతో పండిపోవాలి" ఆయన ముఖంలో నిశ్చలమైన భావం -

వింటున్న వాళ్ళు మంత్రముగ్ధులయ్యారు. నాగస్వరానికి కట్టుబడ్డ పాముల్లా తలలూపుతున్నారు.

సుందరి తనవాదాన్ని విడిచిపెట్టలేదు. ఎలాగయినా ఆయనను ఒప్పించి తీరాలి. లేకపోతే ఇక మళ్ళీ జన్మలో ఈ అవకాశం రాదు. అందుకే ఆమెలో పట్టుదల అంతకంతకు అధికమౌతోంది.

"మీరు నా మాటల్ని అపార్థం చేసుకోకండి. ఎందుకంటే నాణానికి రెండోవైపు కూడా ఉంటుంది. పవిత్రమైన కుటుంబ జీవనం వ్యామోహమయింది కాదు. ఈ వ్యవస్థే లేకపోతే మానవజాతి నిలువనీడలేని అభాగ్యలా అవుతుంది. కూలిన గోడలా మిగులుతుంది. సమాజమనే పక్షికి స్త్రీ పురుషులు రెండు రెక్కల్లాంటివారు. అది సమాన స్థాయిలో ఎగరాలంటే రెండు రెక్కలు సరిగా పనిచేయాలి. అటువంటిది ఒక రెక్క పక్షితో మీ ధర్మ కపోతాన్నెలా ఎగురవేస్తారు? అది స్త్రీ పట్ల పక్షపాతంగా వ్యవహరించటం కదా?"

మంచి విజ్ఞానదాయకమైన ఆ సంభాషణ శిష్యులు కూడా ఉత్సాహంగా వింటున్నారు. ఇద్దరిలో ఎవరికెవరు తీసిపోవటంలేదు. రసపుష్టి భావపుష్టితో ఉన్న ఆ మాటలు వారికెంతో ఆసక్తిగా ఉన్నాయి.

బుద్ధుడు మాట్లాడుతూ -

"ధర్మమనేది చాలా కష్టమయింది. దాని పునాదితో ఏర్పడ్డ సిద్ధాంతానికి ఒకరెక్క రెండు రెక్కలు అనే ప్రశ్నేలేదు. ఆచరణం అత్యంత ముఖ్యం. అది సరిగా లేనినాడు ఎన్ని రెక్కలుండీ ఎగరలేదు. దానికావాల్సింది మంచి నడవడి - దాని నిర్వహణలో బలహీనులు

లేదా బలహీనపరిచే వాతావరణాన్ని దూరీకరించుకోవటం ముఖ్యం - ఒక వృక్షం బలంగా ఎదగాలంటే చుట్టూ అందమయిన చెట్లున్నా తొలగించుకోక తప్పదు. నా సిద్ధాంతం కూడా అంతే. ఇది పరిపుష్టంగా శాశ్వతమైన మనుగడ సాధించాలంటే కొన్ని కష్టమైన నియమాలు పాటించక తప్పదు" - స్థిరంగా ఉన్నాయి అతడి మాటలు.

"ఒక్క ప్రశ్న అడుగుతాను ఏమనుకోరుగా?" సుందరి అడిగింది.

"అడుగు తల్లీ - సందేహమెందుకు?"

"అనుకున్నది సాధించాలంటే కొన్ని పొందాలి. మరికొన్ని విడవాలి. తప్పదు. కానీ మీరు నాటిన ఈ సిద్ధాంత బీజం కొన్నాళ్ళకు మొలకెత్తి పెరిగి శాఖోపశాఖలై పుష్పించి ఫలిస్తుంది. అయితే దాని ఆయువెంత? ఆ తర్వాత వృక్షం కుళ్ళిపోక తప్పదు. దాని పళ్ళు ఆకులు కొమ్మలు వాడిపోకా తప్పదు. ఒకనాటికి చెట్టు పూర్తిగా నశిస్తుంది. అటువంటి తాత్కాలికమైన వృక్షాన్ని చూపించి దీని పళ్ళు అపూర్వం. ఈ చెట్టు శక్తి ఎప్పటికీ తరగదు. దీని ఉనికి శాశ్వతమనగలరా? అది హేతుబద్ధమా! చెప్పండి -"

సుందరి అడిగిన ప్రశ్నకు గౌతముడు కొంచెంసేపు ఆలోచించాడు.

"మంచి ప్రశ్న అడిగావమ్మా! సిద్ధాంతాలనేవి మానవుడి ఆలోచనా శక్తిని అతని పరిజ్ఞాన శక్తి సామర్థ్యాలను అతని పెరుగుదలలోని ప్రతి స్థాయిలోను ఉన్నత ప్రమాణాలను అభివృద్ధి చేస్తాయి. నూతన యుగంలో ఇది వరకటి కంటే మిన్నయైన శక్తిని సమకూర్చుకుని ముందుకు సాగిపోవడానికే నా ప్రయత్నమంతా. నాకు తెలుసు ఎందరో ఆరాధిస్తారు. మరెందరో నిందిస్తారు. ఈ రెంటిని సమన్వయం చేసుకుని పోగలిగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరగలను."

"చెట్టు నశిస్తుందన్నావే - అది నిజంకాదు. ఆ చెట్టు దానితో సమసిపోవటంలేదు. దాని పళ్ళు తిన్నవారు విత్తనాలను భద్రపరుస్తారు. మరోచోట జాగ్రత్తగా నాటుతారు. మళ్ళీ చెట్లు వస్తాయి. అవే పళ్ళు కాస్తాయి. అవునా - పూర్తిగా నశింపు దేనికీలేదు. అందుకే ఆగామినేత్రం కోసం అపూర్వ గవాక్షాలు తెరుస్తున్నాను. వాస్తవానికి - కాల్పనికతకు మధ్య విభజనరేఖ చెరిపేస్తూ కొత్త ప్రపంచానికి దారులు వేస్తున్నాను. లక్షల సంవత్సరాలు కాకపోయినా కొన్ని శతాబ్దాలవరకు నా సిద్దాంతాలు నిలబడతాయి. ఆ నమ్మకం నాకుంది. అది పునాదిని పటిష్టంగా నిర్మించేవారిమీద ఆ బాధ్యత ఉంది కనుక నా గమనంలో తప్పటడుగులు దొర్లకూడదు"

ఉదాత్తమైన ఆ మాటలకు అందరూ చలించిపోయారు. సుందరి కళ్ళు చెమర్చాయి. దేహం గగుర్పాటుకు లోనైంది ఆయనందుకే మహానుభావుడయ్యాడనుకుంది. అయినా విడిచిపెట్టలేదు.

"దయచేసి నాదొక్క మనవి వినండి. మహోన్నతమైన మీ ఆదర్శాన్ని విమర్శించటంలేదు. మీరు వేసే ప్రతి అడుగు అందరికీ అందుబాటు కావాలి. అదే నా వేదన. అందరూ భిక్షుకులు కాలేరు. గృహస్థ ధర్మాన్ని విడచి అనుసరించమనటం ఎంతవరకు సమంజసం.?

ఈ వృద్ధురాల్ని చూడండి - ఈమెకు డెబ్బై సంవత్సరాలు. ఒక్కగానొక్క కొడుకు. భర్త పోయాడు ఆస్తి యవ్వనం అన్నీ అంతరించాయి. ఈ వయసులో ఆమెకు కన్నూకాలూ అన్నీ కొడుకే. అటువంటి కొడుకు భిక్షువై ఇల్లు విడిచి పెట్టాడు. ఇప్పుడామెని ఎవరాదుకుంటారు.

ఈ పసిపిల్లల్ని చూడండి. తండ్రికోసం బెంగపెట్టుకుని చిక్కిశల్యమయ్యారు. దాదాపుగా ఇక్కడికొచ్చిన స్త్రీలంతా భర్త వియోగంతో బాధపడుతున్నవారే. అనుశ్రుతంగా సృష్టి ఆవిర్భావంనుండి వస్తున్న స్త్రీ పురుష సంబంధాలను తెంచటం ద్వారా మీ ధర్మం పరిపూర్ణం కాదు. రాజయోగంలాగా భార్యాభర్తలు కలిసి ఆదరించినప్పుడే పరిపుష్టమవుతుంది.

మొన్న నగరంలో రత్నశ్రేష్టి భార్య మరణం స్త్రీలల్లో తమపట్ల అపార్థాలకు తావిస్తోంది. అందుకే మరొక్కసారి ఆలోచించండి. మేమంతా మీ మార్గానుసక్తులం. అయితే మా భర్తలతో కలసి ఈ ధర్మప్రచారం కొనసాగించటానికి సిద్ధంగా ఉన్నాం.

వివాహం స్వచ్ఛందంగా మానుకోవాలనుకునేవారి విషయంలో ఎవరికయినా అభ్యంతరమేముంటుంది. కానీ వివాహమై గృహస్థ ధర్మంలో ఉన్నవారు సన్యసిస్తే కుటుంబమే సమూలంగా కూలిపోతుంది. ఈ ఆందోళన పెరిగి పెద్దదయితే మీ ధర్మప్రచారానికి ఒకవైపు కంటకంలా బాధించదా? నిరంతరం మీ మనసును వేధించదా? సమాజం కోసమే ఈ సిద్ధాంతమైనప్పుడు సమాజంలో ప్రధాన పాత్రలయిన స్త్రీల మీద చిన్న చూపు ఎందుకు? మొదటినుండి ధర్మకర్మాల నిర్వహణలో దంపతులకగ్రతాంబూలం ఉంది. అందువలన తమరు భిక్షుణీ మండలికవకాశం ఇచ్చినట్లే భార్యాభర్తలు కలసి చేసే విధంగా మరో మండలిని ఏర్పాటుచేయండి. దానివల్ల మీరనుకున్న ఆశయం శాఖోపశాఖలై విస్తరిస్తుంది. దీనిమీద మీరు ఆలోచించి మాకు న్యాయం చేస్తారని భావిస్తూ మీకు కలిగించిన శ్రమకు మన్నించమని అడుగుతూ ఇక శలవు తీసుకుంటాం"

వినయంగా బుద్ధుడి పాదాలకు నమస్కరించి ఆమె వెనుతిరిగింది. రోహిణి వెంట తారలా అందరూ ఆమెననుసరించారు. అందరూ వెళ్ళిపోయాక గౌతముడు మరోసారి పరీక్ష ఎదుర్కోక తప్పలేదు - అతని మనసులో ఆమె మాటలు పదేపదే వినిపిస్తున్నాయి.

శిష్యులంతా మరోసారి వత్తిడి తెచ్చారు. వాళ్ళకు జరిగిన చేదు అనుభవాలు కూడా కారణం కావచ్చు - మౌద్గల్యుడు ఈ వాదాన్ని సమర్థించాడు. ఇప్పుడున్న ఆవేశం రేపటికి ఉండకపోవచ్చు. కనుక గృహస్థుగానే ఉండి బౌద్ధధర్మాన్ని ప్రచారం చెయ్యాలనుకున్న వారికి మరోశాఖ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం తెలియజేసాడు.

ఆ రాత్రి అదే విషయమై రెండు జాములవరకు చర్చ జరిగింది. ఎక్కువ శాతం మౌద్గల్యుడి వాదనను సమర్థించారు. అందరి అభిప్రాయాలు విన్నాక బుద్ధుడు శాంతంగా ఒకేమాట అన్నాడు -

"నేను నా ఆశయాన్ని ఎవరికోసమో మార్చుకుంటూపోతే చివరికి మిగిలేది బుద్ధుడుకాదు - సిద్ధార్థుడే నన్ను నమ్ముకుని నాకోసం అన్నీ వదిలివచ్చిన మీ మాటా కాదనలేను. అందుకే అప్పుడప్పుడూ కొన్ని మార్పులు అంగీకరించాల్సొస్తుంది. ఏ సిద్ధాంతమైనా ఎక్కువకాలం నిలవాలంటే దాని మనుగడ కాపాడుకోవటంలోనే ఉంది. స్త్రీలు - బలహీనులు. వాళ్ళకు అనేక ప్రాకృతిక ఇబ్బందులున్నాయి. కఠిన నియమాలను ఆచరించటం బహుకష్టం. అందుకే వద్దన్నాను తప్ప వారిమీద చిన్న చూపుతోకాదు. దీనినంగీకరిస్తే వెయ్యి సంవత్సరాలకు వేసిన ప్రణాళిక దెబ్బతింటుంది. ఇది నిలిచేది కేవలం ఐదు వందలసంవత్సరాలు మాత్రమే. ఇకనేను చేయగలిగిందికూడా ఏమీలేదు. అంతా కాలానికే వదిలేస్తున్నా. గృహస్తుల దీక్ష విషయమై జరిగే నష్టం అంతగా లేదు కనుక దాన్ని గురించి మరోసారి చర్చిద్దాం - ఇక విశ్రమించండి"

భగవానుడు తన శయ్యమీదకెళ్ళి పడుకున్నాడు. అర్ధనిమీలితాలైన ఆయన నేత్రాల్లో భవిష్యదర్శనం కనిపిస్తోంది. గాఢంగా ఒక నిట్టూర్పు ఆయన హృదయం నుండి భారంగా బయటకు వచ్చింది. తెలియకుండానే నిశాదేవి ఒళ్ళో నిద్రదేవత జోకొట్టగా హాయిగా నిద్రపోయాడు.

హఠాత్తుగా శుద్ధోధనుడు జబ్బుపడ్డాడు. దేశంలోని వైద్యులంతా అక్కడే ఉన్నారు. నాడి చాలా బలహీనంగా కొట్టుకుంటోంది. ప్రాణం పోకడ ఏక్షణమో అన్నట్టుంది. వైద్యులంతా పెదవి విరిచారు. అయినవాళ్ళందరికీ కబుర్లు వెళ్ళిపోయాయి. రెండు రోజుల్నుండి సుందరి అక్కడే ఉంది. పరిచర్యలు చేస్తూ మాటిమాటికి ఆయన కళ్ళు తనవాళ్ళకోసం వెతుక్కుంటూనే ఉన్నాయి. క్షణక్షణానికి క్షీణిస్తున్న అతని ఆరోగ్యం చూసి సుందరి మాటిమాటికి కళ్ళు తుడుచుకుంటోంది.

ఈమధ్య కాలంలో నందుడు ఇల్లువిడిచి వెళ్ళాక ఆమెకు మామగారితోనే కాలక్షేపమయింది. తరచుగా వచ్చి ఆయన మంచిచెడ్డలు చూస్తోంది - గౌతమి - యశోధర భిక్షుణీ సంఘంలో ఉండటంతో మందిరంలో వృద్ధభూపతి ఒక్కడే మిగిలాడు.

ఈరోజు ఆయన మరణానికి చాలాచేరువలో ఉన్నాడు. ఇప్పటివరకు తన తండ్రిని ఆయనలో చూసుకుని ఊరటపొందుతోంది. ఆయనతో నిరంతరం జరిపే ధార్మిక చర్చలతో ఆమెకు పొద్దుపోతోంది. తనని బాగా అర్థంచేసుకున్న ఈ ఒక్కతోడూ తనని విడిచివెళ్ళిపోతున్నాడు. రేపటినుండి తాను మరింత ఒంటరి. తనలో బాధ ఎవరికి చెప్పుకోగలదు. ఈ ప్రపంచంలో ఏకాకిగా మిగిలిపోయింది.

కుమిలి కుమిలి ఏడుస్తున్న కోడలిని ఓదార్చాడు శుద్ధోధనుడు.

"చూడమ్మా! నువ్వెంతో ధైర్యవంతురాలివి - ఎన్నో పరిస్థితులను తట్టుకుని నువ్వు నమ్మిన సిద్ధాంతంకోసం నిలబడ్డావు. నాకు కూతుళ్ళు లేరనే కొరత నీవల్ల తీరింది. నా చిన్నకోడలు ఎంతో తెలివయింది. ధీరురాలు అని సగర్వంగా చెప్పుకునేవాడిని. పండినపుడు రాలక తప్పదు. మృత్యుపిలుపు వచ్చినప్పుడు వెళ్ళకా తప్పదు. ఇది సహజం. దీనికోసం విజ్ఞులైనవారు శోకించకూడదు"

మాటలు బలహీనంగా వస్తున్నాయి - ఆయాసంతో గుండె ఎగిసిపడుతున్నది.

"మీరు కూడా దూరమైతే నాకెవరున్నారు మామయ్యా. ఎవరితో మాట్లాడను. ధైర్యం చెప్పి నన్ను ఓదార్చేదెవరు?" - ఆమె దుఃఖం అంతులేకుండా ఉంది.

"చూడు తల్లీ! నీ మాటల్లో అర్థం నేనిప్పుడే తెలుసుకోగలుగుతున్నాను. ఆనాడు ఎంతో ఆవేదనతో చెప్పావు. కుటుంబ వ్యవస్థని కాపాడమని - అది నాకు సాధ్యంకాలేదు. దాని పర్యవసానం ఇప్పుడనుభవిస్తున్నాను. అంతా ఎవరికి వారుగా మిగిలిపోయారు. కుటుంబమనే దారానికి కట్టుబడ్డప్పుడే నిండుగా ఒకరినొకరు అండగా మమతానురాగాలతో జీవితం సంపూర్ణమౌతుంది. నాకొడుకు ప్రపంచాన్ని కుటుంబంగా మార్చాడు. అందుకే ఈ చిన్న విషయాలనతడు పట్టించుకోవటంలేదు. కానీ నాలా చనిపోయేముందు ఎవరికి అయినవాళ్ళు దగ్గరలేని పరిస్థితి రాకూడదని మాత్రం కోరుకుంటున్నాను. నీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. తల్లీ! అంత పెద్దకుటుంబం నాకొద్దు. నా చిన్న కుటుంబం నా వాళ్ళంతా నా ఎదురుగా ఉంటే చాలు.

ఒక్కసారి అందర్నీ చూడాలని ఉంది. వస్తారంటావా! అమ్మా! "

ఆయన కళ్ళల్లో నీళ్ళు - సుందరి వాటిని తుడుస్తూ -

"తప్పకుండా వస్తారు మామయ్యా! ఎంత సన్యాసం తీసుకున్నా జన్మనిచ్చిన తండ్రిని చూడటం విధి. మరొక్కసారి నేను కబురుచేస్తా. మీరు నిశ్చింతగా ఉండండి"

వెంటపెట్టుకుని తీసుకురమ్మని మంత్రిని స్వయంగా ఆదేశించి మళ్ళీ, ఆయన పక్కనే కూర్చుని మెల్లగా గుండెమీద రాస్తోంది. బయటగాలి ఉధృతంగా వీస్తున్నది. గదిలో చల్లటి వాతావరణం ప్రవేశించటంతో లేచి కిటికీ తలుపులన్ని వేసి పరదాలు సరిచేసింది. మసకచీకటిగా ఉండటంతో పరిచారికలను పిలిచి తైలదీపాలు పెట్టించింది. ఆయన ప్రాణంలాగానే అవికూడా రెపరెపలాడుతున్నాయి.

గదిలో ప్రధాన వ్యక్తులంతా చేతులు కట్టుకుని మౌనంగా నిలబడి ఉన్నారు. బంధువులు మెల్లమెల్లగా ఒక్కొక్కరే వచ్చి చేరుకుంటున్నారు. వైద్యుడి ఆదేశం మేరకు అందరూ శబ్దం చేయకుండా చూస్తూ నిలబడ్డారు. సుందరి మళ్ళీ వచ్చి ఆయన పక్కనే కూర్చుంది శుద్ధోధనుడు ఆమె ముఖంలోకి చూస్తున్నాడు. తెలియని బాధ ఆ ముఖంలో ద్యోతకమౌతోంది. అదంతా అశ్రువుల రూపంలో బయటికొస్తోంది. ఆమె తుడుస్తూనే తనుకూడా ఏడుస్తోంది.

"నిన్ను చూస్తుంటే బాధగా ఉందమ్మా! పసివయస్సులోనే భర్తకు దూరమై ఎంత వేదన పడుతున్నావో అర్థమవుతూనే ఉంది. అటు పన్నెండు సంవత్సరాలు పెద్దకోడలి ఏడుపు చూసి చూసి ఇలా అయ్యాను. ఇక నీ కన్నీళ్ళు పూర్తిగా చూడకముందే దాటిపోవటం నా అదృష్టం. త్యాగానికి బలైపోయిన నా కుటుంబాన్ని దుఃఖానికి ప్రతిరూపంగా చూస్తున్నాను. ఎవరికేం చెప్పాలో, నేనేం చెయాలో

అర్ధంకాని స్థితిలోనే వెళ్ళిపోతున్నాను. నీకు మంచి జరగాలని ఆఖ్యాదేవిని కోరుకుంటున్నాను అంతకంతకు ఆయనలో ఆయాసం ఎక్కువవుతున్నది.

"ఏరీ - వాళ్ళు ఇంకా రాలేదా - నీ ప్రయత్నం నెరవేరాలని ఆశీర్వదిస్తున్నాను" ఆయన కళ్ళు గుమ్మం వైపే చూస్తున్నాయి. అందరికంటే ముందు రాహులుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. బోడితల కాషాయబట్టలతో ఉన్న మనుమడిని గుర్తించటం కష్టమే అయింది.

"తాతయ్యా!" అంటూ వచ్చి పక్కన కూర్చున్నాడు. మనుమడి చెయ్యితీసి తన గుండెలమీద పెట్టుకుని -

"నాయనా! మీ అమ్మ - నాయనమ్మా వస్తున్నారా?" అడిగాడు -

"వస్తున్నారు తాతయ్యా! ఆశ్రమం నుండి అనుమతిరావటంలో కొంత ఆలస్యమయింది. - అరుగో - వచ్చేస్తున్నారు" అన్నాడు.

సుందరి ఆదేశం మేరకు రాహులుడు తాతగారి గొంతులో తులసినీళ్ళుపోస్తున్నాడు.

ఇంతలో కాస్త కుడి ఎడంగా అందరూ వచ్చేసారు - గౌతమి - యశోధర - దేవదత్తుడు నందుడు ముందుగా వచ్చారు. ఆలస్యంగా గౌతముడు తన శిష్యులతో వచ్చి చేరుకున్నాడు. వాళ్ళందరిని ఒకచోట చూసి ఆయన ముఖం వెలిగిపోతున్నది. మృత్యుదేవత పదఘట్టనలు ఆ గదిలో వినిపిస్తుంటే అందరూ రోదిస్తున్నారు. గౌతముడు తప్ప - కనీసం మరణమైనా తన వాళ్ళందరిని కాసేపయినా ఒకచోట చేర్చిందనుకున్నాడు శుద్ధోధనుడు -

శాక్యసంఘం వాళ్ళు పెద్దయెత్తున వచ్చారు. మంత్రులు, దండనాధులంతా అక్కడే ఉన్నారు.

అందరిని కళ్ళనిండుగా కడసారి చూసుకున్నాడు - దీక్షతీసుకున్నా సహజమైన ప్రేమాభిమానాలెక్కడికిపోతాయి. గౌతమి భర్త కాళ్ళదగ్గర కూలబడి ఏడుస్తోంది. ఇన్నేళ్ళ దాంపత్యం ఎన్నో కష్టసుఖాలును కలసిపంచుకున్నారు. ఈరోజు తనని విడచి ఆయనొక్కరే వెళ్ళిపోతున్నారు. ఆమె తట్టుకోలేకపోతోంది. సన్యాసం శరీరం తీసుకున్నా మనసుకు రావాలిగా - ఈ నూతన విధానం ఇన్నేళ్ళ అనుబంధాన్ని సడలించలేకపోతోంది.

యశోధర రాహులుడివైపు కూర్చుని రోదిస్తోంది -

"అమ్మా! యశోధరాం" శుద్ధోధనుడు పిలిచాడు -

"ఏం మామయ్యా!?" ఆమెకు వెక్కిళ్ళు ఆగటంలేదు.

ఒకప్పుడు ఆమె ఎంత సౌందర్యవతి. కానీ ఇప్పుడున్న ఈ రూపం చూస్తుంటే ఆయన గుండె తరుక్కుపోయింది.

"తల్లీ! మావంశంలో అడుగుపెట్టి మా కీర్తిని పెంచావు. ఉన్నతమైన నీ నడవడిక నీ ధర్మానుసరణం వల్ల శాక్యకులానికి శాశ్వతమైన కీర్తివచ్చింది. నీకేం న్యాయం జరిగిందో తెలియదు. మావలన నీకు కలిగిన కష్టానికి నష్టానికి మమ్మల్ని క్షమించు. నీ భర్తలోకోత్తముడు. ఆయన బాటలో నడుస్తూ ఆదర్శనారీమణివయ్యావు. అదే నీకు రక్ష. చివరిసారి నా ఆశీస్సులందుకోమ్మా" బలహీనంగా ఉన్న చేయెత్తి ఆమె తలమీద ఉంచాడు.

యశోధర తనను తాను నిగ్రహించుకోలేకపోయింది. పమిటచెంగు పూర్తిగా ముఖానికి కప్పుకుని బిగ్గరగా రోదించింది. సుందరి ఆమెను శాంతపర్చటానికి పక్కకు తీసుకెళ్ళింది.

"గౌతమీ! ఇటురా! నా ఎదురుగా రా!" ఆమె వచ్చి నిలబడింది "గౌతమీ నువ్వు కాపరానికి రాగానే నెలలబిడ్డ గౌతముడిని, ఇదిగో నా ప్రాణం ఎలా చూసుకుంటావో అని నీ ఒళ్ళో పడేసాను. నిజంగా మాతృలోకానికే గర్వకరాణం నువ్వు. సొంత బిడ్డలకంటే ఎక్కువగా సాకి మహోన్నతమైన వ్యక్తిగా తీర్చిదిద్దావు. నీకంటి వెలుగు ఈనాడు జగత్తుకే వెలుగునిస్తున్నాడు. ఆ మార్గంలో నడుస్తూ నీ

జన్మచరితార్థం చేసుకున్నావు. మహిళల్లో మణిపూసవు. నీ వల్లే నాకు ఇహమూ పరమూ సిద్ధించాయి. ప్రేమమయివి. సహనశీలివి. బుద్ధదేవుని పరిపూర్ణ ప్రేమామృతము నీకు దక్కాలని, నేను లేనిలోటు సాధు సజ్జన సేవనం వలన తీరాలని కోరుకుంటున్నాను. "

తరువాత ఆయన దృష్టి నందుడి మీద పడింది. నందుడు దగ్గిరకొచ్చాడు. "నాయనా! నందకుమారా! ఎంతో పుణ్యం చేస్తేనే కానీ మంచి భార్య దొరకదు. అద్భుతమైన తెలివి సౌందర్యం కలబోసుకున్న జాతిరత్నం నీ భార్య. ఆమెను జారవిడుచుకోకు. నీ పట్ల ఆమె ఇప్పటికీ ఎంతో సహనం చూపిస్తోంది. మరింత బాధపెట్టి ఆమె వ్యక్తిత్వ వికాసాన్ని తగ్గించకు. ధర్మసాధనలో మీరిద్దరూ గౌతమబుద్ధుడి మార్గంలో నడవాలని నా కోరిక"

నందుడు మౌనంగా తలూపాడు. విడిపోయాక భార్యాభర్తలు కలుసుకోవటం అదే ప్రథమం.

తరువాత వృద్ధభూపతి కళ్ళు గౌతముడి వైపు మళ్ళాయి. రెండో సూర్యుడిలా వెలిగిపోతున్న కొడుకు ముఖం చూడగానే ఆయన కళ్ళల్లో గర్వం తొణికిసలాడింది.

"కుమారా! ఒక్కసారి నా దగ్గరకు వచ్చి కూర్చోనాయనా! ఇంత పిల్లవాడిగా ఉన్నప్పుడు ఈ గుండెలమీద మోసాను, నీ చిరునవ్వుల్లో తడిసి పులకరించేవాడిని. ఈనాడు... నేనందుకోలేనంత ఎత్తుకు ఎదిగిపోయావు, తండ్రీ - మాట్లాడేశక్తి తరిగిపోతోంది. కన్నతండ్రిని కడసారి విన్నపం మన్నిస్తావా" ఆశగా, చెయ్యిచాపాడు.

"తప్పక నాన్నగారూ! మీకు ఆనందం కలిగే పని జరుగుతుంది. మీరు ప్రశాంతమైన మనస్సుతో ఉండండి" అన్నాడు గౌతముడు తండ్రి చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు. "ఏం లేదు నాయనా నీ మార్గాన్ని ఆపే శక్తి నాకులేదు. సాక్షాత్తూ భగవంతుడి అవతారానివి నీకు చెప్పేపాటివాడిని కాదు. ఈ రాజ్యం నీకు తృణప్రాయమని తెలుసు. దీన్ని స్వీకరించవు. నీ తమ్ముళ్ళు, నీ కొడుకు నీ మార్గంలోనే నడుస్తున్నారు. అందువలన ఈ రాజ్యాన్ని శాక్య సంఘానికి అప్పచెబుతున్నా. నీ కభ్యంతరంలేదుగా"

వెంటనే శాక్య సంఘం పెద్దలు ముందుకొచ్చారు -

"మన్నించండి మహారాజా! మా అహంకారం మూలంగా మీరేం నష్టపోయారో మాకు తెలుసు. అయినా ప్రపంచానికి మేలే జరిగింది. ఇంతవరకు నిర్ణయాధికారం శాక్య సంఘానిదే అయినా ఇప్పుడు మేమంతా ఆయన మార్గంలో నడవాలని నిర్ణయం తీసుకున్నాం. విశ్వమే ఆ మహానుభావుడికి జేజేలు పలుకుతుంటే ఈ సంఘం ఈ రాజ్యం ఎంతని - అందుకే వారికే అర్పించతలిచాము. ఇక్కడినుండి బుద్ధరాజ్యంగా వ్యవహరించబడుతుంది. వారే అధికారిని నిర్ణయించటానికి అర్హులు. మీరేమంటారు? "

సంఘపెద్దల్లో వచ్చిన మార్పుకు శుద్ధోధనుడి కళ్ళు చెమర్చాయి - తాను రాజ్యం కోసం బిడ్డను వదులుకున్నాడు. తన బిడ్డ కోసం, ప్రజలకోసం రాజ్యాన్నే త్యాగం చేసాడు. అయినా అహికారం ఆయన పాదాలముందు మోకరిల్లుతోంది. తనను స్వీకరించమని.

"అహా! నా జీవితం ధన్యం నాయనా! అపూర్వమైన నీ త్యాగంతో నన్ను పునీతుడ్ని చేసావు. నీవంటి బిడ్డకు జన్మనిచ్చినందుకు మోక్షద్వారం నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. చాలు ఈ విషయంలో నాకు నిశ్చితంగా ఉంది. అసలు కోరికే మిగిలిపోయింది. అడగనా?"

గౌతముడు తండ్రికి మరింత ఓదార్పునిస్తూ.

"నాన్నగారూ ధర్మవిరుద్ధంకాని కార్యం ఏదయినా నిస్సంకోచంగా చేయగలను - ఈ లోకంలో అందరూ నాపై శాసకులే. వారి కన్నీళ్ళు తుడవటమే నా ధ్యేయం. చెప్పండి మీకోసం నేనేం చెయ్యగలను. కాంక్ష సర్వానర్థాలకు మూలం. అదివున్న వాడికి మృత్యువుకూడా మోయరానిదవుతుంది. మమత్వం అన్ని శాంతులకు కారణం నిజమైన శాంతి పథంలో ప్రయాణిస్తున్న నాకే కోర్కెలు లేవు. మీరు అడిగేది బౌద్ధధర్మానికి సమ్మతమయితే తప్పక నెరవేరుస్తాను."

ఆ సమయంలో కూడా ఏ మాత్రం మోహావేశాలకు లోనికాని అతని వ్యక్తిత్వం మేరునగంలా అనిపించింది. చూసేవాళ్ళకు. ధర్మసూక్తమైన ఆ మాటలు విని అతని ఒడలు పులకరించింది. రెండు నేత్రాలు ఆ దివ్య స్వరూపాన్ని నింపుకున్నాయి. హృదయమంతా ప్రేమ వెల్లువై దానిలో ఇంద్రియాలు తడిసిపోతున్నాయి. జన్మరాహిత్యాన్ని కలిగించటానికే తెంచిన మోక్షప్రతగా కనిపిస్తున్నాడు. సుందర విగ్రహం సమ్మోహనమై అతన్ని విభ్రాంతిలో ముంచుతోంది - పదే పదే కళ్ళు అశ్రువులు చిలుకుతున్నాయి. అణువణువు బుద్ధుడి అస్థిత్వాన్ని నింపుకుంటోంది. వ్యామోహాలంతరించాయి.. కోర్కెలణిగిపోయాయి. ఎన్నడెరుగని నూతన లోకాల ద్వారాలు తెరుచుకుంటున్నాయి. ఆ పరవశత్వంలో మునిగితేలుతూనే -

"నాయనా! నీ ధర్మమార్గానికి నేనెన్నడు అడ్డురాను. గురువు దైవం.. నీవే.. కోర్కెలంతరించాయి. కానీ ఒక్కటి న్యాయంచెయ్యి. సుందరి నిన్ను కలిసి చెప్పిన మాటలసారాంశం గుర్తుంచుకో. తమ్ముడు మరదలు కలిసే నీ బాటలో నడవాలి. ఈ మార్పును నీవంగీకరించాలి. లోకంలో భార్యాభర్తలు కలసి నీ ధర్మమార్గాన్ని.... అ...ను...స"

మాట ఆగిపోయింది. బుద్ధుడి సుందరరూపాన్ని నింపుకున్న కళ్ళు ఇక తెరవకూడదన్నట్టు శాశ్వతంగా మూతలు పడ్డాయి - వివశమైన ఇంద్రియ స్థితినుండి మమకారపు సరిహద్దులు దాటుకుంటూ అగాహమైన చీకట్లోకి జారి పోయిందాజీవి.

బంధువుల ఏడ్పుల మధ్య ఏడుకట్ల సవారి బయలుదేరింది. మేడ విడిచి, గూడు విడచి, తనదనుకున్న సర్వం విడచి ఏకాకిగా సాగిపోతోంది. ఇక కన్నీళ్ళు కార్పణ్యాల కలతలు ఏమీలేవు. అంతా ప్రశాంతత. ఊపిరున్నంతవరకే అన్ని వ్యామోహాలు, చివరికి శరీరంకూడా తనది కాదు -

ఏదీలేదు - ఏమీలేదు అంతా శూన్యం.

కొడుకులు మోస్తున్నారు. పౌరులంతా తమ చక్రవర్తికి కన్నీళ్ళతో కడసారి వీడ్కోలిస్తున్నారు. దారికి రెండువైపులా జనం చల్లుతున్న పూలల్లో తడుస్తూ మహారాజు శవం శ్మశానవాటిక చేరింది. మంచిగంధపు చెక్కలతోపాటు మరో కట్టెగా కాలిబూడిదైపోయింది. అంతా అయిపోయింది.

గౌతముడు కూడా దహనకాండ పూర్తయ్యేవరకు ఉండి భవనానికి తిరిగి వచ్చాడు. అతని వెంట తమ్ముళ్ళంతా...

ఈ కార్యక్రమం జరుగుతున్నంతసేపు సుందరీ నందులు ఒకరి ముఖం ఒకరు చూసుకోలేదు. పెదవి విప్పి మాట్లాడుకోలేదు. కానీ హృదయాలు ఆరాటపడుతున్నాయి. ఎన్నో యుగాల వియోగాన్ని మోస్తున్నట్టు మూగభాషలో మౌనంగా పలకరించుకుంటున్నాయి.

కర్మకాండ పూర్తయ్యాక బుద్ధుడు అందరిని సమావేశ పర్చాడు. ప్రధాన శిష్యులంతా ఆయన వెంట ఉన్నారు. వాళ్ళుకాక బుద్ధుడి కుటుంబ సభ్యులంతా పిలిపించబడ్డారు. నందుడు - దేవదత్తుడు - యశోధర గౌతమి మహానాముడు మిగిలిన బంధువులంతా కూర్చున్నాక ప్రత్యేకించి ఎక్కడో ఉన్న సుందరిని పిలిపించాడు. అందరూ వచ్చాక ఆయన మాట్లాడాడు

"ధర్మసోదరులారా! సోదరీమణులారా! ప్రధానంగా తండ్రిగారికోర్కెమీద నేను కపిలవస్తుపురం తిరిగి రావటం సంభవించింది. జన్మనిచ్చిననేల - తల్లిదండ్రుల రుణం తీర్చుకోవటం కర్తవ్యం. పైగా నా ధర్మప్రచారంలో మగధయినా శాక్య నగరమయినా ఒకటే. అన్ని ప్రాంతాలు అన్ని వర్గాలు నా సిద్ధాంతంలో ఏకమయ్యాయి. నా లక్ష్యసాధనలో అణుమాత్రం స్వార్ధానికి తావులేదు. శోకమోహాలతో రోజు రోజుకూ కృశించిపోతున్న మానవాళి సుఖశాంతులకోసం నూతన బౌద్ధధర్మం ఆవిర్భవించింది. దాని ఆచరణ బహుకష్టతరం. బ్రహ్మచర్యం దీని మూలసూత్రం. స్వార్ధపరమైన ధనసముపార్జనం మహానేరం.

కట్టుగుడ్డ పైన వస్త్రం - దుప్పటి - భిక్షాపాత్ర కమండలం ఇవే మూల సంపద. ఏ ప్రదేశంలో స్థిరంగా ఉండకుండా సంచారం చెయ్యటం దీని నియమం.

ప్రజలందరికీ ఇది చేరాలి. వ్యాకులితమైన వారి చీకటి మనస్సులో వెలుగు నింపాలి"

అందరూ ఊపిరి బిగపట్టుకుని వింటున్నారు. ఆయన తన మాటలు కొనసాగిస్తూనే ఉన్నారు.

''నేనిక్కడకు వచ్చాక అనేక అనుభవాలు చవిచూసాను. అందులో పొగడ్తలున్నాయి. నిందలున్నాయి. అయితే భిక్షువులు శాంతస్వభావులు. సహనంతో అన్ని పరీక్షలకు నిల్చాము. అన్నింటిని మించి రెండుసార్లు రెండు పరీక్షలు ఎదుర్కోవాల్సి వచ్చింది. నిజానికి అవి నా సహజ సిద్ధాంతానికి వ్యతిరేకం. నా మనసు అంగీకరించనివే. అయినా ఇష్టంలేకున్నా శిష్యుల ఒత్తిడిమీద అంగీకరించాల్సి వచ్చింది.

ఒకటి భిక్షుణీ సంఘం ఏర్పాటు చేయటం - నిజానికి నేను స్త్రీలకు వ్యతిరేకినికాదు. కాని నియమాలు కఠినంగా సాగాలంటే వాళ్ళ సాంగత్యాన్ని పరిహరించక తప్పదు. దాన్ని ఎంతో ఒత్తిడి మేరకు ఒప్పుకోవాల్సివచ్చింది. ఇప్పుడు మరో పరీక్ష ఎదుర్కొంటున్నాను. అది గృహస్థులకు బుద్ధధర్మంలో స్థానం కల్పించటం.

వాస్తవానికి ఇది ఇంకా కఠినమైందే

గృహస్థుల్లో స్వార్థచింతనమెక్కువ. నాది అనుకునే మమకారం పైనే మక్కువ. నిరీహంగా సమాజసేవ చెయ్యాలనుకునే గృహస్థులకు అడుగడుగునా ఎన్నో ఆటంకాలెదురవుతాయి. అయినా చైతన్యస్వరూపులయిన స్త్రీలల్లో వస్తున్న ఆందోళన నేను గమనిస్తూనే ఉన్నాను.

సుందరి ఆధ్వర్యంలో అనేకమంది స్త్రీలు వారి సమస్యలు విన్నవించారు. ఇది పెను ఆందోళనగా మారి గౌతమబుద్ధుడి వల్ల సంసారాలు పాడైపోతున్నాయనే అభివాదాలు బయలుదేరాయి. ఎంతో లోతుగా ఆలోచించిన మీదట ఈ నిర్ణయానికి రావటం జరిగింది.

అందరి మనస్సులు, మనస్తత్వాలు ఒకేరకంగా సాగటం కష్టం. భిన్నతత్త్వాలను అర్థం చేసుకొని సదవగాహనతో నడిపించుకోవటం మా కర్తవ్యం - అందుకే ఈరోజు ఈ సమావేశం -

ముఖ్యంగా ఇక్కడ నా పని పూర్తయింది. తండ్రిగారి కోర్కె నెరవేరింది. వారి దహనకాండలు ముగిసాయి. నేను ఈ నగరం విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాను''

కొంచెం ఆగాడు గౌతముడు. ఆ మాటలు అక్కడున్న వాళ్ళందరికీ పిడుగుపాటులా తోచాయి. ముఖ్యంగా గౌతమి.. పెంచిన మమకారం వరదలై పొంగుతోంది ఆమె హృదయంలో. కొత్తగా మనసు మార్చుకుని ఇప్పుడిప్పుడే అన్నగారిని గాఢంగా ఆరాధిస్తున్న దేవదత్తుడు, అన్నగారి సిద్ధాంతాల బాటలో పూర్తిగా మమేకమై ఆయన ఆదర్శాల పంటగా రూపుదిద్దుకుంటున్న నందుడూ, బంధువులు అందరికి గుండెలు బిగపడుతున్నాయి.

ఆ సమయంలో కూడా సుందరి ఆలోచిస్తున్నది. యశోధర గురించే. ఏదో ఒక మార్గం కనీసం భర్తను చూసుకుంటూ గడపాలనుకున్న యశోధరేమవుతుందో?

బుద్ధుని వాదనం కొనసాగుతూనే ఉంది.

''ఇక్కడి బౌద్ధసంఘ నిర్వహణకు కొంతమంది నిర్వాహకులను ఏర్పాటుచేయటం జరిగింది. ప్రధాన బుద్ధధర్మానికి చేసే మార్పులేమీలేవు. అది దాని నియమ పాలనాన్ని నిష్కర్షగా నిర్మొహమాటంగా అమలుచేయాల్సిందే

ఇక మార్పులకు లోనయ్యే కొన్ని సిద్ధాంతాలను ప్రత్యేక విభాగాలుగా చేయటం జరుగుతుంది.

భిక్షుణీ సంఘం అనుబంధంగా వ్యవహరించబడుతుంది. రెండవది తండ్రిగారు మరణశయ్యమీద తీసుకున్నమాట. సుందరి కొందరి ప్రతినిధిగా అనుభవిస్తున్న ఆవేదన పరిశీలించి ఇకమీదట గృహస్థులకు కూడా బౌద్ధధర్మాన్ని ఆచరించే అవకాశం ఇవ్వబడుతుంది. దీన్నికూడా అనుబంధ విభాగంలో చేర్చటం జరుగుతుంది.

భార్యాభర్తలు కలిసి పనిచేయవచ్చు - అయితే వారు సంఘనియమాలకు కట్టుబడి ఉండాలి. స్వార్థంకంటే పరమార్థమే ప్రధాన లక్ష్యంగా ఉండాలి. కష్టాలలో కృంగిపోతున్న అనాధలే వారి బిడ్డలుగా స్వీకరించాలి. సాధారణ వ్యక్తులా జీవించాలి.

ఈ నియమాలకు కట్టుబడి దంపతులెవరయినా దీక్ష స్వీకరించవచ్చు. ఈ ప్రశ్న నన్ను నా ప్రధాన శిష్యులు మినహాయించి ఇంకెవరడిగినా సమాధానం దొరుకుతుంది.

ధర్మసోదరీ! సుందరీ! ఇన్నాళ్ళుగా నువ్వు సాగిస్తున్న పోరానికి తుదిరూపం వచ్చిందనుకుంటాను. స్త్రీలలోని అకుంఠితమైన దీక్షను నేనభినందిస్తున్నాను. నమ్మిన సిద్ధాంతం ఏదయినా దానికోసం చివరివరకు నిలబడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని చేస్తున్న నీ ప్రయత్నం ఫలించింది. కుటుంబమంతా ఒకదారి నడిచినా నీదారిలో నిలబడి సాధించావు. దీనికోసం మీ స్త్రీలందరు అనుభవిస్తున్న ఆవేదన నాకర్థమయింది.

నాయనా నందకుమా! సుందరీ మీ ఇద్దరూ నాకు దగ్గరగా రండి'' గౌతముడు ఆదేశిచాడు.

ఇద్దరూ ఆయన దగ్గరకు వెళ్ళి పాదాలకు నమస్కరించి నిలబడ్డారు. అందరూ చిత్తరువుల్లా చూస్తున్నారు.

గౌతమబుద్ధుడు తండ్రికిచ్చిన మాట ప్రకారం వాళ్ళిద్దరి చేతులు కలిపి ఆశీర్వదించాడు.

''ఇకనుండి మీరిద్దరూ కలిసే ధర్మప్రచారం కొనసాగించండి - ఇప్పుడేవిధంగా స్వార్థరహితంగా చేస్తున్నారో అదేవిధంగా ముందు కూడా కొనసాగించండి. వ్యామోహాల్ని విడచి అభాగ్యుల ఆర్తుల సేవలో మీ జన్మలు పునీతం చేసుకోండి.

మీలాగే గృహస్థ ధర్మంలో ఉండి బౌద్ధ సిద్ధాంతాలను కొనసాగించదలచుకున్న వారందరికీ ఒక శాఖ ఏర్పాటు చేస్తున్నాను.

దానిపేరే 'శ్రమణకం' ఇకమీదట గృహస్థాశ్రమంలో బౌద్ధధర్మాన్ని పాటించేవారు 'శ్రమణకులు' అని పిలవబడతారు''

'శ్రమణకులు' అద్భుతంగా ఉంది. గౌతముని శిష్యులు ఆనందంగా ఉచ్చరించారాపేరు. సుందరీనందులు రెట్టించిన భక్తి గౌరవాలతో మరోసారి బుద్ధుడి పాదాలమీద వాలిపోయారు. ఆయన వారిని, అక్కడున్నవారందరినీ ఆశీర్వదించాడు. కడసారి వీడ్కోలుగా అందరి ముఖాల్లోకి చూసాడు. యశోధర ముఖం మీద లిప్తపాటు ఆగిన చూపులు వెంటనే వెనక్కి తిరిగి వచ్చేసాయి.

ప్రధాన శిష్యులు వెంటరాగా బుద్ధుడు మగధదారి పట్టాడు.

యశోధర మాత్రం నిర్వికారంగా సర్వం పోగొట్టుకున్నట్టు శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది ఆమె ముఖంలో భావాలు దొరకటం కష్టమే. ఆ చూపులు ఎక్కడో దిగంతాల్లో చిక్కుపడిపోయినట్టు -

నిర్లిప్తంగా - నిస్తేజంగా - చూస్తూ ఉండిపోయాయి

బహుశా వచ్చే జన్మకోసం ఆ అన్వేషణం -

ఆమె చెవుల్లో లీలగా..

బుద్ధం శరణం గచ్ఛామి -

సంఘం శరణం గచ్ఛామి -

ధర్మం శరణం గచ్ఛామి -

అనే శబ్దం దూరంగా దూర దూరంగా సాగి సాగి కాల్పనికల్లో ఎక్కడో ఆగిపోయింది...

భావశూన్యతలో వెతుక్కుంటున్నదారి

శాశ్వతంగా మూతబడిపోయింది.

*(సమాప్తం)*